
అనుదినం... జనస్వరం
www.navatelangana.com
నవతెలంగాణ
శుక్రవారం 2-2-2024
సమగ్ర తెలుగు దినపత్రిక
సంపుటి : 9 | సంచిక : 342 | Published from Khammam, Rangareddy, Hyderabad, Karimnagar | 12 పేజీలు | వెల : 6.50

భ్రమలు కల్పించడానికే...



- ఓట్ ఆన్ అకౌంట్ బడ్జెట్‌పై సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

కేంద్ర ఆర్థికమంత్రి నిర్మలా సీతారామన్ ప్రవేశపెట్టిన ఓట్ ఆన్ అకౌంట్ బడ్జెట్ కార్పొరేట్లకు లాభాలు కట్టబెట్టి, ఓటర్లను భ్రమల్లో పెట్టేదిగా ఉందని సీపీఐ(ఎం) రాష్ట్ర కమిటీ విమర్శించింది. రాబోయే పార్లమెంట్ ఎన్నికలను దృష్టిలో పెట్టుకుని ఈ బడ్జెట్‌ను రూపొందించారని తెలిపింది. దారిద్ర్యరేఖకు దిగువనున్న వారికి ప్రయోజనం కల్పించే బడ్జెట్ కాదని స్పష్టం చేసింది. ఈ మేరకు సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం గురువారం ఒక ప్రకటన విడుదల చేశారు. గత బడ్జెట్

...11లో


నిరాశపరిచిన నిర్మలమ్మ బడ్జెట్



అప్పులు - పన్నులే ఆదాయ వనరులు


ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ గురువారం పార్లమెంటులో ప్రవేశపెట్టిన మధ్యంతర బడ్జెట్ నిరాశ కలిగించింది. రూ.47.65 లక్షల కోట్ల అంచనాలతో బడ్జెట్‌ను రూపొందించగా అందులో అత్యధికంగా రక్షణ శాఖకు రూ.6.2 లక్షల కోట్లు కేటాయించారు. ఆదాయ పన్ను చెల్లింపుదారులకు ఈ బడ్జెట్‌లో ఎలాంటి ఊరట లభించలేదు. గ్రామీణ ఉపాధి హామీ వంటి ముఖ్యమైన పథకాలకు కేటాయింపుల్ని నామమాత్రంగానే పెంచారు. మధ్యంతర బడ్జెట్‌లో ఎన్నికల తాయిలాలు కూడా ప్రకటించకపోవడంతో చప్పగా ఉంది. మరోవైపు దేశంపై అప్పుల భారం రోజురోజుకూ పెరిగిపోతోంది. 2023-24 ఆర్థిక సంవత్సరం చివరి నాటికి రూ.168,72,554.17 కోట్ల మేర రుణాలు చెల్లించాల్సి ఉంటుందని అంచనా వేశారు. ఈ రుణ భారం వచ్చే ఆర్థిక సంవత్సరం చివరికి రూ.183,67,132.46 కోట్లకు చేరుతుందని నిర్మలా సీతారామన్ అంచనా. వీటిలో 2025 మార్చి 31 నాటికి అంతర్గత రుణాలే రూ.177,92,204 కోట్లు ఉంటాయని చెబుతున్నారు. ప్రత్యక్ష, పరోక్ష పన్ను రేట్లలోనూ, ఎగుమతి, దిగుమతి సుంకాల్లోనూ బడ్జెట్‌లో ఎలాంటి మార్పులూ చేయలేదు.


- వేతన జీవులకు లభించని ఊరట
- కీలక రంగాలకు అరకొర నిధులు
- ఉద్యోగ కల్పన ఊసే లేదు
- ఎన్నికల తాయిలాలూ లేవు
- నామమాత్రపు హామీలతో సరి



న్యూఢిల్లీ : రాబోయే లోక్‌సభ ఎన్నికల్లో ప్రజలు మరోసారి బీజేపీకే పట్టం కడతారన్న నమ్మకంతో ఆర్థిక మంత్రి ఈ మధ్యంతర బడ్జెట్‌లో ప్రధానంగా నాలుగు వర్గాలపై దృష్టి సారించారు. తన దృష్టిలో ఈ నాలుగే అతి పెద్ద కులాలని ప్రధాని మోడీ గతంలో చేసిన ప్రకటనను దృష్టిలో పెట్టుకొని పేదలు, మహిళలు, యువత, రైతుల కోసం కొన్ని పథకాలు, కార్యక్రమాలు ప్రకటించారు. దేశంలో నిరుద్యోగం పెరిగిపోతోందని పలు సర్వేలు చెబుతున్నప్పటికీ దానిపై ఆర్థిక మంత్రి తన బడ్జెట్ ప్రసంగంలో ఒక్క మాట కూడా చెప్పలేదు. 2047 నాటికి వికసిత్ భారత్ సాధనే లక్ష్యంగా ఉపాధి

...11లో





తెలంగాణకు గుండుసున్నా..

- విభజన హామీల ఊసేలేని కేంద్ర బడ్జెట్
- రైల్వే కోచ్ ఫ్యాక్టరీ.. బయ్యారం ఉక్కుకు దిక్కేలేదు
- ఎన్నికల వేళా రాష్ట్రానికి రిక్తహస్తమే

వివరాలు 10లో

పెరిగిన దేశం అప్పు

- ఆరేండ్లలో దాదాపు రూ. 82 లక్షల కోట్లు పెరిగిన రుణం

వివరాలు 3లో

కేంద్ర పన్నుల్లో వాటా కింద తెలంగాణకు రూ. 25,639 కోట్లు

- ఏపీకి రూ. 49,364 కోట్లు

మోడీ మార్క్ 'అభివృద్ధి నమూనా' !



- పేదలను పీల్చి పిప్పిచేస్తూ ధనవంతులను మరింత సంపన్నులను చేస్తున్నారు : సీపీఐ(ఎం) విమర్శ

న్యూఢిల్లీ : ఆర్థిక మంత్రి దేశ ఆర్థిక వ్యవస్థ గురించి ఎంతలా గొప్పలు చెప్పినా 2024-25 సంవత్సరానికి కేంద్రం గురువారం ప్రవేశపెట్టిన తాత్కాలిక బడ్జెట్ దేశ కార్మికవర్గం ఎదుర్కొంటున్న దుర్భరమైన ఆర్థిక పరిస్థితులను బహిర్గతం చేసింది. ధనవంతులను మరింత సంపన్నులుగా, పేదలను మరింత నిరుపేదలుగా తయారుచేసేందుకు దుర్మార్గపూరితమైన మోడీ ప్రభుత్వ మార్క్ 'అభివృద్ధి' నమూనా

...10లో

భారత భవిష్యత్‌ను రూపొందించే బడ్జెట్ : ప్రధాని మోడీ



"మధ్యంతర బడ్జెట్ అభివృద్ధి చెందిన భారతదేశ (డెవలప్డ్ ఇండియా) పునాదిని బలోపేతం చేసే హామీని అందిస్తుంది. యువత, పేద, మహిళలు, రైతులు అనే డెవలప్డ్ ఇండియా నాలుగు స్తంభాలకు సాధికారతనిస్తుంది. ఇది భారత భవిష్యత్‌ను రూపొందించే బడ్జెట్. ఈ బడ్జెట్‌లో మొత్తం వ్యయం చారిత్రకంగా రూ.11,11,111 కోట్లకు పెరిగింది. బడ్జెట్ 21వ శతాబ్దపు ఆధునిక మౌలిక సదుపాయాల కల్పనతో పాటు భారత్‌లోని యువతకు లక్షలాది కొత్త ఉపాధి అవకాశాలను కల్పిస్తుంది"

శ్వేత పత్రాన్ని స్వాగతిస్తున్నాం : చిదంబరం



2014కు ముందు ఆర్థిక వ్యవస్థ దుర్వినియోగంపై ప్రభుత్వం శ్వేత పత్రంతో ముందుకు వస్తుందని కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ మధ్యంతర బడ్జెట్‌ను ప్రవేశపెడుతున్న సందర్భంలో అన్నారు. అయితే, శ్వేత పత్రాన్ని స్వాగతిస్తున్నామనీ, అది వచ్చినపుడు దానిపై స్పందిస్తామని చిదంబరం తెలిపారు.

ఇది బీజేపీ ఫేర్‌వెల్ బడ్జెట్ : అఖిలేశ్ యాదవ్



ఇది బీజేపీ ప్రభుత్వ ఫేర్‌వెల్ బడ్జెట్ అని సమాజ్‌వాదీ పార్టీ(ఎస్పీ) అధినేత, యూపీ మాజీ ముఖ్యమంత్రి అఖిలేశ్ యాదవ్ అన్నారు. దశాబ్ద కాలం పాలనలో ప్రజా వ్యతిరేక బడ్జెట్‌లతో కేంద్రం షేమ్‌ఫుల్ రికార్డును సృష్టించిందని విమర్శించారు. ఈ రికార్డు బ్రేక్ కాదనీ, ఎందుకంటే సానుకూల ప్రభుత్వం ఏర్పాటయ్యే సమయం ఆసన్నమైందని తెలిపారు.

కేఆర్ఎంబీ చేతికి సాగర్, శ్రీశైలం !

తెలంగాణ, ఏపీ అంగీకారం

- 50 శాతం వాటాకు కట్టుబడి ఉన్నాం : తెలంగాణ ఈఎన్సీ మురళీధర్
- అప్పగింతకు ఓకే: ఏపీ ఈఎన్సీ నారాయణరెడ్డి



నవతెలంగాణ ప్రత్యేక ప్రతినిధి-హైదరాబాద్

నాగార్జునసాగర్, శ్రీశైలం ప్రాజెక్టుల నిర్వహణ కృష్ణా నదీ యాజమాన్య బోర్డు(కేఆర్ఎంబీ)కి అప్పగిస్తూ తెలంగాణ, ఏపీ అంగీకరించాయి. కేంద్ర జలశక్తి శాఖ ఆదేశాల మేరకు బుధవారం హైదరాబాద్‌లోని జలసౌధలో సమావేశం జరిగింది. ఇందులో కేఆర్ఎంబీ అధికారులు తెలంగాణ, ఏపీ సాగునీటి శాఖ ఈఎన్సీలు పాల్గొన్నారు. దాదాపు రెండు గంటలపాటు భేటి సాగింది. ఈ భేటీలో కష్ణాబోర్డు ప్రాజెక్టుల ఆపరేషన్‌కు తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ ఒప్పుకున్నాయి. నీటి వాటాల పంపకంపై త్రిసభ్య కమిటీదే నిర్ణయమని చెప్పారు. రెండు తెలుగు రాష్ట్రాల అధికారులు తమ తమ ప్రభుత్వాల అభిప్రాయాలు తెలియజేసినట్టు తెలిసింది. ఇరు రాష్ట్రాల మధ్య ఎప్పటికప్పుడు సమస్యలను పరిష్కరించేందుకు బోర్డు ప్రత్యేక దృష్టిపెట్టనుంది. సాగర్‌ను తెలంగాణ సిబ్బంది, శ్రీశైలంను ఏపీ సిబ్బంది ద్వారా బోర్డు పర్యవేక్షణ చేయనుంది. ఈమేరకు ఈ సమావేశంలో నిర్ణయం తీసుకున్నారు.

బోర్డుకు లేఖలు రాశాం : తెలంగాణ ఈఎన్సీ మురళీధర్

ఈ సందర్భంగా తెలంగాణ ఈఎన్సీ మురళీధర్ మాట్లాడుతూ ప్రాజెక్టుల ఆపరేటింగ్ అంతా కేఆర్ఎంబీకి

...11లో

త్వరలో మరో రెండు గ్యారంటీలు

అమలుకు ఓటాన్ అకౌంట్లోనే నిధుల కేటాయింపు

- అర్హులందరికీ లబ్ది చేకూరేలా పథకాల అమలు
- అర్హులెవ్వరికీ నష్టం జరగకుండా చర్యలు : ప్రజా పాలన దరఖాస్తుల సమీక్షలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి



నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

ఎన్నికల ముందు ప్రజలకిచ్చిన హామీ మేరకు ఆరు గ్యారంటీల్లో ఇప్పటికే రెండు గ్యారెంటీలు అమలు చేశామనీ, త్వరలో మరో రెండు గ్యారంటీలను అమలు చేస్తామని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తెలిపారు. ప్రజాపాలన దరఖాస్తులపై గురువారం హైదరాబాద్ సచివాలయంలో క్యాబినేట్ సబ్ కమిటీ అధ్యక్షులు, ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, మంత్రులు ఉత్తమ్ కుమార్ రెడ్డి, దుద్దిళ్ల శ్రీధర్ బాబు, పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, ఉన్నతాధికారులతో ఆయన సమీక్షా సమావేశం నిర్వహించారు. రూ.500కు గ్యాస్ సిలిండర్, ఇందిరమ్మ ఇండ్లు, 200 యూనిట్ల ఉచిత విద్యుత్ పథకాలపై సంబంధిత అధికారులతో చర్చించారు. వీటి అమలుకు అవసరమైన కార్యాచరణ ప్రణాళికను సిద్ధం చేయాలని

...11లో

నేడు ఇంద్రవెల్లికి సీఎం రేవంత్‌రెడ్డి



- సీఎం హోదాలో తొలిసారి జిల్లా పర్యటన
- లోక్‌సభ ఎన్నికలే లక్ష్యంగా కాంగ్రెస్ సమాయత్తం

వివరాలు 11లో

కల్వకుంట్ల చంద్రశేఖరరావు అనే నేను..



- ఎమ్మెల్యేగా కేసీఆర్ ప్రమాణం

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

బీఆర్ఎస్ అధినేత, మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్... గజ్వేల్ ఎమ్మెల్యేగా గురువారం ప్రమాణ స్వీకారం చేశారు. అసెంబ్లీలోని స్పీకర్ ఛాంబర్‌లో సభాపతి గడ్డం ప్రసాద్‌కుమార్ ఆయనతో ప్రమాణ స్వీకారం చేయించారు. తుంటి ఎముకకు శస్త్ర చికిత్స చేయించుకున్న మాజీ సీఎం... వీల్‌చైర్‌లో వస్తారని అందరూ భావించారు. కానీ ఆయన కారు దిగి, చేతికర్ర సాయంతో స్పీకర్

...10లో

కదంతొక్కిన విద్యార్థి లోకం



- ఎన్ఈపీని తిరస్కరించాలి, విద్యరంగాన్ని కాపాడాలి
- ర్యాలీని ప్రారంభించిన మంత్రి ఉదయనిధి స్టాలిన్

నవతెలంగాణ-న్యూఢిల్లీ బ్యూరో

జాతీయ విద్యా విధానం (ఎన్ఈపీ)ని వ్యతిరేకిస్తూ తమిళనాడులోని చెన్నైలో విద్యార్థి లోకం కదంతొక్కారు. దేశంలోని దక్షిణ ప్రాంతంలోని రాష్ట్రాల నుంచి వేలాది మంది విద్యార్థులు యునైటెడ్ స్టూడెంట్స్ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో గురువారం 'ఎన్ఈపీని

...10లో

నేటి నుంచే ప్రత్యేక పాలన

గెజిటెడ్ అధికారులకు బాధ్యతల అప్పగింత

- ముగిసిన సర్పంచుల పదవీకాలం
- ప్రత్యేకాధికారులకు, గ్రామ కార్యదర్శులకు జాయింట్ చెక్‌పవర్




నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

రాష్ట్రంలో సర్పంచుల పదవీకాలం గురువారంతో ముగిసింది. శుక్రవారం నుంచి రాష్ట్రంలోని 12,679 గ్రామపంచాయతీల్లో ప్రత్యేక పాలన అమల్లోకి రానున్నది. ఈ మేరకు పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ ప్రధాన కార్యదర్శి సందీప్ కుమార్ సుల్తానియా ప్రత్యేకాధికారులను నియమిస్తున్నట్టు ఉత్తర్వులను జారీ చేశారు. రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాలతో ప్రత్యేక అధికారులుగా గెజిటెడ్ ఆఫీసర్లను నియమిస్తూ గ్రామాల వారీగా జాబితాను కలెక్టర్లు విడుదల చేశారు. ప్రత్యేక అధికారులుగా నియమితులైన వారి జాబితాలో తహశీల్దార్లు, డిప్యూటీ, నాయబ్ తహశీల్దార్లు, ఎంపీడీఓ, ఎంపీఓ, ఏఈ(పీఆర్), డిప్యూటీ ఈఈ(పీఆర్), తహశీల్దార్లు, ఎంఏఓ, వెటర్నరీ అసిస్టెంట్ సర్జన్లు(వెటర్నరీ డాక్టర్లు), ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈలు, ఐబీ ఏఈఈ, డీఈఈలు, మిషన్ భగీరథ అధికారులు, ఎంఈఓలు ఉన్నారు. అన్ని గ్రామాలకు గెజిటెడ్ అధికారులను నియమించే వెసులుబాటు లేకపోవడంతో రెండు, మూడు గ్రామాలకు ఒక అధికారిని నియమించారు. మేజర్ గ్రామ పంచాయతీలకు ఎక్కువగా ఎంపీడీఓలు, తహసీల్దార్లు, పంచాయతీరాజ్ శాఖ మండల అధికారి ఉన్నారు. ప్రత్యేకాధికారులకు, గ్రామ కార్యదర్శులకు జాయింట్ చెక్ పవర్ ఉంటుంది. సర్పంచుల పదవీ కాలం ఫిబ్రవరి ఒకటో తేదీతో ముగిసిన విషయం తెలిసిందే. తెలంగాణ పంచాయతీ రాజ్ చట్టం-2018లో సెక్షన్ 136(3)(3) ప్రకారం శుక్రవారం నుంచి ప్రత్యేక అధికారులు పాలనాధికారాలను కలిగి ఉంటారు. సర్పంచుల నుంచి 15వ ఆర్థిక సంఘం నిధులకు సంబంధించిన డిజిటల్ కీలు, చెక్కుబుక్కులను, ఇతర రికార్డులను గ్రామ కార్యదర్శులు గురువారం సాయంత్రమే స్వాధీనం చేసుకున్నారు. ఎవరైనా రికార్డులు, డిజిటల్ కీలు ఇవ్వకపోతే కఠిన చర్యలు తీసుకుంటామని సర్పంచులను రాష్ట్ర ప్రభుత్వం

...10లో

ప్రమాణస్వీకారంలో ఆలస్యమెందుకు?



జార్ఖండ్ గవర్నర్‌పై కాంగ్రెస్ మండిపాటు

- బీహార్‌లో గంటల్లోనే చేయించారు కదా అని నిలదీత

న్యూఢిల్లీ : జార్ఖండ్ నూతన ముఖ్యమంత్రిగా ఛాంపై సొరేన్‌తో ప్రమాణస్వీకారం చేయించడంలో జరుగుతున్న జాప్యంపై కాంగ్రెస్ ఆగ్రహం వ్యక్తం చేసింది. పొరుగున ఉన్న బీహార్‌లో నితీష్ కుమార్‌తో ప్రమాణస్వీకారం చేయించడంలో ప్రదర్శించిన వేగం జార్ఖండ్‌లో ఎందుకు కన్పించడం లేదని ప్రశ్నించింది. కాంగ్రెస్ ఎంపీ అభిషేక్ మనుసింఘ్వీ గురువారం విలేకరులతో మాట్లాడుతూ 'హేమంత్ సొరేన్ ఎన్డీఏలో చేరి ఉంటే పరిస్థితి వేరేలా ఉండేది. బీజేపీ వాషింగ్ మిషన్లో ఆయన శుభ్రపడే వారు. ప్రపంచంలోనే అత్యంత పేరెన్నికగన్న విశ్వవిద్యాలయాన్ని మన దేశంలో బీజేపీ స్థాపించింది. అక్కడ ఒకే ఒక అంశంపై పీహెచ్‌డీలు, పోస్ట్ డాక్టరేట్లు ఇస్తారు. అదేమంటే ఎన్నికైన ప్రభుత్వాలను ఎలా కూల్చేయాలి, ఎన్నికైన ప్రభుత్వాలను ఎలా మైనారిటీలో పడేయాలి, ఫిరాయింపుల్ని ఎలా ప్రోత్సహించాలి, ఈ చర్యలకు ఎలా ప్రేరణ కలిగించాలి అనేదే ఆ అంశం' అని ఎద్దేవా చేశారు.

హేమంత్ సొరేన్ రాజీనామా అనంతరం జార్ఖండ్‌పై అనేక గంటలుగా నిశ్శబ్దత

...11లో



అరెస్టును సవాలు చేస్తూ..

- సుప్రీం తలుపు తట్టిన సొరేన్
- నేడు విచారణ

న్యూఢిల్లీ : భూ కుంభకోణం కేసులో ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) అధికారులు తనను అరెస్ట్ చేయడాన్ని సవాలు చేస్తూ జార్ఖండ్ మాజీ ముఖ్యమంత్రి హేమంత్ సొరేన్ గురువారం సుప్రీంకోర్టును ఆశ్రయించారు. ఈ వ్యవహారంపై అత్యవసరంగా విచారణ జరపాలని సొరేన్ తరపు వాదిస్తున్న సీనియర్ న్యాయవాది కపిల్ సిబల్ కోర్టును అభ్యర్థించారు. సొరేన్ పిటిషన్‌పై

...11లో

ప్రజల ఆశయాలు.. ఆకాంక్షలే లక్ష్యం

మంత్రి సీతక్క



నవతెలంగాణ-హాజీపూర్

ఓట్ల కోసం, అధికారం కోసం బీఆర్ఎస్ తరహాలో కుటిల రాజకీయాలు చేయబోమని, ప్రజల ఆకాంక్షలు, ఆశయా లను నెరవేర్చడానికి చిత్తశుద్ధితో కృషి చేస్తామని మహిళా, శిశు సంక్షేమ, పంచా యతీరాజ్ శాఖ మంత్రి దనసరి సీతక్క అనసూయ అన్నారు. ఇంద్రవెల్లిలో సీఎం సభ ఏర్పాట్లను పరిశీలించేందుకు వెళ్తూ గురువారం మార్గమధ్యలో మంచిర్యాల లోని ఎమ్మెల్యే కొక్కిరాల ప్రేమ్‌సాగర్‌రావు నివాసంలో మంత్రి మీడియా సమావేశం లో మాట్లాడారు. ప్రజల సమస్యలను పరి ష్కరించాల్సిన కేసీఆర్ హంగు,ఆర్భాటాల కు.. దేశ రాజకీయాలు అంటూ హంగామా చేశారని విమర్శించారు. ప్రగతి భవన్, సెక్రటేరియెట్ లాంటి సౌదాలు నిర్మించి ఇదే అభివృద్ధి అని ప్రజలను మభ్యపెట్టే ప్రయత్నం చేశార న్నారు. మారుమూల గ్రామాల్లో, తండాల్లో, ఆదివాసీ ప్రాంతాల్లో వారి జీవన ప్రమాణాలు ఎలా ఉన్నాయో తెలుసుకునే ప్రయత్నం చేయలేదని విమ ర్శించారు. కోదండరామ్ లాంటి ఉద్యమ కారునికి ఎమ్మెల్సీ పదవి ఇస్తే ఎందుకు అక్కసు వెళ్ల గక్కుతున్నారని ప్రశ్నించారు.

తెలంగాణ ఉద్యమ సమయంలో సాగర హారంలో లక్షలాది మందిని ఏకతాటిపైకి తీసుకొచ్చి ఆంధ్ర పాలకుల గుండెల్లో దడ పుట్టించింది కోదండరామ్ కాదా అని నిలదీశారు. తెలంగాణ త్యాగధనులను వాడుకొని వదిలిపెట్టే తత్వం బీఆర్ఎస్‌ది అన్నారు. బీఆర్ఎస్ పాలనలో ఉద్యోగులకు జీతాలు ఎప్పుడు వస్తాయో తెలియని అయోమయ పరిస్థితి ఉండేదని.. కాంగ్రెస్ ప్రభుత్వంలో ఐదో తేదీలోపే అందరికీ జీతాలు ఖాతాలో పడుతున్నాయని చెప్పారు. ప్రశ్నించే తెలంగాణ ఉద్యమ కారుల గొంతు నొక్కడంతోపాటు ధర్నా చౌక్‌ను ఎత్తేసిన ఘనత బీఆర్ఎస్‌కు దక్కిందని ఎద్దేవా చేశారు. తెలంగాణ పేరును శాశ్వతంగా రూపుమాపడానికి కేసీఆర్ టీఆర్ఎస్‌ను బీఆర్ఎస్‌గా మార్చి చేతులు కాల్చుకున్నారన్నారు.

ఆటోను ఢీ కొట్టిన కారు.. నలుగురికి తీవ్రగాయాలు

నవతెలంగాణ- జూబ్లీహిల్స్

హైదరాబాద్ ఎస్ఆర్ నగర్ పోలీస్ స్టేషన్ పరిధి అమీర్‌పేట్ ధరంకరం రోడ్డులో ఓ కారు బీభత్సం సృష్టించింది. ఈ ఘటనలో కారు డ్రైవర్‌తో పాటు మరో ముగ్గురికి తీవ్ర గాయాలయ్యాయి. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. స్విఫ్ట్ డిజైర్ కారులో సునిల్ అనే వ్యక్తి, సోదరుడు, స్నేహితునితో కలిసి అమీర్‌పేట్ గురుగోవింద్ స్టేడియం నుంచి ప్రధాన రహదారి వైపు వెళ్తున్నాడు. ఈ క్రమంలో సునిల్ ఒక్కసారిగా పొర పాటున హ్యాండ్ బ్రేక్ వేశాడు.

రిటైల్ బంక్‌లుగా.. కన్స్యూమర్ పెట్రోలు బంక్‌లు

పార్లమెంటు ఎన్నికలకు ముందే ప్రారంభం కానున్న పీఏసీఎస్ పెట్రోల్ బంక్‌లు

ఎన్నికల్లో లబ్ధి పొందేందుకు బీజేపీ ఎత్తుగడ

నవతెలంగాణ-సంస్థాన్ నారాయణపురం

ఏడాదిన్నర కాలంగా మూతబడ్డ ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం(పీఏసీఎస్) ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన కన్స్యూమర్ పెట్రోల్ బంక్‌లను రిటైల్ బంక్‌లుగా మార్చేందుకు కేంద్ర ప్రభుత్వం యోచిస్తోంది. త్వరలో జరగనున్న పార్లమెంటు ఎన్నికల్లో రైతుల ఓట్లను రాబట్టుకోవడానికి బీజేపీ ప్రభుత్వం ఈ నిర్ణయం తీసుకున్నట్టుగా తెలుస్తోంది. కేంద్ర సహకార సంఘాల శాఖ మంత్రి అమిత్ షా 'సహకార సమృద్ధి యోజన' పథకం కింద కన్స్యూమర్ బంక్‌లను రిటైల్ బంక్‌లుగా మార్చేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. నష్టాల్లో కూరుకుపోయిన వ్యవసాయ సహకార సంఘాలను లాభాల బాటలో నడిపించడం కోసమే ఆప్కాబ్ పెట్రోల్ బంక్‌ల స్థాపన వైపు వ్యవసాయ సహకార సంఘాలను ప్రోత్సహిస్తున్నట్టుగా కేంద్రం చెబుతోంది.

ఈ నేపథ్యంలో ఆప్కాబ్ కృషి మేరకు రాష్ట్రవ్యాప్తంగా సుమారుగా 300 పీఏసీఎస్‌లు, యాదాద్రి భువనగిరి జిల్లాలో సంస్థాన్ నారాయణపురం, మోత్కూర్, చందుపట్ల, అమ్మనబోలు, పోచంపల్లి, రామన్నపేటతో పాటు ఉమ్మడి నల్లగొండ జిల్లాలో 20 సహకార సంఘాలు పెట్రోల్ బంక్‌లను స్థాపించాయి. వ్యవసాయ అవసరాల కోసం రైతులు ఉపయోగించే ట్రాక్టర్, మోటార్ సైకిళ్లకు రిటైల్ బంకుల కంటే ఒక రూపాయి తక్కువ ధరకే డీజిల్, పెట్రోల్ సరఫరా చేయనున్నట్టు ఆయా సహకార సంఘ అధ్యక్షులు చెప్పారు. కానీ బంక్‌ల నిర్వహణ కొనసాగేటప్పటికీ రిటైల్ బంక్‌లకు వచ్చే ధర కంటే పీఏసీఎస్ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన కన్స్యూమర్ బంక్ నిర్వాహకులు అదనపు ధరకు డీజిల్, పెట్రోల్ కొనాల్సిన పరిస్థితి ఏర్పడింది. ఆర్థిక నష్టాలకు గురైన సహకార సంఘాలు నడపలేని స్థితిలో ఏడాదిన్నర కాలంగా మూతపడి ఉన్నాయి. తాజాగా పార్లమెంట్ ఎన్నికలకు ముందే వాటిని ప్రారంభించాలని చూస్తున్నట్టు తెలుస్తోంది.



అతి త్వరలో తిరిగి ప్రారంభిస్తాం



వ్యవసాయ సహకార సంఘాల ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కన్స్యూమర్ పెట్రోల్ బంక్‌లను రిటైల్ బంక్‌లుగా మార్చాలని ఏడాదిన్నర కాలంగా కేంద్ర ప్రభుత్వానికి మొర పెట్టుకుంటున్నాం. కేంద్ర ప్రభుత్వం ఇటీవలే కేంద్ర సహకార సమృద్ధి యోజన పథకం తీసుకువచ్చింది. ఆయాశాకాధికారులకు సైతం ఆదేశాలు పంపింది. మూతపడ్డ పీఏసీఎస్ బంకులు తొందరలోనే తెరుచుకుంటాయి.

జక్కిడి జంగారెడ్డి, పీఏసీఎస్ చైర్మెన్, నారాయణపురం

6న జీఆర్ఎంబీ భేటి

నవతెలంగాణ ప్రత్యేక ప్రతినిధి-హైదరాబాద్

గోదావరి నదీ యాజమాన్య బోర్డు (జీఆర్ఎంబీ) 15వ సమావేశం ఈనెల ఆరున హైదరాబాద్‌లో జరగనుంది.

ఈమేరకు గురువారం జీఆర్ఎంబీ సభ్య కార్యదర్శి తెలంగాణ సాగునీటి శాఖకు నోటీసులు పంపారు. ఇప్పటికే ప్రతిపాదించిన ఏజెండాపై సమావేశంలో చర్చలు ఉంటాయని స్పష్టం చేశారు.

జలసౌధలో ఉదయం 11 గంటలక సమావేశం ప్రారంభమవుతుందని సభ్యకార్యదర్శి నోటీసుల్లో పేర్కొన్నారు.

శ్రామిక మహిళా హక్కులపై కేంద్ర ప్రభుత్వ దాడి

ఫిబ్రవరి 16న గ్రామీణ భారత్ బంద్‌ను విజయవంతం చేయాలి

- వర్కింగ్ ఉమెన్ కోఆర్డినేషన్ కమిటీ (సీఐటీయూ) జాతీయ కన్వీనర్ ఏఆర్ సింధు



నవతెలంగాణ-వరంగల్ ప్రాంతీయ ప్రతినిధి

కనీస వేతనాలు, నిరుద్యోగం, అధిక ధరల వంటి సమస్యలతో దేశంలోని శ్రామిక మహిళా హక్కులపై కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం దాడి చేస్తున్నదని, ఈ వినాశకర విధానాలకు ప్రతిఘటనగా ఫిబ్రవరి 16న జరిగే దేశవ్యాప్త సమ్మె-గ్రామీణ భారత్ బంద్‌ను విజయవంతం చేయాలని వర్కింగ్ ఉమెన్ కో ఆర్డినేషన్ కమిటీ (సీఐటీయూ) జాతీయ కన్వీనర్ ఏఆర్ సింధు పిలుపునిచ్చారు. గురువారం హన్మకొండ జిల్లా కేంద్రంలోని బాలవికాస్‌లో జరిగిన సీఐటీయూ జాతీయ వర్కింగ్ కమిటీ సమావేశాల సందర్భంగా నిర్వహించిన వర్కింగ్ ఉమెన్ కమిటీ సమావేశంలో ఆమె మాట్లాడారు. 2024 మార్చి 8న అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పని ప్రదేశాలన్నిటిలోనూ విస్తృతంగా జరపాలని కోరారు.

ముఖ్యంగా కేంద్ర ప్రభుత్వం శ్రామిక మహిళల జీవితాలను ప్రభావితం చేస్తున్న సమస్యలను పక్కదారి పట్టిం చేందుకు హిందూ మతతత్వవాదాన్ని, భావోద్వేగాలను, వైషమ్యాలను రెచ్చగొడు తోందని విమర్శించారు. మనువాదంతో మహిళల హక్కులకు భంగం కలిగిస్తున్న దన్నారు. ఈ పరిస్థితుల్లో ఐక్యతతో భవిష్య పోరాటాలకు సిద్ధం కావాలని శ్రామిక మహిళలకు పిలుపునిచ్చారు. నర్సికొట్టే అమ్మ అధ్యక్షతన జరిగిన సమావేశంలో సీఐటీయూ జాతీయ అధ్యక్షులు కే.హేమలత, జాతీయ ప్రధాన కార్యదర్శి తపన్ సేన్, జాతీయ కోశాధికారి ఎం.సాయిబాబు, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పాలడుగు భాస్కర్, రాష్ట్ర కార్యదర్శులు జే.వెంకటేష్, రాగుల రమేష్, తెలంగాణ రాష్ట్ర శ్రామిక మహిళా నాయకులు ఎస్వీ రమ, పి.జయలక్ష్మి, హన్మకొండ జిల్లా ఉపాధ్యక్షులు టి.ఉప్పలయ్య, గాదె ప్రభాకర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పలు పార్టీల ఆఫీసులకు మంత్రి పొంగులేటి

సీపీఐ, టీడీపీ, ప్రజాపంథా కార్యాలయాల సందర్శన



- అసెంబ్లీ ఎన్నికల్లో మద్దతిచ్చినందుకు కృతజ్ఞతలు
- పార్లమెంట్ ఎన్నికల్లోనూ మద్దతు కోసం విజ్ఞప్తి

నవతెలంగాణ- ఖమ్మం ప్రాంతీయ ప్రతినిధి

అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీకి మద్దతిచ్చిన పార్టీల కార్యాలయాలను రెవెన్యూ, గృహ నిర్మాణ, సమాచారశాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి సందర్శించారు. ఆయా పార్టీల నాయకులు ఆయనకు స్వాగతం పలికారు. అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థుల విజయానికి కృషి చేసినందుకు కృతజ్ఞతలు తెలిపారు. రానున్న లోక్‌సభ ఎన్నికల్లోనూ తమ పార్టీకి మద్దతు ఇవ్వాలని కోరారు. ఖమ్మంలోని సీపీఐ, సీపీఐ(ఎంఎల్) ప్రజాపంథా, టీడీపీ కార్యాలయాలను గురువారం ఆయన సందర్శించి మాట్లాడారు. కాంగ్రెస్ అభ్యర్థుల గెలుపునకు కృషి చేసిన ప్రతి కార్యకర్తకూ కృతజ్ఞతలు తెలిపారు. కాంగ్రెస్ గెలుపు కోసం నిద్రపోకుండా పనిచేసిన పలు పార్టీల కార్యకర్తల పనితీరు, వారు చేసిన కృషి మరువలేనిదన్నారు. తమకు సహకరించిన వాళ్లను మరిచిపోమని, ప్రజల అవసరం కోసం తామెప్పుడు తమతోనే ఉంటామని తెలిపారు. చిత్తశుద్ధితో అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలు చేస్తామని స్పష్టం చేశారు. వందకు వందశాతం అభయహస్తం ఆరు గ్యారెంటీలను అమలు చేస్తామని అన్నారు. అంతకుముందు టీపీసీసీ నాయకులు రాయల నాగేశ్వరరావు ఇంటికి వెళ్లి బ్రేక్‌ఫాస్ట్ చేశారు. ఆయనతో కలిసి పార్టీ కార్యాలయాలకు వెళ్లారు. పొంగులేటి వెంట కాంగ్రెస్ నాయకులు బాలసాని లక్ష్మీనారాయణ, చావా శివరామకృష్ణ, బొర్రా రాజశేఖర్, మహ్మద్ జావీద్, బాగం హేమంతరావు, మౌలాన, పోటు రంగారావు, గోకినేపల్లి వెంకటేశ్వర్లు తదితరులు ఉన్నారు.

మేడారం జాతర నేపథ్యంలో

పర్యావరణ రుసుం నిలిపివేత: మంత్రి కొండా సురేఖ

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

మేడారం జాతరకు నేపథ్యంలో ఏటూరు నాగారం అభయారణ్యంలో వాహనాల నుంచి వసూలు చేసి పర్యావరణ రుసుము(ఎన్విరాన్‌మెంట్ ఇంపాక్ట్ ఫీజు)ను ఫిబ్రవరి రెండో తేదీ నుంచి 29 తేదీ వరకు నిలిపేస్తున్నట్టు రాష్ట్ర అటవీ, పర్యావరణ, దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ ప్రకటించారు. త్వరలో జరగనున్న మేడారం సమ్మక్క, సారలమ్మ జాతరలో భక్తులకు అసౌకర్యం కలగకుండా ప్రభుత్వం తరపున అన్ని రకాల చర్యలు తీసుకుంటున్నామని పేర్కొన్నారు. గురువారం ఈ నేపథ్యంలోనే ఏటూరు నాగారం అభయారణ్యంలో పర్యావరణ రుసుంను వసూలు చేయొద్దని చీఫ్ వైల్డ్ లైఫ్ వార్డెన్ ఎమ్.సి.పర్గెయిన్ ఉత్తర్వులు జారీ చేశారు. ఆ దిశగా చర్యలు తీసుకోవాలని ములుగు జిల్లా అటవీ అధికారికి ఆదేశాలు జారీ చేశారు. మేడారం సమ్మక్క, సారలమ్మ జాతరలో భక్తులకు అసౌకర్యం కలగకుండా ప్రభుత్వం అన్ని రకాల చర్యలు తీసుకుంటున్నది.

పర్యావరణ రుసుము మినహాయింపు వల్ల జాతరకు వచ్చే వాహనాల రద్దీని నియంత్రించేందుకు కొంత మేర దోహపడనున్నది. ఏటూరు నాగారం అభయారణ్యం పరిధిలో పస్రా, తాడ్వాయి, ఏటూరు నాగారం మీదుగా వెళ్లే వాహనాల నుంచి నామమాత్రపు పర్యావరణ రుసుమును ఇప్పటిదాకా అటవీ శాఖ వసూలు చేస్తున్నది. ఇలా వచ్చే ఆదాయంలో అటవీ ప్రాంతాల రక్షణకు, ప్లాస్టిక్‌ను తొలగించేందుకు, వన్యప్రాణుల రక్షణకు అటవీ శాఖ వినియోగిస్తున్నది. అయితే వివిధ వర్గాల నుంచి వచ్చిన విజ్ఞప్తి మేరకు జాతర ముగిసే దాకా ఈ ఫీజు వసూలు నిలిపే యనున్నారు. జాతరకు వచ్చే భక్తులు అటవీ ప్రాంతాన్ని వీలైనంత పరిశుభ్రంగా ఉంచాలనీ, ప్లాస్టిక్ వినియోగాన్ని తగ్గించాలని అటవీశాఖ కోరింది.

సబ్సిడీలకు కోతలు

ఆహారం, గ్యాస్, పెట్రోల్, యూరియా వంటి ఎరువులకు తగ్గిన కేటాయింపులు





అంగన్‌వాడీలు, పంట బీమాకు కోత
ఉపాధి హామీ, పీఎం కిసాన్‌కు పెంపు లేదు

నవతెలంగాణ-న్యూఢిల్లీ బ్యూరో

కేంద్ర బడ్జెట్‌లో సామాన్య, పేదలు, రైతులకు సంబంధించిన వాటిపై కేంద్ర ప్రభుత్వం కోత విధించింది. ఆహారం, వంటగ్యాస్, పెట్రోలియం, యూరియా వంటి ఎరువులకు బడ్జెట్ కేటాయింపులు తగ్గాయి. కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ గురువారం ప్రవేశపెట్టిన మధ్యంతర బడ్జెట్‌లో సామాన్య, పేద ప్రజలకు ఎటువంటి ఉపశమనం కలగలేదు. పైగా ఆయా వర్గాలకు సంబంధించిన రంగాల కేటాయింపుల్లో కోత విధించారు. ఆహారానికి సంబంధించి 2022-23 బడ్జెట్‌లో రూ.2,72,802 కోట్లు కేటాయించగా, 2022-23లో దాన్ని రూ.2,12,332 కోట్లకు తగ్గించారు. దాన్ని 2024-25 బడ్జెట్‌లో రూ.2,05,250 కోట్లకు తగ్గించారు. ప్రజా పంపిణీకి 2023-24లో రూ 137.36 కోట్లు కేటాయించగా, ప్రస్తుత బడ్జెట్‌లో రూ.106.73 కోట్లకు తగ్గించారు. గ్యాస్ సబ్సిడీకి 2023-24లో రూ 12,240 కోట్లు కేటాయించగా, ప్రస్తుత బడ్జెట్‌లో రూ.11,925.01 కోట్లకు తగ్గించారు.

పెట్రోలియంకు సంబంధించి 2023-24 బడ్జెట్‌లో రూ.12,240 కోట్లు కేటాయించగా, దాన్ని 2024-25 బడ్జెట్‌లో రూ.11,925 కోట్లకు తగ్గించారు. రైతులకు సంబంధించిన ముఖ్యమైన ఎరువులకు 2022-23 బడ్జెట్‌లో రూ. 2,51,339 కోట్లు కేటాయించగా, 2023-24లో రూ.1,88,894 కోట్లకు తగ్గించారు. దాన్ని 2024-25 బడ్జెట్‌లో రూ.1,64,000 కోట్లకు తగ్గించారు. అందులోనూ యూరియాకు 2022-23 బడ్జెట్‌లో రూ.1,65,217 కోట్లు కేటాయించగా, 2023-24లో దాన్ని రూ.1,31,100 కోట్లకు తగ్గించారు. 2024-25 బడ్జెట్‌లో రూ.1,19,000 కోట్లకు తగ్గించారు. పంటల బీమా పథకానికి సంబంధించి 2023-24 బడ్జెట్‌లో రూ.15,000 కోట్లు కేటాయించగా, దాన్ని 2024-25 బడ్జెట్‌లో రూ.14,600 కోట్లకు తగ్గించారు.

నేషనల్ రూరల్ హెల్త్ మిషన్ (ఎన్‌ఆర్ హెచ్‌ఎం)కు కేటాయింపులే లేవు. స్మార్ట్ సిటీలకు 2023-24లో రూ 13,200 కోట్లు కేటాయించగా, ప్రస్తుత బడ్జెట్‌లో రూ.10,400 కోట్లకు తగ్గించారు. అంగన్‌వాడీలకు 2023-24లో రూ 21,523 కోట్లు కేటాయించగా, ప్రస్తుత బడ్జెట్‌లో రూ.21,200 కోట్లకు తగ్గించారు. అంటే రూ. 323 కోట్లు తగ్గించారు. మహిళా భద్రత పథకాల కేటాయింపుల్లో భారీ కోత విధించారు. 2023-24లో రూ 1,009 కోట్లు కేటాయించగా, ప్రస్తుత బడ్జెట్‌లో రూ.155 కోట్లకు తగ్గించారు.

ప్రభుత్వరంగ సంస్థల్లో పెట్టుబడులకు సంబంధించి 2023-24 బడ్జెట్‌లో రూ.34,354 కోట్లు కేటాయించగా, దాన్ని సవరించిన అంచనాల్లో రూ.32,800 కోట్లకు తగ్గించారు. 2024-25 బడ్జెట్‌లో రూ.31,107 కోట్లకు తగ్గించారు. అంటే రూ.3,247 కోట్లు తగ్గించారు. కోల్ ఇండియా లిమిటెడ్‌కు భారీ కోత పడింది. 2023-24లో రూ 16,500 కోట్లు కేటాయించగా, ప్రస్తుత బడ్జెట్‌లో రూ.15,500 కోట్లకు తగ్గించారు. ఎస్ఎల్పి ఇండియా లిమిటెడ్‌కు 2023-24లో రూ 2,880 కోట్లు కేటాయించగా, ప్రస్తుత బడ్జెట్‌లో రూ.2,429 కోట్లకు తగ్గించారు.

సాంస్కృతిక పథకాలకు 2023-24లో రూ 808.77 కోట్లు కేటాయించగా, ప్రస్తుత బడ్జెట్‌లో రూ.520.24 కోట్లకు తగ్గించారు. అకాడమీ, మ్యూజియంలకు బడ్జెట్‌లో కోత విధించారు. అకాడమీలకు సంబంధించి 2023-24లో రూ.435.45 కోట్లు కేటాయించగా, ప్రస్తుత బడ్జెట్‌లో రూ.389.37 కోట్లకు తగ్గించారు. మ్యూజియంలకు సంబంధించి 2023-24లో రూ 389.40 కోట్లు కేటాయించగా, ప్రస్తుత బడ్జెట్‌లో రూ.373.70 కోట్లకు తగ్గించారు. పిఎంకిసాన్, ఉపాధి హామీకి ఎటువంటి పెంపుదల లేదు. గతంలో కేటాయించిన వాటినే కాపీ, పేస్టు చేశారు.

పెరిగిన దేశం అప్పు

ఆరేండ్లలో దాదాపు రూ.82 లక్షల కోట్లు పెరిగిన రుణం

నవతెలంగాణ-న్యూఢిల్లీ బ్యూరో

మోడీ ప్రభుత్వ హయాంలో అప్పు విపరీతంగా పెరిగిపోతున్నది. ఆరేండ్లలో దాదాపు రూ.82 లక్షల కోట్లకు అప్పు పెరిగింది. కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ గురువారం ప్రవేశపెట్టిన మధ్యంతర బడ్జెట్‌లో ఈ అప్పులు బహిర్గతమయ్యాయి. 2024 మార్చి 31 నాటికి రూ.168,72,554.16 కోట్లు అప్పు ఉంటే, 2025 మార్చి 31 నాటికి అది కాస్తా రూ. 183,67,132.46 కోట్లకు పెరుగుతుందని అంచనా



వేసింది. అంటే ఏడాదిలోనే రూ.14,94,577.85 కోట్ల అప్పు పెరుగుతుందని ప్రభుత్వ బడ్జెట్ లెక్కలు స్పష్టం చేస్తున్నాయి. 2019-20లో రూ.101,98,173.64 కోట్ల అప్పు ఉంటే, అదికాస్తా 2024-25 నాటికి రూ.183,67,132.46 కోట్లకు పెరుగనున్నది. అంటే, రూ.81,68,958.81 కోట్ల అప్పు పెరిగింది.

2024 మార్చి 31 నాటికి..

దేశీయ అప్పు	: రూ.163,35,070.06 కోట్లు
విదేశీ అప్పు	: రూ.5,37,484.10 కోట్లు
మొత్తం	: రూ.168,72,554.16 కోట్లు

2025 మార్చి 31 నాటికి..

దేశీయ అప్పు	: రూ.177,92,204.95 కోట్లు
విదేశీ అప్పు	: రూ.5,74,927.51 కోట్లు
మొత్తం	: రూ.183,67,132.46 కోట్లు

ఆరేండ్లలో పెరిగిన అప్పుల వివరాలు

ఏడాది	అప్పు (కోట్లల్లో)
2019-20	రూ.101,98,173.64
2020-21	రూ.120,58,987.40
2021-22	రూ.135,45,605.78
2022-23	రూ. 152,23,605.78
2023-24	రూ.168,72,554.16
2024-25	రూ.183,67,132.46



కేటాయింపులు ఇలా..

- మౌలిక వసతుల రంగానికి రూ.11.11లక్షల కోట్లు
- రక్షణశాఖకు రూ.6.2లక్షల కోట్లు
- రైల్వేశాఖకు రూ.2.55లక్షల కోట్లు
- హోంశాఖకు రూ.2.03లక్షల కోట్లు
- వ్యవసాయం, రైతుల సంక్షేమానికి రూ.1.27లక్షల కోట్లు
- గ్రామీణాభివృద్ధి శాఖకు రూ.1.77లక్షల కోట్లు
- ఉపరితల రవాణా, జాతీయ రహదారుల నిర్మాణానికి రూ.2.78లక్షలకోట్లు
- ఆహారం, ప్రజాపంపిణీ వ్యవస్థకు రూ.2.13లక్షల కోట్లు
- రసాయనాలు, ఎరువుల కోసం రూ.1.68లక్షలకోట్లు
- కమ్యూనికేషన్ రంగానికి రూ.1.37లక్షలకోట్లు
- గ్రామీణ ఉపాధిహామీ పథకానికి రూ.86వేలకోట్లు
- ఆయుష్మాన్ భారత్ పథకానికి రూ.7500కోట్లు
- పారిశ్రామిక ప్రోత్సాహకాలకు రూ.6,200కోట్లు
- సెమీ కండక్టర్లు, డిస్‌ప్లే ఎకో వ్యవస్థల తయారీకి రూ.6,903కోట్లు
- సోలార్ విద్యుత్ గ్రిడ్‌కు రూ.8500కోట్లు
- గ్రీన్ హైడ్రోజన్‌కు రూ.600కోట్లు

కేంద్ర పన్నుల్లో వాటా కింద

తెలంగాణకు రూ.25,639 కోట్లు



నవతెలంగాణ-న్యూఢిల్లీ బ్యూరో

2024-25 ఆర్థిక సంవత్సరానికి గానూ కేంద్ర పన్నుల్లో వాటా కింద తెలంగాణకు రూ.25,639 కోట్లు రానున్నాయి. అందులో కార్పొరేట్ పన్ను రూ.8,051.77 కోట్లు, ఆదాయపు పన్ను రూ.8,872.10 కోట్లు, సంపద పన్ను - 0.26 కోట్లు, సెంట్రల్ జీఎస్టీ రూ.7,838.82 కోట్లు, కస్టమ్స్ రూ.523.20 కోట్లు, కేంద్ర ఎక్సైజ్ డ్యూటీ రూ.312.84 కోట్లు, సర్వీస్ టాక్స్ రూ.0.86 కోట్లు, ఇతర పన్నులు, డ్యూటీలు కలిపి రూ.40.51 కోట్లు తెలంగాణకు రానున్నాయి.

ఆంధ్రప్రదేశ్‌కు.. రూ.49,364 కోట్లు



ఆంధ్రప్రదేశ్‌కు రూ.49,364.61కోట్లు (4.047శాతం) రానుంది. అందులో కార్పొరేట్ పన్ను రూ.15,502.14 కోట్లు, ఆదాయపు పన్ను రూ.17,081.54 కోట్లు, సంపద పన్ను - 0.50 కోట్లు, సెంట్రల్ జీఎస్టీ రూ.15,092.15 కోట్లు, కస్టమ్స్ రూ.1,007.31 కోట్లు, కేంద్ర ఎక్సైజ్ డ్యూటీ రూ.602.32 కోట్లు, సర్వీస్ టాక్స్ రూ.1.66 కోట్లు, ఇతర పన్నులు, డ్యూటీలు కలిపి రూ.77.99 కోట్లు ఆంధ్రప్రదేశ్‌కు రానున్నాయి. అలాగే.. కేంద్ర పన్నుల్లో ఉత్తరప్రదేశ్ (రూ. 2,18,816.84 కోట్లు), బీహార్ (రూ. 1,22,685.76 కోట్లు), మధ్యప్రదేశ్ (రూ.95,752.96 కోట్లు), పశ్చిమ బెంగాల్ (రూ. 91,764.26 కోట్లు), మహారాష్ట్ర (రూ. 7,053.69 కోట్లు), రాజస్థాన్ (రూ. 73,504.11 కోట్లు) రాష్ట్రాలకు అత్యధిక వాటా వెళ్తుంది.

బడ్జెట్‌పై ఐద్వా అసంతృప్తి

మహిళా సాధికారతపై మోసపూరిత ప్రకటనలని విమర్శ



న్యూఢిల్లీ : కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన తాత్కాలిక బడ్జెట్ పట్ల ఐద్వా తీవ్ర అసంతృప్తిని వ్యక్తం చేసింది. ఇది, ఎన్నికల ముందు ప్రచార పత్రం తప్ప మరొకటి కాదని విమర్శించింది. మహిళా సాధికారతలో విజయాల గురించి ఈ ప్రభుత్వం ఆర్భాటంగా చేస్తున్న ప్రచారాన్ని మహిళల ఉపాధి అవకాశాలు క్షీణించడం, కొనసాగుతున్న ఆర్థిక దుస్థితి, పెరుగుతున్న ఆకలి వంటి వాటిల్లో చూడాలని ఐద్వా పేర్కొంది. ఇవన్నీ కలిసి మహిళల జీవితాల్లో అంతులేని కష్టాలను నింపుతున్నాయని పేర్కొంది. ఆర్థిక మంత్రి వాస్తవిక పరిస్థితులను గమనంలోకి తీసుకోవాలని, మహిళలను మోసం చేయడాన్ని ఆపాలని ఐద్వా కోరింది. 2014-2021 మధ్య కాలంలో మహిళా కార్మికుల ఆత్మహత్యలు 137శాతం పెరిగాయని తెలిపింది. మహిళల సాధికారత అనేది పెట్టుబడులపై కాదని, ఫలితాలపై ఆధారపడి వుంటుందని ఆర్థిక మంత్రి వ్యాఖ్యానించారని, అంటే దానర్థం మహిళాభివృద్ధికి బడ్జెట్‌లో కేటాయింపులు కీలకం కాదని చెప్పకనే చెబుతున్నారని విమర్శించింది. మహిళా లబ్దిదారుల సంఖ్య గణనీయంగా వున్న ఎంజీఎన్ఆర్ఇజిఎస్ గురించి అస్సలు ప్రస్తావనే లేదని, ఈ పథకాన్ని మొత్తంగా నిలిపివేయడానికి ప్రభుత్వం కుట్రలు పన్నుతోందని స్పష్టమవుతోందని ఐద్వా పేర్కొంది. గత బడ్జెట్‌లో ప్రకటించిన బాలికల పొదుపు మొత్తాల పథకం ఇప్పటివరకు ప్రారంభం కాలేదు. పైగా జన ధన్ పథకంలో మోసాల గురించి కాగ్ బట్టబయలు చేసింది. అటువంటపుడు ఈ పథకాల గురించి మహిళా సాధికారత అంటూ ఈ ప్రభుత్వం చేసుకునే ప్రచారం ఏ మాత్రమూ సరికాదని ఐద్వా పేర్కొంది. మహిళా రిజర్వేషన్ బిల్లును, మూడుసార్లు తలాక్ బిల్లును ఆమోదించడాన్ని నారీ శక్తిగా ప్రభుత్వం చెప్పుకుంటోంది. గతంలో వీటిపై ఐద్వా తీవ్రమైన విమర్శలు చేసిందని, ఇకపై కూడా ఈ ప్రభుత్వ మహిళా వ్యతిరేక వైఖరిని బహిర్గతం చేస్తామని తెలిపింది. రాబోయే ఎన్నికల్లో ఈ నిరంకుశ, మనువాదీ ప్రభుత్వాన్ని ఓడించేందుకు ప్రజాతంత్ర శక్తులు, మహిళలు ఏకం కావాలని పిలుపిచ్చింది.

దొడ్డిదారిన వ్యవసాయ చట్టాల అమలుకు పన్నాగం

- వ్యవసాయ కార్యకలాపాల్లో
- పిపిపి ప్రతిపాదనపై ఎస్‌కెఎం మండిపాటు
- 3న గ్రామస్థాయిలో బడ్జెట్ కాపీలు దగ్ధం చేయాలని పిలుపు

న్యూఢిల్లీ : మోడీ ప్రభుత్వం ఓటాన్ అకౌంట్‌లో తీసుకొచ్చిన అంశాలు వ్యవసాయ రంగానికి, ఉపాధి హామీకి, మొత్తంగా ప్రజల సర్వతోముఖాభివృద్ధికి అత్యంత ప్రమాదకరమైనవని సంయుక్త కిసాన్ మోర్చా (ఎస్‌కెఎం) విమర్శించింది. పంట చేతికి వచ్చిన తర్వాత సాగే కార్యకలాపాల్లో అంటే దిగుబడులను నిల్వ చేయడం, సరఫరా మార్గాలు, ప్రాథమిక, సెకండరీ స్థాయిల్లో ప్రాసెసింగ్, మార్కెటింగ్, బ్రాండింగ్ వంటి వాటిల్లో ప్రభుత్వ ప్రైవేటు భాగస్వామ్యాన్ని పెంచి పోషించేందుకు బడ్జెట్‌లో ప్రతిపాదించారని, ఇది వ్యవసాయ రంగంలో కార్పొరేట్లకు పెద్ద పీట వేస్తూ, వారి చేతికి పగ్గాలు ఇవ్వడం తప్ప మరొకటి కాదని ఎస్‌కెఎం విమర్శించింది. ఈ మేరకు ఒక ప్రకటన జారీ చేసింది. ప్రభుత్వ రంగాన్ని, సహకార సంఘాలను, ఎంఎస్‌ఎంఇలను బలోపేతం చేసేందుకు చర్యలు తీసుకోవడానికి బదులుగా ఈ కార్యకలాపాలన్నింటినీ కార్పొరేట్లకు గుత్తంగా కట్టబెట్టడమంటే మోడీ సర్కార్ గతంలో తీసుకొచ్చిన మూడు నల్ల వ్యవసాయ చట్టాలను దొడ్డిదారిన అమలు చేయడమేనని ఎస్‌కెఎం మండిపడింది. ఈ ప్రతిపాదనను అమలు కానివ్వబోమని స్పష్టం చేసింది.

కనీస మద్దతు ధరను సి2 ప్లస్ 50శాతంగా ఇస్తామని 2021 డిసెంబరు 9న మోడీ ప్రభుత్వం రాతపూర్వకంగా హామీ ఇచ్చిందని, కానీ ఇంతవరకు దాన్ని అమలు చేయలేదని, ఈ బడ్జెట్‌లో కూడా దాన్ని ప్రకటించకపోవడం రైతులను తీవ్రంగా మోసం చేయడమేనని ఆగ్రహం వ్యక్తం చేసింది. నిరుద్యోగ సమస్య ఇంత తీవ్రంగా వున్నా ఉపాధి ఉత్పత్తికి ఎలాంటి గణనీయమైన కేటాయింపులు లేవని విమర్శించింది. ఈ నేపథ్యంలో, రైతు, కార్మిక వ్యతిరేక బడ్జెట్‌ను నిరసిస్తూ, ఈ నెల 3వ తేదీన గ్రామ స్థాయిలో కార్పొరేట్ అనుకూల బడ్జెట్ కాపీలను దగ్ధం చేయాల్సిందిగా ఎస్‌కెఎం రైతులకు పిలుపునిచ్చింది. ఈ నెల 16న జరగబోయే గ్రామీణ బంద్‌ను, పారిశ్రామిక సమ్మెను విజయవంతం చేయాల్సిందిగా ప్రజలకు విజ్ఞప్తి చేసింది.

వ్యవసాయ కార్మికులను గాలికి వదిలిన బడ్జెట్

తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

గ్రామీణ వ్యవసాయ కార్మికుల సంక్షేమాన్ని మోడీ ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్ పూర్తిగా విస్మరించిందని తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం అధ్యక్ష, కార్యదర్శులు జి.నాగయ్య, ఆర్.వెంకట్ రాములు విమర్శించారు. గురువారం హైదరాబాద్ ఆర్టీసీ క్రాస్ రోడ్‌లోని రాష్ట్ర కార్యాలయంలో జరిగిన సంఘం విస్తృత సమావేశంలో వారు మాట్లాడుతూ వ్యవసాయ కార్మికుల కోసం పార్లమెంట్‌లో సమగ్ర చట్టం తీసుకు రావాలని డిమాండ్ చేశారు. ఇప్పుడున్న 100 రోజుల పని దినాలను 200 రోజులకు పెంచడంతో పాటు పట్టణాలకు విస్తరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ఉపాధ్యక్షులు బి.ప్రసాద్, మచ్చ వెంకటేశ్వర్లు, నారి ఐలయ్య, కొండమడుగు నరసింహ, ఆవుల వీరన్న, ములకపల్లి రాములు, రాష్ట్ర సహాయ కార్యదర్శి రాళ్ల బండి శశిధర్, గోపాల్, నరసింహులు, సమ్మయ్య, సాంబశివ తదితరులు పాల్గొన్నారు.

అబద్ధాల బడ్జెట్ : ఎస్ఎఫ్ఐ

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

విద్యారంగంపై అబద్దాలతో కూడిన బడ్జెట్‌ను కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ ప్రవేశపెట్టారని ఎస్ఎఫ్ఐ రాష్ట్ర అధ్యక్షులు ఆర్ఎల్ మూర్తి, కార్యదర్శి టి నాగరాజు విమర్శించారు. ఉన్నత విద్యారంగంలో 28 శాతం విద్యార్థినీల నమోదు పెరిగిందనడం, సైన్స్, టెక్నాలజీ ఇంజినీరింగ్, మెడికల్ విభాగాల్లో వారి చేరిక 43 శాతంగా ఉందనడం హాస్యాస్పదంగా ఉందని గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. బీజేపీ అధికారం చేపట్టాక విద్యార్థినీలు చదువులకు దూరమయ్యారని విమర్శించారు. కేంద్రం నిర్వహిస్తున్న కేంద్రీయ విశ్వవిద్యాలయాల్లో, కేంద్రీయ పాఠశాలల్లో, నవోదయాల్లో కనీస మౌలిక సదుపాయాలు లేవని తెలిపారు. స్కిల్ ఇండియా ఏర్పాటు చేసి ఎనిమిది కోట్ల మందిని స్కిల్ యువతగా తీర్చిదిద్దామన్నారని వివరించారు. పదేండ్లలో ఎన్ని లక్షల మంది యువతకు ప్రభుత్వ ఉద్యోగాలు కల్పించారో కేంద్రం సమాధానం చెప్పాలని వారు డిమాండ్ చేశారు. నూతన ఐటీఐలు, ఐఐటీలు, మెడికల్ కళాశాలలు, ఐఐఎంలు ఏర్పాటు చేసినట్టు గొప్పలు చెప్పారని తెలిపారు. కానీ ఆయా కళాశాలల్లో మౌలిక సదుపాయాల కొరత విద్యార్థులను తీవ్రంగా వేధిస్తున్నదని పేర్కొన్నారు. ప్రభుత్వమే 390కి పైగా ప్రయివేటు విశ్వవిద్యాలయాలకు అనుమతులిచ్చి ప్రభుత్వ వర్సిటీలను నిర్వీర్యం చేసిందని తెలిపారు. ఏకలవ్య పాఠశాలలు, సైనిక స్కూళ్లను ఏర్పాటు చేసినట్టు చెప్పిన దేశంలో నూతన విద్యాసంస్థలు ఎక్కడా ప్రారంభం కాలేదని విమర్శించారు. నూతన విద్యావిధానికి అనుగుణంగా విద్యారంగానికి బడ్జెట్ కేటాయింపుల్లేవని పేర్కొన్నారు. నూతన విద్యావిధానం పేరుతో ప్రయివేటు, కార్పొరేట్ శక్తులకు విద్యారంగాన్ని అప్పజెప్పే కుట్రలు చేస్తున్నదని తెలిపారు. దేశంలో విద్యాప్రమాణాలు పెరగాలంటే బడ్జెట్ కేటాయింపులు పెరగాలని సూచించారు.

విద్యారంగాన్ని విస్మరించిన కేంద్రబడ్జెట్ : ఏఐఎస్ఎఫ్

కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన మధ్యంతర బడ్జెట్ విద్యారంగాన్ని పూర్తిగా విస్మరించిందని ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు కసిరెడ్డి మణికంఠ రెడ్డి, పుట్ట లక్ష్మణ్ విమర్శించారు. విద్యారంగానికి కేంద్ర బడ్జెట్‌లో 10 శాతం నిధులు కేటాయించాల్సి ఉండగా 2.61 శాతమే కేటాయించడం ఎంత వరకు సమంజసమని ప్రశ్నించారు. దేశ వ్యాప్తంగా ఉన్న విశ్వవిద్యాలయాలు, ప్రభుత్వ విద్యాసంస్థల అభివృద్ధికి ఈ నిధులు ఏమాత్రం సరిపోవని తెలిపారు. విభజన చట్టం ప్రకారం తెలంగాణకు త్రిపుల్ఐటీ, ఐఐటీ, ఐఐఎంతోపాటు జిల్లాకో నవోదయ పాఠశాల ఏర్పాటు చేయాలని ఉన్నా ఈ బడ్జెట్‌లో ఆ ఊసే లేదని విమర్శించారు. తెలంగాణ పట్ల బీజేపీ ప్రభుత్వం కక్షపూరితంగా వ్యవహరిస్తున్నదని తెలిపారు. ఇంకోవైపు నాణ్యమైన విద్య అందిస్తామంటూ అబద్ధపు మాటలు చెప్తూ విద్యా ప్రయివేటీకరణ, కార్పొరేటీకరణ, కాషాయీకరణ చేసే దిశగా నూతన జాతీయ విద్యావిధానాన్ని ప్రోత్సహిస్తున్నదని పేర్కొన్నారు. దేశంలో విదేశీ ప్రయివేట్ వర్సిటీలకు అనుమతులివ్వడం సరైంది కాదని తెలిపారు. దేశం, ధర్మం అనే మోడీ ప్రభుత్వం విదేశీ వర్సిటీలకు ప్రోత్సాహం అందించి దేశీయ వర్సిటీల అభివృద్ధికి ఎందుకు నిధులు కేటాయించడం లేదని ప్రశ్నించారు.

అబద్ధాల పుట్ట బడ్జెట్ !

సీఐటీయూ విమర్శ



న్యూఢిల్లీ : మోడీ సర్కార్ ప్రవేశపెట్టిన ఓటాన్ అకౌంట్ బడ్జెట్ అబద్దాల పుట్ట అని, ప్రైవేటీకరణ కోసం బరి తెగించి చేసిన ప్రయత్నమని సీఐటీయూ విమర్శించింది. ప్రజల ఆదాయాలు 50శాతం పెరిగాయని, ద్రవ్యోల్బణం ఒక మోస్తరు స్థాయికి చేరుకుందంటూ చెప్పుకోవడం ద్వారా తిరిగి అధికారంలోకి రావడానికి చేసిన ప్రయత్నంగా వుందని విమర్శించింది. ఈ మేరకు సీఐటీయూ ప్రధాన కార్యదర్శి తపన్‌సేన్ ఒక ప్రకటన జారీ చేశారు. నిజానికి వాస్తవిక పరిస్థితులు భిన్నంగా వున్నాయని, నిత్యావసరాల ధరలు పెరుగుతునే వున్నాయని, నిరుద్యోగం పెచ్చరిల్లిందని విమర్శించింది. తమ రోజువారీ అవసరాలను తీర్చుకోవడానికే పోరాడుతున్న సామాన్యుల్లో విశ్వాసాన్ని పాదుగొల్పడంలో ఈ బడ్జెట్ ఘోరంగా విఫలమైందని విమర్శించింది. ప్రభుత్వ రంగ సంస్థలను ప్రైవేటీకరించేందుకు మోడీ ప్రభుత్వ హయాంలో పెద్ద ఎత్తున చర్యలు చేపట్టారని, రూ.4.09లక్షల కోట్ల మేరకు ప్రైవేటీకరణ జరిగిందని, దేశ చరిత్రలోనే ఇది అత్యంత ఎక్కువని విమర్శించింది. ఈ సంవత్సరంలో రూ.30వేల కోట్ల మేరకు పెట్టుబడులను ఉపసంహరించాలని లక్ష్యంగా పెట్టుకోగా 2025లో ఈ లక్ష్యం 50వేల కోట్లకు పెరిగిందని సిఐటియు విమర్శించింది. రక్షణ పరిశోధన, అభివృద్ధి రంగాల్లో ప్రైవేటుకు ద్వారాలు తెరిచారని, రూ.లక్ష కోట్లతో కార్పస్‌ను ఏర్పాటు చేశారని విమర్శించింది. వినూత్న ఆవిష్కరణల ముసుగులో ప్రైవేటు రంగానికి 50ఏళ్ళ పాటు వడ్డీ లేని రుణాలు అందించేందుకే ఈ చర్యలని విమర్శించింది. రాజ్యాంగంలో పొందుపరిచిన సమాఖ్యవాదం భావనను సమూలంగా ధ్వంసం చేసేందుకే ఒకపక్క మోడీ సర్కార్ ప్రయత్నిస్తుండగా, మరోవైపు రాబోయే తరం సంస్కరణలు చేపట్టడానికి అవసరమైన బ్లూ ప్రింట్‌ను రాష్ట్రాలతో చర్చించి రూపొందిస్తామని బడ్జెట్‌లో చెప్పడం హాస్యాస్పదంగా వుందని సిఐటియు విమర్శించింది. గత పదేళ్ళ మోడీ సర్కార్ పనితీరును చూసినట్లైతే, ఇది కార్మిక, కర్షక, ప్రజా, జాతి వ్యతిరేక ప్రభుత్వమని స్పష్టమవుతోందని తపన్‌సేన్ ఆ ప్రకటనలో పేర్కొన్నారు. మొత్తంగా చూసినట్లైతే కార్మికులు, రైతాంగం, సామాన్యులకు ఈ బడ్జెట్‌లో ఎలాంటి సానుకూల చర్యలు లేవని విమర్శించారు. ఈ నేపథ్యంలో, సంయుక్త కిసాన్ మోర్చా, సీఐటీయూల పిలుపు మేరకు ఈ నెల 16న జరగనున్న గ్రామీణ బంద్, పారిశ్రామిక సమ్మెను విజయవంతం చేయాల్సిందిగా సిఐటియు తన అనుబంధ సంఘాలకు, సభ్యులకు పిలుపిచ్చింది.

గ్రామీణ పేదలకు మరణ శాసనం కేంద్ర బడ్జెట్

ఉఫాధి హామీపథకం ఎత్తివేసే కుట్ర

- ఆలిండియా వ్యవసాయ కార్మిక సంఘం జనరల్ సెక్రెటరీ బి.వెంకట్

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

కేంద్రం ప్రవేశ పెట్టిన ఓటాన్ అకౌంట్ బడ్జెట్లో బీజేపీ ప్రభుత్వం పేదలకు మరణ శాసనాన్ని విధించిందని అఖిల భారత వ్యవసాయ కార్మిక సంఘం జనరల్ సెక్రెటరీ బి.వెంకట్ ఒక ప్రకటనలో విమర్శించారు. ఉపాధిహామీ పథకానికి నిధులు పెంచకుండా గతేడాది సవరించిన బడ్జెట్ కంటే తక్కువ కేటాయింపులు చేశారని అన్నారు. 2023-24 ఆర్థిక సంవత్సరంలో కేటాయించిన రూ. 87 వేల కోట్లతో పాటు మరో రూ.15 వేల కోట్ల మేర చేసిన పనికి బకాయిలు ఉన్నాయని తెలిపారు. మొత్తంగా చూస్తె గతేడాది దాదాపు రూ. లక్ష కోట్లు కేటాయించగా ఈ సారీ రూ. 86 వేల కోట్లు మాత్రమే కేటాయించి, ఎక్కువ కేటాయించామని అబద్ధాలు ప్రచారం చేస్తున్నారని విమర్శించారు. రూ. 2లక్షల కోట్లు ఉపాధి హామీకి అవసరమవుతాయని నిపుణులు చెప్పిన మాటను కేంద్రం పక్కన పెట్టిందని ఆరోపించారు.

ఈ ఏడాది 1/3 వంతు కార్మికులు ఉపాధి లేక, పనికి దూరమవుతారని వెంకట్ ఆందోళన వ్యక్తం చేశారు. క్రమంగా ఈ పథకానికి నిధులు తగ్గించేందుకు కేంద్రం కుట్ర పన్నుతున్నదని విమర్శించారు. గ్రామీణ ప్రాంతాల్లో పనితో సంబంధం లేకుండా భూములు కేటాయించాల్సిన సర్కార్... పేదలకు అన్యాయం చేస్తున్నదని విమర్శించారు. ధనవంతులను మరింత ధనవంతులు చేసే కార్పొరేట్ బడ్జెట్ అని ఆరోపించారు. ప్రజాపంపిణీ, విద్య, ఆరోగ్యం, గృహనిర్మాణం, ఉపాధి హామీ తదితర పథకాలకు నిధులు కేటాయించకుండా తాను కార్పొరేట్ పక్షపాతినని మోడీ మరోసారి రుజువు చేసుకున్నారని విమర్శలు గుప్పించారు.

రైతు వ్యతిరేక కేంద్ర బడ్జెట్‌కు నిరసిస్తూ నేడు రాష్ట్ర వ్యాప్త నిరసనలు

తెలంగాణ రైతు సంఘం పిలుపు

నవతెలంగాణబ్యూరో-హైదరాబాద్

రైతు వ్యతిరేక, కార్పొరేట్లకు అనుకూలంగా ఉన్న కేంద్ర బడ్జెట్‌ను నిరసిస్తూ... శుక్రవారం రాష్ట్ర వ్యాప్తంగా నిరసనలు తెలియజేయాలని తెలంగాణ రైతు సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి టి సాగర్ పిలుపునిచ్చారు. ఈమేరకు గురువారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. 2024-25 కేంద్ర బడ్జెట్‌లో వ్యవసాయరంగానికి రూ.2,22,281 కోట్లు కేటాయించినట్టు ప్రకటించినప్పటికీ వాస్తవంగా ఖర్చు చేసింది రూ.1,17,528.79 కోట్లు మాత్రమేనని పేర్కొన్నారు. దేశాన్ని వ్యవసాయ దిగుమతులకు కేంద్రంగా తయారు చేస్తూ, వ్యవసాయోత్పత్తులపై కార్పొరేట్ సంస్థలకు ఆధిపత్యం కలిగే లా నిధులు తగ్గిస్తున్నారని పేర్కొన్నారు. గతంలో ఉపసంహరించుకున్న మూడు నల్ల చట్టాలను మరో కోణంలో అమలు జరపడాన్ని ఆయన ఖండించారు. తక్షణమే రుణ మాఫీతోపాటు కనీస మద్దతు ధరలను శాస్త్రీయంగా నిర్ణయించాలని కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

సంపాదకీయం

జనం చెవుల్లో 'కమలం' పూలు

యాభై ఆరు అంగుళాల ఛాతి ఉందో లేదో తెలీదు గానీ, ఉన్నదాని నిండా గుండె నిబ్బరం ఉన్నట్టుంది. హిండెన్‌బర్గ్ నివేదిక టాయిలెట్ పేపర్ అయింది. కాగ్ నివేదికల నుండి కాచుకొస్తున్న తీరు చూసి ఆధునిక ప్రజాస్వామ్య దేశాలు ముక్కున వేలేసుకుంటున్నాయి. దేవుళ్ళను తన పక్కనే కొలువు తీర్చుకున్న తర్వాత ఈవీఎమ్‌లు కాషాయ శోభతో అలరారడం గ్యారంటీ అనే ధైర్యం ఉన్నది. ఇక బడ్జెట్‌లో ముక్కలో బొక్కలో విసరాల్సిన అవసరమేముంటుందని మోడీ బృందం భరోసా.

దానికి తగ్గట్టుగానే నిన్నటి నిర్మలమ్మ 'మధ్యంతర పద్దు' ఉంది. 2022 -23 కంటే 2023 -24 రెవెన్యూ ఆదాయం 13.3 శాతం పెరిగినా ద్రవ్యలోటు తగ్గించడం పేర గత ఏడాది బడ్జెట్ అంచనాల కంటే కేంద్ర ప్రభుత్వ ఖర్చు కుదించి వేయబడింది. వ్యవసాయం, వ్యవసాయ అనుబంధ రంగాలు, విద్య, వైద్య, సాంఘిక సంక్షేమంపైనా, ఎస్సీ, ఎస్టీలకు సంబంధించిన పీఎం కృషి సించాల్ యోజన వంటి వాటిపై గత బడ్జెట్ సంఖ్యలకంటే తక్కువే కేటాయించారు. ఆహార సబ్సిడీ, ఎరువులు, సబ్సిడీ, ఉపాధి హామీ నిధులన్నీ 2022 - 23 కంటే తగ్గించి వేయబడ్డాయి. జీడీపీ వృద్ధి 7.3 శాతం ఉంటుందనేది భూమ్మీదుండే అంచనా వేశారా? అనే సందేహం రాకతప్పదు. సర్కారు వారి అంచనా ప్రకారం ద్రవ్యోల్బణం 1.6 శాతం ఉంటుందని అంచనా. వాస్తవానికి వినిమయ ధరల సూచీపై ఆధార పడ్డ ద్రవ్యోల్బణం 6 శాతం, దీన్లో ఆహార ద్రవ్యోల్బణం పది శాతం దాటింది.

అంకెలు, సంఖ్యలు ఎలా ఉన్నా, అయోధ్య దెబ్బతో దేశంలో రామనామం కంటే మోడీ నామస్మరణే మిన్నంటిన వేళ ఓట్లేసే సామాన్యులను భక్తి రసంలో ముంచెత్తి, మైనార్టీలను కత్తులతో కంట్రోల్‌లో పెడితే ఈడీ, సీబీఐతో ప్రతిపక్షాలను బెదిరించి, మళ్లీ గట్టెక్కాలనుకునే ఆత్రుతతో ఉన్న కమలనాథులకు ఇదే చివరి బడ్జెట్ చేయాలి.

ఇప్పటికే దేశంలో వృద్ధి 'K' ఆకారంలో అంటే పేదలు మరింత పేదలవుతూంటే ధనికులు మరింత ధనికులౌతున్నారని అనేక మంది ఆర్థిక శాస్త్రవేత్తలు చెప్తున్నది నిజమని ఈ మధ్యంతర బడ్జెట్ మరింత రుజువు చేసింది. మోడీ బృందానికేమైనా భవిష్యత్ కన్పడే ఈ పద్దు తయారు చేశారో లేదో తెలియదు గానీ వీరి ప్రగల్భాలకి పరాకాష్టగా ఈ మధ్యంతర బడ్జెట్‌ను నిర్మలమ్మ ప్రజెంట్ చేసింది. 1950 నుండి 2014 వరకు ఒకటిగానూ, 2014 నుండి ఈ పదేండ్ల "అభివృద్ధి" ఒకటిగానూ విడగొట్టి పద్దులు లెక్క కట్టారు. 2023- 24 దేశ అభివృద్ధి 3.7 లక్షల కోట్ల డాలర్లు ఉంటుందని, రానున్న ఐదేండ్లలో ఇది ఐదు లక్షల కోట్ల డాలర్లకు పెరుగుతుందని చెప్తున్నారు. 2030 నాటికి ప్రపంచంలోనే మూడవ అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా భారతదేశం అవతరిస్తుందని పేర్కొన్నారు. 2014 నాటికి ప్రపంచ దేశాల్లో అట్టడుగు ఐదు దేశాల్లో ఒకటిగా ఉన్న భారతదేశం మోడీ వల్ల ఈ స్థాయికి పెరిగిందని చెప్పుకుంటున్నారు. పెరగటం మంచిదే కావచ్చు, దాని వల్ల సామాన్యులకు ఒరిగేదేంటనేది మిలియన్ డాలర్ల ప్రశ్న. వాళ్ల ఊర్లో మిరియాలు తాటికాయలంత ఉంటాయని చెప్తే జనం తాము చెవుల్లో పెట్టిన కమలం పూల వల్ల నమ్మి తీరతారనే అతి విశ్వాసంలో ఉన్నారు కాషాయ నేతలు.



ప్రభుత్వ రంగ పరిశ్రమలను ధ్వంసం చేయడంలో తామే మొనగాళ్లమని చెప్పుకుంటూ రూ.4.09 లక్షల కోట్ల ప్రభుత్వ రంగ షేర్‌లను అమ్మేశామని నిస్సిగ్గుగా ప్రకటించుకున్నారు. 2025లో మరో రూ.50 వేల కోట్ల షేర్లను అమ్మేస్తారట. దేశాన్ని, దేశంలో 75 ఏండ్ల పాటు నిర్మించిన ఆస్తులను అమ్మేయడం కూడా ఘనకార్యంగా చెప్పుకోవడం మోడీ ప్రభుత్వానికే చెల్లింది. అటు రాష్ట్రపతి ప్రసంగంలోనూ, ఇటు నిర్మలమ్మ బడ్జెట్ ప్రసంగంలోనూ మోడీ లక్ష్యాలు యువత, మహిళలు, రైతులు, పేదల గురించి నామస్మరణం చేశారు. పేదరికాన్ని నిర్మూలించేశామని చెప్పుకోవడానికి ఈ పాలకులకు నోరెలా వచ్చిందో అర్థం కాదు. ఐక్యరాజ్యసమితి పేదరిక సూచీలో భారత దేశ స్థితి అధ్వాన్నంగా ఉందన్న విషయం మన కళ్లెదుటే ఉంది. ఐఎల్ఓ లెక్క ప్రకారం మన దేశంతో సహా ప్రపంచంలోని అనేక దేశాల్లో నిజ వేతనాలు పడిపోవడాన్ని లెక్క తేలిస్తే ఇక పేదరికం ఎలా పడిపోయిందో ఈ పాలకులే చెప్పాలి. నాడు వస్తూ వస్తూ తెలంగాణాకు అన్యాయం చేసిన బీజేపీ నేడు పోతూ పోతూ కూడా దాన్నే కొనసాగించింది. విభజన హామీల ఊసే లేదు. రైల్వే కోచ్ ఫ్యాక్టరీ, బయ్యారం ఉక్కు ఫ్యాక్టరీ కలికానికి కూడా కానరావు.

అంకెలు, సంఖ్యలు ఎలా ఉన్నా, అయోధ్య దెబ్బతో దేశంలో రామనామం కంటే మోడీ నామస్మరణే మిన్నంటిన వేళ ఓట్లేసే సామాన్యులను భక్తిరసంలో ముంచెత్తి, మైనార్టీలను కత్తులతో కంట్రోల్‌లో పెడితే ఈడీ, సీబీఐతో ప్రతిపక్షాలను బెదిరించి, మళ్లీ గట్టెక్కాలనుకునే ఆత్రుతతో ఉన్న కమలనాథులకు ఇదే చివరి బడ్జెట్ చేయాలి.

అబద్ధాల పునాదిపై అయోధ్య రామాలయం


అయోధ్యలో బాబ్రీ మసీదు కూల్చేయడం గురించి, అది రాముడి జన్మస్థలం అని ఆరెస్సెస్ - బీజేపీలు ప్రకటించడం గురించి దేశంలో చాలా కాలంగా చర్చ జరుగుతూ ఉంది. ఈ వివాదం గత పాతికేళ్ళ నుండే కాదు, కొన్ని శతాబ్దాలుగా సాగుతూ ఉంది. సుప్రీం కోర్టు తీర్పు కూడా అది రాముడి జన్మస్థలమని నిర్ధారించలేదు. పైగా బాబ్రీ మసీదును కరసేవకులు కూల్చడాన్ని నేరంగా పరిగణించింది. కూలగొట్టిన చోటే రామాలయం కట్టుకోవడానికి అనుమతించలేదు. అందుకే, ఆలయ నిర్మాణం ఆ స్థలానికి దూరంగా కడుతున్నారు. అంతమాత్రానికి మసీదు ఎందుకు కూల్చాల్సి వచ్చిందో, దాని వెనక రాజకీయ మేమిటో ఈ దేశ ప్రజలు అర్థం చేసుకుంటున్నారు. మరో వైపు అయోధ్యలో రామ మందిరం దివ్యంగా నిర్మాణమవుతూ ఉంది. అందుకోసం వేల ఇండ్లు ధ్వంసం చేసిన సంగతి, పురాతన కట్టడాలు కూల్చేసిన సంగతి మీడియా కప్పిపుచ్చింది. ఇండ్లు కూల్చిన వారికి ప్రభుత్వం నష్టపరిహారం ఇవ్వకుండా అందరినీ నిరాశ్రయుల్ని చేసిన సంగతి మోడీ మీడియా మరుగు పరిచింది. సమస్యను పరిష్కరించే దిశలో కాకుండా సమస్యలు పెంచే దిశలో బీజేపీ ప్రభుత్వం ముందుకు వెళ్ళింది.


డాక్టర్ దేవరాజు మహారాజు

రామ భక్తుడు 'రామ్ చరిత్ మానస్' రాసిన కవి పుంగవుడు తులసీదాస్, రామ మందిరాన్ని తురుష్కరాజులు కూలగొడితే ఊరుకుంటాడా? వళ్ళు మండి తన ఆక్రోశాన్ని భక్తి పూర్వకంగా ఆ రాముడికి నివేదించుకోవాలి కదా? నివేదించుకోలేదు - ఆయనేమైనా వేరే విషయాలు రాశాడా? లేదే - కేవలం రామచరిత్ మానసే రాశాడు. అలాంట ప్పుడు తన కాలంలో జరిగిన రామాలయ విధ్వంసం గురించి రాయకుండా ఉంటాడా? ఉండడుకదా? వీటన్నిటి సారాంశం ఏమిటంటే అయోధ్యలో బాబర్ అనే ముస్లిం రాజు హిందూ దేవాలయాన్ని కూలగొట్టించ లేదు. అదే స్థలంలో తన పేరుతో మసీదు కట్టించలేదు-ఇది స్పష్టం!

భారత రాష్ట్రపతిని గానీ, బీజేపీ అగ్రనేతలను గానీ, ఇతర మతాల మతపెద్దలను గానీ ఆహ్వానించలేదు. పరిస్థితి గమనించి విపక్షాల కూటమి 'ఇండియా' రాముడి ప్రాణప్రతిష్ఠ కార్యక్రమానికి వెళ్ళకూడదని నిర్ణయించుకుంది. సృష్టికారకుడు, సర్వశక్తి సంపన్నుడూ అయిన దేవుడు తనకు తానే వెళ్ళి విగ్రహంలో ప్రాణప్రతిష్ఠ చేసుకోవాలి గానీ, ఎవరో ఒక తుచ్ఛ మానవుడితో ప్రాణప్రతిష్ఠ చెయించుకోవటమేమిటని హేతువాదులు ప్రశ్నించారు. సనాతన ధర్మం గురించి గొప్పగా ఉపన్యసించే ప్రధాని భార్య లేకుండా పూజలెలా చేస్తాడని మఠాధిపతులంతా ఛీత్కరించారు. ఎందుకు ఎన్ని అన్నా, తాను అనుకుంటున్న ఈ హిందూ దేశానికి తనను తానే రాజుగా ప్రకటించుకుంటున్నట్టు ఆర్భాటం చేశాడు ప్రధాని. ఒక మత కార్యక్రమాన్ని ప్రభుత్వ కార్యక్రమంగా మార్చేశాడు. ఆ రోజు దేశవ్యాప్తంగా సెలవు ఇవ్వడం అవసరం లేదు. అదీగాక, ఆసుపత్రులు మూసివేయడం మరింత దారుణం. విమానాశ్రయం నుండి రామాలయం దాకా రోడ్డు మీద రాముడి కటౌట్లు మోడీ కటౌట్లు పెట్టారు. దేవుడితో సమానంగా ఈ మానవుడి బొమ్మలేమిటని స్థానికులు ఆగ్రయిస్తే, మోడీ కటౌట్లు రాత్రికి రాత్రి తొలగించారు. ఏమైనా రాముడి స్థాయి తగ్గించి, మోడీ తన స్థాయి పెంచుకున్నాడని విమర్శలు వెల్లువెత్తాయి. బాబ్రీ మసీదు కూలగొట్టిన సందర్భంగా మత ఘర్షణల్లో రెండు వేలకు పైగా మరణించిన విషయం గానీ, కూలగొట్టిన మసీదుకు బదులుగా కొత్త మసీదు నిర్మాణానికి ఐదెకరాల స్థలం కేటాయించాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని సుప్రీంకోర్టు ఆదేశించిన విషయం గానీ ఎవరూ మాట్లాడటం లేదు, తప్పు కదా అదీ?

ఇవన్నీ ఇలా ఉంటే చరిత్ర ఏం చెబుతోందీ? బాబర్ అయోధ్యలో మసీదు కట్టించాడా? దేవాలయాన్ని కూల్చి కట్టించాడా? బాబ్రీ మసీదు ఆరు డిసెంబర్ 1992న కూల్చేసిన తర్వాత ఆ మసీదు అడుగున ఆర్కియాలజీ విభాగానికి ఏ ఆధారాలు దొరికాయి? లాంటి విషయాల మీద చరిత్రకారులు పరిశోధకులు ఏం చెప్పారో తెలుసుకోవడానికి తప్పని సరై నేను కూడా చరిత్ర పొరల్లోకి వెళ్ళాల్సి వచ్చింది. మొఘల్ చక్రవర్తి బాబర్(1483-1530 C.E)కు తన దినచర్య (డైరీ) రాసుకునే అలవాటు ఉండేది. దాన్ని ఆయన చాగ్తాయే-తుర్కీ అనే తన మాతృభాషలో రాసుకున్నాడు. అది 'తుజక్ ఏ బాబ్రీ' గా వెలువడింది. దాన్ని బాబర్ మనుమడు అక్బర్ ద గ్రేట్ (1542-1605 C.E) తన ఆస్థాన పండితుడితో ఫారసీ భాషలోకి అనువదింపజేశాడు. అప్పుడు అది 'బాబర్‌నామా' గా వెలుగు చూసింది. వీటిలో బాబ్రీ మసీదు ప్రసక్తి లేదు. చాలా కాలం తర్వాత బ్రిటీష్ పరిపాలనా కాలంలో బివిరిడ్జి (Annette Susannah Bevereidge) అనే రచయిత్రి భారతదేశం సందర్శించినపుడు తుజక్ ఐ బాబ్రీ-బాబర్ నామా రెండింటినీ చదివి, వాటి ఆధారంగా 'మెమొయిర్ ఆఫ్ బాబర్' పేరుతో 1921లో ఇంగ్లీషు అనువాదం తెచ్చారు- ఇందులో కూడా బాబర్ మసీదు కట్టించిన విషయం లేదు. మూలగ్రంథాల్లోనే లేనప్పుడు అనువాదంలో ఎందుకుంటుందీ? Ibn Battuta - అనే అరబ్ యాత్రికుడు ఆ కాలంలో తన అనుభవాలనన్నింటినీ RIHLA అనే గ్రంథంలో నిక్షిప్తం చేశాడు. అందులో కూడా బాబర్ మసీదు కట్టించిన విషయం లేదు.



ఆనాటి గ్రంథాలలో ఎక్కడా బాబర్ హిందూ దేవాలయం కూలగొట్టించాడని గానీ, అదే స్థలంలో మసీదు కట్టించాడని గానీ లేదు. అసలు ఆయన జీవిత కాలంలో ఆయోధ్యకు వెళ్ళనే లేదు. తన మంత్రులను గానీ. సైన్యాధికారులను గానీ పంపి అక్కడ దేవాలయమేదీ కూలగొట్టించలేదు. మసీదు కూడా కట్టించ లేదు. అంతే సిర్సా-షుషురా నదుల సంగమానికి బాబర్ 28 మార్చి 1528 C.E న ఒకసారి వెళ్ళాడు. అది అవధ్ ప్రాంతం. అక్కడికి అయోధ్య 72 మైళ్ళ దూరంలో ఉంది, వీరి విషయాలు అలా ఉంచి - రామ భక్తుడు 'రామ్ చరిత్ మానస్' రాసిన కవి పుంగవుడు తులసీదాస్, రామ మందిరాన్ని తురుష్కరాజులు కూలగొడితే ఊరుకుంటాడా? వళ్ళు మండి తన ఆక్రోశాన్ని భక్తిపూర్వకంగా ఆ రాముడికి నివేదించుకోవాలి కదా? నివేదించుకోలేదు- ఆయనేమైనా వేరే విషయాలు రాశాడా? లేదే - కేవలం రామచరిత్ మానసే రాశాడు. అలాంటప్పుడు తన కాలంలో జరిగిన రామాలయ విధ్వంసం గురించి రాయకుండా ఉంటాడా? ఉండడుకదా? వీటన్నిటి సారాంశం ఏమిటంటే అయోధ్యలో బాబర్ అనే ముస్లిం రాజు హిందూ దేవాలయాన్ని కూలగొట్టించ లేదు. అదే స్థలంలో తన పేరుతో మసీదు కట్టించలేదు -ఇది స్పష్టం! ఈ పరిశీలనల్లో ఒక ఫలకం కూడా దొరికింది. దాని మీద బాబర్ ఆదేశాల మేరకు ఆయన కమాండర్ మీర్ బాఖీ (బాఖీ తష్కండి) బాబ్రీ మసీదు కట్టించాడని ఉంది. అంతేగాని దాని మీద హిందూ దేవాలయం కూల్చి కట్టాడని లేదు. నిపుణులు దాన్ని క్షుణ్ణంగా పరిశీలించి తేల్చిందేమంటే ఆ ఫలకం 16వ శతాబ్దం నాటిది కాదని అందులోని భాష శైలి ఆధునిక కాలానికి చెందిందని - 19వ శతాబ్దంలో ఎవరో రాసి పెట్టిందని తేల్చారు. దానితో ఆ చిన్న ఆధారం కూడా పరీక్షకు నిలబడలేదు.

తాను అనుకుంటున్న ఈ హిందూ దేశానికి తనను తానే రాజుగా ప్రకటించుకుంటున్నట్టు ఆర్భాటం చేశాడు ప్రధాని. ఒక మత కార్యక్రమాన్ని ప్రభుత్వ కార్యక్రమంగా మార్చేశాడు. ఆ రోజు దేశవ్యాప్తంగా సెలవు ఇవ్వడం అవసరం లేదు. అదీగాక, ఆసుపత్రులు మూసివేయడం మరింత దారుణం. విమానాశ్రయం నుండి రామాలయం దాకా రోడ్డు మీద రాముడి కటౌట్లు మోడీ కటౌట్లు పెట్టారు. దేవుడితో సమానంగా ఈ మానవుడి బొమ్మలేమిటని స్థానికులు ఆగ్రయిస్తే, మోడీ కటౌట్లు రాత్రికి రాత్రి తొలగించారు. ఏమైనా రాముడి స్థాయి తగ్గించి, మోడీ తన స్థాయి పెంచుకున్నాడని విమర్శలు వెల్లువెత్తాయి.

సరే మరి, ఎవరూ కట్టించకపోతే అయోధ్యలో మసీదు ఎలా వచ్చిందీ? అనే అనుమానం సహజంగా వస్తుంది. మరింత విస్తృత పరిశోధనల తర్వాత మరి కొన్ని విషయాలు బయటికొచ్చాయి. చరిత్రకారుడు సశీల్ కుమార్ 'ద డిస్పూటెడ్ మాస్క్' అనే పేరుతో తన పరిశోధనలు గ్రంథస్థం చేశాడు. రొమిల్లా థాపర్, కునాల్ చక్రవర్తి, సుదిర జైస్వాల్ వంటి ప్రసిద్ధ చరిత్ర కారులు కూడా ఈ విషయాలు చర్చించారు. అయోధ్య బాబ్రీ మసీదును మొదట 'జామా మసీదు' అనే పిలిచేవారు. చాలాకాలం దానికి అ పేరే వాడుకలో ఉంది. 1855 తర్వాతే దాన్ని బాబ్రీమసీదు అనడం ప్రారంభించారు. పురాతన నిర్మాణాలు బాగా అధ్యయనం చేసిన నిపుణులు నిర్ధారించిందేమంటే -14-15 శతాబ్దాల మధ్య కాలంలో దాన్ని జోన్‌పూర్ షర్కీ రాజులు కట్టించారని! వారు కట్టించిన ఇతర మసీదుల గోపురాలు, లోపలి దూలాలు, స్థంభాలు, గోడల నిర్మాణం ప్రవేశద్వారం (ఆర్చ్) వగైరా క్షుణ్ణంగా పరిశీలించిన తర్వాత వారు ఆ నిర్ణయానికి వచ్చారు. ఈ 'బాబ్రీ మసీదు' జోన్‌పూర్ షర్కీ రాజులు కట్టించిన షాహీ అటల మసీదుకు పూర్తి నకలు (డూప్లికేట్ నమోనా)గా ఉంది. అందువల్ల తెలుసుకోదగ్గ విషయమేమంటే బాబర్‌కు బాబ్రీ మసీదుకు ఎలాంటి సంబంధం లేదని! ఇలాంటి చారిత్రక విషయాలు తెలుసుకోకుండా మిడిమిడి జ్ఞానంతో రాజకీయాలు చేయాలన్న కుట్రతో ఎందరో ఎన్నో మాట్లాడారు. ఇంకా మాట్లాడుతూనే ఉన్నారు. అయితే అవన్నీ అబద్ధాలు.

అయోధ్యను పూర్వం సాకేత్ అని పిలిచేవారు. సాధారణ శకం 5వ శతాబ్దంలో స్కందగుప్తుడు దానికి అయోధ్య అని పేరు పెట్టాడు. 1818 C.E లో ఫైజాబాద్ జిల్లాకు సంబంధించిన అధికారి దారే ఫరా బక్ష్ ఒక డాక్యుమెంట్ విడుదల చేశాడు. అందులో గూడా హిందూ దేవాలయ-బాబ్రీ మసీదుల ప్రసక్తి లేదు. 1979-80లలో ఆర్కియాలజిస్ట్ బి.బి.లాల్ అయోధ్య ప్రాంతంలో విస్తృతంగా తవ్వకాలు నిర్వహించాడు. ఆయన ఉద్దేశమేమంటే, వాల్మీకి రామాయణంలోని వర్ణనల ప్రకారం అక్కడ ఆధారాలేమైనా దొరుకుతాయేమోనని! వాల్మీకి రామాయణాన్ని నిరూపించాలన్న పట్టుదలతో చాలా కష్టపడ్డారు. రామాయణంలో వాల్మీకి వర్ణించిన ప్రదేశాలు, రాముడికి- సీతకు సంబంధించిన వస్తువులు, వారున్న ఇల్లు వంటి వాటి ఆధారాలు తవ్వితీద్దామని ఆరాటపడ్డాడు. కానీ ఫలితం దక్కలేదు. సాధారణ శకానికి పూర్వం 8వ శతాబ్దం నుండి కొన్ని

అయోధ్య బాబ్రీ మసీదును మొదట 'జామా మసీదు' అనే పిలిచేవారు. చాలాకాలం దానికి అ పేరే వాడుకలో ఉంది. 1855 తర్వాతే దాన్ని బాబ్రీమసీదు అనడం ప్రారంభించారు. పురాతన నిర్మాణాలు బాగా అధ్యయనం చేసిన నిపుణులు నిర్ధారించిందేమంటే -14-15 శతాబ్దాల మధ్య కాలంలో దాన్ని జోన్‌పూర్ షర్కీ రాజులు కట్టించారని! వారు కట్టించిన ఇతర మసీదుల గోపురాలు, లోపలి దూలాలు, స్థంభాలు, గోడల నిర్మాణం ప్రవేశద్వారం (ఆర్చ్) వగైరా క్షుణ్ణంగా పరిశీలించిన తర్వాత వారు ఆ నిర్ణయానికి వచ్చారు. ఈ 'బాబ్రీ మసీదు' జోన్‌పూర్ షర్కీ రాజులు కట్టించిన షాహీ అటల మసీదుకు పూర్తి నకలు (డూప్లికేట్ నమోనా)గా ఉంది. అందువల్ల తెలుసుకోదగ్గ విషయమేమంటే బాబర్‌కు బాబ్రీ మసీదుకు ఎలాంటి సంబంధం లేదని!

ఆధారాలు లభించాయే గాని-అవి దేవుడైన రాముడికి సంబంధించినవి కావు. అంత శ్రమకోర్చి చేసిన పనిని బి.బి.లాల్ గ్రంథస్థం చేయలేదు. ఆయన అనుకున్నది దొరకనందుకు బహుశా ఆయనకే నామోషీగా తోచిందేమో-'Nothing of speciel Interest-was found'- అని చెప్పుకున్నాడు. ఇండియన్ ఆర్కియాలజీ రివ్యూ జర్నల్ రెండు సంచికల్లో ఆయన కృషిని కొంత నమోదు చేసింది. అందులో Nothing అనే ఉంది. 1969-70 ప్రాంతంలో బెనారస్ హిందూ విశ్వవిద్యాలయ బృందం అయోధ్యలో కొంత అధ్యయనం చేసింది గానీ కొత్త సమాచారం ఏదీ ఇవ్వలేక పోయింది.

సర్వే ఆఫ్ ఇండియా : భారతదేశపు తొలి డైరెక్టర్ జర్నల్ ఆఫ్ ఆర్కియాలజీ అలెగ్జాండర్ కన్నింగ్‌హాం దేశవ్యాప్తంగా తవ్వకాలు జరిపించాడు. ఎక్కడ తవ్వినా బౌద్ధానికి సంబంధించిన శిల్పాలు, స్థూపాలు బయటపడసాగాయి. 1862-63 C.Eలో అయోధ్యలో కూడా తవ్వించాడు. అక్కడ రెండు బౌద్ధ స్థూపాలు విశాలమైన ఒక బౌద్ధ విహారం బయటపడ్డాయి. వాటిని పరిశీలించి అవి మౌర్య చక్రవర్తి అశోకుడి కాలంవి అని ఆయన నిర్ధారించాడు. వాస్తవానికి సాకేత్/అయోధ్య ఒక గొప్ప బౌద్ధ క్షేత్రంగా వెలసిల్లిందని చీనా యాత్రికుడు హ్యూస్‌త్సాంగ్ చెప్పింది కూడా అదే! 300-400 C.E మధ్య వెలువడిన బౌద్ధ జాతక కథల ప్రకారం- దశరధుడి, ఆయన కుమారుడు శ్రీరామచంద్రుల రాజధాని ఆయోధ్య కానేకాదు. వారి రాజధాని వారణాసి! 5-8 C.E శతాబ్దాల మధ్య మొదటి/ పద్నాలుగవ జైన తీర్థంకరుల జన్మస్థానం అయోధ్య! ఇక 1853-55 C.E ప్రాంతంలో వైష్ణవ భక్తుడు హనుమాన్ ఘడీ బైరాగి-బాబ్రీ మసీదు ఉన్న స్థలమే శ్రీరాముడి జన్మస్థలమని ప్రచారం ప్రారంభించాడు. 1979 C.Eలో అఖిల భారతీయ రామాయణ మహాసభ వారు వారం రోజులపాటు ఆయోధ్యలో రామాయణ పారాయణం జరిపించారు. ఆ తరువాత రాముడి - సీత విగ్రహాలు బాబ్రీ మసీదులో పెట్టి వివాదాన్ని పెంచారు. ఆ తర్వాతే పిటిషన్లు - కోర్టు కేసులు ఉధృతమయ్యాయి. నిప్పు లేనిదే పొగరాదు అని అంటారుగానీ, బ్రాహ్మణవాదం తల్చుకుంటే నిప్పు లేకుండానే పొగ పుట్టించి దేశాన్ని ఉక్కిరిబిక్కిరి చేయగలదు. ఇదిగో ప్రత్యక్షంగా చూశాం!

ఇంగిత జ్ఞానంతో ఆలోచిస్తే వాల్మీకి సృష్టించిన కల్పిత పాత్ర రాముడు చారిత్రక పురుషుడే కాదు. అతను ఈ దేశంలో పుట్టడమేమిటీ? పుడితే గిడితే వాల్మీకి మెదడ్లో పుడతాడు కదా? అబద్ధాల పునాది మీద నడుస్తున్న ప్రస్తుత కేంద్ర ప్రభుత్వం అబద్ధాల పైనే అయోధ్య రామాలయం నిర్మిస్తోంది. ఈ బాయిస్(B)22జనవరి (J) ప్రాణప్రతిష్ఠ(P) ప్రభుత్వం ఒక చీకటిలోంచి మరో చీకటిలోకి ప్రవేశించినట్టు 6/12/1992 నుండి 22/1/2024లోకి ప్రవేశించింది! ఎవరి విశ్వాసాలు వారివి. నేను కేవలం నాకు దొరికిన చారిత్రక ఆధారాలు ప్రజల ముందు పెట్టాను. నమ్మడం నమ్మక పోవడం - వారి ఇష్టం!

- సుప్రసిద్ధ సాహితీవేత్త, జీవశాస్త్రవేత్త : మెల్బోర్న్ నుంచి



బతుకుబాట

ఎప్పట్లాగే
ఉదయం కన్నెర్ర చేసింది
పొరలు పొరలుగా నేల
చీలిపోతూనే కన్నీరొలికింది
కన్నీటితోనే స్నానమాడిన కర్షకుడు
ఊహల మేడపై
జోరుగా పచార్లు కొడుతున్నాడు

నాగలి ఒంటరిదైపోయాక
కందిరీగలతో చెలిమి చేస్తూనే
మట్టి గూటిలో ఒదిగిపోయింది
కాలం అనుకూలించక
కోయిల రాగం మార్చుకుంది
ఎండు గడ్డి దుప్పటి కింద
పొలాలన్నీ సేదతీరుతున్నాయి

ఆకులు రాల్చిన చెట్టేమో
మరో చిగురు కోసం
నొప్పులు పడుతూ
అంగలార్చుతోంది
అంతో ఇంతో కడుపుకేసిన మేతను
పదే పదే నెమరు వేయలేక
పశువు కాళ్ళు చాపి పడుకుంది
ఎక్కడో తొంగి చూసిన మేఘం
ఏమీ పట్టనట్టు వెళ్ళిపోతుంటే
గాలి బుసలు కొట్టి పడగలిప్పింది

ఏరు నెత్తిన ఇసుక బుట్ట
కాళ్ళ కింద కంప చెట్టు
ఎండమావుల పరుగులతో
ఊరు ఉసూరుమంది
శ్మశానం వెంటనే నిద్ర లేచింది
బతుకు బాట అటు వైపే కదిలింది

అరువు పాటలో రైతు బతుకు
అడుగుల లెక్కన
అమ్ముడుపోయింది
బిక్కు బిక్కు మంటూ భూమి
రియల్ రంగాన ఆశలొదులుకుంది
ఆనందంలోను కన్నీళ్ళే
దు:ఖంలోను కన్నీళ్ళే

- నరెద్దుల రాజారెడ్డి
9666016636

సెమీకండక్టర్స్ ఉత్పత్తిలో మనమెక్కడ?

సెమీకండక్టర్స్ మ్యానుఫ్యాక్చరింగ్ ప్రస్తుతం అంతర్జాతీయంగా ప్రధానమైన చర్చనీయాంశమైంది. సెమీకండక్టర్స్ అంటే సాధారణంగా చిప్‌గా భావిస్తాము. వీటి తయారీకి ఉపయోగిస్తున్న ప్రధానమైన రా మెటీరియల్ సిలికాన్. చిప్‌లు స్మార్ట్ ఫోన్లు, కార్లు, కంప్యూటర్లు మొదలుకొని భద్రత అవసరాలు, రాకెట్లు, ఆర్టిఫిషియల్ ఇంటలిజెంట్ వరకు ఆధునాతన సాంకేతిక ఆవిష్కరణలన్నింటికీ ప్రధానమైన అవసరం. పర్యావరణం పరంగా కర్బన్ ఉద్గారాలను తగ్గించడం కోసం సోలార్ విద్యుత్, ఎలక్ట్రికల్ వాహనాలు, డ్రైవర్లు లేకుండా నడవగలిగే వాహనాలకు సెమీకండక్టర్లు పెద్దఎత్తున అవసరం ఉన్నది. ఆర్థిక, సాంకేతిక వ్యవస్థకు ఆయువుపట్టు లాంటి సెమీకండక్టర్స్ ఉత్పత్తికి, సప్లై చైన్‌గా వృద్ధి చెందడానికి అభివృద్ధి చెందిన దేశాలు పోటీపడుతున్నాయి. ఇప్పటికైతే సెమీకండక్టర్స్ టెక్నాలజీపై పట్టు అమెరికాదే. చైనా తక్కువ ధరతో అధిక నాణ్యత కలిగిన సిలికాన్ ఉత్పత్తులను ప్రపంచానికి అందిస్తున్నది. సెమీకండక్టర్స్ చిప్స్ తయారీకి వినియోగించే ముడిసరుకులు సిలికాన్ 60లక్షల మెట్రిక్ టన్నులు 70శాతం, జెర్మినియం 95 మెట్రిక్ టన్నులు 68శాతం, గాలియం 420 మెట్రిక్ టన్నులు 98శాతం చైనా సరఫరా చేస్తున్నది.రేర్ ఎర్త్ ఎలిమెంట్స్ (అర్ఈఈ)లను అవి కనుగొనబడిన రాతి నుండి వేరు చేయడానికి అవసరమైన ప్రక్రియలు కష్టతరమైనది, ఖరీదైనది. పూర్తి పదార్థాన్ని వెలికితీసేందుకు, శుద్ధి చేయడానికి వేల దశలు అవసరం. అర్ఈఈ మైనింగ్, రిఫైనింగ్‌పై దృష్టి సారించిన కొన్ని దేశాలలో చైనా ఒకటి, దీని ఫలితంగా ప్రపంచంలోని టంగ్‌స్టన్, మాలిబ్డినం సరఫరాలో 85 శాతం ఆ దేశం ఉత్పత్తి చేస్తుంది. సెమీ కండక్టర్స్ ఉత్పత్తిలో తైవాన్‌కు చెందిన తైవాన్ సెమీకండక్టర్స్ మ్యానుఫ్యాక్చరింగ్ కార్పొరేషన్ (టి.ఎస్.యం.సి) దే ఆధిపత్యం. అత్యంత ఆధునికమైన సెమీకండక్టర్స్ 90 శాతం, ఇతర అన్ని రకాల సెమీకండక్టర్స్ ఉత్పత్తిలో 60 శాతం తైవాన్ ఉత్పత్తి చేస్తుంది. ఆపిల్, ఇంటెల్ వంటి దిగ్గజ సంస్థలకు సెమీకండక్టర్స్‌ను టి.ఎస్.యం.సి సరఫరా చేస్తున్నది. నైపుణ్యం కలిగిన మ్యాన్ పవర్ ఉండడం ప్రధాన కారణం.


గీట్ల ముకుంద రెడ్డి
94900 98857

కోవిడ్-19వల్ల పోర్టులు, ఎయిర్‌పోర్టులు పని చేయలేదు. రవాణారంగం స్తంభించిపోయింది. సరఫరా చైన్ తెగిపోయి అనేక దేశాల ఆర్థిక అభివృద్ధికి ఆటంకమైంది. నాటో కూటమి, రష్యా యుద్ధ క్షేత్రమైన ఉక్రెయిన్ చిప్పుల తయారీలో లేజర్లను నియంత్రించడానికి ఉపయోగించే నియాన్ గ్యాస్‌లో 50 శాతం ఉత్పత్తి చేసేది. ఈగ్యాస్ సరఫరాకు ఆటంకాలు ఏర్పడ్డాయి. చైనాలో విడదీయరాని భాగం అయినా తైవాన్‌పై బీజింగ్ పట్టు సాధిస్తుందని భావిస్తున్న పశ్చిమ యూరప్ దేశాలు సెమీకండక్టర్స్ కోసం తైవాన్‌పై ఆధారపడడం తగ్గించుకోవాలని భావిస్తున్నాయి. ఈ నేపథ్యంలో మన దేశంతో సహా అనేక అభివృద్ధి చెందిన, చెందుతున్న దేశాలు తమ తమ దేశీయ అవసరాలు తీర్చుకోవడానికి, అదే సమయంలో సప్లై చైన్‌గా వృద్ధి చెందడానికి ప్రయత్నిస్తున్నాయి. సెమీకండక్టర్స్ తయారీకి బూస్టింగ్ ఇచ్చేందుకు అమెరికా ప్రభుత్వం 52 బిలియన్ డాలర్ల పెట్టుబడిని పెడుతున్నది. యూరోపియన్ యూనియన్ 43 బిలియన్ యూరోలను పెట్టుబడి పెట్టాలని లక్ష్యంగా పెట్టుకున్నది. చైనా 145 బిలియన్ డాలర్ల పెట్టుబడి పెడుతున్నది. సెమీ కండక్టర్స్, డిస్ప్లే తయారీని పెంచడానికి భారత ప్రభుత్వం రూ.76 వేల కోట్ల (10 బిలియన్ అమెరికన్ డాలర్లు) ప్యాకేజీని 2021 డిసెంబర్ 15న ప్రకటించింది. సెమీకండక్టర్స్ మెటీరియల్ మార్కెట్ సుమారు 65 మిలియన్ డాలర్లకు చేరింది. సెమీకండక్టర్స్‌కు ఉపయోగించే సిలికాన్ వంటి కొన్ని రకాల మెటీరియల్ చౌకగా, సమృద్ధిగా ఉన్నప్పటికీ ఉత్పత్తి ఖర్చులు చాలా ఎక్కువ అవుతున్నాయి. సెమీకండక్టర్లు ఎలక్ట్రానిక్ పరికరాలలో ముఖ్యమైన భాగం. ప్రపంచవ్యాప్తంగా రోజుకు బిలియన్లలో ఉత్పత్తి, వినియోగం జరుగుతున్నాయి. ఇండియా 90శాతం సెమీకండక్టర్లను చైనా, తైవాన్, సౌత్‌కొరియా తదితర దేశాలనుండి దిగుమతి చేసుకుంటున్నది.



స్థిరమైన సెమీకండక్టర్లను అభివృద్ధి చేయడానికి దీర్ఘకాలిక వ్యూహాలను అమలు చేయడానికి "ఇండియా సెమీకండక్టర్ మిషన్ (ఐఎస్ఎమ్)" కేంద్ర ప్రభుత్వం ఏర్పాటు చేసింది. అమెరికా చైనా మధ్య జరుగుతున్న టెక్నాలజీ వార్, రాజకీయ, ఆర్థిక,వాణిజ్య వ్యూహాత్మక వార్ నేపథ్యంలో చైనా తన దేశీయ కొనుగోలు శక్తి పెంచుకోవడానికి, ఉద్యోగుల వేతనాలు గణనీయంగా పెంచిన పరిస్థితిలో ప్రపంచ టెక్ దిగ్గజ సంస్థలు భారత్ వైపు చూస్తాయని కేంద్ర ప్రభుత్వం కలలుగంటున్నప్పటికీ ఒక్కడుగు ముందుకు.. రెండడుగులు వెనక్కు అన్నట్లుగా ఉంది పరిస్థితి.

ప్రపంచంలోని సెమీకండక్టర్ డిజైన్ ఇంజనీర్లలో భారత దేశం 20శాతం వాటా కలిగి ఉంది. ప్రస్తుతం ప్రపంచ సెమీకండక్టర్ పరిశ్రమలో దాదాపు 1,50,000 మంది భారతీయ ఇంజనీర్లు పనిచేస్తున్నారు. భారత దేశాన్ని గ్లోబల్ హబ్‌గా మార్చడం, దేశంలో శక్తివంతమైన సెమీకండక్టర్ డిజైన్ ఎకోసిస్టం రూపొందించడం కోసం జాతీయ ఎలక్ట్రానిక్స్ పాలసీ (2019) లక్ష్యంగా పెట్టుకున్నది. ఎలక్ట్రానిక్స్ అండ్ ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ మంత్రిత్వశాఖ దేశీయ పరిశ్రమలో సెమీకండక్టర్ డిజైన్లు వృద్ధి చేయడానికి డిజైన్ లింక్డ్ ఇన్సెంటివ్ (డిఎల్ఐ) పథకాన్ని ప్రకటించింది. డిఎల్ఐ ఇంటిగ్రేటెడ్ సర్క్యూట్లు (ఐసీలు), చిప్ సెట్లు, సిస్టం ఆన్ చిప్స్ (ఎస్వోసిఎస్), సిస్టమ్‌లు అండ్ సెమీకండక్టర్ డిజైన్ అభివృద్ధి, విస్తరణకు వంద దేశీయ స్టార్టప్ కంపెనీలకు వివిధ దశలలో ఆర్థిక ప్రోత్సాహకాలు, డిజైన్ మౌలిక సదుపాయాల మద్దతును అందించడం లక్ష్యంగా పెట్టుకోగా కేవలం ఏడు స్టార్టప్‌లను మాత్రమే ఆమోదించింది. ఎలక్ట్రానిక్ కాంపోనెంట్స్, సెమీకండక్టర్స్ (SPECS) సహకారంతో రాజస్థాన్‌కు చెందిన సహస్ర సెమీకండక్టర్స్ కంపెనీ మెమరీ చిప్‌లను ఉత్పత్తిని భివాడి జిల్లాలోని సెమీకండక్టర్ అసెంబ్లీ, టెస్ట్, ప్యాకేజింగ్ యూనిట్‌లో ప్రారంభించింది. గ్లోబల్ చిప్‌మేకర్ అయిన అమెరికా ఆధారిత మైక్రోన్, గుజరాత్‌లో కొత్త అసెంబ్లీ, టెస్ట్ యూనిట్‌ను స్థాపించడానికి 825 మిలియన్ డాలర్ల పెట్టుబడి పెడుతున్నది. 2024 చివరినాటికి సనంద్‌లో ఉత్పత్తుల తయారీని ప్రారంభిస్తుందని భావిస్తున్నారు. కేంద్ర ప్రభుత్వం గణనీయమైన ఆర్థిక సహాయాన్ని అందిస్తోంది. మొత్తం ప్రాజెక్ట్ వ్యయంలో 50శాతం, గుజరాత్ ప్రభుత్వం నుండి అదనంగా 20శాతం సహాయం అందిస్తున్నది.

స్వదేశీ ఎలక్ట్రానిక్స్ కాంట్రాక్ట్ తయారీ సేవల కంపెనీ కేన్స్ టెక్నాలజీ అనుబంధ సంస్థ కేన్స్ సెమికాన్ ద్వారా హైదరాబాద్ కొంగర కలాన్ వద్ద సెమీకండక్టర్ ఓ.ఎస్.ఏ.టి, కాంపౌండ్ సెమీకండక్టర్ సౌకర్యాన్ని ప్రారంభించడానికి కంపెనీ రూ.28 వందల కోట్ల పెట్టుబడి పెట్టడానికి సంసిద్ధత వ్యక్తం చేసింది. దీని ద్వారా రెండువేల ఉద్యోగాలు వస్తాయని అంచనా. ప్రారంభ మూడేండ్లలో కేన్స్ సెమికాన్ క్యూఎఫ్ఎన్ (క్వాడ్ ఫ్లాట్ నో-లీడ్స్ ప్యాకేజీ), ఎస్.వో.టి (స్మాల్ అవుట్‌లైన్ ట్రాన్సిస్టర్), టివో (ట్రాన్సిస్టర్ అవుట్‌లైన్), బిజీఏ (బాల్ గ్రిడ్ అర్రే) లతో సహా వివిధ ప్యాకేజీ రకాలతో గ్లోబల్ కస్టమర్‌లకు సహాయం చేస్తుంది.

ఎచ్.సి.ఎల్ అవుట్‌సోర్స్ సెమీకండక్టర్ అసెంబ్లీ, టెస్టింగ్ (ఓ.ఎస్.ఏ.టి) యూనిట్‌ను ఏర్పాటు చేయడానికి తైవానీస్ ఎలక్ట్రానిక్స్ తయారీ సేవల దిగ్గజం ఫాక్స్‌కాన్‌తో జాయింట్ వెంచర్ (జెవి)ని కొనసాగిస్తోంది. ఫాక్స్‌కాన్ 37.2 మిలియన్ల అమెరికన్ డాలర్లుకు 40 శాతం ఈక్విటీని కలిగి ఉన్నది. ఎచ్.సి.ఎల్ హార్డ్‌వేర్ కంపెనీగా ప్రారంభమైనప్పటికీ, సెమీకండక్టర్ డొమైన్‌లో డిజైన్ సేవలందించడంలో దాని ప్రస్తుత దృష్టి ప్రధానంగా ఉంది. సెమీకండక్టర్ స్పేస్‌లో సహకారాన్ని పెంచుకోవడానికి యూరోపియన్ యూనియన్. ఇయు-ఇండియా ట్రేడ్ అండ్ టెక్నాలజీ కౌన్సిల్ (టిటిసి) ఫ్రేమ్‌వర్క్ కింద సెమీకండక్టర్ ఎకోసిస్టమ్స్, దాని సరఫరా గొలుసు, ఆవిష్కరణలపై వర్కింగ్ అరేంజ్‌మెంట్స్‌పై భారత్, యూరోపియన్ కమిషన్ మధ్య అవగాహన ఒప్పందం గతేడాది నవంబర్ 21న కుదిరింది.

స్థిరమైన సెమీకండక్టర్లను అభివృద్ధి చేయడానికి దీర్ఘకాలిక వ్యూహాలను అమలు చేయడానికి "ఇండియా సెమీకండక్టర్ మిషన్ (ఐఎస్ఎమ్)" కేంద్ర ప్రభుత్వం ఏర్పాటు చేసింది. అమెరికా చైనా మధ్య జరుగుతున్న టెక్నాలజీ వార్, రాజకీయ, ఆర్థిక, వాణిజ్య వ్యూహాత్మక వార్ నేపథ్యంలో చైనా తన దేశీయ కొనుగోలుశక్తి పెంచుకోవడానికి, ఉద్యోగుల వేతనాలు గణనీయంగా పెంచిన పరిస్థితిలో ప్రపంచ టెక్ దిగ్గజ సంస్థలు భారత్ వైపు చూస్తాయని కేంద్ర ప్రభుత్వం కలలుగంటున్నప్పటికీ ఒక్కడుగు ముందుకు..రెండడుగులు వెనక్కు అన్నట్లుగా ఉంది పరిస్థితి. ఫోక్స్కాన్ వేదాంత కంపెనీతో కుదుర్చుకున్న ఒప్పందం నుండి వెనక్కి పోయింది. రూ.లక్షల కోట్ల పెట్టుబడులు అవసరం ఉండడం, కేంద్ర ప్రభుత్వం మాటలకు, చేతలకు పొంతన లేకపోవడం వంటి కారణాల వలన భారత్‌కు ఈ రంగంలో అనేక అవకాశాలు ఉన్నప్పటికీ ఆశించిన ఫలితాలు రావడం లేదు.



పేదలకు సేవలందించి మన్ననలు పొందాలి

ఆర్ఎంపీలు ప్రాథమిక వైద్యాన్ని మాత్రమే చేయాలి

మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి

నవతెలంగాణ- ఖమ్మం

గ్రామీణ వైద్యులు నిత్యం ప్రజలకు అందుబాటులో ఉండి మెరుగైన వైద్య సేవలందించి ప్రజల మన్ననలు పొందాలని రాష్ట్ర రెవెన్యూ, సమాచార, గృహ నిర్మాణ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి అన్నారు. గురువారం ఖమ్మంలోని మంత్రి పొంగులేటి కార్యాలయంలో గ్రామీణ వైద్యుల సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షులు పిట్టల నాగేశ్వరరావు ఆధ్వర్యంలో గ్రామీణ వైద్యుల సంక్షేమ సంఘం జిల్లా మహాసభ పోస్టర్ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మంత్రి పొంగులేటి మాట్లాడుతూ ఈనెల 11వ తేదీన ఖమ్మంలో గ్రామీణ వైద్యుల సంక్షేమ సంఘం 21వ మహాసభలో పాల్గొనేందుకు వస్తానని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ జిల్లా నాయకులు చావా శివరామకృష్ణ, గ్రామీణ వైద్యుల సంక్షేమ సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి అనంతారపు వెంకటాచారి, జిల్లా ఉపాధ్యక్షులు నారపోగు సుదర్శన్, చింతకాని మండల అధ్యక్షులు సుంకర కొండలరావు, రూరల్ మండల అధ్యక్షుడు పిడియాల భాస్కర్, నాయకులు మిడిదొడ్డి వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.



ఆక్రమణలపై అదనపు కలెక్టర్ విచారణ

నవతెలంగాణ-కారేపల్లి

కారేపల్లి క్రాస్‌రోడ్ ఆర్అండ్‌బీకి ఇరువైపుల ఆక్రమణలపై జిల్లా స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ బీ.సత్యప్రసాద్ గురువారం విచారణ చేశారు. కారేపల్లి మండలం విశ్వనాధపల్లి గ్రామపంచాయతీలోని కారేపల్లి క్రాస్ రోడ్‌లో రోడ్డుకు ఇరువైపుల ఆక్రమణలు ఉండటం వలన ప్రజలకు, వాహనదారులు ఇబ్బందులకు గురవటమే కాకుండా ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయి. దీనిపై గ్రామస్తులు ఇచ్చిన పిర్యాదుపై పోలీసులు అనేక సార్లు ఆక్రమణదారులను హెచ్చరించారు. అయినా ఒకరు ఆక్రమించారని మరోకరు రోడ్డుపై వ్యాపారాలను సాగిస్తున్నారు. దీనిపై కదిలిన యంత్రాంగం రోడ్డుకు ఇరువైపుల మార్కింగ్ వేసి ఆక్రమణలను తొలగించాలని నోటీసులు జారీ చేశారు. ఈ విషయమై జిల్లా అదనపు కలెక్టర్ బీ.సత్యప్రసాద్ కారేపల్లి క్రాస్ రోడ్‌ను సందర్శించి ఆక్రమణలను పరిశీలించారు. ఆక్రమణదారులు స్వచ్ఛందంగా ఖాళీ చేయాలని ఆదేశించారు. అదనపు కలెక్టర్ వెంట తహసీల్దార్ వంకాయల సురేష్‌కుమార్, ఆర్అండ్‌బీ డిప్యూటీ ఈఈ తదితరులు ఉన్నారు.



ఉపాధి హామీ పనులను పరిశీలించిన ట్రైనీ కలెక్టర్

పనుల పురోగతిపై ఆరా

నవతెలంగాణ-నేలకొండపల్లి

మండలంలో జాతీయ గ్రామీణ ఉపాధి హామీ ద్వారా జరుగుతున్న వివిధ పనులను ట్రైనీ కలెక్టర్ మయాంక్ సింగ్, అసిస్టెంట్ ప్రాజెక్టు డైరెక్టర్ (ఏపీడి) వెంకటరాజు గురువారం పరిశీలించారు. మండలంలోని కోరట్లగూడెం, చెన్నారం, నేలకొండపల్లి, పైనంపల్లి గ్రామాలలో ఏర్పాటు చేసిన నర్సరీలను పరిశీలించి అక్కడ పెంచుతున్న మొక్కల వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఉపాధి కూలీలు చేస్తున్న పని ప్రదేశాలను పరిశీలించి చేస్తున్న పని వారికి వస్తున్న రోజువారి కూలీ తదితర వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఉపాధి పనుల రికార్డులను, రోజువారి కూలీల మస్టర్ వివరాలను పరిశీలించారు. ఆయా గ్రామాలలో ఉపాధి హామీ పనుల పురోగతిపై ట్రైనీ కలెక్టర్ సంతృప్తి వ్యక్తం చేశారు. కలెక్టర్ వెంట ఏపిడి వెంకటరాజు, ఎంపీడీవో కే జమలారెడ్డి, ఈజీఎస్ ఏపీవో రావెళ్ల సునీత ఉన్నారు.



4న యూటీఎఫ్ జిల్లా కమిటీ

నవతెలంగాణ- నేలకొండపల్లి

తెలంగాణ రాష్ట్ర ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ (టీఎస్ యుటిఎఫ్) ఖమ్మం జిల్లా కమిటీ విస్తత సమావేశాలు నాలుగో తేదీ ఆదివారం నాడు నేలకొండపల్లిలోని సీతారామ ఫంక్షన్ హాల్ నందు జరుపనున్నట్లు సంఘం జిల్లా అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు జీవీ నాగమల్లేశ్వరరావు, పారుపల్లి నాగేశ్వరరావు తెలిపారు శుక్రవారం స్థానిక సీతారామ ఫంక్షన్ హాల్‌లో విలేకరులతో వారు సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నాలుగో తేదీ విస్తృతస్థాయి సమావేశం అనంతరం మధ్యాహ్నం ఉపాధ్యాయుల మహా ప్రదర్శన ఉంటుందని, ఉపాధ్యాయులు, విద్యారంగ శ్రేయోభిలాషులు అధిక సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. ఈ సమావేశాలకు ముఖ్యఅతిథిగా రాష్ట్ర మంత్రివర్యులు పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, ఉపాధ్యాయ ఎమ్మెల్సీ అలుగుబెల్లి నర్సిరెడ్డి, తెలంగాణ రాష్ట్ర ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ ప్రధాన కార్యదర్శి చావా రవి, డీఈవో సోమశేఖర్ శర్మ రాష్ట్ర నాయకులు చావా దుర్గ భవాని షేక్ మహబూబాబాద్ బండి నరసింహారావు హాజరుకానున్నట్లు తెలిపారు. విలేకరుల సమావేశంలో సంఘం రాష్ట్ర కమిటీ సభ్యుడు షేక్ రంజాన్, జిల్లా కార్యదర్శి పి సురేష్, షేక్ ఉద్దండ్ షరీఫ్, జిల్లా కమిటీ సభ్యులు నవాబ్ సాహెబ్, అయినాల గోవిందరావు, తొర్తి గురవయ్య, రావెళ్ళ అరవింద్ కుమార్, నాగార్జున, విజయ్ కుమార్, మంగేశ్వరి ,కవిత పద్మ తదితరులు పాల్గొన్నారు.

ముదిగొండ : ఈనెల 4న నేలకొండపల్లిలో జరిగే టిఎస్ యుటిఎఫ్ జిల్లా విస్తృత కమిటీ సమావేశాలను జయప్రదం చేయాలని సంఘం జిల్లా కార్యదర్శి పినపాక సురేష్ ఉపాధ్యాయులకు పిలుపు నిచ్చారు. ముదిగొండలో గురువారం యుటిఎఫ్ కరపత్రాలను ఆవిష్కరించారు. కార్యక్రమంలో టిఎస్ యుటిఎఫ్ మండల అధ్యక్ష, కార్యదర్శి వి.రాంబాబు, బి.కోటేశ్వరరావు, పలువురు ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

డి-రిజర్వేషన్ రాజ్యాంగ స్ఫూర్తికి విరుద్ధం

నవతెలంగాణ- ఖమ్మం

ఇటీవల యూజీసీ నూతన విద్యా విధానంలో డి రిజర్వేషన్ పద్ధతి తీసుకొస్తున్నారని, ఇది రాజ్యాంగ స్ఫూర్తికి విరుద్ధమని, పేద బలహీనవర్గాల విద్యార్థులను ఉన్నత విద్యకు దూరం చేసే కుట్రే అని, దీనిని వెంటనే విరమించుకోవాలని ఏఐఎస్ఎఫ్ జాతీయ కార్యవర్గ సభ్యులు ఇటికాల రామకృష్ణ కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. గురువారం ఖమ్మం గిరి ప్రసాద్ భవన్‌లో ఏఐఎస్ఎఫ్ ముఖ్య కార్యకర్తల సమావేశం జరిగింది. ఈ సమావేశంలో సమావేశంలో జిల్లా నాయకులు చందులాల్, రోహిత్, రాకేష్, ప్రతాప్, రాజు, సునీల్, ప్రభాస్, నరేష్, గోపి, విజయ్ తదితరులు పాల్గొన్నారు.

వడ్లమూడి నాగేశ్వరరావుకి పరామర్శ

నవతెలంగాణ-ఖమ్మంరూరల్

సీపీఐ(ఎం) మండల కమిటీ సభ్యులు, వ్యవసాయ కార్మిక సంఘం మండల కార్యదర్శి వడ్లమూడి నాగేశ్వరరావు తండ్రి వడ్లమూడి రాములు ఇటీవల మృతి చెందారు. ఈ సందర్భంగా మండలంలోని ఎం. వెంకటాయపాలెం గ్రామంలోని వడ్లమూడి నాగేశ్వరరావు కుటుంబాన్ని సిపిఎం నాయకులు సందర్శించారు. వడ్లమూడి రాములు చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. రాములు కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతిని తెలిపారు. పార్టీ వారి కుటుంబానికి ఎల్లప్పుడు అండగా ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఎం ఖమ్మం జిల్లా ఇన్చార్జ్ యర్రా శ్రీకాంత్, రాష్ట్ర కమిటీ సభ్యులు పొన్నం వెంకటేశ్వరరావు, జిల్లా కమిటీ



సభ్యులు యర్రా శ్రీనివాసరావు, మండల కార్యదర్శి నండ్ర ప్రసాద్, ఏపూరి వరకుమార్, గుర్రం యుగంధర్, కుక్కల సైదులు, నాగేశ్వరరావు తదితరులు ఉన్నారు.

16న దేశవ్యాప్త సమ్మె, గ్రామీణబంద్‌కు మద్దతుగా జిల్లా బంద్

ఖమ్మం జిల్లా అఖిలపక్ష పార్టీల పిలుపు

నవతెలంగాణ-ఖమ్మం

కేంద్రంలో వున్న బిజెపి అవలంభిస్తున్న ప్రజా, కార్మిక, రైతు వ్యతిరేక విధానాలను నిరసిస్తూ ఫిబ్రవరి 16న దేశవ్యాప్తంగా కార్మిక సంఘాలు, రైతు సంఘాలు, వ్యవసాయ కార్మికులు ఇచ్చిన గ్రామీణ భారత్ బంద్‌కు మద్ధతుగా ఖమ్మం జిల్లా బంద్‌ను నిర్వహించడం జరుగుతుందని, ఈ బంద్‌ను జయప్రదం చేయాలని సిపిఎం రాష్ట్ర నాయకులు పోతినేని సుదర్శన్‌రావు, సిపిఐ జిల్లా కార్యదర్శి పోటు ప్రసాద్, సిపిఐ (ఎంఎల్) ప్రజాపంథా జిల్లా కార్యదర్శి గోకినపల్లి వెంకటేశ్వర్లు, బిఆర్ఎస్ నాయకులు ఉప్పల వెంకటరమణ, సిపిఐ (ఎంఎల్) న్యూడెమోక్రసీ నాయకులు ఎం.గిరి మరియు కాంగ్రెస్ నాయకులు పిలుపునిచ్చారు. స్థానిక సుందరయ్య భవనంలో సిఐటియు జిల్లా కార్యదర్శి కళ్యాణం వెంకటేశ్వరరావు అధ్యక్షతన ఏర్పాటు చేసిన అఖిలపక్ష సమావేశంలో వారు మాట్లాడుతూ బిజెపి ప్రభుత్వ హయాంలో ప్రభుత్వరంగ సంస్థలు పూర్తిగా ప్రైవేట్‌పరం చేశారని, కార్మికులు పోరాడి సాధించుకున్న కార్మిక చట్టాలను రద్దుచేసి 4 లేబర్ కోడ్‌లు తీసుకురావడం జరిగిందన్నారు. దీనివల్ల కార్మికులు కట్టుబానిసల్లాగా మార్చబడుతున్నారని వారు పేర్కొన్నారు. ఉపాధిహామీ పథకం నిధులు తగ్గించి ఈ పథకాన్ని నిర్వీర్యం చేసే కుట్రలు జరుగుతున్నాయని, రైతు నల్ల చట్టాలను తీసుకొచ్చి రైతులను కూలీలుగా మార్చే చర్యలకు పూనుకుంటుందని, ఈ విధానాలకు వ్యతిరేకంగా



దేశవ్యాప్తంగా అనేక ఆందోళనలు జరుగుతున్నప్పటికీ, కేంద్ర ప్రభుత్వం కనీసం స్పందించకుండా మానవ హక్కుల మీద దాడికి పూనుకుంటుందన్నారు. ప్రశ్నిస్తే అక్రమ కేసులు బనాయించి బెదిరింపులకు పాల్పడుతుందని, త్వరలో జరిగే పార్లమెంట్ ఎన్నికల్లో కేంద్ర ప్రభుత్వాన్ని గద్దె దించటం లక్ష్యంగా లౌకికశక్తులు, ప్రజాస్వామికవాదులు ఐక్యంగా కార్మిక, ప్రజా పోరాటాలకు వెన్నుదన్నుగా నిలవాలని, దానిలో భాగంగా జరుగుతున్న దేశవ్యాప్త సమ్మె గ్రామీణ బంద్‌ను విజయవంతం చేయాలని వారు పిలుపునిచ్చారు. ఫిబ్రవరి 16న పూర్తిగా జిల్లా బంద్‌ను జయప్రదం కోసం వ్యాపారవర్గాలు, చిరు వ్యాపారులు పూర్తిగా సహకరించాలని వారు కోరారు. కార్యక్రమంలో వివిధ పార్టీల నాయకులు యర్రా శ్రీకాంత్, పొన్నం వెంకటేశ్వరరావు, బొంతు రాంబాబు, చంద్రశేఖర్, శింగు నర్సింహారావు, మాదినేని రమేష్, సివై.పుల్లయ్య, పోటు కళావతి, తాటి నిర్మల, ఖాసిం, కార్మిక సంఘాల నాయకులు తుమ్మ విష్ణువర్ధన్, పాషా, శివరాంకష్ణ, పాల్వంచ కృష్ణ పాల్గొన్నారు.

ఎర్రుపాలెం : మోడీ ప్రభుత్వం తొమ్మిది సంవత్సరాల కాలంలో కార్మికుల ప్రయోజనాలను కార్పొరేట్ శక్తులకు తాకట్టు పెట్టిందని వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు పొన్నం వెంకటేశ్వరరావు విమర్శించారు. మండల కేంద్రమైన ఎర్రుపాలెంలో రామిశెట్టి పుల్లయ్య భవనంలో ప్రజాసంఘాల నాయకులతో సమావేశాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షులు మెరుగు సత్యనారాయణ, రైతు సంఘం జిల్లా కమిటీ సభ్యులు దివ్వెల వీరయ్య, గొల్లపూడి కోటేశ్వరరావు, సిఐటియు మండల కార్యదర్శి సగ్గుర్తి సంజీవరావు, వ్యవసాయ కార్మిక సంఘం మండల అధ్యక్ష కార్యదర్శులు గామాసు జోగయ్య, నాగులవంచ వెంకట రామయ్య, వృత్తి సంఘం నాయకులు దూదిగం బసవయ్య, ఆశా కార్యకర్తల సంఘం మండల కార్యదర్శి నండ్రు సుధారాణి, మధ్యాహ్న భోజన కార్మికులసంఘం మండల నాయకురాలు కుమారి తదితరులు పాల్గొ న్నారు.

మధిర: గ్రామీణ భారత్ బంద్‌ను జయప్రదం చేయాలని సీఐటీయూ రాష్ట్ర కమిటీ సభ్యులు శీలం నరసింహారావు కోరారు. సీఐటీయూ ఆధ్వర్యంలో మధ్యాహ్నం భోజన కార్మికులు మధిర ఎంఈఓ ఆఫీస్ నందు ఎంఈఓ వై.ప్రభాకర్‌కు సమ్మె నోటీసును అందజేశారు. ఈ సందర్భంగా శీలం నరసింహారావు మాట్లాడుతూ మధ్యాహ్న భోజన కార్మికులకు కనీస వేతనం 26 వేల రూపాయల వేతనం నిర్ణయించి అమలు చేయాలని, కార్మికుల్ని బానిసత్వంలోకి నెట్టే 4 లేబర్ కోడ్‌లను రద్దు చేయాలని అన్నారు. కార్యక్రమంలో సీఐటీయూ నాయకులు పడకండి మురళి, వడ్రానపు మధు, కృష్ణకుమారి, చిన్ని, ధనలక్ష్మి, భారతి, రమాదేవి, కనకదుర్గ, బేగం, లక్ష్మి, నర్మదా తదితరులు పాల్గొన్నారు.

పెనుబల్లి : లంకపల్లి గ్రామంలో స్థానిక పిఆర్ ఫంక్షన్ హాల్ లో లంకపల్లి ఏరియా భవన నిర్మాణ కార్మికుల జనరల్ బాడీ సమావేశం గుడిమెట్ల బాబు అధ్యక్షతన జరిగింది. ఈ సమావేశంలో సిఐటియు రాష్ట్ర కమిటీ సభ్యులు చలమాల విఠల్‌రావు మాట్లాడుతూ దేశవ్యాప్త సార్వత్రిక సమ్మెను జయప్రదం చేయాలని కోరారు. కార్యక్రమంలో సిఐటియు ఖమ్మం జిల్లా కమిటీ సభ్యురాలు మిట్టపల్లి నాగమణి, భవన నిర్మాణ కార్మిక సంఘం యూనియన్ నాయకులు ఎస్.కె చిన్న రాజి, హరి, వెంకటేశ్వరరావు, ఓరుగంటి ప్రసాద్, ఎస్కే మస్తాన్, నాగేశ్వరరావు, ప్రజానాట్యమండలి కండె సత్యం తదితరులు పాల్గొన్నారు.

ఇసుక లారీలు సీజ్

నవతెలంగాణ - బోనకల్

రాత్రి వేళలో ఆంధ్రా ప్రాంతం నుండి అక్రమంగా ఇసుకను తరలించేందుకు నెంబర్ ప్లేట్ లేకుండా వెళ్తున్న మూడు లారీలను బోనకల్ క్రాస్ రోడ్డు వద్ద బుధవారం రాత్రి పట్టుకొని సీజ్ చేసి యజమానులపై, డ్రైవర్లపై బోనకల్లు పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదు చేసి చేసినట్లు వైరా ఏసీపీ మహమ్మద్ అబ్దుల్ రహమాన్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. నిబంధనలకు విరుద్ధంగా అక్రమంగా తరలిస్తున్న ఇసుక లారీని సీజ్ చేసి కేసులు నమోదు చేయాలని పోలీస్ కమిషనర్ ఆదేశాల మేరకు జిల్లా సరిహద్దు పోలీస్‌స్టేషన్ల యస్‌హెచ్‌వోలను అప్రమత్తం చేయడం జరిగిందన్నారు. అందులో భాగంగా గత కొంతకాలంగా ఖమ్మంలోని ఇసుక మాఫియా ఆంధ్ర ముఠాతో చేతులు కలిపి ఆంధ్రప్రదేశ్ ఇసుక క్వారీల నుంచి నిబంధనలకు విరుద్ధంగా బోనకల్లు మండలం మీదుగా రాకపోకలు సాగిస్తున్నారని పేర్కొన్నారు. ఇది ఆంధ్ర ఇసుక అంటూ అధిక ధరలకు అమ్ముకుని ప్రభుత్వ ఆదాయానికి గండి కొడుతున్న నేపథ్యంలో వాహనాల తనిఖీలు ముమ్మరం చేసినట్లు పేర్కొన్నారు.అందులో భాగంగా ఎటువంటి అనుమతులు, బిల్లులు లేకుండా నందిగామ రీచ్ నుంచి ఖమ్మం కేంద్రానికి బోనకల్లు మీదుగా లారీలో ఇసుకను తరలించేందుకు నెంబర్ ప్లేట్ లేకుండా వెళ్తున్న మూడు లారీలను పట్టుకున్నట్లు పేర్కొన్నారు. ఇసుక తరలింపు క్రమంలో ఏదైనా రోడ్డు ప్రమాదం జరిగిన తప్పించుకునేందుకు, సీసీ కెమెరాలకు, పోలీసు చలాన్ల కు దొరకకుండా వుండేందుకు లారీ యాజమానుల సూచనల మేరకు నెంబర్ ప్లేట్ తొలగించినట్లు నిందుతులు వెల్లడించినట్లు తెలిపారు. అనుమతులు లేకుండా అక్రమంగా ఇసుకను తరలిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని, ఇసుక రవాణా చేస్తున్న లారీలపై నిఘా పెట్టామని పేర్కొన్నారు. నిందితులపై చట్టం పరమైన చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు. ఇసుక మాఫియాను కట్టడి చేస్తామని స్పష్టం చేశారు. నిందితులు బండి కొండలరావు, చెలమల్ల సుమంత్ కుమార్, యాఠ్ర మహేందర్, యాఠ్ర సతీష్, ఇరుగు సుదర్శన్‌లపై కేసులు నమోదు చేసినట్లు తెలిపారు.

ఇసుక లారీలు, ట్రాక్టర్లు సీజ్



నవతెలంగాణ-ముదిగొండ

ఎపి రాష్ట్రం నుండి అక్రమంగా ఇసుక రవాణా చేస్తున్న 3 లారీలు, 3 ట్రాక్టర్లను సువర్ణాపురం వద్ద ఎస్సై గజ్జల నరేష్ గురువారం పట్టుకొని సీజ్ చేసి పోలీస్ స్టేషన్‌కు తరలించారు. అక్రమ ఇసుక రవాణాపై ఉక్కుపాదం. మండలంలోని పెద్దమండవ, గంధసిరి నుండి అక్రమంగా ఇసుక రవాణా చేస్తే చట్ట ప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్సై జి.నరేష్ హెచ్చరించారు. గురువారం ఆయన విలేకరులతో మాట్లాడారు. అనుమతులు లేకుండా ఇసుక రవాణా చేస్తే ఉపేక్షించేదిలేదన్నారు. గత రెండు నెలలలో ఆంధ్ర నుంచి అక్రమ ఇసుక రవాణా చేస్తున్న 10 లారీలు, మండలంలో మున్నేరు నుండి నిత్యం ఇసుక అక్రమంగా రవాణా చేస్తున్న 40 ట్రాక్టర్లను సీజ్ చేసినట్లు తెలిపారు.

ప్రజానేత రావెళ్ల సత్యం

నేడు 39వ వర్ధంతి

నవతెలంగాణ-ముదిగొండ

పీడిత ప్రజల పక్షాన ఆలుపెరగని పోరాటం చేసిన మహనీయుడు రావెళ్ల సత్యం. మార్క్సిస్ట్ మహానేత పుచ్చలపల్లి సుందరయ్య ప్రియ శిష్యుడిగా ఉద్యమంలోకి అడుగు పెట్టి ఎంతోమంది పేదల జీవితాల్లో వెలుగులు నింపాడు. ఎర్రజెండా నీడలో అనేక ప్రజా ఉద్యమాలు నిర్వహించి గొప్ప నాయకుడిగా గుర్తింపు పొందారు. సమితి ప్రెసిడెంట్‌గా, జిల్లా మార్కెటింగ్ కమిటీ అధ్యక్ష, ఉపాధ్యక్ష పదవి బాధ్యతలు చేపట్టి సిపిఐ(ఎం)ని, సముచిత స్థానానికి తీసుకెళ్లి సహకార సంఘానికి మార్కెటింగ్ ఉద్యోగులకు వెన్నుదన్నుగా నిలిచిన ఆదర్శప్రాయుడు రావెళ్ల సత్యం. ఆ విప్లవమూర్తి, పేదోళ్ల పెన్నిధి రావెళ్ళ 39వ వర్ధంతిని శుక్రవారం నిర్వహించనున్నారు. ముదిగొండ మండలం గోకినేపల్లి గ్రామానికి చెందిన రావెళ్ళ సత్యనారాయణ (సత్యం) వీర తెలంగాణ సాయుధ పోరాటంలో పాల్గొని నిజాం నవాబు, రజాకార్లకు వ్యతిరేకంగా పోరాడారు. రావెళ్ల సత్యం గ్రామాల్లో రైతు కూలీ పోరు ఉద్యమాలు నిర్వహించి ప్రజల పక్షాన నిలిచారు. రావెళ్ళ నాయకత్వంలో చింతకాని, నేలకొండపల్లి, కూసుమంచి, తిరుమలాయపాలెం, ముదిగొండ, ఖమ్మం పరిసర ప్రాంతాల్లో పర్యటించి ప్రజల్ని చైతన్యవంతుల్ని చేసేవారు. ప్రధానంగా ముదిగొండ మండలంలో పమ్మి,ముత్తారం, కమలాపురం, బాణాపురం, పెద్దమండవ, అమ్మపేట, గంధసిరి, చిరుమర్రి గ్రామాల్లో పెచ్చు మానికల దోపిడికి వ్యతిరేకంగా ప్రజలను ఐక్యం చేసి బలమైన ప్రజా ఉద్యమాలు నిర్వహించారు. 1985 ఫిబ్రవరి 2న గుండెపోటుతో అకాల మరణం చెందిన రావెళ్ల ప్రజల గుండెల్లో ప్రజా నేతగా నిలిచారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

నవ తెలంగాణ -బోనకల్

మండల పరిధిలోని 11కెవి ముష్టికుంట్ల ఫీడర్ లైన్ మరమ్మత్తుల కారణంగా ముష్టికుంట్ల ఫీడర్ పరిధిలోని చిరునోముల, చొప్పకట్లపాలెం, ముష్టికుంట్ల గ్రామాల్లో శుక్రవారం ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 02 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేనున్నట్లు మండల విద్యుత్ దొండేటి ఉమామహేశ్వరరావు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. విద్యుత్ వినియోగదారులు విద్యుత్ శాఖ అధికారులకు సహకరించాలని ఆయన కోరారు.

సీనియర్ జర్నలిస్ట్ రామదాసుకు మాతృవియోగం

నవతెలంగాణ- నేలకొండపల్లి

నేలకొండపల్లి సీనియర్ జర్నలిస్ట్ మారేపల్లి రామదాసుకు గురువారం మాతృవియోగం కలిగింది. ఆయన మాతృమూర్తి మారేపల్లి పెద్ద పుల్లమ్మ (89) ఆమె స్వగ్రామం మండ్రాజుపల్లిలో గత కొద్దిరోజులుగా తీవ్ర అనారోగ్యంతో బాధపడుతున్నారు. ఆమెకు ఇద్దరు కుమారులు, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. ఆమె భౌతికకాయాన్ని స్థానిక జర్నలిస్టులు, వివిధ పార్టీల నాయకులు, దళిత సంఘాల నేతలు సందర్శించి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. వారి కుటుంబానికి ప్రగాఢ సానుభూతిని తెలిపారు.

కేసీఆర్‌కు శుభాకాంక్షలు తెలిపిన సండ్ర

- తమ్మినేనికి సండ్ర పరామర్శ

నవతెలంగాణ-సత్తుపల్లి

గజ్వేల్ నుంచి ఎమ్మెల్యేగా ఎన్నికైన భారతీయ రాష్ట్ర సమితి (బీఆర్ఎస్) అధినేత కల్వకుంట్ల చంద్రశేఖరరావు (కేసీఆర్) గురువారం అసెంబ్లీ స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్ సమక్షంలో ప్రమాణ స్వీకారం చేశారు. ప్రమాణ స్వీకారం చేసిన కేసీఆర్‌ను సత్తుపల్లి మాజీ ఎమ్మెల్యే సండ్ర వెంకటవీరయ్య మర్యాద పూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలిపారు. ఎమ్మెల్యేతో పాటు కేసీఆర్‌కు శుభాకాంక్షలు తెలిపిన వారిలో రాజ్యసభ సభ్యులు వద్దిరాజు రవిచంద్ర, ఎమ్మెల్సీ తాతా మధుసూదనరావు, మాజీ ఎమ్మెల్యేలు మెచ్చా నాగేశ్వరరావు, కందాళ ఉపేందర్‌రెడ్డి ఉన్నారు.

తమ్మినేని పరామర్శించిన సండ్ర వెంకటవీరయ్య

సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం ఇటీవల తీవ్ర అస్వస్థతకు గురై హైదరాబాద్‌లో వైద్య జరిపించుకున్నారు. ఆరోగ్యం కుదుటపడి పూర్తిస్థాయిలో రికవరీ అయ్యి హైదరాబాద్‌లో తమ్మినేని విశ్రాంతి తీసుకుంటున్నారు. ఈ నేపథ్యంలో గురువారం సత్తుపల్లి మాజీ ఎమ్మెల్యే సండ్ర వెంకటవీరయ్య తమ్మినేనిని ఆయన గృహంలో కలిసి పరామర్శించారు. ఆరోగ్య స్థితిగతులను అడిగి తెలుసుకున్నారు. పూర్తిస్థాయిలో కోలుకొని ప్రజాక్షేత్రంలో మరింత చురుగ్గా పాల్గొనాలని ఈ సందర్భంగా సండ్ర ఆకాంక్షించారు.





క్రమశిక్షణకు మారుపేరు తాళ్లూరి దుర్గమ్మ

భారత రాజ్యాంగాన్ని నిర్వీర్యం చేస్తున్న బిజెపి ప్రభుత్వం

సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు పోతినేని సుదర్శన్ రావు

నవతెలంగాణ - బోనకల్

తాళ్లూరి దుర్గమ్మ తన జీవితాంతం నీతి నిజాయితీగా క్రమశిక్షణకు మారుపేరుగా పెద్ద బీరవల్లి సర్పంచిగా ఉన్న సమయంలో గ్రామాభివృద్ధికి ఎంతో కృషి చేశారని సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు పోతినేని సుదర్శన్‌రావు కొనియాడారు. మండల పరిధిలోని పెద్ద బీరువల్లి మాజీ సర్పంచ్ సిపిఎం నాయకురాలు తాళ్లూరి దుర్గమ్మ సంస్మరణ సభ గురువారం జరిగింది. తొలుత తాళ్లూరి దుర్గమ్మ చిత్రపటానికి పోతినేని సుదర్శన్‌రావు, రాష్ట్ర కమిటీ సభ్యులు పొన్నం వెంకటేశ్వరరావు, జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు కళ్యాణపు వెంకటేశ్వరరావు, బొంతు రాంబాబు, చింతలచెరువు కోటేశ్వరరావు, తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు మెరుగు సత్యనారాయణ, సిపిఎం మండల కార్యదర్శి దొండపాటి నాగేశ్వరరావు, మండల కమిటీ సభ్యులు పెద్దపోలు కోటేశ్వరరావు, తాజా మాజీ సర్పంచ్ ఆళ్ళ పుల్లమ్మ, కర్లకుంట దేవమణి సిపిఎం సీనియర్ నాయకులు ఎనమద్ది సత్యనారాయణ తదితరులు పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం జరిగిన సంస్మరణ సభలో వారు మాట్లాడుతూ దుర్గమ్మ మృతి పార్టీకి తీరని లోటన్నారు.

కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం అయోధ్యలో రామ మందిరం పేరుతో భారతదేశాన్ని మతం పేరుతో చీల్చాలని కుట్ర పన్నుతుందన్నారు. అయోధ్య నిర్మాణం పూర్తి కాకపోయినా కేవలం పార్లమెంటు ఎన్నికల దృష్టిలో పెట్టుకొని హడావుడిగా ప్రధానమంత్రి నరేంద్ర మోడీ ప్రారంభోత్సవం చేశారన్నారు. భారత రాజ్యాంగాన్ని నిర్వీర్యం చేసేందుకు బిజెపి ప్రభుత్వం కుట్ర పన్నుతుందన్నారు. బిజెపి మరల అధికారంలోకి వస్తే ఈ దేశాన్ని కుల, మతాల పేరుతో నాశనం చేస్తుందన్నారు. బిజెపి అధికారంలోకి రాకుండా ఐక్యంగా కలిసి పోరాటం చేయవలసిన అవసరం ఎంతో ఉందన్నారు. దేశవ్యాప్తంగా ఈనెల 16వ తేదీన



సిఐటియు, తెలంగాణ రైతు సంఘం, వ్యవసాయ కార్మిక సంఘం చేపట్టిన భారత బంద్‌ను ప్రజలందరూ విజయవంతం చేయాలని కోరారు. కేంద్ర ప్రభుత్వం తీసుకువచ్చిన నల్ల చట్టాల వలన రైతులు తీవ్రంగా నష్టపోతారన్నారు. దేశవ్యాప్తంగా మణిపూర్ తరహా సంఘటనలను ప్రేరేపించాలని కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం ప్రయత్నాలు చేస్తుందని విమర్శించారు. ఆ ప్రయత్నాలను అన్ని పార్టీలు తిప్పికొట్టాలని పిలుపునిచ్చారు. సిపిఎం ఎన్నికలలో ఓడిపోయినా గెలిచినా ప్రజల కోసమే, ప్రజా సమస్యల పరిష్కారం కోసమే నిత్యం పోరాటాలు చేస్తుందన్నారు. సిపిఎం కార్యకర్తలు క్షేత్రస్థాయిలో ప్రజా సమస్యలను గుర్తించి వాటి పరిష్కారం కోసం పోరాటాల నిర్వహించాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో పిఎన్ఎమ్ రాష్ట్ర నాయకులు దేవేంద్ర ఝూన్సీ, లక్ష్మీపురం ఎంపీటీసీ జొన్నలగడ్డ సునీత, వ్యవసాయ కార్మిక సంఘం మండల ప్రధాన కార్యదర్శి బంధం శ్రీనివాసరావు, సిపిఎం మధిర పట్టణ మాజీ కార్యదర్శి పాపినేని రామ నరసయ్య, సిపిఎం మండల కమిటీ సభ్యులు, వివిధ గ్రామాలకు చెందిన సిపిఎం నాయకులు ప్రజాప్రతినిధులు ప్రజాసంఘాల బాధ్యులు తదితరులు పాల్గొన్నారు.



అంగరంగ వైభవంగా రక్షణగిరి తిరునాళ్లు

నవతెలంగాణ -ఎర్రుపాలెం

మండల పరిధిలోని అయ్యవారి గూడెంలో గల రక్షణ గిరి పుణ్యక్షేత్ర తిరునాళ్లు గురువారం రక్షణగిరి డైరెక్టర్, విచారణ గురువులు రేవపా ఐజాక్ సూరేపల్లి ఆధ్వర్యంలో అంగరంగ వైభవంగా ప్రారంభం చేశారు. రక్షణ గిరి కొండ వద్ద ఆయన మాట్లాడుతూ రక్షణగిరి 17వ వార్షికోత్సవ తిరునాళ్ల గురువారం నుండి 3వ తేదీ శనివారం వరకు ప్రకృతి సౌందర్యంతో సువిశాలమైన రక్షణగిరి కొండపై జరగనున్నాయని తెలిపారు. దేవుని మహిమలు తెలియపరచుటకు భక్తులకు దీవెనలు అందించుటకు ప్రతి సంవత్సరం రక్షణ గిరి పుణ్యక్షేత్ర మహెూత్సవ వేడుకలను ఎంతో ఘనంగా నిర్వహిస్తున్నామని అన్నారు. ఉదయం 10 గంటలకు మేడికొండ స్వీవప్ప పతాకావిష్కరణ చేసి తిరునాళ్లు ప్రారంభించినట్లు తెలిపారు. అనంతరం గ్రామ దేవాలయంలో దివ్య పూజబలి 5 గంటలకు రక్షణగిరి మాత స్వరూపంతో అయ్యవారిగూడెం గ్రామ వీధుల్లో ఊరేగింపు నిర్వహించినట్లు తెలిపారు. శుక్రవారం సాయంత్రం 4 గంటలకు జపమాల, దివ్య పూజ బలి, ఆరాధన కార్యక్రమాలు కాస్పర్ చాట్ల ఆధ్వర్యంలో జరుగనున్నాయని, 3వ తేదీ శనివారం విశాఖ పీఠ రేవ పా మరియదాసుచే ప్రత్యేక ప్రార్థనలు, కొండపై తిరునాళ్ల (పండగ)పర్వదిన సమిష్టి దివ్యపూజ బలి కార్యక్రమాలు జరుగుతాయని తెలిపారు. అయ్య వారిగూడెం గ్రామ సర్పంచ్ గోసు రామారావు ఆధ్వర్యంలో వచ్చిన విశ్వాసులకు, భక్తులకు అన్నదానం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. విశ్వాసులు, సంఘస్తులు, భక్తులు ఈ కార్యక్రమంలో వేలాదిగా పాల్గొని రక్షణ పొందాలని అన్నారు.

'మైనార్టీ గురుకుల సమస్యలపై దృష్టిపెట్టాలి'

నవతెలంగాణ-కారేపల్లి



మైనార్టీల విద్యాఅభివృద్ధికి ఏర్పాటు చేసిన గురుకులాల సమస్యలపై నూతన ప్రభుత్వం దృష్టి పెట్టాలని టీఎస్‌యూటీఎఫ్ మైనార్టీ వింగ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మహేష్, ఖమ్మం జిల్లా అధ్యక్షులు కుమారస్వామి అన్నారు. గురువారం కారేపల్లిలోని తెలంగాణ మైనార్టీ బాలికా గురుకుల విద్యాలయంలో సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ మైనార్టీ గురుకులాలకు సొంత భవనాలు లేక అద్దె భవనాలల్లో అర కొర వసతులతో నడుస్తున్నాయన్నారు. అద్దె భవనాల్లో విద్యార్థులకు రక్షణ, విద్యా బోధన కత్తిమీద సాముగా మారిందని ఆవేదన వ్యక్తం చేశారు. గురుకుల ఉపాధ్యాయులు ఐక్యంగా ఉండి తమ సమస్యలు సాధించుకోవాలన్నారు. గురుకుల ఉపాధ్యాయుల సమస్యలపై యూటీఎఫ్ పోరాటాలు చేసి అనేక సమస్యలు పరిష్కారం చూపిందన్నారు. ఈకార్యక్రమంలో ప్రిన్సిపాల్ ఎం.శైలజా, యూటీఎఫ్ మైనార్టీ వింగ్ జిల్లా ప్రధానకార్యదర్శి వీ.దామోదర్, జిల్లా ఉపాధ్యక్షురాలు సావిత్రి తదితరులు పాల్గొన్నారు.

బసవయ్యకు నివాళులర్పించిన ఎమ్మెల్యే

నవతెలంగాణ-తల్లాడ

మండల పరిధిలోని కొత్త వెంకటగిరి గ్రామానికి చెందిన పాకాలపాటి బసవయ్య ఇటీవల అనారోగ్యంతో మృతి చెందారు. ఆయన దశదినకర్మ గురువారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే డాక్టర్ మట్టా రాగమయి పాల్గొని చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించి కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

అవిశ్వాస తీర్మానంపై సభ్యుల పరిశీలన

నవతెలంగాణ-కామేపల్లి

కామేపల్లి సహకార సొసైటీ చైర్మెన్ పదవిపై అవిశ్వాస తీర్మానం చేసిన సభ్యులను స్పెషల్ ఆఫీసర్ కామేపల్లి సహకార సొసైటీలో పరిశీలించారు. కామేపల్లి సొసైటీ చైర్మెన్ పై 12 మంది డైరెక్టర్లు అవిశ్వాస తీర్మానం చేసి ఖమ్మంలో ఫిర్యాదు చేశారు. ఈ విషయంపై కామేపల్లి సహకార సొసైటీలో స్పెషల్ ఆఫీసర్ పరిశలించారు. నివేదికను సంబంధిత పైఅధికారులకు అందించనున్నట్టు తెలిపారు. త్వరలోనే తదుపరి నిర్ణయం తీసుకోవడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో డైరెక్టర్లు తదితరులు పాల్గొన్నారు.

సీఐని కలిసిన ఆటో యూనియన్ నాయకులు

నవతెలంగాణ-ఖమ్మం

నూతనంగా బాధ్యతలు స్వీకరించిన ఖమ్మం వన్ టౌన్ సీఐ ఉదయ్ కుమార్‌ని ఆటో వర్కర్స్ యూనియన్ (ఐఎన్టీయుసీ) జిల్లా అధ్యక్షులు సిహెచ్. విప్లవ కుమార్ ఆధ్వర్యంలో మర్యాద పూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ ప్రభుత్వానికి డిపార్ట్మెంట్‌కు సహకరించాలని, భాధ్యతో మెలగాలని అనుమానితులను గుర్తించి పోలిసు వారికి తెలియజేయాలని, ప్రయాణికులతో జాగ్రత్తగా మాట్లాడాలని, అసౌకర్యాలు కల్పించకూడదని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆటో యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి బొడ్డు సైదులు, కోశాధికారి తోట సైదులు, నగర అధ్యక్షులు జంగిపల్లి ప్రసాద్, నాయకులు ఎం. వెంకట్ నాయుడు, పాష, అనంద్ భవన్ 1, ఆనంద్ భవన్ 2 అడ్డా ప్రెసిడెంట్స్, డ్రైవర్లు పాల్గొన్నారు.

విద్యార్థుల అల్పాహారం కోసం రూ.20 వేలు వితరణ

నవతెలంగాణ-ఖమ్మం రూరల్

మండలంలోని ముత్తగూడెం ఉన్నత పాఠశాలలో 10వ తరగతి చదువుతున్న విద్యార్థులకు అల్పాహారం నిమిత్తం గ్రామానికి చెందిన సిపిఐ సీనియర్ నాయకులు మహమ్మద్ మౌలానా తనయురాలు, మాజీ ఎంపీపీ రజియా సుల్తానా-డాక్టర్ జాఫర్ దంపతులు గురువారం పాఠశాల ఉపాధ్యాయులకు 20 వేల రూపాయలు అందజేశారు. ఈ సందర్భంగా రజియా సుల్తానా మాట్లాడుతూ విద్యార్థులు పదవ తరగతి పరీక్షల్లో ప్రతిభ కనబరిచి తల్లిదండ్రులకు, గ్రామానికి మంచి పేరు తీసుకొచ్చి జీవితంలో ఉన్నత శిఖరాలు అధిరోహించాలని కోరారు. ఈ కార్యక్రమంలో సిపిఐ నాయకులు గౌస్ పాషా, రాజాగౌడ్, బూర నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

నేటి నుంచి ఉచిత పశు వైద్య శిబిరాలు

నవతెలంగాణ-బోనకల్

పీవీ నరసింహారావు తెలంగాణ పశువైద్య విశ్వవిద్యాలయం, పశు వైద్య కళాశాల రాజేందర్ నగర్, హైదరాబాద్, పశు వైద్య, పశుసంవర్ధక శాఖ ఖమ్మం జిల్లా వారి సంయుక్త ఆధ్వర్యంలో "జాతీయ సేవా పథకంలో" భాగంగా నిపుణులైన అధ్యాపక బృందం, పశు వైద్యులు ఈనెల 2వ తేదీ నుంచి 5వ తేదీ వరకు బోనకల్ మండలంలో పలు గ్రామాలలో పశు వైద్య శిబిరాలు నిర్వహించనున్నట్లు మండల పశు వైద్యాధికారి ఎర్రగుంట్ల అన్వేష్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈనెల 2 న కలకోట, బ్రాహ్మణపల్లి గ్రామాలలో 3వ తేదీన రావినూతల, రామాపురం గ్రామాలలో పశు వైద్య శిబిరాలను నిర్వహించనున్నట్లు తెలిపారు. 4వ తేదీన రాపల్లి, చొప్పకట్లపాలెం 5 న మోటమర్రి, ఆళ్ళపాడు గ్రామాలలో పశు వైద్య శిబిరాలను నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. ఈ శిబిరాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ శిబిరాలు ఉదయం 8 గంటల నుంచి నిర్వహిస్తామని తెలిపారు. పశు వైద్య శిబిరములో నిర్వహించబడు కార్యక్రమాలు గురించి ఆయన తెలిపారు. నట్టల నివారణ మందులు (దూడలు, దేశవాళి కోళ్లు), వ్యాధి నివారణ టీకాలు, పశు పోషణ, సంరక్షణపై అవగాహన, పశుగ్రాసాలపై సమాచారం, పాఠశాల విద్యార్థులకు సంక్రమిత వ్యాధులు, కల్తీ పాలను గుర్తించటంపై అవగాహన కల్పించనున్నట్లు తెలిపారు.

రాష్ట్ర స్థాయి క్రీడల్లో పథకాలు సాధించిన మద్దులపల్లి డిగ్రీ కళాశాల విద్యార్థులు

నవతెలంగాణ-ఖమ్మం రూరల్



ఘట్కేసర్‌లో ఇటీవల నిర్వహించిన సాంఘిక సంక్షేమ మహిళా డిగ్రీ కళాశాలల రాష్ట్ర స్థాయి క్రీడా పోటీల్లో తమ కళాశాల విద్యార్థులు వివిధ విభాగాల్లో పతకాలు సాధించారని మండల పరిధిలో మద్దులపల్లిలోని సాంఘిక సంక్షేమ మహిళా డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ ఝాన్సీరాణి తెలిపారు. పతకాలు సాధించిన విద్యార్థులను ప్రిన్సిపల్, అధ్యాపకులు గురువారం అభినందించారు. కబడ్డీలో బంగారు పతకం, 4,100 మీటర్ల రిలేలో వెండి, 100 మీటర్లు, డిస్కస్ త్రో, షార్ట్ పుట్ విభాగాల్లో కాంస్య పతకాలు సాధించినట్లు వివరించారు. ఈ కార్యక్రమంలో పీడీ చామంతి, వైస్ ప్రిన్సిపల్ శ్రీలక్ష్మీ, అధ్యాపకులు పాల్గొన్నారు.

గోపాలపేట సర్పంచ్‌ను సన్మానించిన గ్రామస్తులు



తల్లాడ : మండల పరిధిలోని గోపాలపేట ఏకైక సీపీఐ(ఎం) సర్పంచ్ నల్లమోతు మోహన్‌రావు, ఉప సర్పంచ్ చల్లగుండ్ల కృష్ణను గ్రామస్తులు గురువారం ఘనంగా సన్మానించారు. గ్రామ పంచాయతీ సర్పంచుల పదవీకాలం ముగియడంతో గ్రామస్తులు శాలువాలతో సన్మానించి, వారి సేవలను కొనియాడారు. గ్రామ పెద్దలు కూచిపూడి వెంకటేశ్వర్లు, నున్న తిరుమలయ్య, వీరస్వామి వెంకటయ్య, కూచిపూడి రమేష్, దొడ్డపనేని పాపయ్య, సత్యనారాయణ, అమరనేని సత్యనారాయణ, రాయల సీతారామయ్య వార్డు సభ్యులు వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

పదవ తరగతి ఫలితాలపై ప్రత్యేక దృష్టిసారించాలి

- అదనపు కలెక్టర్ బీ.సత్యప్రసాద్

నవతెలంగాణ-ఖమ్మం



పదవ తరగతి ఫలితాలపై ప్రత్యేక దృష్టి సారించి నూరు శాతం ఉత్తీర్ణత సాధనకు పాఠశాల ప్రధానోపాధ్యాయులు, మండల విద్యాధికారులు బాధ్యతాయుతంగా కృషిచేయాలని స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ బి.సత్యప్రసాద్ అన్నారు. గురువారం నూతన కలెక్టరేట్ సమావేశ మందిరంలో జిల్లా విద్యాశాఖ అధికారి సోమశేఖరశర్మ, మండల విద్యాధికారులు, పాఠశాల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులతో పదవతరగతి పరీక్షలపై అదనపు కలెక్టర్ సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పదవతరగతి పరీక్షలు సమీపిస్తున్న దృష్ట్యా విద్యార్థులను పరీక్షలకు సన్నద్ధం చేయాలన్నారు. విద్యార్థులకు ప్రత్యేక శిక్షణ తరగతులు నిర్వహణతో పాటు ఏప పాఠ్యాంశంలో వెనుకబడిన విద్యార్థులను గుర్తించి ఆయా సబ్జెక్టుల ఉపాధ్యాయులతో ప్రత్యేక శిక్షణనిచ్చే విధంగా చూడాలన్నారు. విద్యార్థుల్లో పరీక్షలపై ఉన్న భయాన్ని తొలగించాలని వారితో ఉపాధ్యాయులు విద్యార్థులకు సబ్జెక్టులో అర్థం కాని విషయాన్ని గమనించి వారి సందేహాలను నివృత్తి చేసి ప్రోత్సహించాలన్నారు. నూరుశాతం ఉత్తీర్ణతకు ఉపాధ్యాయులు, ప్రధానోపాధ్యాయులు చొరవ చూపాలన్నారు.

విద్యారంగంపై అబద్దాలతో కూడిన బడ్జెట్

- ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి ప్రవీణ్

నవతెలంగాణ-ఖమ్మం



కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఓటాన్ బడ్జెట్ విద్యారంగంపై బద్దాలతో కూడిన బడ్జెట్ అని ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి టి. ప్రవీణ్ గురువారం ఒక ప్రకటనలో ఆరోపించారు. కేంద్ర ఓటాన్ బడ్జెట్ ప్రవేశ పెడుతూ బడ్జెట్ సమావేశాల్లో దేశ ఆర్థిక శాఖ మంత్రి నిర్మల సీతారామన్ వాస్తవాలకు బహు దూరంగా మాట్లాడారని, ఉన్నత విద్యారంగంలో 28 శాతం విద్యార్థినీల ఎన్‌రోల్ మెంట్ పెరిగిందనడం, సైన్స్, టెక్నాలజీ ఇంజనీరింగ్, మెడికల్ విభాగాల్లో విద్యార్థినీల చేరిక 43 శాతంగా ఉందని, ప్రపంచంలోనే ఇది అత్యుత్తమమైనది అనడం హాస్యాస్పదంగా ఉందని పేర్కొన్నారు. బిజెపి అధికారం చేపట్టాక విద్యార్థినీలు చదువులకు దూరమయ్యారని, కేంద్ర ప్రభుత్వం నిర్వహిస్తున్న కేంద్రీయ విశ్వవిద్యాలయాల్లో, కేంద్రీయ పాఠశాలల్లో, నవోదయల్లో కనీస మౌలిక సదుపాయాలు లేవని తెలిపారు. స్కిల్ ఇండియా ఏర్పాటు చేసి ఒకటి పాయింట్ ఎనిమిది కోట్ల మంది యువతను స్కిల్డ్ యువతగా తీర్చిదిద్దామనని తెలిపారని, ఎన్ని లక్షల యువతకు ప్రభుత్వ ఉద్యోగాలు కల్పించారో సమాధానం చెప్పాలని ప్రశ్నించారు. నూతన ఐటిఐలు, ఐఐటీలు, మెడికల్ కళాశాలలు, ఐఐఎంలు ఏర్పాటు చేసినట్లు గొప్పలు చెప్పారని, కానీ ఆయా కళాశాలలో మౌలిక సదుపాయాల కొరత విద్యార్థులను తీవ్రంగా వేధిస్తోందని తెలిపారు. ప్రభుత్వమే 390కి పైగా ప్రైవేటు యూనివర్సిటీలకు అనుమతులిచ్చి ప్రభుత్వ యూనివర్సిటీలను నిర్వీర్యం చేశారన్నారు. ఏకలవ్య పాఠశాలలు, సైనిక స్కూల్స్ తదితర ఏర్పాటు చేసినట్లు చెప్పిన దేశంలో నూతన విద్యాసంస్థలు ఏక్కడ ప్రారంభం కాలేదు. నూతన విద్యావిధానం అనుగుణంగా బడ్జెట్ కేటాయింపులు విద్యారంగానికి లేవని, నూతన విద్యావిధానం పేరుతో విద్యారంగానికి ప్రైవేటు, కార్పొరేట్ శక్తులకు అప్పజెప్పే కుట్రలు చేస్తుందని అభిప్రాయం తెలిపారు. దేశంలో విద్యాప్రమాణాలు పెరగాలంటే బడ్జెట్ కేటాయింపులు పెరగాలని డిమాండ్ చేశారు.

1.5 కేజీ గంజాయి స్వాధీనం

- నలుగురు అరెస్టు

నవతెలంగాణ-ఖమ్మం

ఖమ్మం దంసలాపురం రైల్వే బ్రిడ్జి పరిసర ప్రాంతాల్లో తనిఖీలు నిర్వహించగా 1.5 కేజీ ఎండు గంజాయితో 4 గురు వ్యక్తులు పట్టుబడినట్లు ఖమ్మం వన్ ఎక్సైజ్ సీఐ కె. రాజు తెలిపారు. వివరాలు ఇలా ఉన్నాయి. ఖమ్మం ఎన్ఎస్టీ రోడ్‌కు చెందిన గెంటేల నరేష్, జెడ్పీ సెంటర్ కు చెందిన గుత్తికొండ యశ్వంత్, ఖమ్మం రూరల్ మండలం గుర్రాలపాడు కు చెందిన దొడ్డ వీర ప్రసాద్, తెల్దారుపల్లికి చెందిన భూక్యా వీరబాబు ఒక ముఠాగా ఏర్పడి గంజాయిని ఆంధ్ర ప్రదేశ్‌లోని చింతూరు ప్రాంతానికి వెళ్లి కేజీ రూ.5 వేల కొనుగోలు చేసి తీసుకువస్తూ ఖమ్మం నగరం, చుట్టు ప్రక్కల ప్రాంతాల్లో 50 గ్రాములు, 100 గ్రాముల ప్యాకెట్లు లాగా తయారు చేసి ఒక్కోటి రూ. 1000 నుండి రూ. 2000 వరకు అక్రమంగా విక్రయిస్తున్నట్లు తమ విచారణలో తేలిందని తెలిపారు. వీరి కార్యకలాపాలపై గత కొన్ని రోజులుగా నిఘా వేయగా గురువారం గంజాయి రవాణా చేస్తూ పట్టుబడ్డారని తెలిపారు. ముద్దాయిలపై కేసు నమోదు చేసి వారిని రిమాండ్‌కు తరలించినట్లు తెలిపారు. ఈ తనిఖీల్లో ఎస్సైలు షేక్ రబ్బానీ, లత, సిబ్బంది రామారావు, శశికాంత్, రమేష్, రవి, నరేష్, మారేశ్వర రావు, శ్రీనివాస్‌రెడ్డి పాల్గొన్నారు.

ప్రభుత్వం క్రీడలను ప్రోత్సహిస్తుంది

- రెండు రాష్ట్రాల వాలీబాల్ పోటీలు ప్రారంభం
- ఎమ్మెల్యే మట్ట రాగమయ దయానంద్

నవతెలంగాణ-కల్లూరు



రాష్ట్ర ప్రభుత్వం క్రీడాలను ప్రోత్సహించి సహకారం అందిస్తుందని సత్తుపల్లి శాసన సభ్యురాలు డాక్టర్ మట్ట రాఘమయ దయానంద్ అన్నారు. స్థానిక అంబేద్కర్ నగర్ యూత్ ఆధ్వర్యంలో తెలంగాణ, ఆంధ్ర రాష్ట్రాల స్థాయి వాలీబాల్ పోటీలు స్థానిక సీఎస్ఐ చర్చి గ్రౌండ్‌లో నిర్వహిస్తుండగా గురువారం సత్తుపల్లి శాసన సభ్యురాలు డాక్టర్ మట్ట రాగమయి దయానంద్ వాలీబాల్ సర్వీస్ చేసి ప్రారంభించారు. అనంతరం ఆర్డిఓ అశోక్ చక్రవర్తి, తహసిల్దార్ సాంబశివుడు, ఎస్సై ఎస్కె.షాకీర్, కాంగ్రెస్ పార్టీ మండల నాయకులు పసుమర్తి చంద్రరావు, భాగం ప్రభాకర్ చౌదరి, లక్కినేని కృష్ణ, నరసింహారావు, ఏనుగు సత్యంబాబు, గోపాల స్వామి, తదితరులు ప్రసంగించారు. తొలుత డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు. క్రీడల నిర్వహకులు పాప బత్తిని నగేష్, దామాల సురేష్ మాట్లాడుతూ రెండు రాష్ట్రాల పోటీలకు 20 టీములు ఈ పోటీల్లో పాల్గొంటున్నాయని, ఈ పోటీలు నాట్ కం లీగ్ పద్ధతిలో నిర్వహిస్తామని, మూడు రోజులు పాటు పోటీలు కొనసాగితాయిని తెలిపారు. ప్రథమ ప్రైజు రూ.30వేలు, రెండో ప్రైజు 20వేలు, మూడో ప్రైజు 10వేలు, నాలుగో బహుమతి 7వేలు దాతలు ఇచ్చిన బహుమతులు, షీల్డ్ మెమొంట్లు అందజేస్తామన్నారు. సీనియర్ పిఈటి పసుపులేటి వీరరాఘవయ్య ఆధ్వర్యంలో నిర్వహిస్తారని తెలిపారు. ఈ కార్యక్రమంలో అంబేద్కర్ యూత్ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

డీసీసీబీ ఉపాధ్యక్షుడు వెంకటేశ్వరరావు రాజీనామా

- మధిర వైస్ ఎంపీపీతో పాటు ఖమ్మంపాడు
- సొసైటీ వైస్ ప్రెసిడెంట్, డైరెక్టర్ల రాజీనామా

నవతెలంగాణ-మధిర



భారత రాష్ట్ర సమితి పార్టీకి జిల్లా సహకార సంఘం ఉపాధ్యక్షుడు దొండపాటి వెంకటేశ్వరరావు రాజీనామా చేస్తున్నట్లు ప్రకటించారు. మధిర పట్టణంలోని రిక్రియేషన్ క్లబ్ ఆవరణలో తనతో పాటు మండల పరిషత్ వైస్ చైర్మెన్ సామినేని సురేష్, ఖమ్మంపాడు సొసైటీ ఉపాధ్యక్షులు పుచ్చకాయల సీతారామయ్య, డైరెక్టర్లుసామినేని జానయ్య, దుగ్గినేని వెంకటరామయ్య, కంచం శ్రీనివాసరావు, బిఆర్ఎస్ మండల ఉపాధ్యక్షులు పిడికిడి సాంబశివరావు, ఖమ్మంపాడు గ్రామ శాఖ అధ్యక్ష, కార్యదర్శులు నూకారపు అప్పారావు, మరుసకట్ల శ్రీను తదితరులు పార్టీకి రాజీనామా చేస్తున్నట్లు ప్రకటించారు. ఈ సందర్భంగా దొండపాటి వెంకటేశ్వరరావు మాట్లాడుతూ గత బీఆర్ఎస్ ప్రభుత్వ కాలంలో తమ ఖమ్మంపాడు పంచాయతీ పరిధిలో ఉన్న రైతులకు సాగునీటిని అందించేందుకుగాను లిఫ్ట్ స్కీంను, దెందుకూరు నుండి కూడలి వరకు రహదారి విస్తరణను, ఇల్లూరు నుండి ఖమ్మంపాడు వరకు బ్రిడ్జి నిర్మాణంతో పాటు రహదారి విస్తరణను చేయాల్సిందిగా నాటి జిల్లా మంత్రి పువ్వాడ అజయ్ కుమార్ తో జిల్లాలోని ప్రజా ప్రతినిధులకు విన్నవించినట్టు తెలిపారు. అయితే వీటిపై కనీసం స్పందన లేకపోవడంతో రైతులకు తాము ఇచ్చిన హామీని నెరవేర్చలేని కారణంగా పార్టీకి రాజీనామా చేస్తున్నట్లు పేర్కొన్నారు. ఇప్పటివరకు బిఆర్ఎస్ పార్టీలో నిర్మాణాత్మకమైన బాధ్యతలలో తమ వంతు పాత్రను నిర్వహించామని తెలిపారు. కాగా దొండపాటి తోపాటు పలువురు ప్రజా ప్రతినిధులు పార్టీ నాయకులు బిఆర్ఎస్ పార్టీకి రాజీనామా చేస్తున్నట్లు సోషల్ మీడియా వేదికగా ప్రచారం జరగడంతో ఖమ్మం పార్లమెంటు సభ్యులు నామా నాగేశ్వరరావు ఫోన్ ద్వారా దొండపాటితో సమాలోచనలు చేశారు. తాను అండగా ఉంటానని సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని రాజీనామాను ఉపసంహరించుకావాలని వారి కోరినట్లు సమాచారం.

తాళ్లూరి దుర్గమ్మ గ్రామాభివృద్ధికి ఎంతో కృషి చేశారు

- జెడ్పీ చైర్మెన్ లింగాల కమల్ రాజు

నవతెలంగాణ-బోనకల్



తాళ్లూరి దుర్గమ్మ పెద్దబీరవల్లి గ్రామ అభివృద్ధికి ఎంతో కృషి చేశారని జిల్లా పరిషత్ చైర్మెన్ లింగాల కమల్ రాజు కొనియాడారు. మండల పరిధిలోనే పెద్ద బీరవల్లి మాజీ గ్రామ సర్పంచ్, సీపీఐ(ఎం) నాయకురాలు తాళ్లూరి దుర్గమ్మ దశదినకర్మ గురువారం పెద్ద బీరవల్లి గ్రామంలో నిర్వహించారు. ఈ కార్యక్రమంలో లింగాల కమల్ రాజు పాల్గొని ఆమె చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. కుటుంబ సభ్యులను పరామర్శించి సంతాప సానుభూతి తెలిపారు. ఆయన వెంట నారాయణపురం సొసైటీ ఉపాధ్యక్షులు కరివేద సుధాకర్, బీఆర్ఎస్ గ్రామ శాఖ అధ్యక్షులు ఎనమద్ది శ్రీనివాసరావు, కార్యదర్శి రెడ్డిబోయిన ఉద్దండు, ఆ పార్టీ నాయకులు డేగల బాబు, నల్లబెల్లి అర్లప్ప తదితరులు ఉన్నారు.



సర్పంచ్, వార్డు సభ్యుల సేవలు ఎనలేనివి

- ఎమ్మెల్యే డాక్టర్ మట్ట రాగమయి

నవతెలంగాణ-తల్లాడ

గ్రామ పంచాయతీ సర్పంచ్‌లు, వార్డు సభ్యులు గ్రామాభివృద్ధికి చేసిన సేవలు ఎనలేనివని ఎమ్మెల్యే డాక్టర్ మట్టా రాగమయి అన్నారు. గ్రామపంచాయతీ సర్పంచ్ పదవీకాలం ముగియడంతో గురువారం తల్లాడ గ్రామపంచాయతీ కార్యాలయ ఆవరణలో సర్పంచ్ పొట్టేటి సంధ్యారాణి, వార్డు సభ్యులను ఎమ్మెల్యే ఘనంగా సన్మానించి వీడ్కోలు పలికారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ సర్పంచులు వార్డు సభ్యులు గ్రామాల అభివృద్ధికి మంచి కృషి చేశారన్నారు. ప్రజల మన్ననలను పొందారని, అదేవిధంగా గ్రామస్తులు సహకరించారని వారందరికీ కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు, అధికారులు గ్రామస్తులు పాల్గొన్నారు.

ఈనెల 16 నుంచి ఆశా వర్కర్ల సమ్మె

నవతెలంగాణ-ఖమ్మం రూరల్



తమ న్యాయమైన సమస్యలు పరిష్కరించాలని కోరుతూ ఈ నెల 16 నుంచి ఆశా వర్కర్లు సమ్మె చేస్తున్నట్లు సిఐటియు జిల్లా సహాయ కార్యదర్శి పెరుమళ్ళపల్లి మోహన్‌రావు తెలిపారు. 16న జరిగే సమ్మె నోటీసులను గురువారం మండలంలోని ఎం.వెంకటాయపాలెం గ్రామంలో గల వైద్యాధికారిణికి అందజేశారు. ఈ సందర్భంగా మోహన్‌రావు మాట్లాడుతూ ఆశా కార్యకర్తలు గ్రామాల్లో ప్రజలను కంటికి రెప్పలా కాపాడుతున్న, వారికి సరైన వేతనాలు అందడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. నెలనెలా జీతాలు కూడా సరిగా ఇవ్వడం లేదని, ఉద్యోగ భద్రత లేదని, ఈఎస్ఐ, పీఎఫ్, ప్రమాద బీమా సౌకర్యం కల్పించాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వం వెంటనే స్పందించి ఆశా వర్కర్ల సమస్యలను పరిష్కరించాలన్నారు. లేనిపక్షంలో 16వ తేదీ నుంచి నిరవధిక సమ్మె ప్రారంభిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో ఆశా వర్కర్ల యూనియన్ మండల అధ్యక్షురాలు బేతంపూడి మల్లేశ్వరి, నాయకురాలు ఉప్పలమ్మ, మంగమ్మ, సావిత్రి, లక్ష్మి పాల్గొన్నారు.

పశువులకు వెటర్నరీ శిబిరం

నవతెలంగాణ-మధిర

మధిర మండలం సిద్దినేనిగూడెం గ్రామంలో తెలంగాణ రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క చిరకాల స్వప్నం ఇందిరా డైరీ ఏర్పాటుకు అవసరమైన అధిక పాల దిగుబడి నిచ్చే దేశీయ సంతతికి చెందిన సాహివాల్ ఆవులను పెంపొందించేందుకుచేయాలని మన దగ్గర ఉన్న పశువులకు కృత్రిమ గర్భం ద్వారా ఉత్పత్తి చేయాలని వెటర్నరీ మెడికల్ క్యాంపును గురువారం ఏర్పాటు చేశారు. ఈ సాహివాల్ దేశీయ ఆవులు అధిక పాల దిగుబడితోపాటు, అత్యధిక వెన్న శాతం కలిగిన పాలనిస్తాయి. ఈ సందర్భంగా పివి. నరసింహారావు పశు వైద్య కళాశాల వైద్యులు మాట్లాడారు. ఈ సందర్భంగా మాటూరు పేట గ్రామంలో సాహివాల్ దేశీయ జాతి ఆవును తీసుకొని వచ్చి మన మధిర ఏరియా నందు ఉత్పత్తి చేయాలని ఆవును సాదుతున్న రైతు చిలువేరు బుచ్చి రామయ్యను ఖమ్మం జిల్లా వెటర్నరీ జెడి డాక్టర్ వేణు మనోహర్, పీవీ నరసింహారావు విశ్వవిద్యాలయం ప్రిన్సిపాల్ ఉదయ్ కుమార్, మధిర ఎంపీపీ లలిత, మాజీ జెడ్పిటిసి సభ్యులు సూరంశెట్టి నాగభూషణం, మధిర మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు సూరంశెట్టి కిషోర్, మర్లపాడు సర్పంచ్ లు వేమిరెడ్డి పెద్దనాగిరెడ్డి, పులిబండ్ల చిట్టిబాబు, కిషోర్ ఎంపీడీవో ఎస్ కే సిలార్ సాహెబ్, మండల ఎస్సీ సెల్ అధ్యక్షులు దారా బాలరాజు, మండల నాయకులు కర్నాటి రామారావు, నిడమనూరు వంశీ తదితరులు పాల్గొని సన్మానించారు.


జడ్పీహెచ్ఎస్ మడుపల్లిని ఫార్మాటివ్ అసెస్మెంట్ మార్కుల పరిశీలన బృందం సందర్శన

నవతెలంగాణ-మధిర

జెడ్పీహెచ్ఎస్ మడుపల్లి పదవ తరగతి ఫార్మాటివ్ అసెస్మెంట్ మార్కుల పరిశీలనా బృందం గురువారం సందర్శించారు. మాటూరు ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు శ్రీహరి అధ్యక్షతన ఎం. శ్రీనివాసరావు ఎస్.ఎస్. శ్రీనివాసరావు. జె. సురేష్, ఉపాధ్యాయ బృందం సందర్శించి 2024 మార్చిలో పదవ తరగతి పరీక్షలు రాయబోతున్న విద్యార్థుల ఫార్మాటివ్ అసెస్మెంట్ మార్కులను ఈ బృందం పరిశీలించి సంతృప్తిని వ్యక్తం చేసింది. అనంతరం పదవ తరగతి విద్యార్థులను ఉద్దేశించి ఈ బృందంలోని సభ్యులు మాట్లాడుతూ విద్యార్థులందరూ సమయాన్ని వృధా చేసుకోకుండా నిరంతరం 10 జీపీఏ సాధించుట కొరకు కష్టపడి చదివి ఉన్నత శిఖరాలను అధిరోహించాలని వారు ఆశించాలని విద్యార్థులకు పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా మడుపల్లి ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు సిహెచ్. సమాధానం మాట్లాడుతూ అతి త్వరలో 10వ తరగతి పరీక్షలు జరుగుతున్నందున విద్యార్థులు సమయాన్ని వృధా చేసుకోకుండా తెలియని విషయాలను తెలుసుకొని మంచి జీపీఏ సాధించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు తోట నరసింహారావు, భూసా కోటేశ్వరరావు, కంచిపోగు ఆదాము బాబురావు, కిషోర్ రామిరెడ్డి, కృష్ణయ్య జాషువా, జ్యోతిర్మయి, రాణి, చైతన్య, చిట్టిబాబు తదితరులు పాల్గొన్నారు.

స్టాఫ్ నర్స్ ఉద్యోగం పొందిన ధర్మసోత్ మౌనిక

నవతెలంగాణ-తల్లాడ



మండల పరిధిలోని రంగం బంజర గ్రామానికి చెందిన ధరం సోత్ మౌనిక స్టాఫ్ నర్స్ ఉద్యోగం పొంది నియామక పత్రం అందుకున్నారు. తెలంగాణ ప్రభుత్వం స్టాఫ్ నర్స్‌లకు నియామక పత్రాలను ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి చేతులు మీదుగా హైదరాబాదులో అందించారు. ఈ సందర్భంగా తల్లాడ మండలానికి చెందిన మౌనిక ఓపెన్ కేటగిరిలో 108వ ర్యాంక్ సాధించి ఉద్యోగం పొంది నియామ పత్రం అందుకున్నారు.

పెనుబల్లి సర్పంచ్‌కు పౌర సన్మానం

నవతెలంగాణ-పెనుబల్లి



పెనుబల్లి సర్పంచ్ తావు నాయక్‌కు పెనుబల్లి గ్రామపంచాయతీ కార్యాలయంలో బిఆర్ఎస్ నాయకులు కోటగిరి శేఖర్ బాబు, సుధాకర్ బాబు ఆధ్వర్యంలో గురువారం పౌర సన్మానం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి స్థానికులు, ప్రజాప్రతి నిధులు హాజరై ఎమ్మెల్యేను శాలువా, పూలమాలతో సత్కరించారు. ఈ సందర్భంగా సుధాకర్ బాబు మాట్లాడుతూ గ్రామపంచాయతీని పూర్తిస్థాయిలో అభివృద్ధి చేసిన ఘనత తావు నాయక్ దక్కుతుందన్నారు. ప్రభుత్వం ఇచ్చిన ప్రతి రూపాయిని గ్రామపంచాయతీ అభివృద్ధికి పాటుపడటం జరిగిందన్నారు. సర్పంచ్ కి పంచాయితీ ప్రజల సహకారం ఉండటం వల్లే అభివృద్ధి మరింత సాధ్యమైందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మల్లెల సతీష్, తేళ్లూరి నాగేశ్వరరావు, వార్డు సభ్యులు పాల్గొన్నారు.

ఎలుగుబంటి కనపడితే సమాచారం ఇవ్వండి

- అటవీశాఖ రేంజర్ ఎల్లయ్య



నవతెలంగాణ-చంద్రుగొండ

గ్రామాల్లో ఎలుగుబంటి కనపడితే వెంటనే అటవీశాఖ సిబ్బందికి తెలియజేయాలని చంద్రుగొండ అటవీశాఖ రేంజర్ ఎల్లయ్య సూచించారు. గురువారం మద్దుకూరు గ్రామంలో ఎలుగుబంటి సంచరించినట్లు గ్రామస్తులు చెప్పిన ప్రదేశాన్ని ఆయన పరిశీలించారు. గ్రామస్తుల నుండి వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఇటీవల మద్దుకూరు, చంద్రుగొండ గ్రామాల్లో ఎలుగుబంటి ఇద్దరు వ్యక్తులను గాయపర్చిన విషయం విధితమే. ఈ క్రమంలో అన్ని గ్రామాల్లో అటవీశాఖ సిబ్బంది గాలింపు చర్యలు చేపట్టిన్నట్లు ఆయన తెలిపాడు. అడవి నుండి దారి తప్పిన ఎలుగుబంటి గ్రామాల్లో వచ్చిన్నట్లు ఉందని, మళ్లీ అడవిలోకి వెళ్తుందని, అప్పటి వరకు మండలవాసులు అప్రమత్తంగా ఉండలన్నారు. ఆయన వెంట అటవీశాఖ సిబ్బంది పాల్గొన్నారు.

సేవ్ సింగరేణి నినాదంతో సమ్మె నోటీసు : సీఐటీయూ



నవతెలంగాణ-కొత్తగూడెం

ఫిబ్రవరి 16న సార్వత్రిక సమ్మెను సింగరేణిలో చేయుటకు జనరల్ మేనేజర్ (పర్సనల్ అండ్ ఐఆర్)కి సింగరేణి కాలరీస్ ఎంప్లాయిస్ యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మంద నరసింహారావు, విజయగిరి శ్రీనివాస్, వై.వెంకటేశ్వరరావు సమ్మె నోటీసు అందించారు. కేంద్ర ప్రభుత్వం ప్రభుత్వ పరిశ్రమల అమ్మకం-కార్మిక వ్యతిరేక చట్టాలు సమస్యలపై ఫిబ్రవరి 16న దేశ వ్యాప్త సమ్మె చేయాలని బొగ్గు బ్లాకుల అమ్మకం వ్యతిరేకంగా అఖిల భారత స్థాయిలో కార్మికుల సమ్మె గ్రామీణ భారత్ బంద్ నిర్వహించాలని పిలుపు నిచ్చాయని అన్నారు. కోల్ ఇండియాలో నడుస్తున్న 160 బొగ్గు గనులను క్యాపిటలైజేషన్ క్యాపిటల్ పేరు కింద అమ్మి వేసే ప్రయత్నాలు జరుగుతున్నాయన్నారు. కోల్ ఇండియాలో వాటాలు అమ్ముతున్న కేంద్రం సింగరేణిలో తనకున్న 49 శాతం వాటాలు అమ్మడనే గ్యారెంటీ లేదు. గత ప్రభుత్వం సింగరేణి రిజర్వ్ ఫండ్ రూ.10 వేల కోట్ల వాడుకొని ఆర్థిక కష్టాల్లోకి నెట్టింది. సింగరేణిలో కొత్తగా వచ్చే ఓపెన్ కాస్ట్ ప్రాజెక్టులు ఔట్‌సోర్సింగ్‌కి ఇచ్చే ప్రయత్నాలు జరుగుతున్నాయని, సింగరేణి ని రక్షించుకునేందుకు ఈ సమ్మె చేస్తున్నట్లు తెలిపారు.

నర్సింగ్ ఆఫీసర్‌గా ట్రాక్టర్ డ్రైవర్ కూతురు

- పలువురి అభినందనలు



నవతెలంగాణ-అశ్వారావుపేట

అశ్వారావుపేట గ్రామ పంచాయతీ ట్రాక్టర్ డ్రైవర్ కుమార్తె నర్సింగ్ ఆఫీసర్ గా ఉద్యోగం పొందారు. మండలంలోని పేరాయిగూడెం పంచాయతీకి చెందిన ఏలేటి ఉషారాణి తెలంగాణ ప్రభుత్వం ప్రకటించిన నర్సింగ్ ఆఫీసర్ ఉద్యోగాలలో కొలువు సంపాదించారు. పాఠశాల విద్య నుంచి ప్రభుత్వ బడిలో చదివి, ఎన్నో ఆర్థిక ఇబ్బందులను ఎదుర్కొని ఉన్నత చదువులు చదివి ప్రభుత్వ కొలువును సంపాదించారు. ఉషారాణి తండ్రి ఏలేటి నాగభూషణం అశ్వారావుపేట పంచాయతీలో ట్రాక్టర్ డ్రైవర్ (జీపీ వర్కర్)గా పని చేస్తున్నారు. తల్లి పార్వతి వ్యవసాయ కూలీ. ఉషారాణి భర్త గద్దల అశోక్ కుమార్ ఇటీవలే తెలంగాణ ప్రభుత్వం ప్రకటించిన పోలీస్ శాఖలో ఎస్ఐ కొలువుకు అర్హత పొంది తెలంగాణ పోలీస్ అకాడమీలో ట్రైనింగ్ పొందుతున్నారు. పేదరికంలోనూ ఉన్నత చదువులు చదివి ప్రభుత్వ కొలువు సాధించిన ఉషారాణి, తల్లి పార్వతి, తండ్రి భూషణంలను పలువురు అభినందిస్తున్నారు.

సొంత గూటికి గురజాల గోపి

- అభిమానుల్లో ఆనందం



నవతెలంగాణ-మణుగూరు

మాజీ కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు, పినపాక నియోజకవర్గం సీనియర్ నాయకులు గురజాల గోపి తిరిగి కాంగ్రెస్ పార్టీలో గురువారం చేరారు. గురజాల గోపి క్యాంపు కార్యాలయం వద్ద అభిమానులు సంతోషం వ్యక్తం చేశారు. తెలంగాణ రాష్ట్ర కాంగ్రెస్ పార్టీ ఇన్చార్జి దీపక్ దాస్ మున్షీ, మాజీ కేంద్రమంత్రి రేణుకా చౌదరి ఆధ్వర్యంలో తిరిగి కాంగ్రెస్ పార్టీలో చేరారు. ఈ సందర్భంగా గురజాల గోపి మాట్లాడుతూ రానున్న పార్లమెంట్ ఎలక్షన్‌లో రాహుల్ గాంధీని ప్రధానమంత్రి చేయడమే లక్ష్యంగా కాంగ్రెస్ పార్టీ గెలుపునకు కృషి చేస్తానని, ప్రాణం ఉన్నంత వరకు కాంగ్రెస్ పార్టీలోనే కొనసాగుతానని తెలియజేశారు.


సాగుభూములకు పట్టాలివ్వాలి

- తహశీల్దార్‌కు బీఎస్పీ మెమోరాండం

నవతెలంగాణ-జూలూరుపాడు

మండల వ్యాప్తంగా దళితులు సాగు చేసుకున్నటువంటి సాగుభూములకి పట్టాలివ్వాలని కోరుతూ బహుజన్ సమాజ్ పార్టీ మండల సీనియర్ నాయకులు నరసింహారావు తహశీల్దార్‌కు గురువారం మెమోరాండం సమర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ఈ కార్యక్రమంలో మంద వెంకటేశ్వర్లు, కత్తి నాగయ్య. గార్లపాటి సైదులు తదితరులు పాల్గొన్నారు.

ఇల్లందు ఏరియాలో 99 శాతం బొగ్గు ఉత్పత్తి : జీఎం




నవతెలంగాణ-ఇల్లందు

జనవరి-2024 నెలకు నిర్దేశించిన బొగ్గు ఉత్పత్తి 4.80 లక్షల టన్నులకు గాను 4.74 లక్షల టన్నుల బొగ్గు తీసి మొత్తం 99 శాతం ఉత్పత్తి చేయడం జరిగిందని జీఎం జాన్ ఆనంద్ తెలిపారు. కార్యాలయంలో గురువారం ఏర్పాటుచేసిన పత్రికా విలేఖరుల సమావేశంలో జనవరి నెల బొగ్గు ఉత్పత్తి ఉత్పాదకత వివరాలను వెల్లడించారు. 1.84 లక్షల టన్నుల బొగ్గు రైల్వే మార్గం ద్వారా, 0.59 లక్షల టన్నులు రోడ్డు మార్గం ద్వారా, ఆర్‌సిహెచ్‌పి ద్వారా 1.63 లక్షల టన్నులు మొత్తం 4.06 లక్షల టన్నుల బొగ్గు బట్వాడా చేయడం జరిగిందని తెలిపారు. 50 రేకుల ద్వారా బొగ్గు రవాణా చేసామని తెలిపారు. రక్షణతో కూడిన బొగ్గు ఉత్పత్తికి కృషి చేయడం పట్ల సంబంధిత అధికారులు ఉద్యోగులను, సూపర్వైజర్లను జీఎం ప్రత్యేకంగా అభినందించారు. ఈ సమావేశంలో ఏజీఎం (ఐడీ) యం.గిరిధరరావు, డీజీఎం (పర్సనల్) జి.వి.మోహన్ రావు, డాక్టర్ మల్ల రెడ్డి, సీనియర్ పర్సనల్ ఆఫీసర్ సాయి స్వరూప్ తదితరులు పాల్గొన్నారు.

జనరల్ సెక్రటరీ దిష్టిబొమ్మ దహనం చేయడం విచారకరం

- వెలగపల్లి జాన్



నవతెలంగాణ-మణుగూరు

ఐఎన్‌టీయూసీ జనరల్ సెక్రెటరీ జనక్ ప్రసాద్ దిష్టిబొమ్మ దహనం చేయడం విచారకరమని దీనిని ఖండిస్తున్నానని సింగరేణి కోల్ మైన్స్ లేబర్ యూనియన్ ఐఎన్‌టీయూసీ సీనియర్ నాయకులు ఏరియా ఉపాధ్యక్షులు వెలగపల్లి జాన్ గురువారం ఓ పత్రిక ప్రకటనలో తెలిపారు. బి.జనక్ ప్రసాద్ సెక్రెటరీ జనరల్ 26వ తారీకున అన్ని కమిటీలు రద్దు చేయబడిందని ప్రకటించడం జరిగిందని, మళ్లీ ఒక ప్రకటనలో టీబీజీకేఎస్ నుంచి వచ్చిన కొంతమందికి బ్రాంచ్ వైస్ ప్రెసిడెంట్‌గా పేర్లు ఇవ్వడంతో ఐఎన్‌టీయూసీ నాయకులు ఉద్రిక్తులైనారని తెలిపారు. నాకు తెలియకుండా కొత్తగూడెం, ఇల్లందు, ఏరియాల నాయకులను సంప్రదించి జనరల్ సెక్రెటరీ దిష్టిబొమ్మను దహనం చేసినట్టు తెలిపారు. ఇలాంటి పొరపాట్లు ఎప్పటికీ జరగవని సెక్రటరీ జనరల్‌కె హామీ ఇస్తున్నానని తెలిపారు. వీళ్ల టీబీజీకేయస్ నుంచి వచ్చిన వారని జనరల్ సెక్రటరీకి తెలియక పోవడం వల్లనే ఇలా జరిగిందని తెలిపారు.

గ్రామ పంచాయతీలకు ప్రత్యేక అధికారుల నియామకం

- కలెక్టర్ ప్రియాంక అల



నవతెలంగాణ-పాల్వంచ

గ్రామ పంచాయతీలకు ప్రత్యేక అధికారులను నియమిస్తూ కలెక్టర్ ప్రియాంక అల గురువారం ఉత్తర్వులు జారీ చేశారు. విధులు కేటాయించిన ప్రత్యేక అధికారులు సంబంధిత గ్రామపంచాయతీల పదవీ బాధ్యతలు చేపట్టాలని చెప్పారు. పదవీ బాధ్యతలు చేపట్టిన అంశంపై ఎంపీడీవోలు, ఎంపీవోలు నివేదికలు అందచేయాలని ఆదేశించారు. గురువారం సాయంత్రం 5 గంటలకు గ్రామ పంచాయతీల పాలక మండలి పదవి కాలపరిమితి ముగిసినందున ఫిబ్రవరి 2వ తేదీ నుండి గ్రామ పంచాయతిల పరిపాలన పర్యవేక్షణకు ప్రత్యేక అధికారులను నియమించినట్లు కలెక్టర్ పేర్కొన్నారు. నియమితులైన ప్రత్యేక అధికారులు తక్షణమే పదవీ బాధ్యతలు చేపట్టాలని కలెక్టర్ స్పష్టం చేశారు.

ఓటు ఆన్ బడ్జెట్ కాదు...ఓటర్లకు గాళం వేసే

ఎన్నికల తాయిలాల బడ్జెట్

- సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శి కనకయ్య



నవతెలంగాణ-కొత్తగూడెం

కేంద్ర మంత్రి నిర్మల సీతారామన్ ప్రవేశ పెట్టిన మధ్యంతర బడ్జెట్ ఓటు ఆన్ బడ్జెట్ కాదు, ఓటర్లకు గాళం వేసే ఎన్నికల తాయిలాల బడ్జెట్ అని సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శి అన్నవరపు కనకయ్య విమర్శించారు. కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన మధ్యంతర బడ్జెట్‌పై ఆయన స్పదింస్తూ ప్రకటన విడుదల చేశారు. తాము అధికారంలోకి వస్తే రాబోయే 5 సంవత్సరాలలో ఎం చేస్తామని ఎన్నికల ప్రకటన లాగా చేసారే తప్ప విధానపరమైన అంశాల జోలికి వెళ్లలేదని విమర్శించారు. పార్లమెంట్ ఎన్నికల వరకు మాత్రమే నిర్వహించే 2 లేదా 3 నెలల బడ్జెట్‌ను రాబోయే 5 సంవత్సరాల కోసం ఖర్చు చేస్తున్నట్లుగా అభూత కల్పనను సృష్టించారని ఆరోపించారు. ఏటా కోటి ఉద్యోగాలు ఇస్తామని, 9 ఏళ్ళు గడిచాయి. కానీ నిరుద్యోగ సమస్య పరిష్కారం చేయకుండా ఎందుకు యువతకు ఉపాధి అవకాశాలు కల్పించలేక పోయారో సమాధానం చెప్పకుండా దాటవేశారని ప్రస్తుత మధ్యంతర బడ్జెట్‌లో మాత్రం స్టార్టప్ ఇండియా స్టార్టప్ గ్యారెంటీతో యువతకు ఉపాధి అవకాశాలు కల్పిస్తామంటూ కొత్త పల్లవి అందుకున్నారని ఆయన ఎద్దేవచేశారు. గత 10ఏళ్ళలో ఇళ్ళ నిర్మాణానికి కృషి చేసామని పార్లమెంట్ సాక్షిగా పచ్చి అబద్ధం చెప్పారని రాష్ట్ర ప్రభుత్వాలు ఇళ్ళ నిర్మాణానికి ప్రవేశ పెట్టిన పథకాలలో కేంద్ర ప్రభుత్వ సహకారం శూన్యమన్నారు. బడ్జెట్‌లో ఎన్నికల మ్యానిఫెస్టో ప్రవేశ పెట్టినట్టు ఉందని ఆయన అభిప్రాయపడ్డారు. మోసపూరిత వాగ్దానాలతో ప్రజలను మభ్య పెట్టే బడ్జెట్ తప్ప ప్రజలకు ఉపయోగపడే బడ్జెట్ లాగా లేదని ఆయన ఆరోపించారు.

అబద్దాలతో కూడిన బడ్జెట్ ప్రసంగం

ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి బి. వీరభద్రం



దేశంలో మధ్యంతర బడ్జెట్ ప్రసంగంలో ఆర్థిక శాఖ మంత్రి నిర్మలా సీతారామన్ విద్యారంగం గూర్చి అబద్ధాలు మాట్లాడారని ఎస్ఎఫ్ఐ భద్రాద్రి కొత్తగూడెం ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి బి. వీరభద్రం అన్నారు. గురువారం ప్రకటన విడుదల చేశారు. విద్యకు సంబంధిత ఉత్పత్తులపై 18 శాతం జీఎస్టీ నుండి ప్రభుత్వం 5 శాతానికి తగ్గించిందని, తాము ఆయా వస్తువులపై జీఎస్టీ ఎత్తివేయాలని కోరారు. నూతన జాతీయ విధానం ద్వారా రాష్ట్రాల హక్కులను లాక్కొని విద్యపై కేంద్రం పూర్తి స్థాయి నియంత్రణ కోసం ప్రయత్నిస్తోందన్నారు. ఇటువంటి చర్యలను ప్రతి ఒక్కరూ ప్రతిఘటించాలని కోరారు.

ఆర్థిక అసమానతకు ఆజ్యంపోసిన బడ్జెట్

సీపీఐ జిల్లా కార్యదర్శి

ఎస్‌కె. సాబీర్ పాషా



కేంద్ర ఆర్థికశాఖ మంత్రి నిర్మలా సీతారామన్ ప్రవేశపెట్టిన బడ్జెట్ ఆర్థిక అసమానతలకు ఆజ్యం పోసే విధంగా ఉందని, ఈ బడ్జెట్‌లో ఆర్థిక అసమానతలను పరిష్కరించేందుకు ఈ బడ్జెట్ ద్వారా ఎలాంటి ప్రయత్నం జరగలేదని సిపిఐ జిల్లా కార్యదర్శి ఎస్‌కె.సాబీర్ పాషా పేర్కొన్నారు. బడ్జెట్‌లో ప్రత్యేకత ఏమి లేదు. వచ్చే పూర్తి బడ్జెట్టులోనైనా వీటిపై కేంద్రం దృష్టి సారించాలన్నారు. ఈ బడ్జెట్ కేవలం పారిశ్రామిక వేత్తలకు, కార్పొరేట్ శక్తులకు సంతోషకరమైన బడ్జెట్ మాత్రమేనని, పేద, మధ్యతరగని వర్గాలకు, యువతకు ఎలాంటి ప్రయోజనం లేని బడ్జెట్.

భట్టిని కలిసిన మండల కాంగ్రెస్ అధ్యక్షులు



నవతెలంగాణ-జూలూరుపాడు

తెలంగాణ రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి, విద్యుత్ శాఖ, ఆర్థిక శాఖ మంత్రి మల్లు భట్టి విక్రమార్కని గురువారం ప్రజాభవన్‌లో గల వారి స్వగృహం నందు మండల కాంగ్రెస్ అధ్యక్షులు మాలోత్ మంగీలాల్ నాయక్ మర్యాదపూర్వకంగా కలిసారు. ఈ సందర్భంగా ఆదిలాబాద్ నుండి ఖమ్మం వరకు భట్టి విక్రమార్క చేపట్టిన పీపుల్స్ మార్చ్ పాదయాత్రలోని ఒక సన్నివేశ చిత్రాన్ని ఫోటో ఫ్రేమ్ రూపంలో భట్టికి అందజేసి, జూలూరుపాడు మండల అభివృద్ధి కోసం కృషి చేయాలని కోరుతూ పలు సమస్యలను వివరించారు. ఈ సందర్భంగా భట్టి విక్రమార్క మంగీలాల్ నాయక్‌తో మాట్లాడుతూ మండల రాజకీయ పరిణామలను అడిగి తెలుసుకున్నారు. అదే విధంగా రాబోయే పార్లమెంట్ ఎన్నికలకు కార్యకర్తలను సిద్ధం చేయాలని, మండల అభివృద్ధి కోసం కృషి చేస్తానని హామీ ఇచ్చారు.

విప్ప చెట్టులను కాపాడుకోవాలి : పీఓ



నవతెలంగాణ-భద్రాచలం రూరల్

సీతారామచంద్ర స్వామి వారికి అతిప్రీతిపాత్రమైన ప్రసాదం, గిరిజన కుటుంబాలకు ఉపాధి కల్పించే, ఇప్పపువ్వు చెట్లను విరివిగా పెంచి ఇప్ప చెట్లు అంతరించిపోకుండా కాపాడుకునే విధంగా సంబంధిత అధికారులు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి ప్రతీక్ జైన్ అన్నారు. గురువారం నాడు ఐటీడీఏ కార్యాలయంలోపలి ఆవరణలో ఇప్పపువ్వు మొక్కలను, యూనిటీ అధికారుల సమక్షంలో ఆయన నాటారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గిరిజన గ్రామాలలో ఇప్ప చెట్టు ద్వారా వచ్చే ఇప్పపువ్వు ఖండంతరాలకు పేరు ఉన్న శ్రీ సీతారామ చంద్రుల వారి ప్రసాదంలో కూడా వినియోగిస్తారని, ఇప్పపువ్వు ద్వారా గిరిజనులు మూడు నెలల పాటు జీవనోపాధి పొందుతారని, అలాగే ఇప్పపువ్వు సేకరణ చేసిన తర్వాత వాటిని ఎండబెట్టి జీసీసీకి విక్రయించి గిరిజనులు ఆర్థిక స్వాలంబన దిశగా ఇప్పుడిప్పుడే అడుగులు వేస్తున్నారని, అలాగే గిరిజనులు ఇప్పపువ్వు ద్వారా ఇప్ప నూనె కూడా తీస్తారన్నారు. ఎన్నో లాభాలు ఉన్న ఇప్పపువ్వు సేకరణను గిరిజనులు సేకరించి ఆర్థికంగా బలోపేతం కావడానికి ఐటిడిఏ కార్యాలయానికి వచ్చే గిరిజనులు ఇప్పపువ్వు చెట్ల వాటి అవసరాలను తెలుసుకోవడానికి ఐటిడిఏ పరిసరాలలో బయట లోపల ఈ ఒక్క మొక్కలను నాటి వాటిని సంరక్షించి వాటి ఎదుగుదలకు కృషి చేయడంతో పాటు చెట్ల ప్రాముఖ్యత గురించి గిరిజనులకు తెలియజేయడం జరుగుతుందని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో ఏపీఓ జనరల్ డేవిడ్ రాజ్, డిడి ట్రైబల్ వెల్ఫేర్ అధికారిని మణెమ్మ, ఎస్ ఓ సురేష్ బాబు, ఏపీవో పవర్ మునీర్ పాషా, ఏటీడీఓ నరసింహారావు, మేనేజర్ ఆదినారాయణ, చిట్టిబాబు, సదానందం, తదితరులు పాల్గొన్నారు.

పది పరీక్షల్లో ఉత్తమ ఫలితాలు సాధించాలి

- జిల్లా విద్యాధికారి ఎం.వెంకటేశ్వర చారి



నవతెలంగాణ-చర్ల

విద్యార్థులకు విశ్లేషణాత్మక విద్యను అందించి రాబోవు పది పరీక్షల్లో చక్కని ఫలితాలు సాధించాలని జిల్లా విద్యాధికారి ఎం.వెంకటేశ్వర చారి అన్నారు. గురువారం మండల పరిధిలోని జెడ్పిహెచ్ఎస్ సత్యనారాయణపురం, జడ్పీహెచ్ఎస్ చినమిడ్సిలేరు, జడ్పిహెచ్ఎస్ తేగడ, కేజీబీవి చర్ల, చర్ల ప్రభుత్వ ఉన్నత పాఠశాలలను ఆయన ఆకస్మికంగా తనిఖీ చేసి ఉపాధ్యాయులకు పలు సూచనలు చేశారు. పదవ తరగతి చదువుతున్న విద్యార్థులను పలు ప్రశ్నలు అడిగి వారిలోని సామర్థ్యాన్ని పరిశీలించారు. పదవతరగతి విద్యార్థులకు తగు సూచనలు చేశారు. పది తరగతులు జరుగుతున్న తీరు, ప్రత్యేక తరగతులు నిర్వహణ, విద్యార్థులకు అందుతున్న అల్పాహారం అందిస్తున్న విధానమును పాఠశాల ప్రధానోపాధ్యాయులు జిల్లా విద్యాశాఖ అధికారికి వివరించారు. గత ఏడాది కంటే మెరుగైన ఫలితాలకు కృషి చేయాలని, ప్రతి ఒక్క ఉపాధ్యాయుడు అంకితభావంతో పని చేయాలని డీఈవో ప్రధానోపాధ్యాయులకు, ఉపాధ్యాయినీ, ఉపాధ్యాయులకు సూచించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయినీ, ఉపాధ్యాయులు, చర్ల మండల విద్యాధికారి జుంకి లాల్, ప్లానింగ్ కోఆర్డినేటర్ సతీష్ తదితరులు పాల్గొన్నారు.

దుమ్ముగూడెం : త్వరలో జరగనున్న పదవ తరగతి పరీక్ష ఫలితాల్లో మెరుగైన ఫలితాలే లక్ష్యంగా ఉపాధ్యాయులు కృషి చేయాలని జిల్లా విద్యాశాఖ అధికారి వెంకటేశ్వర చారి ఉపాధ్యాయులకు సూచించారు. గురువారం నర్సాపురం గ్రామంలో గల సూదిరెడ్డి నాగిరెడ్డి ఆదిలక్ష్మమ్మ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను గురువారం ఆయన ఆకస్మికంగా సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన పదవ తరగతి గదులను పరిశీలించి విద్యార్థులకు తగిన సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు, పాధ్యాయిని ఉపాధ్యాయులు, ఏఎస్ఓ సతీష్ కుమార్, చర్ల మండల విద్యాశాఖ అధికారి జుంకి లాల్ తదితరులు ఉన్నారు.

నిత్యావసర సరుకులు పంపిణీ



నవతెలంగాణ-జూలూరుపాడు

మండలంలోని మాచినేని పేటకు చెందిన భూక్యా పవన్ ఇటీవలే ఓ ప్రమాదంలో చనిపోయారు. ఈ సందర్భంగా ఆ కుటుంబానికి జెపీఆర్ ట్రస్ట్ ఆధ్వర్యంలో గురువారం నిత్యావసర సరుకులు ఎస్సై జీవన్ రాజు చేతుల మీదుగా పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో జెపిఆర్ ట్రస్ట్ వ్యవస్థాపకులు ఇడుపుల రాజు, ఏఎస్ఐ కె.కోటేశ్వరరావు, కానిస్టేబుల్ కె.దయానంద్, కానిస్టేబుల్ భూక్యా రవి, హోంగార్డు నరేందర్ రెడ్డి, గార్లపాటి గణేష్ తదితరులు పాల్గొన్నారు.



ఏజెన్సీలో జీవో నెంబర్ 3 ప్రకారం బదిలీలు చేపట్టాలి

నవతెలంగాణ-టేకులపల్లి

రాష్ట్రంలో ఏజెన్సీ జీవో నెంబర్ 3 ప్రకారం పదోన్నతులు బదిలీలు చేపట్టాలని టీఎస్ టీటీఎఫ్ సంఘం నాయకులు ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తున్నట్లు గురువారం తెలిపారు. మండల కేంద్రంలో టీఎస్ టీటీఎఫ్ వ్యవస్థాపకుడు లక్ష్మణ్ నాయక్ గృహంలో ఆ సంఘం మండల కమిటీ సమావేశం మండల అధ్యక్షులు బి.ఫుల్ సింగ్ అధ్యక్షతన గురువారం నిర్వహించినట్లు తెలిపారు. లక్ష్మణ్ నాయక్ మాట్లాడారు. పెండింగ్ డీఏలు విడుదల చెయ్యాలని, సీపీఎస్‌ను రద్దు చెయ్యాలని, పెండింగ్ బిల్లులు వెంటనే విడుదల చెయ్యాలని, కేజీబీవీ పాఠశాలల సిబ్బంది జీతాలు విడుదల చెయ్యాలని, పాఠశాలలలో మౌళిక సదుపాయాలు కల్పించాలని ప్రభుత్వాన్ని కోరారు. ఈ సమావేశంలో జిల్లా అధ్యక్షులు భూక్యా శంకర్ నాయక్, జిల్లా ప్రధాన కార్యదర్శి వాంకుడోత్ రమేష్ బాబు, వర్కింగ్ ప్రెసిడెంట్ జి.బన్సీలాల్, జిల్లా కోశాధికారి ఎం.బాలు, జిల్లా నాయకులు, యుగేందర్, రమేష్, మంగీలాల్, మండల ప్రధాన కార్యదర్శి టి.రాంకిషన్, కార్యదర్శులు ఎల్.లక్ష్మణ్, బాలాజీ, గోర్య, సురేష్, తదితరులు పాల్గొన్నారు.

మినీ అంగన్వాడీల నుంచి డబ్బులు వసూలు చేస్తే క్రిమినల్ కేసులు

- జిల్లా సంక్షేమ అధికారిణి వేల్పుల విజేత



నవతెలంగాణ-పాల్వంచ

మినీ అంగన్వాడీల నుంచి డబ్బులు వసూలు చేస్తే శాఖ పరమైన చర్యలు, క్రిమినల్ కేసులు నమోదు చేస్తామని జిల్లా సంక్షేమ అధికారిణి వేల్పుల విజేత గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా మినీ అంగన్వాడీలను మెయిన్ అంగన్వాడీలుగా అప్ గ్రేడ్ చేసిన విషయం విదితమే. నేటి జనాభా పెరుగుదలను, కుటుంబాల పెరుగుదలను అనుసరించి, మినీ అంగన్వాడీలు పిల్లలకు పౌష్టికాహారం అందజేతతో పాటుగా ప్రీస్కూల్ ఎడ్యుకేషన్ కూడా అందించాల్సిన బాధ్యత ఉంది కాబట్టి వారు చేసే సేవలో ఉన్న కష్టాన్ని గుర్తించిన ప్రభుత్వం మినీ అంగన్వాడీల నుంచి మెయిన్ అంగన్వాడీలుగా అప్ గ్రేడ్ చేస్తూ వేతనాలను కూడా పెంపు చేసినట్లు చెప్పారు. ఇది ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా తీసుకున్న చర్య. దీనివలన మన భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో 626 మినీ అంగన్వాడీలు మెయిన్ అంగన్వాడీలుగా మారాయి. దీనికి సంబంధించిన ఉత్తర్వులు కూడా మన శాసనసభ్యులు, కలెక్టర్ సమక్షంలో జిల్లా సంక్షేమ అధికారిణి జిల్లా వ్యాప్తంగా ఉన్న మినీ అంగన్వాడీ టీచర్‌లకు అందజేశారు. అయితే కొందరు దళారులు మేమే ఈ పని చేయించామంటూ మేము చేయటం వల్లే మీకు ఈ ప్రమోషన్స్ వచ్చాయంటూ మినీ అంగన్వాడీల నుంచి డబ్బులు వసూలు చేస్తున్నారని పలు ఆరోపణలు వస్తున్నాయి. ఈ నేపథ్యంలో ఏ అంగన్వాడీ కార్యకర్త కూడా ఎటువంటి దళారులకు, వ్యక్తులకు ఎటువంటి పైకం ఇవ్వరాదని, ఇది మీ కష్టాన్ని గుర్తించి ప్రభుత్వం మీకు ఇచ్చిన కానుక అని, ఆమె ఒక ప్రకటనలో తెలియచేశారు. ఒకవేళ ఎవరైనా డబ్బులు అడిగినట్లు సమాచారం ఉంటే ఆధారాలతో 8639969322 నంబర్‌కు ఫిర్యాదు చేయాలని ఆమె తెలియచేశారు.

ప్రజలకు సేవ చేసే భాగ్యం లభించడం అదృష్టం

- జిల్లా కోఆపరేటివ్ మార్కెటింగ్ సొసైటీ చైర్మెన్ కొత్వాల



నవతెలంగాణ-పాల్వంచ

ప్రజాప్రతినిధులకు ఐదేళ్లపాటు ప్రజలకు సేవ చేసే భాగ్యం లభించడం అదృష్టమని జిల్లా కోఆపరేటివ్ మార్కెటింగ్ సొసైటీ చైర్మెన్ కొత్వాల శ్రీనివాసరావు అన్నారు. జగన్నాధపురం సర్పంచ్ బానోత్ అనితతో పాటు పాలకవర్గం పదవి కాలం గురువారంతో ముగుస్తున్న సందర్భంగా గ్రామ అభివృద్ధి కమిటీ ఆధ్వర్యంలో సన్మానించారు. సన్మాన సభలో కొత్వాల పాల్గొన్నారు. ఈ సందర్భంగా కొత్వాల మాట్లాడుతూ ప్రజలచే ఎన్నుకోబడి ప్రజాప్రతినిధులుగా వున్న శాసనసభ్యులు కానీ, పార్లమెంట్ సభ్యులు కానీ, సర్పంచ్‌లు, జడ్పీటీసీలు, ఎంపీటీసీలు, సొసైటీ చైర్మెన్‌లకు ఐదేళ్ల ప్రజాసేవ చేసే భాగ్యం లభిస్తుందన్నారు. ప్రజలకు అందుబాటులో వుంటూ వారి సమస్యల పరిష్కారంలో ముందుండాలన్నారు. గ్రామాల అభివృద్ధి సర్పంచ్‌లకే సాధ్యం అని కొత్వాల అన్నారు.

కొత్వాలకు ఘన సన్మానం

ఈ సందర్భంగా జగన్నాధపురం గ్రామ అభివృద్ధి కమిటీ ఆధ్వర్యంలో ప్రజాప్రతినిధులు, గ్రామ పెద్దలు కొత్వాలను శాలువా కప్పి, బొకేలు ఇచ్చి ఘనంగా సన్మానించారు.

ఈ కార్యక్రమంలో మండల విద్యాధికారి శ్రీరామూర్తి, జగన్నాధపురం సర్పంచ్ బానోత్ అనిత, ఎంపీటీసీ మూడు ఉషారాణి, కార్యదర్శి సాయిరాం, మాజీ కార్యదర్శి రుక్మిణి, మండల కాంగ్రెస్ అధ్యక్షులు కోండం వెంకన్న, మాజీ జడ్పిటిసి సభ్యులు యర్రంశెట్టి ముత్తయ్య, మాలోత్ నందానాయక్, హెడ్ మాస్టర్ రమాదేవి, కాంగ్రెస్ నాయకులు బాలినేని నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

ధర్మకర్తల మండలికి దరఖాస్తు చేసుకోండి

నవతెలంగాణ-ఇల్లందు

శ్రీ హరిహర క్షేత్రం నూతన ధర్మకర్తల మండలికి ఆసక్తి గల వ్యక్తులు దరఖాస్తు చేసుకోవాలని కమిషనర్ దేవదాయ ధర్మదాయ శాఖ హైదరాబాద్ వారు ప్రకటించారని ఆలయ కార్యనిర్వహణ అధికారి బి.సూర్యప్రకాష్ రావు ప్రకటనలో తెలిపారు. వివరాలకు సహాయ కమిషనర్ దేవాదాయ ధర్మాదాయ శాఖ కాల్వ ఒడ్డు ఖమ్మం వారి కార్యాలయంలో సంప్రదించాలని కోరారు.

టాస్క్ ఫోర్స్ దాడుల్లో వేల కలప పట్టివేత

నవతెలంగాణ-దుమ్ముగూడెం

దుమ్ముగూడెం అటవీ రేంజ్ పరిధిలోని కొత్త జిన్నేలగూడెం, చిన్న నల్లబెల్లి గ్రామాలలో అక్రమంగా నిల్వ ఉంచిన, ట్రాలీ ఆటోలో సరఫరా చేస్తున్న సుమారు రూ.3 లక్షల 18 వేల విలువ చేసే అక్రమ టేకు కలపను టాస్క్ ఫోర్స్ అధికారులు శుక్రవారం స్వాధీన పరుచుకున్నారు. గురువారం రాత్రి నమ్మదగిన సమాచారంతో టాస్క్ ఫోర్స్ రేంజ్ అధికారి ప్రసాద్ నేతృత్వంలో కొత్త జిన్నేలగూడెం గ్రామంలో అక్రమంగా నిల్వ ఉంచిన 18 టేకు దిమ్మలతో పాటు, ట్రాలీలో తరలిస్తున్న మూడు టేకు దిమ్మలను ఆయన స్వాధీనపరుచుకున్నారు. వీటి విలువ సుమారు రూ.3 లక్షల 18 వేలు ఉంటుందని ఆయన తెలిపారు. టాస్క్ ఫోర్స్ దాడుల్లో రేంజ్ అధికారి కనకమ్మ, డిఆర్ఓ శోభనాయక్, ఎఫ్ఎస్ఓ కోటేశ్వరరావు, సిబ్బంది వీర్రాజు రాములు రాఘవ బాబురావు తదితరులు పాల్గొన్నారు.

ఎన్నికలలో లబ్ది పొందేందుకే మధ్యంతర బడ్జెట్

- సీపీఐ(ఎం) జిల్లా కమిటీ సభ్యులు అబ్దుల్ నబి

నవతెలంగాణ-ఇల్లందు



కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన మధ్యంతర బడ్జెట్ పార్లమెంట్ ఎన్నికలను దృష్టితో పెట్టినదే తప్ప బడుగు బలహీన వర్గాలకు గిరిజన, దళిత, మైనారిటీ, వెనకబడిన తరగతుల ప్రజానీకానికి, మధ్యతరగతి ప్రజలకు నిరాశ పర్చే విధంగా ఉన్న బడ్జెట్ అని సీపీఐ(ఎం) జిల్లా కమిటీ సభ్యులు అబ్దుల్ నబి అన్నారు. ఈ మధ్యంతర (తత్కాలిత) బడ్జెట్ పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో పెట్టినదే అని దీని కాలపరిమితి నాలుగు నెలలు ఎన్నికల అనంతరం కొత్త ప్రభుత్వం పూర్తి బడ్జెట్ పార్లమెంట్‌లో ప్రవేశ పెడుతుందని ఆయన అన్నారు. ఈ తాత్కాలిక బడ్జెట్‌ను ప్రధాని నరేంద్ర మోడీ, ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్‌ను పొగడడం విడ్డూరంగా ఉందన్నారు. ప్రతీ అంశాన్ని ఎన్నికలలో లబ్ది పొందేందుకు మసిబూసి మారేడు కాయ చేసే విధంగా ఉన్నదని ప్రజలు వాస్తవాలను గ్రహించాలని ఆయన అన్నారు.

శాలివాహన సంఘం నూతన కమిటీ ఎన్నిక

నవతెలంగాణ-మణుగూరు

మణుగూరు మండల శాలివాహన (కుమ్మర్ల సంఘం) సంఘం నూతన కమిటీని ఆదివారం ఎన్నుకున్నారు. గౌరవ అధ్యక్షులుగా నిమ్మనగోటి భిక్షపతి, మండల అధ్యక్షులుగా నిమ్మనగోటి శ్రీనివాస్, ప్రధాన కార్యదర్శిగా నాంపల్లి కార్తీక్, మండల యూత్ అధ్యక్షులుగా సంగెం గణేష్, ప్రధాన కార్యదర్శిగా చిలువేరు వెంకటేష్, ట్రజరర్ నిమ్మనగోటి పుల్లారావును ఎకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ కార్యక్రమంలో బొడ్డుపల్లి చంద్రమౌళి, కే.తిరుపతి, జి.భద్రయ్య, సందీప్, నిమ్మనగోటి పుల్లారావు, ఉపెందర్ తదితరులు పాల్గొన్నారు.

రేషన్ కార్డు ఈకేవైసీకి 29 వరకు గడువు

- తహసీల్దార్ వీర భద్ర ప్రసాద్

నవతెలంగాణ-పినపాక



ఆహార భద్రత కార్డుదారులు ఫిబ్రవరి 29 లోపు సంబంధిత చౌక ధరల దుకాణాలకు వెళ్లి ఈ కేవైసీ పూర్తి చేసుకోవాలని తహసీల్దార్ వీర భద్ర ప్రసాద్ తెలిపారు. గురువారం ఆయన తహసీల్దార్ కార్యాలయంలో మాట్లాడారు. ప్రతి రేషన్ షాప్‌లో ఈ కేవైసీ కోసం తగిన ఏర్పాట్లు చేసినట్లు తెలియజేశారు. అదేవిధంగా ఎమ్మెల్సీ ఓటుకు సైతం దరఖాస్తు చేసుకొని వారు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ఈ నెల ఆరవ తేదీ వరకు దరఖాస్తు చేసుకోవడానికి అవకాశం ఉందని తెలిపారు.



సీపీఎస్ విధానాన్ని రద్దు చేయాలి

నవతెలంగాణ-ఇల్లందు

అన్ని మేనేజ్మెంట్ల ఉపాధ్యాయుల బదిలీలను, పదోన్నతులను వెంటనే చేపట్టాలని జిల్లా కార్యదర్శి పి.జయరాజు ప్రభుత్వానికి కోరారు. మండల అధ్యక్షులు ఎ.రాంబాబు అధ్యక్షతన ఏర్పాటు చేసిన మండల కమిటీ సమావేశంలో వారు మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ మేనిఫెస్టోలో ప్రకటించినట్లు ఉపాధ్యాయ, విద్యారంగ సమస్యల పరిష్కారం పట్ల ప్రత్యేక చొరవ తీసుకోవాలని అన్నారు. సీపీఎస్ విధానాన్ని రద్దు చేయాలని, 317 జీఓ ద్వారా నష్టపోయిన ఉపాధ్యాయులకు స్థానిక జిల్లాలో సూపర్ న్యూమరీ పోస్టుల ద్వారా వారి సొంత జిల్లాలకు బదిలీ చేయాలని కోరారు. పెండింగ్‌లో ఉన్న 3 డీఏలను వెంటనే మంజూరు చేయాలన్నారు. ఈ సమావేశంలో ఎఫ్డబ్ల్యూఎఫ్ కన్వీనర్ కె.శేషగిరి కార్యదర్శులు పి.మాధవి, ఎ.రాందాస్ జి.లింగ, ప్రభుసింగ్, బి.సంతోష్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.



సర్పంచులకు ఆత్మీయ సత్కారం

నవతెలంగాణ-పినపాక

ఐదేండ్ల పదవీ కాలం పూర్తి చేసుకున్న 23 గ్రామ పంచాయతీల సర్పంచులకు ఆత్మీయ సన్మానం రైతు వేదిక హాల్‌లో సర్పంచులు, ఎంపీటీసీలకు గురువారం సమావేశం నిర్వహించారు. అనంతరం సర్పంచులను ఘనంగా సత్కరించారు. పూలమాలలు, శాలువాలతో సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ గుమ్మడి గాంధీ మాట్లాడుతూ గ్రామ అభివృద్ధిలో సర్పంచ్ కీలక పాత్ర పోషించారని సర్పంచులను పలువురు కొనియాడారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో చంద్రశేఖర్, ఎంపీఓ వెంకటేశ్వరరావు, ఎంపీటీసీలు , ఉప సర్పంచులు, తదితరులు పాల్గొన్నారు.

మంజూరైన కరెంటు పోల్స్‌ను తక్షణమే ఏర్పాటు చేయాలి

- కౌన్సిలర్ వై. శ్రీనివాసరెడ్డి

నవతెలంగాణ-కొత్తగూడెం

కొత్తగూడెం మున్సిపల్ పరిధిలో మంజూరైన కరెంటు పోల్స్‌ను తక్షణమే ఏర్పాటు చేయాలని, శిథిలావస్థలో ఉన్న కరెంటు పోల్స్‌ను తక్షణమే తొలగించాలని 23వ వార్డు కౌన్సిలర్ వై. శ్రీనివాసరెడ్డి అన్నారు. గురువారం 23వ వార్డు కూలీ లైన్‌లో వివిధ కరెంటు పోల్స్ మీద డ్యామేజీ, పగిలిపోయి ప్రమాదంగా మారిన పింగాణి వాటిని తొలగించి కొత్తవి వేయించడం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మున్సిపాలిటీ ద్వారా ప్రతి వార్డుకి 15 కరెంటు పోల్స్ మంజూరు చేయటం జరిగిందని వాటిని తక్షణమే నిర్మించాలని, అదేవిధంగా వార్డులో డ్యామేజీ శిథిలావస్థలో ప్రమాదకరంగా ఉన్న కరెంటు పోల్స్ ను తక్షణమే తొలగించాలని, ప్రజలకు కరెంటు సమస్య రాకుండా లైట్లు పోయిన వెంటనే కొత్త లైట్లు వేయాలని, నాణ్యమైన విద్యుత్తును 24 గంటలు వచ్చే విధంగా తగిన జాగ్రత్తలు ఏర్పాట్లు చూడాలని విద్యుత్ అధికారులకు విజ్ఞప్తి చేశారు.

గంజాయి పట్టివేత....?

నవతెలంగాణ -కొత్తగూడెం

భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కేంద్రమైన కొత్తగూడెం సమీప ప్రాంతాల్లో టాస్క్ ఫోర్స్, ఎక్సైజ్, కొత్తగూడెం 3 టౌన్ పోలీసుల ఆధ్వర్యంలో సంయుక్తంగా గురువారం తనిఖీలు చేపట్టారు. చింతూరు ప్రాంతం నుంచి ఇల్లందు క్రాస్ రోడ్ వైపుకు వస్తున్న ఓ వాహనంలో భారీగా గంజాయి తరలిస్తున్నట్లు పోలీసులు అనుమానించారు. ఈ క్రమంలో ఆ వాహనాన్ని ఆపే క్రమంలో ఆ డ్రైవరు వేగాన్ని పెంచి పారిపోయేందుకు ఉపక్రమించాడు. దీంతో పోలీసులు చేజింగ్ చేస్తూ పట్టణంలోని గణేష్ టెంపుల్ ఏరియాలో అడ్డుకొని అదుపులోకి తీసుకున్నారు. ఉన్నతాధికారుల ఆదేశాల అనుసారం దర్యాప్తు చేసి పూర్తి వివరాలు వెల్లడిస్తామని పోలీసులు తెలిపారు.

ఐఎన్‌టియూసీ కొత్త కమిటీల రద్దు ప్రకటనలు అవాస్తవం

నవతెలంగాణ-కొత్తగూడెం



సింగరేణిలో గుర్తింపు కార్మిక సంఘం ఎన్నికలలో ఉమ్మడి ఖమ్మం జిల్లా నాలుగు ఏరియాలలో ఐఎన్‌టియూసీ కార్మిక సంఘం ఘనవిజయం సాధించింది. ఈ విజయంలో ఐఎన్‌టియూసీ పాత, కొత్త కార్మిక సంఘం నాయకులు, కార్యకర్తలు సమిష్టి కృషితో విజయకేతనం ఎగరవేశారు. కార్మిక సంఘాన్ని విజయ బావుటాలో కీలక భూమి పోషించిన ప్రతి ఒక్కరికి న్యాయం చేశామని. కొందరు వ్యక్తులు తమ స్వార్ధ ప్రయోజనాల కోసం కార్మిక సంఘాన్ని విచ్ఛిన్నం చేయడానికి చేస్తున్న వారి కుట్రలో భాగంగా కొత్తగా ప్రకటించిన కమిటీలను రద్దు చేస్తున్నట్టు అసత్య ప్రచారాలను పూర్తిగా ఖండిస్తున్నామని ఐఎన్‌టియూసీ నేషనల్ సెక్రెటరీ జనక్ ప్రసాద్ తెలిపారు. గురువారం ప్రకటనలో పేర్కొన్నారు. సింగరేణి సంస్థలో ఐఎన్‌టియూసీ కార్మిక సంఘాన్ని బలోపేతం చేయడానికి ప్రతి ఒక్క కార్మికుడు కృషి చేయాలన్నారు.

16న దేశ వ్యాప్త సమ్మె

- అధికారులకు సమ్మె నోటీస్ అందజేత

నవతెలంగాణ పాల్వంచ





కనీస వేతనం రూ.26 వేలు ఇవ్వాలని, మల్టీ పర్పస్ విధానం రద్దు, జీసీసీ హమాలీలను నాల్గవ తరగతి ఉద్యోగులుగా గుర్తించాలని సీఐటీయూ జిల్లా కార్యదర్శి ఏజే రమేష్ డిమాండ్ చేశారు. ఈ మేరకు గురువారం డిమాండ్ల సాధనకు ఫిబ్రవరి 16 దేశ వ్యాప్త సమ్మె నోటీస్‌లను జిల్లా సివిల్ సప్లయ్ జిల్లా మేనేజర్, జిల్లా గ్రామ పంచాయతీ అధికారికి అందజేశారు. గత పది సంవత్సరాలుగా కేంద్రంలో అధికారంలో ఉన్న మోడీ ప్రభుత్వం అనుసరిస్తున్న కార్మిక, రైతాంగ, వ్యవసాయ కార్మిక వ్యతిరేఖ విధానాలకు నిరసనగా 16న దేశ వ్యాప్త సమ్మె జరుగుతుందని, ఈ సమ్మెలో భాగంగా జిల్లా సివిల్ సప్లయ్ మేనేజర్, జిల్లా గ్రామ పంచాయతీ అధికారి సీఐటీయూ ఆధ్వర్యంలో సమ్మె నోటీసులను అందజేశారు. ఈ సందర్భంగా జిల్లా కార్యదర్శి ఎ.జె.రమేష్ మాట్లాడారు. సమ్మెలో రాష్ట్రంలో పని చేస్తున్న 40 వేల మంది గ్రామ పంచాయతీ కార్మికులు, ఐదు లక్షల మంది హామాలీలు పాల్గొంటున్నారని అన్నారు. జిల్లా సివిల్ సప్లయ్ మేనేజర్, జిల్లా గ్రామ పంచాయతీ అధికారికి సమ్మె నోటీసు ఇచ్చిన వారిలో సీఐటీయూ జిల్లా కార్యదర్శి ఎ.జె.రమేష్, కోశాధికారి జిలకర పద్మ, ఉపాధ్యక్షులు దొడ్డ రవి కుమార్, సహాయ కార్యదర్శి కె.సత్య, హమాలీ యూనియన్, గ్రామ పంచాయతీ కార్మికులు, ఉద్యోగుల యూనియన్ రాష్ట్ర, జిల్లా నాయకులు మొగిలి, గంటా శ్రీనివాసరావు, ఒరక రాఘవులు, శ్రీను, నరసింహారావు, దేవేందర్, సదానందం తదితరులు ఉన్నారు.

కొత్తగూడెం : 16న దేశవ్యాప్తంగా జరుగుతున్న సార్వత్రిక సమ్మెలో భాగంగా రైతులు గ్రామీణ బంద్ చేపట్టాలని సిపిఐ, సిపిఎం, న్యూ డెమోక్రసీ, ప్రజాపంథా పార్టీల అనుబంధ రైతు సంఘాలతో ఏర్పాటైన సంయుక్త కిసాన్ మోర్చా జిల్లా నాయకులు పిలుపు నిచ్చారు. గురువారం కొత్తగూడెం సిపిఐ జిల్లా కార్యాలయం శేషగిరిభవం నందు జరిగిన విలేకర్ల సమావేశంలో నాయకులు కాసాని ఐలయ్య, సలిగంటి శ్రీనివాస్, ముద్దా బిక్షం, అమర్లపూడి రాము, అన్నవరపు సత్యనారాయణ మాట్లాడారు. రైతాంగానికి సంబందించిన 18 డిమాండ్లు పేర్కొంటూ 16న జరిగే గ్రామీణ బందులో రైతాంగం పాల్గొని జయప్రదం చేయాలని పిలుపు నిచ్చారు. ఈ విలేకర్ల సమావేశంలో రైతు సంఘాల నాయకులు బుర్ర వెంకన్న, కొండబోయిన వెంకటేశ్వర్లు, కల్లూరి కిశోర్, నాయిని రాజు, బానోత్ ధర్మ తదితరులు పాల్గొన్నారు.

భద్రాచలం రూరల్ : నిర్మాణ రంగ కార్మికుల కోసం అనేక పోరాటాల ద్వారా సాధించుకున్న 1996 నిర్మాణ రంగ కార్మికుల చట్టాన్ని, 1979 వలస కార్మికుల సంక్షేమ చట్టాన్ని కేంద్ర బిజెపి ప్రభుత్వం రద్దు చేయటాన్ని నిరసిస్తూ ఫిబ్రవరి 16వ తేదీన దేశవ్యాప్తంగా నిర్మాణ రంగ కార్మికుల సమ్మె జరుగుతుందని ఈ సమ్మెను జయప్రదం చేయాలని సీఐటీయూ జిల్లా అధ్యక్షులు కే.బ్రహ్మాచారి, భద్రాచలం పట్టణ కన్వీనర్ ఎం.బి.నర్సారెడ్డి విజ్ఞప్తి చేశారు. సమ్మె సన్నాహక కార్యక్రమాల్లో భాగంగా భద్రాచలం పట్టణంలో పెయింటర్లు, కార్పెంటర్లు, మార్బుల్, టైల్స్ వర్కర్స్ జనరల్ బాడీ సమావేశాలు నిర్వహించారు. ఈ సమావేశంలో నాయకులు పాల్గొని మాట్లాడుతూ... దేశవ్యాప్తంగా 10 కోట్ల మంది, తెలంగాణ రాష్ట్రంలో 25 లక్షల మంది నిర్మాణ రంగంలో ఉపాధి అవకాశాలు పొందుతున్నారని, అంతటి కీలకమైన నిర్మాణరంగ కార్మికుల సంక్షేమాన్ని కేంద్ర ప్రభుత్వం విస్మరించటం అన్యాయమన్నారు. నిర్మాణ రంగంలో ఉపయోగించే ముడి సరుకు పై ఇష్టానుసారంగా విధించిన పనులను తగ్గించాలని డిమాండ్ చేశారు. ఈ జనరల్ బాడీ సమావేశాల్లో నిర్మాణరంగ కార్మికులు, సీఐటీయూ నాయకులు జాకీర్, చిన్నరాజు, అప్పారి రాము, మధు, చాట్ల శ్రీను, భాష, తదితరులు పాల్గొన్నారు.

అశ్వారావుపేట : పలు డిమాండ్లతో జరుగుతున్న ఫిబ్రవరి 16న గ్రామపంచాయతీ కార్మికులు సమ్మెలో పాల్గొనాలని సిఐటియు జిల్లా ఉపాధ్యక్షుడు పిట్టల అర్జున్ కోరారు. గ్రామపంచాయతీ కార్మికుల సమావేశం నరసింహారావు అధ్యక్షతన గురువారం స్థానిక గ్రామపంచాయతీ కార్యాలయం వద్దలో నిర్వహించారు. ఈ సందర్భంగా అర్జున్ మాట్లాడారు. ఆరు గ్యారెంటీల పథకంలో గ్రామపంచాయతీ కార్మికులకు తొలి ప్రాదాన్యత ఇవ్వాలని



కోరారు. ఈ కార్యక్రమంలో భూషణం, వరలక్ష్మి, రాణి, దుర్గమ్మ లక్ష్మీ స్వప్న, ఇందిరా తదితరులు పాల్గొన్నారు.

సమ్మె నోటీసును ఇచ్చిన సీఐటీయూ

ఇల్లందు : 16న జరిగే దేశవ్యాప్త సమ్మెకు సంబందించిన సమ్మె నోటీసును కార్మిక ఐసీడీఎస్ సెక్టార్, మండల విద్యాశాఖ అధికారులకు సీఐటీయూ ఆధ్వర్యంలో గురువారం సమ్మె నోటీసులు ఇచ్చారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ అబ్దుల్ నబి అంగన్వాడీ, మధ్యాహ్న భోజన కార్మిక యూనియన్‌ల నాయకులు ఈసం వెంకటమ్మ, సుల్తానా, కే.మరియ, ఎస్.కే.ఫాతిమా, రాంబాయి, సంధ్య, యాకమ్మ అరుణ, విజయ, తదితరులు పాల్గొన్నారు.

బిల్డింగ్ అండ్ అదర్ కన్స్ట్రక్షన్ వర్కర్స్ ఫెడరేషన్ (సీఐటీయూ) ఆధ్వర్యంలో

బిల్డింగ్ అండ్ అదర్ కన్స్ట్రక్షన్ వర్కర్స్ ఫెడరేషన్ (సిఐటియు) ఇల్లందు మండల కమిటీ ఆధ్వర్యంలో స్థానిక అసిస్టెంట్ లేబర్ కమిషనర్ ఆఫీసర్‌కు సమ్మె నోటీసు ఇచ్చారు. అనంతరం కామ నాగరాజు అధ్యక్షతన జరిగిన సమావేశంలో సీఐటీయూ జిల్లా సహాయ కార్యదర్శి అబ్దుల్ నబీ పాల్గొని మాట్లాడారు. ఈ కార్యక్రమంలో తాళ్లూరి కృష్ణ, వ్యవసాయ కార్మిక సంఘం నేత ఆలేటి కిరణ్ కుమార్, కామ నాగరాజు, పవన్ పాసి, వెంకన్న, దానియల్, రాములు, ఎస్.కృష్ణ, కష్ణ రాజు తదితరులు పాల్గొన్నారు.

జీఎంకు సమ్మె నోటీస్ అందజేసిన జేఏసీ

దేశవ్యాప్తంగా జరిగే గ్రామీణ, పారిశ్రామిక సమ్మెను విజయవంతం చేయాలని జేఏసీ నాయకులు ఎస్ఏ నబి, ఎండి నజీర్ షేక్ యాకుబ్ షావలి, వెంకటనారాయణ, కొండపల్లి శ్రీనివాస్ పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా సింగరేణి జీఎం జాన్ ఆనంద్‌కు సమ్మె నోటి అందజేసి, మాట్లాడారు. ఈ కార్యక్రమంలో జేఏసీ నాయకులు ఆలేటి కిరణ్, మూడు సంజు సయ్యద్, హమీద్ తదితరులు పాల్గొన్నారు.

బూర్గంపాడు : 16న దేశవ్యాప్త సమ్మెలో భవనిర్మాణ కార్మికులు పెద్ద సంఖ్యలో పాల్గొనాలని వ్యకాస జిల్లా ఉపాధ్యక్షులు బత్తుల వెంకటేశ్వర్లు అన్నారు. గురువారం ప్రజా సంఘాల మీటింగ్ సారపాక సీపీఐ(ఎం) కార్యాలయంలో నిర్వహించారు. ఈ సందర్భంగా బత్తుల మాట్లాడారు. అలాగే గ్రామీణ బందును విజయ వంతం చేయాలన్నారు. ఈ జనరల్ బాడీ సమావేశం సెగెం శ్రీనివాసరావు అధ్యక్షతన జరిగింది. ఈ కార్యక్రమంలో టి.మల్లయ్య, ఎస్.వెంకన్న, ఓర్సుపండు, బి.బిక్షు మంచ పెరిగి స్వామి, వీరన్న, ప్రేమ్ తదితరులు పాల్గొన్నారు.

అన్నపురెడ్డిపల్లి : సమ్మెను విజయవంతం చేయాలని జిల్లా కమిటీ సభ్యులు నరసింహారావు అన్నారు. మండల పరిధిలోని యర్రగుంట గ్రామంలో తాపీ యూనియన్ నాయకులు కృష్ణ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన సమావేశంలో నరసింహారావు మాట్లాడారు. ఈ కార్యక్రమంలో వ్యకాస మండల నాయుకులు జంగిలి వెంకటరత్నం, ఆశవర్కర్లు మండల నాయుకురాలు విజయలక్ష్మి, తదితరులు పాల్గొన్నారు.



ప్రజా పాలకులకు ఘనంగా వీడ్కోలు

- సన్మానించిన సింగారం ప్రజలు

నవతెలంగాణ-మణుగూరు

ఐదేండ్ల పాటు సమితి సింగారం గ్రామపంచాయతీ పరిపాలించిన సర్పంచ్ బచ్చల భారతి, ఉప సర్పంచ్ పుచ్చకాయలశంకర్, వార్డు సభ్యులకు పౌర సన్మానం గురువారం ఘనంగా నిర్వహించారు. మణుగూరు మండల పరిధిలోని సమితి సింగారం గ్రామ పంచాయతీ పాలక వర్గం పదవి కాలం పూర్తి చేసుకున్న సందర్భంగా వారికి, పాలక వర్గ సభ్యులకు గ్రామ పంచాయతీ ప్రజలు, పంచాయతీ కార్యాలయ ఆవరణలో వారిని ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా సమితి సింగారం సర్పంచ్ బచ్చల భారతి, ఉపసర్పంచ్ పుచ్చకాయల శంకర్, ఎంపీడీవో చంద్రమౌళి, ఎంపీఓ పల్నాటి వెంకటేశ్వరరావులు మాట్లాడారు. సమతి సింగారం గ్రామపంచాయతీ ఈ పాలకవర్గంతో మరింత అభివృద్ధి చెందిందని ప్రతి వీధిలో సీసీ రోడ్లు నిర్మాణం జరిగాయని తెలిపారు. సమస్యలు పరిష్కారం చేసి గ్రామాన్ని అన్నివిధాలుగా అభివృద్ధి పథంలో నడిపినందుకు ప్రజలు సర్పంచ్‌కు ధన్యవాధములు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో వార్డు సభ్యులు చెన్నకేశవులు, వెంకట సోములు, తాత మాధవి, స్రవంతి, ప్రవీణ్, సౌజన్య, పాల్గొన్నారు.

పత్రిక సజీవమైనది...శాశ్వతమైనది

ప్రజా చైతన్యం కోసమే 'నవతెలంగాణ'

- సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శి కనకయ్య

నవతెలంగాణ-కొత్తగూడెం



కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అనుసరిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలను ఎండగట్టడంలో సోషల్ మీడియా ఎలాంటి పాత్ర వహించినా దిన పత్రికలు మాత్రం తన పూర్తి బాధ్యత నిర్వర్తించాలని, పత్రిక అనేది సజీవమైనదని, శాశ్వతమైనదని, ఇందులో సామాన్య ప్రజల్లో చైతన్యాన్ని తీసుకువచ్చే విధంగా నవతెలంగాణ చేస్తున్న కృషి అమోఘమని సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శి అన్నవరపు కనకయ్య అన్నారు. గురువారం భద్రాద్రి కొత్తగూడెం జిల్లా నవతెలంగాణ విలేకరుల వర్క్‌షాప్ స్థానిక మంచిగంటి భవన్‌లో జరిగింది. ఈ సమావేశానికి హాజరైన అన్నవరపు కనకయ్య మాట్లాడుతూ తెలంగాణలో నూతనంగా ఏర్పడ్డ కాంగ్రెస్ ప్రభుత్వ వైఖరిలో పత్రికల పట్ల సానుకూలత ఉన్నట్టు కనిపిస్తుందన్నారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వం పత్రికల గొంతులను అనుచివేసే ధోరణి ఆలంబించింన విషయాన్ని గుర్తుచేశారు. పత్రికలు స్వేచ్ఛగా అన్యాయాలను ఎండగట్టిన నాడే ప్రజాస్వామ్యం నిలబడుతుందని, ప్రజాస్వామ్యాన్ని కొనసాగించాల్సిన బాధ్యత పత్రికలపై ఉందన్నారు. ప్రతి అక్షరం ప్రజల పక్షం నినాదంతో నవతెలంగాణ పత్రిక చేస్తున్న కృషి అభినందనీయమన్నారు. కేంద్రంలో బిజెపి తొమ్మిద్దిన్నర సంవత్సరాల కాలంలో మీడియాను నిర్వీర్యం చేసిందని, మీడియా మీద ఆధిపత్యం చేసి ఆర్ఎస్ఎస్ భావజాలం ప్రజల్లోకి తీసుకువెళ్లిందన్నారు. నిరంతరం అబద్ధపు ప్రచారాలతో ప్రజలను అయోమయంలో నెట్టివేసిందన్నారు. బీజేపి ప్రభుత్వం అయోధ్యలో బాలరాముడి పేరుతో దేశవ్యాప్తంగా చేసిన హడావుడిని ఖండించారు. ఇంటింటికి హిందువు ముసుగులో ఆర్ఎస్ఎస్ భావజాలం వ్యాప్తి చేస్తుందని మండిపడ్డారు. మేధావులు, మీడియాపై బిజెపి ఉక్కు పాదం మోపి లొంగుబాటు చేసుకుంటుందని, ఎదిరించిన వారిపై దాడి చేసి అక్రమకేసులు పెట్టి జైలుకు పంపిస్తున్న విషయాన్ని గుర్తు చేశారు. దేశవ్యాప్తంగా రానున్న ఎన్నికల్లో పత్రికలు తమ స్వేచ్ఛను కొనసాగించుకుని కేంద్ర ప్రభుత్వం అనుసరిస్తున్న ఆర్ఎస్ఎస్ వావిజలాన్ని వ్యతిరేకిస్తూ ప్రజల్లో చైతన్యం తేవాలని పిలుపు నిచ్చారు. నవతెలంగాణ కొత్తగూడెం ఇంచార్జ్ దాసరి వెంకటేశ్వరరావు (డివి) అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో నవతెలంగాణ ఖమ్మం రీజియన్ మేనేజర్ ఎస్‌డి.జావిద్, డెస్క్ ఇంచార్జ్ బి.వీరేష్, ఖమ్మం జిల్లా సర్కులేషన్ ఇన్‌చార్జ్ ఇ.వెంకటేశ్వర్లు (ఇవి) భద్రాద్రచలం, కొత్తగూడెం ఎడివిటీ ఇన్‌చార్జిలు, జిల్లాలోని అన్ని మండలాల విలేకరులు తదితరులు పాల్గొన్నారు.

మా వార్డుపై కొంచెం జాలి చూపించండి

- 16 వార్డు కౌన్సిలర్ మాచర్ల రాజకుమారి

నవతెంలగాణ-కొత్తగూడెం



కొత్తగూడెం మున్సిపల్ పరిధిలో గతంలో శంఖుస్థాపనలు చేసిన అభివృద్ధి కార్యక్రమాలు నిర్మాణాలకు నోచుకోలేక పోతున్నాయి. ఏండ్లు గడుస్తున్నప్పటికీ శంఖుస్థాపన శిలాఫలకాలు ఎక్కిరిస్తున్నాయని తెలుస్తుంది. కొత్తగూడెం మున్సిపల్ పరిధిలోని గొల్లగూడెం 16వ వార్డు హిందూ స్మశాన వాటిక పరిస్థితి ఇదే విధంగా ఉందని తెలుస్తుంది. గత 3 సంవత్సరాల క్రితం బీఆర్ఎస్ ప్రభుత్వ హయాయంలో శంఖుస్థాపనలు చేసిన పనులు ముందుకు సాగడం లేదు. ఈ విషయంలో అధికారులు ఎందుకు స్పందించడంలేదని వార్డు కౌన్సిలర్, ప్రజలు ప్రశ్నిస్తున్నారు. హిందు స్మశాన వాటిక అభివృద్ధికి శిలా ఫలకం వేశారు. నేటికి అభివృద్ధికి నోచుకోలేదు. స్మశాన వాటికలో కనీస వసతులు టాయిలెట్సు, కనీసం సమాధి అయ్యాక స్నానాలు చేయడానికి మంచినీటి సౌకర్యం, పిండ ప్రదానం చేయడానికి సరైన షెడ్స్‌కూడా లేకుండా పోయాయి. దీంతో ప్రజలు ఇబ్బందులు పడుతూ ఖర్మకాండలు బహిరంగ ప్రదేశంలో చేస్తున్నారు. ఇప్పటికైనా కలెక్టర్ ఈ విషయంలో సానుకూలంగా స్పందించాలని వార్డు కౌన్సిర్ మాచర్ల రాజకుమారి కోరుతున్నారు. వెంటనే వార్డులో ఉన్న హిందూ స్మశాన వాటికను అందులో ఉన్న ఇబ్బందులను గుర్తించి వెంటనే సౌకర్యాలు ఏర్పాటు చేయాలని వార్డు ప్రజల తరపున కోరుతున్నారు.

రేపు బీఆర్ఎస్ నియోజకవర్గ స్థాయి సమావేశం

నవతెలంగాణ-భద్రాచలం రూరల్



ఈ నెల 3వ తేదీన మహబూబాద్ పార్లమెంట్ పరిధిలోని భద్రాచలం అసెంబ్లీ నియోజకవర్గ విస్తృతస్థాయి సమావేశం భద్రాచలం శాసనసభ్యులు డాక్టర్ తెల్లం వెంకట్రావు అధ్యక్షతన జరుగుతుందని నియోజకవర్గంలో ఉన్న బీఆర్ఎస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, ప్రజా ప్రతినిధులు అధిక సంఖ్యలో పాల్గొని సమావేశాన్ని జయప్రదం చేయాలని బీఆర్ఎస్ పార్టీ నియోజకవర్గ నాయకులు రావులపల్లి రాంప్రసాద్ పిలుపునిచ్చారు. గురువారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. రాబోయే పార్లమెంట్ ఎన్నికల్లో నాయకత్వం కార్యకర్తలు ఏ విధంగా ముందుకు వెళ్లాలో రాష్ట్ర స్థాయి నాయకులు కార్యకర్తలకు వివరిస్తారని అన్నారు. ఈ కార్యక్రమంలో భద్రాచలం మండల అధ్యక్షులు అరికెళ్ల తిరుపతిరావు, ఆకోజు సునీల్ కుమార్, తాండ్ర నరసింహారావు, కోటగిరి ప్రబోధ్ కుమార్, కోలా రాజు, డానియల్ ప్రదీప్, కాపుల నవీన్న, తదితరులు పాల్గొన్నారు.

పినపాక : 3న మణుగూరులో నిర్వహించే నియోజకవర్గస్థాయి పార్లమెంటరీ సమావేశాన్ని జయప్రదం చేయాలని బీఆర్ఎస్ పినపాక మండల అధ్యక్షులు సతీష్ రెడ్డి పిలుపునిచ్చారు. ఏడూళ్ల బయ్యారం క్రాస్ రోడ్‌లో గల బీఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో గురువారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ కార్యక్రమానికి మాజీ మంత్రి వర్యులు, ప్రస్తుత సిద్ధిపేట ఎమ్మెల్యే హరీష్ రావు, భద్రాద్రి కొత్తగూడెం జిల్లా బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షుడు రేగా కాంతారావు రానున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ గుమ్మడిగాంధీ, ఎంపీటీసీ చింతపంటి సత్యం, ఆత్మకమిటీ చైర్మెన్ పటేల్ భద్రయ్య, బీఆర్ఎస్ పార్టీ మండల వైస్ ప్రెసిడెంట్ కటకం గణేష్ తదితరులు పాల్గొన్నారు.

కరకగూడెం : 3న జరిగే బీఆర్ఎస్ సన్నాక సమావేశాన్ని జయప్రదం చేయాలని బీఆర్ఎస్ నాయకులు తెలిపారు. గురువారం మండల బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు రావుల సోమయ్య ఆధ్వర్యంలో ముఖ్య కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో ప్రధాన కార్యదర్శి బుడగం రాము, ఉపాధ్యక్షులు పోగు వెంకటేశ్వర్లు, సీనియర్ నాయకులు కొంపెల్లి పెదరామలింగం, బూర్గంపాడు మార్కెట్ కమిటీ వైస్ చైర్మెన్ కొమరం రాంబాబు, సాంబశివరావు బైరిశెట్టి చిరంజీవి, సతీష్, నరసింహారావు, ప్రవీణ్, ఎలాగొండ వెంకటేశ్వర్లు, సునీల్ తదితరులు పాల్గొన్నారు.



ప్రజా పాలకులకు సన్మానం

నవతెలంగాణ-అన్నపురెడ్డిపల్లి

పంచాయతీ పాలన 5 ఏండ్లు పూర్తి కావడం పరిపాలన ముగియడంతో గ్రామ మాజీ సర్పంచ్, వార్డు సభ్యులు, రైతు సమన్వయ సమితి మండల కో ఆర్డినేటర్‌కి సన్మానం చేశారు. బుధవారంతో పంచాయతీ పాలన అయి పోవడంతో మండల పరిధిలోని నర్సాపురం గ్రామ పంచాయతీ కార్యదర్శి విజయలక్ష్మి పంచాయతీ కార్యాలయంలో మాజీ సర్పంచ్ రాములు, వార్డు సభ్యులు రాఘవులు, శ్రీనివాసరెడ్డి, రాధ, కృష్ణకుమారి, సైదమ్మకు మాజీ రైతు సమన్వయ కమిటీ మండల కో ఆర్డినేటర్ భీమిరెడ్డి శ్రీనివాసరెడ్డికి ఎంపీడీఓ అన్నపూర్ణ ఆధ్వర్యంలో శాలువాలతో సన్మానించారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

నవతెలంగాణ-ఇల్లందు

11కేవి ఇల్లందు టౌన్ ఫీడర్‌లో మరమ్మతులు నిర్వహించనున్నందున ఉదయం 8గంటల నుండి మధ్యాహ్నం 2:30గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిచిపోనుందని ఏఈ రాము గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. వడ్డెర బజారు, ఇందిరా నగర్, సంజయ్ నగర్, గవర్నమెంట్ హాస్పిటల్, 2 నెం.బస్తీ, సీతారామ టాకీస్ వెనక, కాళిమెయిల్ బస్తీ, పోలీస్ స్టేషన్, శివాలయం, ఆం బజారు ఏరియాలలో విద్యుత్ సరఫరా నిలిచిపోనుంది.

అశ్వారావుపేట ప్రత్యేక అధికారిగా డీపీఓ రాజీవ్ కుమార్

- మూడు పంచాయితీలకు ఒక్కో ప్రత్యేక అధికారి నియామకం

నవతెలంగాణ-అశ్వారావుపేట

స్థానిక పాలక వర్గాల పాలనా కాలం మంగళవారం తో ముగియడంతో ప్రభుత్వం పంచాయితీలకు ప్రత్యేక అధికారులను నియమించింది.మేజర్ పంచాయితీలకు జిల్లా స్థాయి అధికారులను, ఓ మోస్తరు జనాభా ఉన్న పంచాయితీలకు డివిజన్ స్థాయి అధికారులను, చిన్న పంచాయితీలకు మండల స్థాయి అధికారులను నియమించింది. అశ్వారావుపేట మండలంలో మొత్తం 30 పంచాయితీలకు గాను మూడు పంచాయితీలకు ఒక్కో అధికారిని కేటాయించారు. నియోజక వర్గం కేంద్రం,మండల కేంద్రం అయిన మేజర్ పంచాయితీకి జిల్లా పంచాయితీ అధికారి రాజీవ్ కుమార్ ను నియమించారు. ఐటిడిఎ డీఈ ఎం.రామిరెడ్డి అనంతారం, గాండ్ల గూడెం, మల్లాయిగూడెంలకు ప్రత్యేక అధికారిగా వ్యవహరించనున్నారు. ఎఫ్ఆర్ఓ మురళి కి వేదాంతపురం,రామన్నగూడెం కేటాయించారు. తహశీల్దార్ క్రిష్ణ ప్రసాద్‌కు పేరాయిగూడెం, నారంవారిగూడెంకాలనీ, ఎంపిడీఓ శ్రీనివాసరావుకు వినాయకపురం, కొత్త మామిళ్ళ వారి గూడెం, ఊట్లపల్లి, ఎంపిఓ పి.సీతారామరాజుకు ఆసుపాక, నారాయణపురం, నారంవారిగూడెం, డిటి రేనా సుచిత్రకు, గుర్రాల చెరువు, పాతఅల్లి గూడెం, వ్యవసాయాధికారి వై.నవీన్‌కు బచ్చువారి గూడెం, గుమ్మడవల్లి, కోయ రంగాపురం, మిషన్ భగీరథ ఇంట్రా ఎ.ఇ లక్ష్మి కి అచ్యుతాపురం, మద్దికొండ, ఐబిఎఇకెఎన్ బి. క్రిష్ణకు పాత రెడ్డిగూడెం, తిరుమలకుంట, ఉద్యాన శాఖ అధికారి సందీప్‌కు కన్నాయిగూడెం, కావడి గుండ్ల, నయాబ్ తహశీల్దార్ సిహెచ్. రామక్రిష్ణకు జమ్మిగూడెం, కేసప్పగూడెం, పశుసంవర్ధక శాఖ వైద్యురాలు స్వప్నకు మొద్దులు మడ, నందిపాడు, దిబ్బగూడెం పంచాయితీలు కేటాయిస్తూ స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ ఉత్తర్వులు జారీ చేశారు.

పల్లె నుండి స్టాఫ్ నర్స్

నవతెలంగాణ-అన్నపురెడ్డిపల్లి



పోటీ ప్రపంచంలో పట్టు విడకుండా పల్లె నుండి వెళ్ళి అనుకున్న లక్ష్యాన్ని చేరుకొని స్టాఫ్ నర్స్ ఉద్యోగాన్ని సాధించి ఏకంగా రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి చేతులు మీదగా ఉద్యోగ నియామక పత్రం అందుకున్నది గౌతమి. మండల పరిధిలోని రాజపురం గ్రామానికి చెందిన గౌతమి స్టాఫ్ నర్స్ నియామక పరీక్షల్లో ఉన్నత శ్రేణిలో ఉత్తీర్ణురాలు అయి హైద్రాబాద్‌లో ఏర్పాటు చేసిన బహిరంగ సభలో ఆమె నియామక పత్రం తీసుకోవడంతో కుటుంబ సభ్యులు, గ్రామ ప్రజలు ఎంతో హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా గౌతమి మాట్లాడుతూ పల్లె నుండి వెళ్లి ఎంతో కష్టపడి చదువుకుని రాష్ట్ర ముఖ్యమంత్రి చేతులు మీదగా నియామక పత్రం తీసుకోవడం గర్వంగా ఉందని, ఆడపిల్ల పెళ్లి అయిన తరువాత చదువుకోవడం అంటే చాలా కష్టం అని అంటారు కానీ భర్త శివ, కుటుంబ సభ్యులు, మిత్రులు ఎంతో ప్రోత్సహించి చదివించడంతో అనుకున్న లక్ష్యాన్ని సాధించానని అన్నారు. సమాజంలో కష్టపడితే సాధించలేనిది ఏమీ వుడందు అని ప్రతి ఒక్కరూ చదువు ఒక ఆయుధం లాంటిది అని అన్నారు. భర్త శివ కషి వలనే స్టాఫ్ నర్స్ అయినానని తెలిపారు.

దుమ్ముగూడెం సర్కిల్ ఇన్స్‌పెక్టర్‌గా బీ.అశోక్

నవతెలంగాణ-దుమ్ముగూడెం

దుమ్ముగూడెం పోలీస్ స్టేషన్ సర్కిల్ ఇన్స్‌పెక్టర్‌గా బీ.అశోక్ గురువారం బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ సర్కిల్ ఇన్స్‌పెక్టర్‌గా విధులు నిర్వహిస్తున్న దోమల రమేష్ బదిలీపై ఖమ్మం 3 టౌన్ పోలీస్ స్టేషన్ సర్కిల్ ఇన్స్‌పెక్టర్‌గా వెళ్లారు. గత మూడు నెలలుగా ఎస్పీ కార్యాలయంలో ఎటాచ్‌లో ఉన్న అశోక్‌ను దుమ్ముగూడెం సిఐగా నియమిస్తూ పోలీస్ ఉన్నతాధికారులు ఉత్తర్వులు జారీ చేయడంతో పూర్తిస్థాయి బాధ్యతలు చేపట్టారు.

'ప్రశ్నించినందుకు కేసులు పెట్టడం రాజ్యాంగ విరుద్ధం'

నవతెలంగాణ-చంద్రుగొండ

అవినీతి అక్రమాలపై ప్రశ్నిస్తే కేసులు పెడతారా గిరిజన హక్కులు కాలరాస్తూ ఉంటే ఊరుకోమని ఎల్ హెచ్ పిఎస్ జిల్లా ఇన్‌చార్జ్ గుగులోతు మోహన్‌నాయక్ అన్నారు. గురువారం మండలంలోని బెండలపాడు గ్రామంలో ముఖ్య కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో మోహన్ నాయక్ మాట్లాడుతూ రాజేష్ నాయక్‌పై పెట్టిన కేసులు వెంటనే ఎత్తి వేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమం లోలంబాడి హక్కుల పోరాట సమితి భద్రాద్రి జిల్లా అధ్యక్షులు గుగులోతు కేశవ నాయక్, మండల ఉపాధ్యక్షులు అజ్మీరా బద్రు నాయక్, సుజాతనగర్ ప్రధాన కార్యదర్శి భూక్య రమేష్ నాయక్,104 డ్రైవర్స్ అసోసియేషన్ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ కేశగాని శంకర్, మండల నాయకులు వీరు నాయక్, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

'శానిటరీ వర్కర్స్ పెండింగ్ జీతాలు వెంటనే ఇవ్వాలి'

నవతెలంగాణ-పాల్వంచ

శానిటరీ వర్కర్స్ పెండింగ్ జీతాలు వెంటనే ఇవ్వాలని సీపీఐ మండల కార్యదర్శి వీసంశెట్టి పూర్ణచందర్‌రావు అన్నారు. ప్రభుత్వ హాస్పిటల్లో పనిచేస్తున్నా శానిటేషన్ సెక్యూరిటీ సిబ్బందికి నాలుగు నెలల పెండింగ్ జీతాలు ఇవ్వాలని ఏఐటీయూసీ ఆధ్వర్యంలో డిసిహెచ్ఎస్ డాక్టర్ రవి బాబు, సూపర్డెంట్ డాక్టర్ ముక్కంటేశ్వర్, డాక్టర్ సోమరాజు దొర సమస్యలతో కూడిన వినతి పత్రం గురువారం అందజేశారు. డాక్టర్ రవి బాబు స్పందించి కాంట్రాక్టర్‌తో చరవాణిలో మాట్లాడి ఒక నెల జీతం రెండు రోజుల్లో ఇప్పిస్తానని హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా సిపిఐ పాల్వంచ మండల కార్యదర్శివీసంశెట్టి పూర్ణచంద్రరావు మాట్లాడారు. గత సంవత్సరం అక్టోబర్, నవంబర్, డిసెంబర్, ఈ ఏడాది జనవరి నాలుగు నెలల పెండింగ్ వేతనాలు వెంటనే ఇవ్వాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఏఐటీయూసీ రాష్ట్ర సమితి సభ్యులు దుగ్గిరాల సుధాకర్, ఏఐటీయూసీ నాయకులు శనగరపు శ్రీనివాసరావు, వెంకట్రావు, ఉప్పుశెట్టి రాకేష్, వైయస్ గిరి, శానిటరీ సిబ్బంది దుర్గ స్వరూప రాణి, నాగలక్ష్మి, రుక్మిణి, కుమారి సుజాత, హుస్సేని, దుర్గా ప్రసాద్, ప్రశాంత్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

టీసీఆర్‌పీఏ డైరీ ఆవిష్కరణ

నవతెలంగాణ-చంద్రుగొండ

టీసీఆర్‌పీఏ నూతన డైరీని గురువారం ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో టీసీఆర్‌పీఏ రాష్ట్ర అధ్యక్షులు గంగుల కృష్ణారెడ్డి, తిరుందాసు సంతోష్ కుమార్, రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ పాడియా నాగేశ్వరావు, భద్రాద్రి కొత్తగూడెం జిల్లా సీఆర్‌పీ యూనియన్ ప్రెసిడెంట్ బానోత్ సేవియా, రాష్ట్ర ఉపాధ్యక్షులు శ్రీనివాస్‌రెడ్డి, ముఖ్యమంత్రికి సమగ్ర శిక్ష ఉద్యోగుల సమస్యలను పూర్తిగా వివరించడం జరిగింది. ముఖ్యమంత్రి అన్ని విషయాలపై నాకు అవగాహన ఉంది.. తమరి విషయం మా దష్టిలో ఉంది తమరికి మా ప్రభుత్వం తప్పక న్యాయం చేస్తుంది అనే సానుకూలంగా స్పందించినట్టు రాష్ట్ర అధ్యక్షులు కృష్ణారెడ్డిని ఆప్యాయతంగా పలకరించడం జరిగిందన్నారు.

కార్పొరేట్ అనుకూల బడ్జెట్

నవతెలంగాణ-ఖమ్మం

పార్లమెంటులో గురువారం ప్రవేశపెట్టిన మధ్యంతర బడ్జెట్ కార్పొరేట్ అనుకూలమైందని, సామాన్య ప్రజలకు పూర్తిగా వ్యతిరేకమైన బడ్జెట్ అని సిపిఐ జిల్లా కార్యదర్శి పోటు ప్రసాద్ ఒక ప్రకటనలో గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. అహంభావంతో, అహంకారంతో కూడిన బడ్జెట్ అని ప్రజలు లేకున్నా కార్పొరేట్ శక్తులు మాత్రం తమ వెంట ఉంటే చాలుననే రీతిలో బడ్జెట్‌ను ప్రవేశపెట్టారని తెలిపారు. ఇంతకు ముందు కార్పొరేట్ పన్ను 30 శాతం నుంచి 22 శాతానికి తగ్గించిన ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ పేద, మధ్యతరగతి ప్రజలకు ఏమి వెసులుబాటు ఇచ్చారని ప్రశ్నించారు. నిత్యావసర వస్తువుల ధరలు పెరిగి కొనుగోలు సామర్థ్యం తగ్గిన నేపథ్యంలో ప్రజలకు సానుకూలమైన నిర్ణయాలని బడ్జెట్ ప్రకటించాలని, కానీ అటువంటి పనిని బిజెపి ప్రభుత్వం చేయలేదన్నారు. దేశంలో నిరుద్యోగం మునుపెన్నడు లేని రీతిలో తారాస్థాయికి చేరిందని, నిరుద్యోగుల కోసం ఎటువంటి ప్రకటన చేయకపోవడం కనీసం ఉపాధి అవకాశాలను మెరుగుపరిచేందుకు పథకాలను ప్రకటించకపోవడం శోచనీయమన్నారు. పదేళ్లుగా కార్పొరేట్ సేవలో ఉన్న మోడీ సర్కార్ మరోసారి కార్పొరేట్లకు జీ హుజుర్ అన్నదని ఆరోపించారు. 65 శాతం మంది ఆధారపడి జీవిస్తున్న వ్యవసాయ రంగానికి ప్రోత్సహకారాలను ప్రకటించ లేదని తెలిపిన ఎన్నికల ముంగిట పేద, మధ్యతరగతి ప్రజలకు స్వాంతన చేకూర్చే దశలో నిర్ణయాలు ఉంటాయని, ప్రజలు ఆశించారని ఆ ఆశలను సైతం సర్కార్ వమ్ము చేసిందని తెలిపారు.

తెలంగాణ ప్రజలకు ద్రోహం చేసిన కేంద్ర బడ్జెట్

• ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు

నవతెలంగాణ-కొత్తగూడెం



కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మల సీతారామన్ ప్రవేశ పెట్టిన ఓటాన్ అన్ అకౌంట్ బడ్జెట్‌లో తెలంగాణకు మొండి చెయ్యి చూపిందని సిపిఐ రాష్ట్ర కార్యదర్శి, కొత్తగూడెం ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు గురువారం ఒక ప్రకటనలో విమర్శించారు. తెలంగాణ విభజన సందర్భంగా పొందుపర్చిన బయ్యారం ఉక్కుఫ్యాక్టరీ ఊసే లేదన్నారు. వరంగల్ కోచ్ ఫ్యాక్టరీని ప్రారంభించకుండా యాక్సిల్ అండ్ వీల్ అనే పరిశ్రమను స్థాపిస్తామని చెప్పి కంటి తుడుపు చర్యలకు ప్రయత్నిస్తున్నారని, వాటికి నిధులు కేటాయించలేదన్నారు. కాళేశ్వరానికి జాతీయ హెూదా ప్రకటించలేదని, ఇప్పుడు పాలమూరు రంగారెడ్డి ప్రాజెక్టుకు కేంద్రం నిధులు ప్రకటించకపోవడంతో తెలంగాణ పట్ల కేంద్రం చిన్నచూపు చూపుతున్నదని ఆరోపించారు. కేంద్రం తీసుకొచ్చిన పంటల మద్దతు ధర గ్యారెంటీ చట్టం, విద్యుత్ సవరణ చట్టం 2022 రద్దు, రుణమాఫీ తదితర అంశాలపట్ల ఢిల్లీలో 13 నెలల పాటు ఆందోళన చేసిన రైతులకు తాత్కాలిక ఉపశమనం కల్పించి నేడు బడ్జెట్‌లో వారికి సంబంధించిన కేటాయింపు లేకపోవడం నమ్మించి మోసం చేయడమే అవుతున్నదని కూనంనేని వాపోయారు.

వైరుధ్యాల బడ్జెట్

ఒకవైపు 2041 వరకు పేదరికం కనపడకుండా చేస్తామని ప్రగల్భాలు పలికిన కేంద్రం తాజా బడ్జెట్‌లో దానికి విరుద్ధంగా వ్యవహరించిందని సాంబశివరావు అన్నారు. గతంలో కార్పొరేట్ ట్యాక్సీలు భారీ తగ్గించి, వచ్చే ఆర్థిక సంవత్సరంలో కూడా అదే విధానాన్ని అవలంభిస్తున్నారని అన్నారు. పేద, మధ్యతరగతి ఇచ్చే సబ్సిడీలను భారీగా కోత విధించారని విమర్శించారు. గత బడ్జెట్‌లో ఆహార, ఎరువులు, పెట్రోలియం సబ్సిడీలో రూ.4.13 లక్షల కోట్లు కేటాయించగా వచ్చే బడ్జెట్‌లో రూ.3.70 లక్షల కోట్లు మాత్రమే కేటాయించడమేంటే రూ. రూ.43 వేల కోట్లు కోత విధించారని మండిపడ్డారు. పేదరికం తగ్గించడమంటే ఇదేనా అని నిలదీశారు. రెండేళ్ళ క్రింద ఉపాధి హామీ పథకానికి రూ.90,860 కోట్లు కేటాయించి, వచ్చే రూ.86 వేల కోట్లు మాత్రమే కేటాయించారన్నారు. అప్పులు సైతం విపరీతంగా పెరిగాయని, భారతదేశ అప్పులు రూ.168.3 లక్షల కోట్లకు చేరుకుంటుందని, గత బడ్జెట్ కంటే రూ.16 లక్షల కోట్లు అధికమని అన్నారు. ఒకవైపు ఎన్నడూ లేని విధంగా ద్రవ్యోల్బణం, నిరుద్యోగిత రేటు పెరుగుతుంటే అందుకు విరుగుడు చర్యలు కాకుండా సబ్సిడీలపై, ఉపాధి హామీపై కోత విధించడమంటే వైరుధ్యాల బడ్జెట్ అని కూనంనేని పెర్కోన్నారు.

'గిరిజన సాంస్కృతిక సాంప్రదాయాలు కాపాడాలి'

నవతెలంగాణ-భద్రాచలం రూరల్



ఐటీడీఏ భద్రాచలం ఏజెన్సీ ఏరియా పరిధిలోని ఆదివాసి గిరిజన కుటుంబాల ఆచార వ్యవహారాలు, సాంస్కృతిక సాంప్రదాయాలు అంతరించిపోకుండా నేటి తరానికి నేర్పిస్తూ ఆదివాసి గిరిజనులు మంచి ప్రవర్తనతో జీవిస్తున్నారని, ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి ప్రతీక్ జైన్ కేంద్ర ప్రభుత్వం అత్యున్నత పరిశోధన సంస్థ, అంతరో పాలాజికల్, సర్వే ఆఫ్ ఇండియా సభ్యులకు తెలిపారు. గురువారం తెలంగాణ, చత్తీస్గఢ్ సరిహద్దు గ్రామాలలో నివసిస్తున్న ఆదివాసి గిరిజనులపై కేంద్ర ప్రభుత్వం అత్యున్నత పరిశోధనా సంస్థ, అంతరోపాలాజికల్, సర్వే ఆఫ్ ఇండియా సాంస్కృతిక శాఖ బృందం వారు తన చాంబర్‌లో మర్యాదపూర్వకంగా కలిశారు. గిరిజన కుటుంబాల ఆచార వ్యవహారాలు, సాంస్కృతిక సాంప్రదాయాల గురించి సర్వే చేయడానికి వచ్చిన బృందం సభ్యులను ఆయన అభినందించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ...ఆదివాసి గిరిజన కుటుంబాల సంక్షేమం కొరకు ప్రభుత్వం ప్రవేశపెడుతున్న అభివృద్ధి సంక్షేమ పథకాలు నిరుపేదలైన ప్రతి గిరిజన కుటుంబానికి చేరే విధంగా చర్యలు తీసుకుంటున్నామని, అలాగే నిరుపేదలైన గిరిజన కుటుంబాలకు వైద్య చికిత్సల కొరకుగానీ, స్వయం ఉపాధితో జీవించడానికి నిరుద్యోగులైన గిరిజన యువతి, యువకులకు ఆర్థిక వేసులుబాటు కల్పించడంతో పాటు, నిరుద్యోగులైన గిరిజన యువతి, యువకులకు ప్రైవేటు రంగాలలో ఉద్యోగాలు కల్పించడం కొరకు వృత్తి శిక్షణలు ఇప్పించడం, గిరిజన విద్యార్థిని, విద్యార్థుల విద్యాభివద్ధి కొరకు ఆశ్రమ పాఠశాలలు, వసతి గృహాలు, గురుకుల కళాశాలలు, గురుకుల పాఠశాలలు, అధునాతన హంగులతో నిర్మాణం చేపట్టి నిష్ణాతులైన ఉపాధ్యాయులను నియమించినట్టు తెలిపారు. ఈ సందర్భంగా పాఠశాల, కళాశాలల్లో అందజేస్తున్న అన్ని సౌక్యరాల గురించి వివరించారు. అనంతరం కేంద్ర ప్రభుత్వం అత్యున్నత పరిశోధన సంస్థ, అంతరోపాలాజికల్ సర్వే ఆఫ్ ఇండియా, ఇన్వెస్ట్ గెట్ కార్యాలయం, జగదల్పూర్ అధికారి డాక్టర్ పిఎస్. రంగసాదు, ప్రిన్సిపాల్ మాట్లాడుతూ తెలంగాణ, చత్తీస్గఢ్ సరిహద్దు గ్రామాలలో నివసిస్తున్న, గిరిజన ప్రజలపై పలు అంశాలపై పరిశోధన చేసినట్టు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏపీవో జనరల్ డేవిడ్ రాజ్, జిసిడిఓ అలివేలు మంగతాయారు, మ్యూజియం ఇంచార్జ్ వీరస్వామి, బృందం సభ్యులు అనుపం దత్త, రాంబాబు, మౌనిక దేవి, డాక్టర్ కె. చంద్రడోల్, ప్రాంజలి రామ్ టేకి, రిషి కొల్బన్ రైస్, కోసం రత్నాకర్పలే, సంజనేర్ బేరా తదితరులు పాల్గొన్నారు.

పంచాయతీల్లో ప్రత్యేక అధికారుల పాలన

నవతెలంగాణ-కల్లూరు

గ్రామపంచాయతీలు సర్పంచుల పదవీకాలం ముగియడంతో ప్రభుత్వం మండలంలోని 31 గ్రామపంచాయతీలకు ప్రత్యేక అధికారులను నియమించింది. ప్రత్యేక అధికారులుగా కల్లూరు నారాయణపురం గ్రామాలకు ఎంపీడీవో బి. రవికుమార్. చెన్నూరు, వెన్నవల్లి, హనుమాతండ, గ్రామాలకు తాహా సిల్దార్ పులి సాంబశివుడు ప్రత్యేక అధికారిగా నియమించారు. చిన్న కోరుకొండి, మర్లపాడు, తెలగారం, గ్రామాలకు డీపిఓ పి. ప్రభాకర్‌రావు ప్రత్యేక అధికారిగా నియమితులయ్యారు. చంద్రుపట్ల, రఘునాథగూడెం, వాచా నాయక్ తండ, గ్రామాలకు డిప్యూటీ తాసిల్దార్ గద్దల కిరణ్ కుమార్ ప్రత్యేక అధికారిగా నియమించారు. పేరువంచ, కొర్లగూడెం, ముగ్గు వెంకటాపురం, గ్రామాలకు డిటి వెంకటేశ్వరరావు ప్రత్యేక అధికారిగా నియమించారు. ఎరబోయినపల్లి, లింగాల, లక్ష్మీపురంప్రత్యేక అధికారిగా డిటి బాబ్జి ప్రసాద్ నియమించారు. పెద్ద కోరుకొండి తాళ్లూరు పోచారం గ్రామాలకు అసిస్టెంట్ ఇంజనీర్ రవిచంద్ర నియ మితులయ్యారు, బత్తులపల్లి, కప్పల బంధం, గోకవరం, ఇరిగేషన్ ఏఈఈ సాయిరాం నిమితులయ్యారు. ఓబుల్ రావు బంజర ముచ్చవరం, పాయపూరు, యజ్ఞ నారాయణపురం, గ్రామాలకు వ్యవసాయ అధికారి ఎం. రూప నియమించారు. పుల్లయ్య బంజర, పడమరలోకారం కిష్టయ్య బంజర, తూర్పులోకారం గ్రామాలకు అంగనవాడి ఏ సి డి పి ఓ రత్తమ్మ ప్రత్యేకఅధికారిగా నియమించారు. అందరూ శుక్రవారం నుండి బాధ్యతలు చేపడుతున్నారు. ప్రభుత్వం నుండి మండలానికి ఉత్తర్వులు అందాయి.గెజిటెడ్ అధికారులే గ్రామ ప్రత్యేకాధికారులు. నవతెలంగాణ. వైరా. నేటితో ముగిసిన గ్రామ పంచాయతీల పాలక వర్గాల న స్థానం లో రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేకాధకారుల పాలనకు శ్రీకారం చుట్టింది. అందుకు గాను మండలం లోని గెజిటెడ్ అధికారుల తో పాటు అసిస్టెంట్ ఇంజనీర్లు, వ్యవసాయ విస్తరణాధి కారులు, ఏపిఎం, అంగన్‌వాడీ సూపర్వైజర్‌లను నియమిస్తూ బుధవారం ప్రకటనలు విడుదల చేశారు. కారణాలు ఏంటో తెలియదు కానీ నాన్ గెజిటెడ్ అధికారులను తొలగించి గెజిటెడ్ అధికారులనే నియమిస్తూ గురువారం రాత్రి కి ఉత్తర్వులు వెలువడనున్నట్లు విశ్వసనీయ సమాచారం. ఒక్కో గెజిటెడ్ అధికారి కి ఒకటి నుంచి మూడు గ్రామ పంచాయతీ బాధ్యతలు అప్పగించనున్నట్లు తెలిసింది.

ప్రతి ఒక్కరికి కృతజ్ఞతలు

తాజా మాజీ సర్పంచులు

బోనకల్ : తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా గ్రామపంచాయతీల సర్పంచుల పదవీకాలం జనవరి 31 తో ముగిసింది. దీంతో సర్పంచులందరూ మాజీలయ్యారు. బోనకల్ మండలంలో 22 గ్రామ పంచాయతీలు ఉన్నాయి. ఈ 22 గ్రామపంచాయతీలకు 22 మంది సర్పంచులు ఉన్నారు. ఈ ఐదేళ్లపాటు సర్పంచులు తమ పదవీ కాలాన్ని పూర్తి చేసుకున్నారు. తాజా మాజీలుగా మారిపోయారు. ఈ సందర్భంగా అనేకమంది సర్పంచులు భావోద్వేగానికి గురయ్యారు. పలువురు సర్పంచులు తమ ఐదేళ్ల పాలనలో ఎదురైన అనుభవాలు, కష్టాలు, సుఖాలను గుర్తుచేసుకున్నారు. ఈ ఐదేళ్లపాటు తమకు గ్రామాభివృద్ధిలో సర్పంచిగా ఐదేళ్లపాటు ఎటువంటి ఆటంకాలు లేకుండా కొనసాగటానికి సహకరించిన అధికారులు, ప్రజలు, అన్ని రాజకీయ పక్షాలకు తాజా మాజీ సర్పంచులు కృతజ్ఞతలు తెలిపారు. తూటికుంట్ల, లక్ష్మీపురం, గార్లపాడు, రామాపురం, రావినూతల, బోనకల్, ముష్టికుంట్ల, చొప్పకట్లపాలెం, చిరునోముల సర్పంచులు నోముల వెంకట నరసమ్మ, నన్నక లక్ష్మి, దారెల్లి నరసమ్మ, తొండపు వేణు, కొమ్మినేని ఉపేందర్, బుక్య సైదా నాయక్, షేక్ బి.జాన్ బి, ఎర్రంశెట్టి సుబ్బారావు, ములకారపు రవి కృతజ్ఞతలు తెలిపారు. జానకిపురం, నారాయణపురం, చిన్న బీరవల్లి, పెద్దబీరవల్లి, బ్రాహ్మణపల్లి, కలకోట, రాయన్నపేట, మోటమర్రి, ఆళ్ళపాడు, గోవిందాపురం ఏ సర్పంచులు చిలక వెంకటేశ్వర్లు, సాదినేని చంద్ర కళావతి, పేరబత్తిని శాంతయ్య, ఆళ్ల పుల్లమ్మ, జెర్రిపోతుల రవీంద్ర, ఎంగళ దయామని, కిన్నెర వాణి, కేతినేని ఇందు, మర్రి తిరుపతిరావు, భాగం శ్రీనివాసరావు కృతజ్ఞతలు తెలిపారు.

వేతన జీవులకు నిరాశ బడ్జెట్ : టీఎస్ యూటీఎఫ్

నవతెలంగాణ - ఖమ్మం

కేంద్ర ఆర్థిక శాఖ మంత్రి నిర్మలాసీతారామన్ పార్లమెంట్ లో ప్రవేశపెట్టిన బడ్జెట్ వేతన జీవులను తీవ్ర నిరాశ పరిచిందని టీఎస్ యూటీఎఫ్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు జి.వి.నాగమల్లేశ్వరరావు, పారుపల్లి నాగేశ్వరరావు గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. పన్ను స్లాబుల్లో ఎలాంటి మార్పు చేయకపోవడం వల్ల వేతనాలపై ఆధారపడి జీవించే ఉద్యోగ, ఉపాధ్యాయులు సరాసరి రెండు నెలల వేతనాన్ని టాక్స్ రూపంలో చెల్లించాల్సి వస్తుందని తెలిపారు. ఈ బడ్జెట్ వేతన జీవులను తీవ్రంగా నిరాశపరిచిందని పేర్కొన్నారు. అదే విధంగా విద్యారంగానికి నామమాత్రంగా కేటాయింపులు జరిపారని, కొఠారి కమిషన్ చెప్పినట్టు జీడిపిలో ఆరు శాతం విద్యారంగానికి కేటాయింపులు జరపాలని డిమాండ్ చేశారు.

కిషన్ రెడ్డితో డాక్టర్ జీవీ భేటీ

బీజేపీ ఖమ్మం లోక్ సభ టిక్కెట్ కోసం అభ్యర్థన

నవతెలంగాణ - ఖమ్మం ప్రాంతీయ ప్రతినిధి



కేంద్రమంత్రి, రాష్ట్ర బీజేపీ అధ్యక్షుడు కిషన్ రెడ్డిని ప్రముఖ వైద్యుడు డాక్టర్ గోంగూర వెంకటేశ్వర్లు ఢిల్లీలో గురువారం కలిశారు. బీజేపీ సీనియర్ నాయకుడు, ఖమ్మం పార్లమెంట్ ఎన్నికల బీజేపీ ఇంచార్జి, పొంగులేటి సుధాకర్ రెడ్డి తో కలిసి కిషన్ రెడ్డి నివాసంలో సమావేశమయ్యారు. రాబోయే పార్లమెంట్ ఎన్నికల్లో ఖమ్మం లోక్ సభ అభ్యర్థిగా తనకు అవకాశం కల్పించాలని డాక్టర్ జీవీ విజ్ఞప్తి చేశారు. ఈ సందర్భంగా పొంగులేటి సుధాకర్ రెడ్డి డాక్టర్ జీవీ చేస్తున్న సామాజిక, సేవా కార్యక్రమాలను వివరించారు. జిల్లా విశ్వ హిందూపరిషత్ మాజీ అధ్యక్షుడుగా మంచి సేవలు అందించినట్లు వివరించారు. ఎన్నో ఏళ్లుగా పార్టీ కార్యక్రమాల్లో చురుగ్గా పాల్గొనడమే కాకుండా పేదల వైద్యుడిగా పేరు గాంచి అనేక సేవా కార్యక్రమాలు చేస్తున్నట్లు తెలిపారు. ఖమ్మంలో సొంత ఖర్చులతో రామకృష్ణ విద్యాలయం నడుపుతున్నట్లు కిషన్ రెడ్డి దృష్టికి తీసుకెళ్లారు. కోవిడ్ సమయంలో వేలాది మంది బాధితులకు అతి తక్కువ ఖర్చుతో వైద్యం అందించడమే కాకుండా బాధితులకు ఉచితంగా భోజనం పంపిణీ చేశారని వివరించారు. ప్రస్తుతం ఉచిత టెలీ హెల్త్ సెంటర్ ద్వారా ప్రజలకు ఆరోగ్య సంబంధిత సమాచారం అందిస్తున్నారని సుధాకర్ రెడ్డి వివరించారు. నిరుద్యోగ యువతకు కెరీర్ గైడెన్స్ పై నిపుణులతో తగిన సూచనలు, సలహాలు ఇచ్చేందుకు డాక్టర్ జీవీ ఫౌండేషన్ ద్వారా సేవలు అందిస్తున్నారని తెలిపారు. ఖమ్మం పార్లమెంట్ స్థానంలో బీజేపీ అభ్యర్థిగా అవకాశం కల్పించాలని కిషన్ రెడ్డిని కోరారు. ఈ సందర్భంగా డాక్టర్ జీవీ అందిస్తున్న సేవా కార్యక్రమాలను కిషన్ రెడ్డి అభినందించారు. డాక్టర్ జీవీ విజ్ఞప్తిపై సానుకూలంగా స్పందించిన కిషన్ రెడ్డి.. పరిశీలిస్తామని హామీ ఇచ్చారు. సమావేశంలో జాతీయ ఎస్సీ కమిషన్ మాజీ చైర్మన్ రాములు పాల్గొన్నారు.

సాయిలు మృతి విప్లవ ఉద్యమానికి తీరని లోటు

నవతెలంగాణ-లక్ష్మీదేవిపల్లి

సిపిఐ ఎంఎల్ కొత్తగూడెం సబ్ డివిజన్ నాయకుడు బంగారు చలక మాజీ ఉపసర్పంచ్ కోడిరెక్కల సాయిలు మృతి విప్లవ ఉద్యమానికి, కమ్యూనిస్టు ఉద్యమానికి, ప్రజా ఉద్యమాలకు తీరని లోటని సిపిఐ ఎంఎల్ ప్రజాపంద జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు జాటోత్ కృష్ణ, జిల్లా నాయకులు ఆజాద్ అన్నారు. గురువారం ఆయన మృతదేహానికి పూలమాలవేసి నివాళులర్పించారు.

బీమా సొమ్మును అందించిన ఎస్‌బీఐ

నవతెలంగాణ-సత్తుపల్లి

భారతీయ స్టేట్ బ్యాంకు ఆధ్వర్యంలోని అగ్రి కల్చరల్ డెవలప్‌మెంట్ బ్యాంకు (ఎస్‌బీఐ-ఏడీబీ) బీమా పథకం ద్వారా ఇద్దరు వ్యక్తుల పేరున మంజూరైన రూ. 30లక్షల సొమ్మును ఆ బ్యాంకు మేనేజర్ బైరి వేణు గురువారం ఆయా కుటుంబాలకు అందించారు. సత్తుపల్లి మండలం రేజర్ల గ్రామానికి చెందిన చెప్పల వెంకన్న ఎస్‌బీఐలో ఇన్సూరెన్స్ కోసం రూ. వెయ్యి జమచేశాడు. గత నవంబరు నెలలో వెంకన్న రోడ్డు ప్రమాదంలో మృతిచెందాడు. మృతుడు వెంకన్న పేరున ఎస్‌బీఐ నుంచి రూ. 20లక్షల బీమా మంజూరు కావడంతో అతనికి నామినీగా ఉన్న సోమరాజుకు మంజూరైన సొమ్మును ఏడీబీ మేనేజర్ వేణు అందించారు. ఈ విధంగానే మండలంలోని తుంబూరుకు చెందిన వేల్పుల ప్రసాద్ ఎస్‌బీఐలో రూ. 500 బీమా చేశాడు. ఇటీవల పొలంలో పనిచేస్తున్న ప్రసాద్ పాము కాటుకు గురై మరణించాడు. అతనికి నామినీగా ఉన్న భార్య ధనలక్ష్మికి ఎస్‌బీఐ బీమా ద్వారా మంజూరైన రూ. 10లక్షలను బ్యాంకు మేనేజర్ ఆమెకు అందించారు.

కొలాబ్ ఫైల్స్ ఎన్ఐసీ వెబ్ అప్లికేషన్‌పై అవగాహన

నవతెలంగాణ-ఖమ్మం

కొలాబ్ ఫైల్స్ ఎన్ఐసీ వెబ్ అప్లికేషన్‌పై అవగాహన పెంపొందించుకోవడం ద్వారా పని సులభతరం అవడమే కాకుండా డెటా సురక్షితంగా ఉంటుందని, దీన్ని అన్ని ప్రభుత్వ కార్యాలయాల్లో వాడడం వల్ల కార్యాలయాల్లో పని వేగవంతంగా పూర్తవుతుందని అడిషనల్ స్టేట్ ఇన్ఫర్మేటిక్స్ అధికారి ర్యానిల్ జాన్, సీనియర్ టెక్నికల్ డైరెక్టర్ రాకేష్‌లు పేర్కొన్నారు. గురువారం నూతన కలెక్టరేట్ సమావేశ మందిరంలో జిల్లా వివిధ శాఖల సిబ్బందికి కొలాబ్ ఫైల్స్ వెబ్ అప్లికేషన్‌పై శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా సీనియర్ టెక్నికల్ డైరెక్టర్ కొలాబ్ ఫైల్స్ వెబ్ అప్లికేషన్ పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా అవగాహన కల్పించారు. కొలాబ్ ఫైల్స్ వెబ్ అప్లికేషన్‌లో పరిచయ్, జన్‌పరిచయ్ రెండు యూసర్‌లు పొందుపర్చడం జరిగిందని, పరిచయ్ యూసర్ సింగిల్ సైన్ ఆన్ ద్వారా ఈ మెయిల్ ఐడితో ప్రభుత్వ శాఖల ఫైల్స్ వినియోగంకు సులభతరంగా ఉండటమే కాకుండా ఫైల్స్, ఫోల్డర్స్ మెయిల్స్ చేసే అవకాశం ఉంటుందని, గోప్యంగా ఉంటాయని ఎలాంటి సైబర్ హ్యాకింగ్ జరగకుండా సురక్షితంగా ఉంటాయన్నారు. ప్రభుత్వం జారీచేసిన డిజిటల్ ఐడెంటిటీతో పాటు సహకార డాక్యుమెంటేషన్ వంటి ఆఫీస్ ఈ ఫైలింగ్ ఫైల్స్ విధానంలో ఎక్కువగా ఉపయోగకరంగా ఉంటుందన్నారు. ఈ శిక్షణా కార్యక్రమంలో ఎన్ఐసి ఐటి మేనేజర్ విజయ్‌ప్రకాష్, జిల్లా ఇన్‌ఫర్మేటిక్స్ అధికారి రాంప్రసాద్, జిల్లా కలెక్టర్ కార్యాలయం పరిపాలన అధికారిణి అరుణ, ఎన్ఐసి సిబ్బంది, వివిధ శాఖల సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



డిప్యూటి సీఎం మల్లు భట్టి విక్రమార్కుని కలిసిన కాంగ్రెస్ నేతలు

నవతెలంగాణ-ముదిగొండ

తెలంగాణ రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి, ఆర్థిక, విద్యుత్‌శాఖల మంత్రి మల్లు భట్టి విక్రమార్కను, మండల పరిధిలో వనంవారికిష్టాపురం కాంగ్రెస్ పార్టీ గ్రామశాఖ నాయకులు మల్లెల అజయ్ కుమార్, లాయర్ పనితి పాపారావు హైదరాబాదు ప్రగతి భవనంలో గురువారం కలిసి శుభాకాంక్షలు తెలిపి, శాలువాతో ఘనంగా సన్మానించారు. ఈసందర్భంగా గ్రామ సమస్యలను భట్టి విక్రమార్క దృష్టికి తీసుకెళ్లగా పరిష్కారానికి కృషి చేస్తానని భట్టి హామీ ఇచ్చారని వారు చెప్పారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ గ్రామశాఖ అధ్యక్షులు పాదిలి తిరపతయ్య, నాయకులు ఏటుకూరి శ్రీను, చెన్ను హనుమయ్య, కాకి వీరభద్రం, బత్తిని పుల్లయ్య, వజ్రాల సతీష్ పాల్గొన్నారు.

స్పెషల్ ఆఫీసర్ల పాలనలోకి గ్రామపంచాయతీలు

- ఎంపీడీవో చంద్రశేఖర్

నవతెలంగాణ-పినపాక

గ్రామ పంచాయతీల్లో స్పెషల్ ఆఫీసర్ల ఎంపిక పూర్తయిందని పినపాక ఎంపీడీవో చంద్రశేఖర్ తెలియజేశారు. గురువారం ఆయన పినపాక ఎంపీడీవో కార్యాలయంలో మాట్లాడారు. పంచాయతీల వారీగా నియమిస్తున్న ఆఫీసర్ల లిస్టును డీపీవోలు, కలెక్టర్‌కు పంపించామని తెలియజేశారు. గురువారం అనగా ఫిబ్రవరి 1న సర్పంచ్‌ల టర్మ్ పూర్తి అవడంతో స్పెషల్ ఆఫీసర్ల పాలనపై ప్రభుత్వం ఉత్తర్వులు అందజేసిందని తెలిపారు. స్పెషల్ ఆఫీసర్లు ఫిబ్రవరి 2వ తేదీన కేటాయించిన జీపీల్లో వారు బాధ్యతలు చేపట్టనున్నారన్నారు. ఇప్పటికే సర్పంచ్‌ల నుంచి సెక్రటరీలు రికార్డులు స్వాధీనం చేసుకున్నారన్నారు. మొత్తం 23 గ్రామ పంచాయతీలు ఉండగా అన్ని పంచాయతీల్లో గెజిటెడ్ ఆఫీసర్లు మాత్రమే స్పెషల్ ఆఫీసర్లుగా వ్యవహరిస్తున్నారని తెలిపారు.

భరణిపాడు సర్పంచ్‌కి పౌర సన్మానం

నవతెలంగాణ-వేంసూరు

ఐదు సంవత్సరాల పాటు నిరంతరం గ్రామ అభివృద్ధికి పాటుపడిన సర్పంచికి గ్రామస్తులు పౌర సన్మానంతో సత్కరించారు. భరణిపాడు సర్పంచ్ మందపాటి సునీత వెంకటరెడ్డి పదవికాలం గురువారంతో ముగియడంతో గ్రామంలో యువకులు గ్రామస్తులు సమన్వయంతో ఘనంగా సన్మానించారు. సన్మాన సభకు ముఖ్యఅతిథిగా ఎంపీపీ పగుట్ల వెంకటేశ్వరరావు సీనియర్ నాయకులు, మాజీ సర్పంచ్ మందపాటి మహేశ్వర్‌రెడ్డి, సొసైటీ అధ్యక్షులు కూరపాటి నానిలు ప్రసంగిస్తూ ఏకగ్రీవంగా సర్పంచ్ అవటానికి సహకరించిన ప్రతి ఒక్కరికి ధన్యవాదాలు తెలుపుతూ అదే స్ఫూర్తితో గ్రామాభివృద్ధి ధ్యేయంగా నిరంతరం ప్రజాప్రతినిధుల సహకారంతో గ్రామ అభివృద్ధికి తమ వంతు సహకారం అందించిన సునీత వెంకటరెడ్డిని అభినందించారు సర్పంచ్ మాట్లాడుతూ అధికారులు ప్రజాప్రతినిధుల సహకారంతో గ్రామంలో 16 సిసి రోడ్లు పూర్తి చేసుకోవడం ఎంతో కాలంగా ఎదురుచూసిన అంతర్గత రహదారులు భరణిపాడు నుండి చిన్నంపేట వరకు గ్రావిల్ రోడ్డు పనులను పూర్తి చేయించడం సంతృప్తిగా ఉందన్నారు. గ్రామస్తులు మాట్లాడుతూ గ్రామంలో సంపూర్ణ పారిశుద్ధ్యానికి అధిక ప్రాధాన్యత ఇస్తూ మొదటి విడత పల్లె ప్రగతి కార్యక్రమంలో ప్రతి ఇంటికి తడి పొడి చెత్త వేసుకునేందుకు డస్ట్ బిన్నులు పంపిణీ చేసి ఆదర్శంగా నిలిచారు. స్మశాన వాటిక నిర్మాణానికి సొంత స్థలాన్ని దానం చేసి తమ దాతృత్వాన్ని చాటుకున్నారని సేవలను కొనియాడారు. మాజీ సర్పంచ్ మందపాటి మహేశ్వర్‌రెడ్డి అధ్యక్షతన జరిగిన ఈ సన్మాన సభలో గ్రామస్తులు పాల్గొన్నారు.

కల్లూరు మండలానికి అరుదైన గౌరవం

- స్టాఫ్ నర్స్ ఉద్యోగం సాధించిన నరాల మౌనిక దేవి

నవతెలంగాణ-కల్లూరు



మండల పరిధిలోని ముచ్చవరం గ్రామపంచాయతీ శివారు బాలాజీ నగర్‌కు చెందిన నరాల మౌనిక దేవి సాఫ్ట నర్స్ ఉద్యోగం సాధించింది. ఈ మేరకు హైదరాబాదులో ఆమె ఉన్నతాధికారుల నుండి నియామకు పత్రాలను అందుకున్నారు. మౌనిక దేవి తల్లిదండ్రులు వ్యవసాయం చేసేవారు. ఖమ్మం మమత మెడికల్ కళాశాలలో చదివిన ఆమె మూడువేల ర్యాంకు సాధించి ఈ ఉద్యోగం పొందింది. ఈ సందర్భంగా మౌనిక దేవి మాట్లాడుతూ తన తల్లిదండ్రులు నరాల శ్రీనివాస్, వసుంధర పాటు భర్త గోపికృష్ణ సహకారంతో ఉద్యోగం సాధించినట్లు తెలిపారు. పేదలకు తన సహాయ సహకారాలు, సేవా కార్యక్రమాలు చేపడతానని ఆమె తెలిపారు. తనకు సహకరించిన ప్రతి ఒక్కరికి ఆమె కృతజ్ఞతలు తెలిపారు.

సర్పంచ్‌లను సన్మానించిన ఎంపీపీ

నవతెలంగాణ-కూసుమంచి



సర్పంచ్‌లుగా ఐదు సంవత్సరాల పదవీ కాలాన్ని విజయవంతంగా పూర్తి చేసుకున్న సందర్భంగా మండలంలోని సర్పంచ్‌లకు గురువారం ఎంపీపీ బానోత్ శ్రీనివాస్‌నాయక్ ఆధ్వర్యంలో సన్మాన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో వైస్ ఎంపీపీ కంచర్ల పద్మా వీరారెడ్డి, ఎంపీడీవో రమాదేవి, ఎంపిటిసి మాదాస్ ఉపేందర్, పెరకసింగారం ఎంపీటీసీ మోదుగు వీరభద్రం, కల్లూరు గూడెం సొసైటీ చైర్మెన్ వాసంశెట్టి వెంకటేశ్వర్లు, గట్టు సింగారం మాజీ సర్పంచ్ చాట్ల పరశ్ రామ్, ఎంపీడీవో కార్యాలయం సిబ్బంది, గ్రామ సెక్రటరీలు తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ వంచనకు గురువతున్న కార్మిక, కర్షకలు

నవతెలంగాణ-కారేపల్లి

కేంద్ర ప్రభుత్వవైఫల్యాల నుండి ప్రజల దృష్టి మరల్చటానికి దేవుడు, మతం ఎజెండాను మోడీ ఎత్తుకున్నాడని రైతు-వ్యవసాయ కార్మిక సంఘాల ఐక్య వేదిక (సంయుక్త కిసాన్ మోర్చా) నాయకులు విమర్శించారు. కేంద్రంలోని బీజేపి ప్రభుత్వం అనుసరిస్తున్న కార్మిక, రైతాంగ, ప్రజావ్యతిరేక విధానాలకు నిరసనగా ఫిబ్రవరి 16 జరుగుతున్న దేశవ్యాప్త కార్మికుల సమ్మె- గ్రామీణ భారత్ బంద్ జయప్రదం కోసం గురువారం కారేపల్లి భాగం రామనర్సయ్య భవన్‌లో కే.నరేంద్ర, గుగులోత్ తేజానాయక్ అధ్యక్షతన సదస్సును నిర్వహించారు. ఈసదస్సులో వ్యకాస రాష్ట్ర కమిటీ సభ్యులు కొండెబోయిన నాగేశ్వరరావు, రైతుకూలీ సంఘం జిల్లా కార్యదర్శి వై.ప్రకాశ్ లు మాట్లాడుతూ 16న జరుగు దేశవ్యాప్త సమ్మెలో ప్రతి ఒక్కరు భాగస్వాములు కావాలని కోరారు. ఈకార్యక్రమంలో రైతు సంఘం కార్యదర్శి వజ్జా రామారావు, సీఐటీయు నాయకులు శనగ రాంబాబు, ఆరెల్లి శ్రీరాములు, సారయ్య, బోళ్ల కొమరయ్య, యాదగిరి, మంగతాయి, కమల, కళ్యాణి, యాదగిరి, ఏఐటీయూసీ నాయకులు బావుసింగ్, ఐఎఫ్‌టీయు నాయకులు బీ.వీరు, సక్రు, రైతుకూలీ సంఘం నాయకులు కోమల్, రావూరి నాగేశ్వరరావు, పులకాని సత్తిరెడ్డి పాల్గొన్నారు.

హైదరాబాద్‌లో.. బంగారం ధరలు
(10 గ్రాములకు రూ.లలో)

24 క్యారెట్లు	63,440	▲	170
22 క్యారెట్లు	58,150	▲	150
కిలో వెండి	77,800	▼	200

చికెన్ ధరలు హైదరాబాద్
బ్రాయిలర్ చికెన్

ఫారం రేటు	రూ.	109
రిటైల్ (లైవ్)	రూ.	131
స్కిన్‌తో	రూ.	190
స్కిన్‌లెస్	రూ.	216

కల్వకుంట్ల చంద్రశేఖరరావు అనే నేను..

(మొదటిపేజీ తరువాయి)

ఛాంబర్ వద్దకు నడుచుకుంటూ వెళ్లారు. అసెంబ్లీ ఎన్నికల తర్వాత ఆయన శాసనసభలో అడుగుపెట్టటం ఇదే మొదటిసారి కావటంతో బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, ఇతర ప్రజా ప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు ఆయనకు ఘన స్వాగతం పలికారు. 'కేసీఆర్ జిందాబాద్, లాంగ్‌లివ్ కేసీఆర్...' అంటూ వారు నినదించారు. కేసీఆర్ అసెంబ్లీకి వచ్చినప్పుడు, తిరిగి వెళ్లేటప్పుడు అసెంబ్లీ ప్రాంగణంలో హడావుడి కనిపించింది. ఎమ్మెల్యేగా ప్రమాణ స్వీకారం చేసిన కేసీఆర్‌కు స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్, శాసనసభా వ్యవహారాల మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు, బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్, మాజీ మంత్రులు హరీశ్‌రావు, తలసాని శ్రీనివాసయాదవ్, ఎమ్మెల్యేలు పోచారం శ్రీనివాసరెడ్డి, జగదీశ్‌రెడ్డి, పాడి కౌశిక్‌రెడ్డి, సబితా ఇంద్రారెడ్డి, పల్లా రాజేశ్వరరెడ్డి, ఎమ్మెల్సీ మధుసూదనాచారి తదితరులు శుభాకాంక్షలు తెలిపారు. బీఆర్ఎస్‌కు చెందిన పలువురు ఎమ్మెల్యేలు, ఇతర ప్రజా ప్రతినిధులు పాల్గొన్నారు.

కదంతొక్కిన విద్యార్థి లోకం

(మొదటిపేజీ తరువాయి)

తిరస్కరించండి, విద్య రంగాన్ని కాపాడండి... బీజేపీని తిరస్కరించండి, ఇండియాను కాపాడండి' అనే నినాదంతో ర్యాలీ నిర్వహించారు. ఈ ర్యాలీని రాష్ట్ర యువజన సంక్షేమం, క్రీడల అభివృద్ధి శాఖ మంత్రి ఉదయనిధి స్టాలిన్ జెండా ఊపి ప్రారంభించారు. పాఠశాల విద్యా శాఖ మంత్రి అనిల్ మహేష్ పొయ్యామొళి, ఎస్ఎఫ్ఐ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు విపి సాను, మయూఖ్ బిశ్వాస్, ఇతర విద్యార్థి సంఘాల నేతలు ర్యాలీలో పాల్గొన్నారు. 16 విద్యార్థి సంఘాల ప్రతినిధులు మాట్లాడిన బహిరంగ సభతో ర్యాలీ ముగిసింది. ఎస్ఎఫ్ఐ తరపున అఖిల భారత అధ్యక్షుడు విపి సాను మాట్లాడుతూ బీజేపీ, ఆర్ఎస్ఎస్ నేతృత్వంలోని కేంద్ర ప్రభుత్వం ప్రభుత్వ విద్యను ఎలా నిర్వీర్యం చేసిందో, సమాఖ్య నిర్మాణంపై దాడి చేసేందుకు ప్రస్తుత పాలన గవర్నర్ హోదా వంటి ప్రభుత్వ యంత్రాంగాన్ని ఎలా దుర్వినియోగం చేస్తోందో ఎత్తిచూపారు. ఎస్ఎఫ్ఐ తమిళనాడు రాష్ట్ర కార్యదర్శి జి. అరవిందస్వామి కూడా ప్రగతిశీల, ప్రజాస్వామిక విద్యార్థి సంఘాలు ఎన్ఐపీకి వ్యతిరేకంగా పోరాటాన్ని బలంగా చేపట్టాల్సిన ఆవశ్యకతను, ప్రభుత్వ విద్యను రక్షించాల్సిన అవసరాన్ని తెలిపారు. ఎస్ఎఫ్ఐ సహాయ కార్యదర్శి దీప్షితా ధర్ మాట్లాడుతూ, "అధికారంలో ఉన్న పార్టీ వ్యాప్తి చేస్తున్న ద్వేషం , మతం ఎజెండా మాకు వద్దు. మాకు విద్యార్థుల ఎజెండా కావాలి" అని అన్నారు.

తెలంగాణకు గుండుసున్నా..

- విభజన హామీల ఊసేలేని కేంద్ర బడ్జెట్
- రైల్వే కోచ్ ఫ్యాక్టరీ.. బయ్యారం ఉక్కుకు దిక్కే లేని వైనం
- ఎన్నికల వేళా రాష్ట్రానికి రిక్తహస్తమే

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

ఎన్నికల్లో ఓట్లు దండుకోవటం కోసమైనా కొన్ని తాయిలాలను పాలకులు ప్రజలకు విదుల్చుతూ ఉంటారు. కానీ ఆ చిన్నపాటి విదిలింపులను కూడా మోడీ సర్కార్ రాష్ట్రంపై విదల్చలేదు. రాష్ట్ర విభజన (2014) నాటి నుంచి పెండింగ్‌లో ఉన్న అనేక హామీలకూ కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ తాజాగా ప్రవేశపెట్టిన ఓటాన్ అకౌంట్ బడ్జెట్‌లోనూ మోక్షం లభించలేదు. రాష్ట్రంలోని వెనుకబడిన జిల్లాలకు నిధుల ఊసే లేకుండా పద్దు కొనసాగింది. బయ్యారం ఉక్కు ఫ్యాక్టరీ, ఖాజీపేట రైల్వే కోచ్ ఫ్యాక్టరీ, గిరిజన యూనివర్సిటీ, ప్రాజెక్టులకు జాతీయ హోదా తదితరాంశాల గురించి రేఖా మాత్రంగా కూడా బడ్జెట్‌లో ప్రస్తావించకపోవటం గమనార్హం. గతంలో రాష్ట్రంలోని ఎంపీలు నవోదయ పాఠశాలలు, పసుపు బోర్డులను ఏర్పాటు చేయాలంటూ ప్రధాని మోడీతోపాటు ఆయా శాఖల మంత్రులకు వినతిపత్రాలు సమర్పించారు. కాంగ్రెస్ ప్రభుత్వం కొలువుదీరిన తర్వాత ముఖ్యమంత్రి రేవంత్, డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క సైతం మోడీని కలిసి... తమ డిమాండ్లను ఏకరువు పెట్టారు. రాష్ట్రానికి ఇతోధికంగా నిధులను ఇవ్వాలంటూ విజ్ఞప్తి చేశారు. విభజన హామీలను అమలు చేయాలంటూ మరోసారి కోరారు. కానీ ప్రస్తుత ఓటాన్ అకౌంట్ బడ్జెట్‌లో వాటి ఊసే లేకపోవటం గమనార్హం. దీంతోపాటు రాష్ట్రానికి హక్కుగా రావాల్సిన నిధులపై సైతం కేంద్రం నోరు మెదపలేదు. మొత్తంగా చూస్తే ఎన్నికల వేళ ప్రవేశపెట్టిన ఓటాన్ అకౌంట్‌లోనూ మోడీ సర్కార్... రాష్ట్రానికి మొండి చెయ్యే చూపింది.

విధ్వంసమైన తెలంగాణను పునర్‌నిర్మిద్దాం

- ఐపీఎస్‌లతో సీఎం రేవంత్

నవతెలంగాణ ప్రత్యేక ప్రతినిధి-హైదరాబాద్

ఆర్థికంగా, సామాజికంగా విధ్వంసమైన తెలంగాణను పునర్ నిర్మించాల్సిన అవసరం ఉందనీ, ఇందులో పోలీసులు కీలకపాత్ర పోషించాలని ముఖ్యమంత్రి ఏ. రేవంత్‌రెడ్డి పిలుపునిచ్చారు. గురువారం హైదరాబాద్‌లో జరిగిన ఐపీఎస్ ఆఫీసర్ల గెట్ టు గెదర్ కార్యక్రమానికి సీఎం ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పోలీసులపై ప్రభుత్వ పెత్తనం ఉండబోదన్నారు. తాము పాలకులం కాబట్టి, పోలీసులను సబ్‌ఆర్డినేట్లుగా చూసే పద్ధతి చూడబోమన్నారు. ప్రజలకు సేవ చేసేందుకు వచ్చిన ఓ అవకాశంగా మాత్రమే ఈ అధికారాన్ని తాము భావిస్తున్నామనీ, అందరినీ కలుపుకుపోతామని సీఎం అన్నారు. రాష్ట్ర అభివృద్ధి, పునర్‌నిర్మాణంలో పోలీసులు ఇచ్చే సలహాలు, సూచనలను వినమ్రంగా స్వీకరిస్తామని సీఎం అన్నారు. గత పదేండ్ల కాలంలో రాష్ట్రం ఆర్థికంగా, సామాజికంగా దెబ్బతిన్నదనీ, ఈ పరిస్థితి నుంచి తెలంగాణను బయటపడేయాల్సిన సమయం వచ్చిందని సీఎం గుర్తు చేశారు. ఈ పనిలో పోలీస్ ఆఫీసర్లు క్రియాశీలక పాత్ర పోషించాలని కోరారు. రాష్ట్రంలో డ్రగ్స్ క్రయ విక్రయాలపై ఉక్కుపాదం మోపాలనీ, హైదరాబాద్‌ను డ్రగ్స్ ఫ్రీ సిటీగా చేయాలని వారికి సూచించారు. యువతీ, యువకులను డ్రగ్స్ వ్యసనం నుంచి బయటపడేయాలన్నారు. రోజురోజుకు సైబర్ క్రైమ్స్ అతిపెద్ద ముప్పుగా పరిణమించాయనీ, వాటిని అరికట్టేందుకు కట్టుదిట్టమైన చర్యలు తీసుకోవాలని పోలీసు ఆఫీసర్లకు సీఎం విజ్ఞప్తి చేశారు. ఇందుకోసం అందుబాటులో ఉన్న ఆధునిక టెక్నాలజీని వినియోగించుకోవాలనీ, అభివృద్ధి చెందిన దేశాల్లో అనుసరిస్తున్న పద్ధతులపై అధ్యయనం చేయాలని సూచించారు. శాంతి భద్రతల పరిరక్షణ కోసం పోలీసులు నిరంతరం కష్టపడుతున్నారని సీఎం అభినందించారు. పోలీసుల సమస్యలు తెలుసుకోవడానికి, వాటిని పరిష్కరించడానికి ప్రభుత్వం ఎల్లప్పుడూ సిద్ధంగా ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో డీజీపీ రవిగుప్తా, అడిషనల్ డీజీ శివధర్‌రెడ్డి, సీఐడీ అడిషనల్ డీజీ షికా గోయల్, హైదరాబాద్ సీపీ కొత్తకోట శ్రీనివాసరెడ్డి, ఇతర పోలీసు అధికారులు పాల్గొన్నారు.

గ్రీన్ అండ్ క్లీన్ సిటీగా హైదరాబాద్

మూసీ ప్రక్షాళనతో మహానగరానికి షాన్

- హైదరాబాద్ ఖ్యాతిని పెంచాలి
- ఓఆర్ఆర్ చుట్టూ ఖాళీగా ఉన్న భూములను వినియోగంలోకి తేవాలి : డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క



నవతెలంగాణ-రంగారెడ్డి ప్రాంతీయ ప్రతినిధి

హైదరాబాద్‌ను గ్రీన్ అండ్ క్లీన్ సిటీగా అభివృద్ధి చేయడం, మూసీని ప్రక్షాళన చేసి హైదరాబాద్ షాన్‌ను పెంచడం ప్రధాన లక్ష్యాలుగా పెట్టుకున్నామని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క అన్నారు. రాష్ట్ర రాజధాని హైదరాబాద్ ఖ్యాతిని పెంచేందుకు రాష్ట్ర ప్రభుత్వం కృత నిశ్చయంతో ఉందని, దానికనుగుణంగా ప్రణాళికలు తయారు చేయాలని అధికారులను ఆదేశించారు. గురువారం హైదరాబాద్ డాక్టర్ బీఆర్ అంబేద్కర్ సచివాలయంలోని ఆయన కార్యాలయంలో 2024-25 వార్షిక బడ్జెట్‌కు సంబంధించి రాష్ట్ర మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్ అండ్ అర్బన్ డెవలప్‌మెంట్ రూపొందించిన ప్రతిపాదనలపై సంబంధిత అధికారులతో భట్టి సమీక్ష చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. హైదరాబాద్ మహనగరానికి సంబంధించి నాలుగు అంశాలపై రాష్ట్ర ప్రభుత్వం ప్రధానంగా దృష్టి సారిస్తున్నదని తెలిపారు. హైదరాబాద్ ఖ్యాతిని పెంచడం, డ్రగ్స్ ఫ్రీ నగరంగా మార్చడం, గ్రీన్ అండ్ క్లీన్ సిటీగా అభివృద్ధి చేయడం, మూసీని ప్రక్షాళన చేసి హైదరాబాద్ షాన్‌ను పెంచడం ప్రధాన లక్ష్యాలుగా పెట్టుకున్నామని వివరించారు.

హైదరాబాద్‌లో డ్రగ్స్ నియంత్రణకు కఠిన చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. డ్రగ్స్ దొరికిన చోట కఠినమైన కేసులు నమోదు చేయడంతో పాటు వాటికి ఉండేటువంటి అన్ని రకాల అనుమతులు రద్దు చేసి సౌకర్యాలను నిలిపివేయాలని ఆదేశించారు. గ్రీన్ అండ్ క్లీన్ సిటీగా మార్చడానికి మురుగు నీటి కాలవల నిర్మాణానికి ప్రాధాన్యత ఇవ్వాలన్నారు. హెచ్ఎండీఏ పరిధిలో చెరువుల సంఖ్య ఒక్కో సందర్భంలో ఒక్కో సంఖ్య చెబుతున్నారని, అసలు చెరువులు ఏమయ్యాయని, వాటిని పునరుద్ధరించేందుకు ఎలాంటి చర్యలు తీసుకుంటున్నారని అధికారులను ప్రశ్నించారు. జీహెచ్ఎంసీ పరిధిలో ఉన్న చెరువుల సంరక్షణకు చర్యలు తీసుకోవాలని, ప్రజలకు భాగస్వాములను చేసి పచ్చదనాన్ని పెంపొందించాలని సూచించారు. మూసీ ప్రక్షాళన పనులు జూన్ నాటికి పూర్తి చేసి సుందరీకరణ చేయాలన్నారు. హెచ్ఎండీఏలో ప్రత్యామ్నాయ వనరులు పెంచడానికి ఔటర్ రింగ్ రోడ్డు చుట్టూ ఉన్న ఖాళీ భూముల్లో పెట్టుబడులు పెట్టి టౌన్‌షిప్‌ల నిర్మాణం చేపట్టి ఆదాయాన్ని సృష్టించాలని సూచించారు. ఆర్థిక వ్యవస్థ అభివృద్ధికి హెచ్ఎండీఏ గుండెకాయగా నిలువాలన్నారు. 2031 మాస్టార్ ప్లాన్ ప్రకారం రోడ్ల విస్తరణకు అవకాశం ఉన్న ప్రాంతాల్లో మార్కు చేయాలని, అక్కడ ఇండ్ల నిర్మాణాలు చేపట్టకుండా ప్రజల్లో అవగాహన కల్పించాలని సూచించారు. రియల్టర్లు వెంచర్లను పూర్తి స్థాయిలో డెవలప్ చేయకుండా, ప్రభుత్వానికి మార్టిగేజ్ చేసిన ప్లాట్లను సైతం రిలీజ్ చేసుకోకుండా నిర్లక్ష్యంగా వదిలేస్తున్నారన్నారు. దాంతో ప్లాట్లను కొనుగోలు చేసిన ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని, ఈ సమస్యను పరిష్కరించడానికి హెచ్ఎండీఏ చొరవ చూపాలని తెలిపారు. రాష్ట్రంలో ఎల్ఆర్ఎస్ కింద 39లక్షల మంది దరఖాస్తు చేసుకున్నారని, ఈ ప్రక్రియను వేగవంతం చేయాలని, ప్రభుత్వం నుంచి కావాల్సిన సహకారాన్ని అందిస్తామన్నారు. పారిశ్రామిక వాడల్లో టెండర్ల ద్వారా భూములు దక్కించుకున్నవారు వాటిని వినియోగించుకుంటున్నారా? లేదా? ఖాళీగా ఉంటే వాటిని వెనక్కి తీసుకోవాలని చెప్పారు. ఇది సాధ్యం కాకుంటే అందులో ప్రభుత్వానికి రావాల్సిన వాటాను రాబట్టాలన్నారు. సమావేశంలో ఆర్థిక శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావు, మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్ అండ్ అర్బన్ డెవలప్‌మెంట్ ప్రిన్సిపల్ సెక్రటరీ దానకిషోర్, గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కమిషనర్ రోనాల్డ్ రోస్, మున్సిపల్ డైరెక్టర్ దివ్య, మెట్రో ఎండీ ఎన్‌వీఎస్ రెడ్డి, డిప్యూటీ సీఎం సెక్రెటరీ కృష్ణ భాస్కర్, తదితరులు పాల్గొన్నారు.

మతం వేరు.. రాజకీయం వేరు

- మోడీ ఆధునిక.. నయా నియంత
- నేటి నుంచి సీపీఐ జాతీయ సమావేశాలు
- ఎమ్మెల్యే, సీపీఐ రాష్ట్ర కార్యదర్శి : కూనంనేని సాంబశివరావు



నవతెలంగాణ-హిమాయత్ నగర్

మతం వేరు, రాజకీయం వేరు అనే విషయాన్ని ప్రజల్లోకి తీసుకెళ్తామని ఎమ్మెల్యే, సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావు అన్నారు. శ్రీరాముని పేరుతో బీజేపీ ఓట్లు కొల్లగొట్టడం అంటే అది శ్రీరామునికి అపచారం చేయడమేనని అన్నారు. గురువారం హైదరాబాద్ హిమాయత్‌నగర్‌లోని సీపీఐ రాష్ట్ర కార్యాలయంలో మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. సీపీఐ జాతీయ సమితి సమావేశాలు శుక్రవారం నుంచి హైదరాబాద్‌లో ప్రారంభం కానున్నట్టు వెల్లడించారు. మూడు రోజులపాటు మగ్దూం భవన్‌లో జరిగే ఈ సమావేశాల్లో తాజా రాజకీయ పరిణామాలు, లోక్‌సభ ఎన్నికలను ఎలా ఎదుర్కోవాలి, అందులో సీపీఐ పాత్ర ఎలా ఉండాలి, ఇండియా కూటమి నేపథ్యంలో సీట్ల సర్దుబాటు, రాజకీయపరమైన చర్చ జరగనుందని వివరించారు. దేశవ్యాప్తంగా వివిధ రాష్ట్రాల నుంచి సుమారు 150 మంది జాతీయ సమితి సభ్యులు హాజరు కానున్నారని తెలిపారు. అదేవిధంగా ఈ నెల 4న హైదరాబాద్‌లోని సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో పాలస్తీనా సంఘీభావ సభ నిర్వహిస్తున్నామని, ఈ సభకు సీపీఐ జాతీయ ప్రధాన కార్యదర్శి డి.రాజా, సీఎం ఎ.రేవంత్ రెడ్డి, కేరళ రాష్ట్ర మంత్రులు, ఎంపీలు, ఎమ్మెల్యేలు హాజరు కానున్నట్టు చెప్పారు.

రామ జపంతో మొదలై మోడీ జపం వరకు వచ్చిందని, మోడీ ఫ్లెక్సీలే కనిపిస్తాయని విమర్శించారు. కేసీఆర్‌కు వేసే ప్రతి ఓటు బీజేపీకి పోయినట్టేనని, అలాగే ఏపీలో జగన్‌కు వేసిన ఓట్లు కూడా బీజేపీకి వెళ్తాయన్నారు. నియంతలలో ఆధునీకతను జోడించి ప్రధాని మోడీ ఆధునిక, నయా నియంతగా మారారని విమర్శించారు. అమయాక ప్రజల భక్తిని ఆసరాగా చేసుకుని మోడీ ప్రభుత్వం మోసం చేస్తోందన్నారు. దక్షిణ అయోధ్యగా పేరున్న భద్రాచలం శ్రీరాముని దేవాలయం మాత్రం మోడీ ప్రభుత్వానికి పట్టడం లేదన్నారు. పాలమూరు -రంగారెడ్డి ప్రాజెక్ట్, కృష్ణానది, గోదావరి నిర్వహణ బాధ్యతను కేంద్రం బలవంతంగా రాష్ట్రాల నుంచి తీసుకుందన్నారు. బీజేపీ అరాచకత్వంతో ప్రతిపక్షాలను విచ్ఛిన్నం చేస్తున్నదని ఆగ్రహం వ్యక్తం చేశారు. కాళేశ్వరంపై జరిగిన అవినీతిని కక్కించాలన్నారు.

తిరుమల తిరుపతి దేవస్థానంలో తెలంగాణ ఎమ్మెల్యేల ఉత్తరాలను తీసుకోవడం లేదని, మన డబ్బులు కూడా టీటీడీలో ఉన్నాయని గుర్తు చేశారు. తెలంగాణ ఎమ్మెల్యేలు రాసే ఉత్తరాల అంశాన్ని ఏపీ ప్రభుత్వం సరిదిద్దాలని, లేకపోతే ఈ అంశంలో రాష్ట్రంతోపాటు తిరుపతిలో ఆందోళన కార్యక్రమాలు చేపడతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సీపీఐ జాతీయ కార్యదర్శి సయ్యద్ అజీజ్ పాషా, జాతీయ కార్యవర్గ సభ్యులు చాడ వెంకట్ రెడ్డి, రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు పల్లా వెంకట్ రెడ్డి, టి.శ్రీనివాస్ రావు, ఎస్.బాల మల్లేష్, కలవేణి శంకర్ తదితరులు ఉన్నారు.

జ్ఞానవాపి మసీదులో హిందువుల పూజలు

- వారణాసి కోర్టు అనుమతించటంతో నిర్వహణ
- ముందుండి జరిపించిన జిల్లా యంత్రాంగం
- మసీదు కమిటీ అభ్యంతరం
- తొలుత సుప్రీంకోర్టు..ఆ తర్వాత హైకోర్టును ఆశ్రయించిన ముస్లిం పక్షం

లక్నో : జ్ఞానవాపి మసీదు కాంప్లెక్స్‌లో బుధవారం రాత్రి హిందువులు పూజలు చేశారు. వారణాసి జిల్లా మేజిస్ట్రేట్ ఎస్. రాజలింగం నేతృత్వంలో ఈ ప్రార్థనలు జరిగాయి. హిందువులు పూజలు నిర్వహించుకోవటానికి వారణాసి కోర్టు ఆదేశాలు జారీ చేసిన కొన్ని గంటలకే ఈ పరిణామం చోటు చేసుకోవటం గమనార్హం.

సీల్ చేసిన బేస్‌మెంట్‌లో ప్రార్థనలు చేసుకోవచ్చని వారణాసి న్యాయస్థానం హిందువులకు అనుకూలంగా బుధవారం తీర్పును వెలువర్చింది. మసీదు స్థానంలో హిందూ ఆలయం ఉన్నదన్న భారత పురావస్తు శాఖ నివేదిక బయటపడిన తర్వాత ఈ తీర్పు రావటం గమనార్హం. ప్రభుత్వాధికారులతో కలిసి మసీదు కాంప్లెక్స్‌లోకి వెళ్లిన రాజలింగం అక్కడ దాదాపు రెండు గంటల పాటు గడిపారు.

సైన్‌బోర్డులను ధ్వంసం చేసిన హిందూత్వ గ్రూపు

అయితే, ఈ పూజల సందర్భంగా హిందూత్వ శక్తులు రెచ్చిపోయాయి. హిందూత్వ గ్రూపు రాష్ట్రీయ హిందూ దళ్.. ఆ ప్రాంతంలోని సైన్‌బోర్డులను ధ్వంసం చేసింది. జ్ఞాన్‌వాపీ మసీదుకు వైపున్న సైన్ బోర్డులపై 'మందిర్', 'టెంపుల్' అనే పదాలను చేర్చింది. అయితే, తాజా పరిణామంపై తమకు సమాచారం అందలేదని అంజుమాన్ ఇంతెజామియా మజీద్ కమిటీ ఆరోపించింది. కోర్టు ఆదేశాలకు సంబంధించిన కాపీ తమకు ఇంకా అందలేదని మసీదు కమిటీ జాయింట్ సెక్రెటరీ ఎస్.ఎం యాసిన్ తెలిపారు.

'తొందరపాటుగా వ్యవహరిస్తున్న జిల్లా యంత్రాంగం'

ఈ విషయంలో ముస్లిం పక్షం సుప్రీంకోర్టును ఆశ్రయించింది. అయితే, వారణాసి జిల్లా కోర్టు ఆదేశాల విషయంలో అలహాబాద్ హైకోర్టును ఆశ్రయించాలని మసీదు కమిటీకి సుప్రీంకోర్టు తెలిపింది. దీంతో హైకోర్టును మసీదు కమిటీ ఆశ్రయించింది. కోర్టు ఆదేశాల తర్వాత జిల్లా యంత్రాంగం తొందరపాటుతో వ్యవహరిస్తున్నదని తన పిటిషన్‌లో ఆరోపించింది. జిల్లా యంత్రాంగం తీరును తప్పుబడుతూ పిటిషన్‌లో పలు అభ్యంతరాలను మసీదు కమిటీ లేవనెత్తింది.

మోడీ మార్క్ 'అభివృద్ధి నమూనా' !

(మొదటిపేజీ తరువాయి)

పార్శ్వాన్ని చూపించింది. 2024-25 సంవత్సరానికి పూర్తి స్థాయి బడ్జెట్‌ను ప్రవేశపెట్టే బాధ్యత 2024 ఎన్నికల తర్వాత ఏర్పడబోయే కొత్త ప్రభుత్వం, పార్లమెంట్‌దే అయినా 2023-24 సంవత్సరానికి సవరించిన గణాంకాలు ఈ కథనాన్ని తెలియచేస్తున్నాయి.

2023-24లో రెవెన్యూ వసూళ్ళు బడ్జెట్ అంచనాలను అధిగమించాయి, అంతకుముందు సంవత్సరంతో పోలిస్తే 13.3 శాతం పెరిగాయి. అయినప్పటికీ, ద్రవ్యలోటును కుదించేందుకు గానూ బడ్జెట్ అంచనాల కన్నా కిందిస్థాయికి కేంద్ర ప్రభుత్వ వ్యయాలు తగ్గించబడ్డాయి. అధికారికంగా 8.9శాతంగా అంచనా వేయబడిన జీడీపీ నామమాత్రపు వృద్ధి కన్నా ఈ ఖర్చులు కేవలం 7శాతమే మాత్రమే పెరిగాయి. బడ్జెట్‌లో పేర్కొన్నదానికన్నా ప్రభుత్వ నిర్వహణా ఖర్చులు అధికంగా వున్నప్పటికీ ఈ ఖర్చుల్లో కోత పడింది. ఫలితంగా, సంక్షేమ పథకాలపై అలాగే మూలనిధి పెట్టుబడులపై చేయాల్సిన ఖర్చులు తగ్గిపోయాయి. ఇది భవిష్య వృద్ధిని, ఆర్థిక మూల సూత్రాలను ప్రతికూలంగా ప్రభావితం చేస్తుంది.

వ్యవసాయం, అనుబంధ కార్యకలాపాలు, విద్య, ఆరోగ్యం, సామాజిక సంక్షేమం, పీఎం క్రిషి సించాయ్ యోజన, ఎస్సీ, ఎస్టీలకు ఇతర గ్రూపులకు అంబ్రెల్లా పథకాలు వంటి అనేక అంశాలపై పెట్టే వ్యయాలన్నీ బడ్జెట్ స్థాయిల కన్నా తక్కువగానే వుంచారు. పీఎం ఆవాస్ యోజన, పీఎం గ్రామ్ సడక్ యోజన, పీఎం పోషణ్‌లపై సవరించిన వ్యయాలు బడ్జెట్‌లో పేర్కొన్నదాని కన్నా తక్కువగా వుండడమే కాకుండా 2022-23లోని వ్యయాల కన్నా కూడా తక్కువగా వున్నాయి. మహిళలు, చిన్నారుల కోసం నిర్దిష్టంగా ఉద్దేశించిన పథకాలపై వ్యయాలు కూడా తగ్గాయి. 2022-23లో కన్నా 2023-24లో ఇలా వ్యయాలు తగ్గడమనేది ఎరువులు, ఆహార సబ్సిడీలు, మహాత్మాగాంధీ గ్రామీణ ఉపాధి హామీ చట్టం, పట్టణాభివృద్ధి వంటి రంగాలపై పద్దుల్లో కూడా కనిపిస్తోంది. 2022-23, 2023-24 మధ్య ఆహార సబ్సిడీల్లో కోత రూ.60470కోట్లుగా కనిపిస్తోంది. ఎరువుల సబ్సిడీలు రూ.62445కోట్లు మేరా తగ్గిపోయాయి. 2023-24లో ఎంఎన్ఆర్ఈజీఏపై ఖర్చు అంతకుముందు సంవత్సరంతో పోలిస్తే రూ.4806కోట్లు తక్కువగా వుంది. గ్రామీణాభివృద్ధి వ్యయాలు, రాష్ట్రాలకు బదలాయింపులు స్తంభించిపోయాయి. అంటే వాస్తవిక రూపంలో చూసినట్లైతే కోతలు పడ్డాయి. జీఎస్టీ నష్టపరిహారానికి అనుగుణంగా గతంలో ఇచ్చిన రుణాల కన్నా మూల నిధి పెట్టుబడుల కోసం ఇచ్చిన రుణాలు చాలా తక్కువగా వుండడంతో రాష్ట్రాలు మరింత ఇబ్బందులు పడ్డాయి.

కేంద్ర ప్రభుత్వం ఖర్చులను తగ్గించేయడం, మరోవైపు సాపేక్షంగా రెవెన్యూలు మెరుగుపడడం ఇవన్నీ కూడా అత్యంత పేలవమైన వృద్ధి నేపథ్యంలోనే చోటు చేసుకున్నాయి. 2023-24లో అంచనా వేయబడిన 'వాస్తవిక' వృద్ధి పూర్తిగా కల్పితమే. పైగా, 2023-24లో ద్రవ్యోల్బణ రేటు 1.6శాతం మేరా తగ్గిందన్న అసంబద్ధమైన ప్రతిపాదన ఇందుకు ప్రాతిపదికగా వుంది. దాదాపు ఆరు శాతంగా వున్న వినిమయ ధరల సూచీ (సీపీఐ), దాదాపు పదిశాతంగా వున్న ఆహార ద్రవ్యోల్బణం ప్రాతిపదికన ద్రవ్యోల్బణ రేట్లు చూసినట్లైతే ఇది పూర్తిగా అసమానంగా, విరుద్ధంగా వుంది. ధరల పెరుగుదలను అరికట్టేందుకు గానూ 2023 ఫిబ్రవరి నుండి ఆర్‌బిఐ తన రెపో రేటును 6.5శాతంగానే కొనసాగిస్తూ రావడం భారతదేశంలో ద్రవ్యోల్బణం వాస్తవిక కథనాన్ని వెల్లడిస్తోంది.

అభివృద్ధి పేలవంగా వున్నప్పటికీ, ప్రభుత్వం మాత్రం నెమ్మదిగా పెరుగుతున్న ఆ ఆదాయాన్ని కూడా బడా వ్యాపార సంస్థలకు, ధనవంతులు, సంపన్నులకు అనుకూలంగా పంపిణీ చేసి ప్రయోజనాలు పొందింది. కోవిడ్ ముందు కాలంతో పోలిస్తే కార్పొరేట్ పన్నులు, ఆదాయ పన్నుల నుండి ఆదాయాలు గణనీయంగా పెరిగాయి. పన్ను రేట్లు పెరగడం వల్ల ఇది జరగలేదు, మొత్తం ఆదాయంలో సంపన్నుల వాటా పెరగడం వల్ల ఇది జరిగింది. ఇది కె-నమూనా రికవరీ, ఎక్కువగా పనిచేస్తూ తక్కువగా ఆదాయం పొందేలా కార్మికవర్గాన్ని పీల్చి పిప్పి చేస్తున్న 'అభివృద్ధి' ఇది.

అభివృద్ధి క్రమంలో కార్మికులను కూడా భాగస్వాములుగా చేరుస్తూ 'వాస్తవికమైన సామాజిక న్యాయం' సాధిస్తున్నామంటూ మోడీ ఆర్భాటంగా చేసుకుంటూ వస్తున్న ప్రచారంలోని డొల్లతనాన్ని, పటాటోపాన్ని ఈ తాత్కాలిక బడ్జెట్ పూర్తిగా బహిర్గతం చేసింది. దేశంలోని కొద్దిమంది లాభాలను గరిష్టంగా పెంచడానికి అనుకూలంగా దేశంలోని అపార కార్మిక వర్గం జీవనోపాధులను పీల్చి పిప్పి చేస్తున్న మోడీ ప్రభుత్వ మార్క్ దుర్మార్గమైన 'అభివృద్ధి నమూనా' ను ఈ బడ్జెట్ అమలు చేసింది.

నేటి నుంచే ప్రత్యేక పాలన

(మొదటిపేజీ తరువాయి)

హెచ్చరించింది. అభివృద్ధికి సంబంధించిన నిధులను ప్రత్యేక అధికారి, గ్రామ కార్యదర్శి సంయుక్త ఆమోదంతో డ్రా చేసుకునేలా జాయింట్ చెక్‌పవర్ అవకాశాన్ని కల్పించింది. అయితే, డిజిటల్ కీకి అధీకృత అధికారిగా ప్రత్యేక అధికారులే ఉంటారు. డిజిటల్ కీ, చెక్కులు, రికార్డుల్లో ఏదైనా సమస్య తలెత్తితే కార్యదర్శిదే బాధ్యత. ఇక నుంచి గ్రామ పంచాయతీలకు వచ్చే నిధులన్నింటికీ ప్రత్యేక అధికారులు, పంచాయతీ కార్యదర్శులు సమన్వయంతో ఖర్చు చేయాల్సి ఉంటుంది.

రామమందిర ప్రాణ ప్రతిష్టకు వ్యతిరేకంగా క్యాంపస్‌లో నిరసన

- విద్యార్థిని సస్పెండ్ చేసిన నిట్ కాలికట్

కాలికట్ : రామ మందిర ప్రాణ ప్రతిష్టకు వ్యతిరేకంగా జరిగిన నిరసన కార్యక్రమంలో పాల్గొన్నందుకు ఒక విద్యార్థిని నిట్ కాలికట్ సస్పెండ్ చేసింది. గతనెల 22న యూపీలోని అయోధ్యలో ప్రధాని మోడీ చేతుల మీదుగా ప్రాణ ప్రతిష్ట కార్యక్రమం జరిగిన విషయం విదితమే. ఆ రోజు క్యాంపస్‌లో ఒక గ్రూపు విద్యార్థులు ఈ కార్యక్రమాన్ని సెలబ్రేట్ చేసుకున్నారు. ఒక విల్లు, బాణంతో కూడిన కాషాయ రంగు భారత మ్యాపును పెయింట్ వేశారు. అయితే, దీనిని మరొక వర్గం విద్యార్థులు వ్యతిరేకించారు. ఇందులో సస్పెండ్ అయిన విద్యార్థి ఉన్నాడు. భారత్ అంటే రామ రాజ్యం కాదని ప్లకార్డులు ప్రదర్శించారు. దీంతో ఇరు వర్గాల మధ్య వాగ్వాదం చోటు చేసుకున్నది. సస్పెండ్ అయిన విద్యార్థి పాల్గొన్న చట్ట వ్యతిరేక కార్యక్రమం క్యాంపస్‌లో అశాంతిని రాజేసిందని క్రమశిక్షణ కమిటీ దర్యాప్తులో తేలిందని క్యాంపస్ డీన్ పేర్కొన్నారు. ఈ మేరకు ఆయన ఒక సర్క్యులర్‌ను జారీ చేశారు. కాగా, ఇన్‌స్టిట్యూట్.. సదరు విద్యార్థిని ఏడాది పాటు సస్పెండ్ చేసింది. అనుమతి లేకుండా క్యాంపస్‌లో, హాస్టల్ పరిసర ప్రాంతాల్లో అడుగు పెట్టకుండా నిషేధించింది.

'ముంపు' తొలగినట్టేనా..!

ఖమ్మంలో మున్నేరుపై ఆర్‌సీసీ వాల్ నిర్మాణ ప్రక్రియ షురూ..

- రూ.690.52 కోట్ల పనులకు టెండర్లకు పిలుపు.. 7వరకు దాఖలు గడువు
- 8.5 కి.మీ మేర నదికి ఇరువైపులా నిర్మాణం
- 6 నుంచి 11 మీటర్ల ఎత్తుతో గోడ



నవతెలంగాణ- ఖమ్మం ప్రాంతీయ ప్రతినిధి

మున్నేరుపై రెయిన్‌ఫోర్స్‌డ్ సిమెంట్ కాంక్రీట్ (ఆర్‌సీసీ) వాల్ నిర్మాణం కలగానే మిగులుతుందేమో.. అనుకున్న ఖమ్మం శివారు పాలేరు, ఖమ్మం నియోజకవర్గ ప్రజల ఆందోళన తీరుస్తూ పనుల ప్రక్రియ మొదలైంది. రూ.690.52 కోట్లను దీని నిర్మాణానికి రాష్ట్ర ప్రభుత్వం కేటాయించి.. టెండర్లు పిలిచింది. ఈ నెల 7వ తేదీ వరకు టెండర్లు దాఖలు చేయొచ్చని ప్రభుత్వం సూచించింది. ఖమ్మం రూరల్, అర్బన్ మండలాల నీటిపారుదల శాఖ ఆధీనంలో పనులు చేపట్టనున్నారు. మున్నేరుకు ఇరువైపులా ఆర్‌సీసీ వాల్ నిర్మాణం పూర్తయితే ఇటు ఖమ్మం, అటు పాలేరు నియోజకవర్గంలోని పరివాహక ప్రాంతాలకు వరద ముంపు తొలగుతుంది.

ఆర్‌సీసీ వాల్ నిర్మాణం ఇలా..

ఆర్‌సీసీ వాల్ నిర్మాణ విషయానికొస్తే.. నదికి రెండు వైపులా గోడల మధ్య దూరం 300 మీటర్లు ఉండేలా భూ సేకరణ చేశారు. నది మధ్య భాగం నుంచి 150 మీటర్లు ఉండేలా హద్దులు నిర్ణయించారు. ఇప్పటికే మార్కింగ్ చేయడం కూడా పూర్తయింది. నదికి కుడి, ఎడమ వైపులా మొత్తం 8.5 కి.మీ పొడవునా ఈ గోడలు నిర్మిస్తారు. దాదాపు గోళ్లపాడు చెక్‌డ్యామ్ నుంచి మొదలై సిటీ ఔట్ పాయింట్ ప్రకాశ్‌నగర్ వరకు ఈ గోడల నిర్మాణం కొనసాగుతుంది. ఈ గోడల ఎత్తు 6 నుంచి 11 మీటర్ల వరకు ఉంటుంది. రెండు కి.మీలకు ఓ ఫ్లడ్ బ్యాంక్ చొప్పున మట్టి, రాతి కట్టల నిర్మాణం చేపడతారు. గోడకు రెండు వైపులా వెలుపల భాగాన మురుగు నీటి కాల్వల నిర్మాణం చేపడతారు. ప్రకాశ్‌నగర్ దాటాక ఈ డ్రెయిన్‌లు మున్నేరులో కలుస్తాయి. ఈ డ్రెయిన్‌లతో కలిపే ఇరువైపులా 150 మీటర్ల చొప్పున భూ సేకరణ చేశారు. గోడల నిర్మాణంతో నిర్వాసితులుగా మారే వారి కోసం వేరొక చోట స్థలాన్ని కేటాయించేలా ప్రభుత్వం ఏర్పాట్లు చేస్తోంది. బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో రూపొందించిన డిజైన్‌లో నాటి మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్ బోటింగ్ కోసం చెక్‌డ్యామ్‌లు ఏర్పాటు చేయాలని సూచించారు. కానీ చెక్‌డ్యామ్‌ల ఏర్పాటుతో వరద ఉధృతి అధికంగా ఉండి తిరిగి నష్టాలు చోటుచేసుకునే అవకాశం ఉంటుందని నీటిపారుదల శాఖ నిపుణులు సూచించారు. ఈ నేపథ్యంలో ఎలాంటి చెక్ డ్యామ్‌లూ లేకుండానే నిర్మాణం చేపట్టాలని కాంగ్రెస్ ప్రభుత్వం నిర్ణయించింది. ప్రకాశ్‌నగర్ వద్ద గతంలో రూ.కోట్ల వ్యయంతో నిర్మించిన చెక్‌డ్యామ్ గతేడాది జూలైలో వచ్చిన వరదలకు దెబ్బతింది. ఈ చెక్‌డ్యామ్, బఫర్‌జోన్ నిబంధనలు దాటి విచ్చలవిడిగా వెంచర్లకు పరిమితులు ఇవ్వడం మూలంగానే గతేడాది మున్నేరు వరద ముంపు తీవ్రత అధికంగా ఉన్నట్టు గుర్తించారు.

మంత్రి పొంగులేటి హామీతో కదలిక..

మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి ఆర్‌సీసీ వాల్ అంశాన్ని అసెంబ్లీ ఎన్నికలకు ముందే ప్రస్తావించారు. మున్నేరు ముంపు ప్రభావిత ప్రాంతాల్లో సందర్శించినప్పుడు ఆయన కరకట్ట బదులు ఆర్‌సీసీ వాల్ ప్రస్తావన తెచ్చారు. కాంగ్రెస్ అధికారంలోకి వస్తే ఆర్‌సీసీ వాల్ నిర్మిస్తామని హామీ ఇచ్చారు. స్థలం, వ్యయం దృష్ట్యా ఆయన ఈ మేరకు అంచనా వేశారని నీటిపారుదల శాఖ అధికారులు అంటున్నారు. గతేడాది మున్నేరులో 30.50 అడుగుల నీటిమట్టం నమోదైంది. 2005లో ఇంతకు మించి నీటిమట్టం నమోదైనా ఇంతభారీ నష్టం చోటుచేసుకోలేదు. ఈ వాల్ నిర్మిస్తే నగరంలో బొక్కలగడ్డ, మోతీనగర్, కాల్వొడ్డు, సుందరయ్యనగర్, ప్రకాశ్‌నగర్, త్రీటౌన్‌లోని వివిధ ప్రాంతాలు, రూరల్ మండలంలోని నాల్గో తరగతి ఉద్యోగుల కాలనీ, రాజీవ్ గృహకల్ప, జలగం నగర్, పెద్దతండా తదితర ప్రాంతాలకు ఎంతో మేలు జరగనుంది

డా.జ్యోతి జీవితం స్ఫూర్తిదాయకం

డాక్టర్ సిరిపురపు జ్యోతి... గొప్ప మానవతావాది. ఎనస్తీషియా వైద్యురాలిగా సుపరిచితురాలైన ఆమె నిస్వార్థ సేవల గురించి ఉయ్యూరు ప్రాంతంలో తెలియని వారంటూ లేరు. వృత్తి లోనూ, ప్రవృత్తిలోనూ మానవత్వం మూర్తీభవించిన వ్యక్తి ఆమె. తన గురించి పక్కన పెట్టి ఇతరుల కష్టసుఖాల గురించి ఆలోచించడం ఆమె పుట్టుకతో వచ్చిన తత్వం. పేదలకు విద్య, వైద్య పరంగా అనేక సేవా కార్యక్రమాలు చేపట్టారు. కమ్యూనిస్టు కుటుంబంలో పుట్టింది కాబట్టే ఆమె ఇలా జీవించగలిగిందని నా నమ్మకం. సామాజిక స్పృహతో నిత్యం పేదలకు చేయూతనిచ్చే ఆమె క్యాన్సర్‌తో పోరాడి ఇటీవలె మరణించింది. మరణానంతరం కూడా కొంతమంది మహనీయులుగా సమాజంలో అలా మిగిలిపోతారు. అలాంటి కోవకే చెందుతారు ఆమె. అలాంటి గొప్ప వ్యక్తిత్వమున్న ఆమె జయంతి ఈ రోజు. స్ఫూర్తిదాయకమైన ఆమె జీవిత పరిచయం మానవి పాఠకులకు ప్రత్యేకం.



నాగేళ్ల రాజేశ్వరమ్మ, జానకి రామయ్యలకు ఏకైక కుమార్తె జ్యోతి. బాల్యం నుండి అల్లారు ముద్దుగా బంధువులు, ఇరుగుపొరుగు వారి ఆలనా పాలనలో పెరిగింది. అమ్మ ఎప్పుడూ తన దగ్గరే ఉండాలని కోరుకుంది. 'నా 12 ఏండ్ల వయసులో చదువు కోసం ఫిరంగిపురం హాస్టల్‌కు నన్ను పంపుతున్న రోజున నేను వెళ్లే వరకు నాతో ఉండమని అమ్మను అడిగాను. కానీ నాకు మీటింగ్ ఉంది, నాన్నకు కూడా నీవే భోజనం పెట్టి వెళ్ళమని చెప్పినప్పుడు చాలా బాధ పడ్డాను. వయసు పెరిగే కొద్దీ అమ్మ చేస్తున్న ప్రజాసేవకు గురించి అర్థమయింది. బంధువులు, ఇరుగుపొరుగువారు 'భర్తను, పిల్లను పట్టించుకోకుండా మీటింగ్‌లంటూ వెళుతుంది' అని అంటే అస్సలు సహించేదాన్ని కాదు. మా అమ్మ ఆశయం చాలా గొప్పది అని వారితో వాదించేదాన్ని' అంటూ తన తల్లి గురించి మాతో ఎప్పుడూ చెప్తుండేవారు. ఆ మాటలు మాలో ఎంతో స్ఫూర్తిని నింపేవి.

మహనీయుల మధ్యన...

స్వాతంత్రోద్యమం ముమ్మరంగా సాగుతున్న కాలం అది. మరో వైపు రామ్మోహనరావు, గురజాడ, వీరేశలింగం వంటి సంఘ సంస్కర్తల నాయకత్వంలో సాంఘిక దురాచారాలు, సతీసహ గమనం, బాల్య వివాహాలు, వివక్ష, అసమానత్వానికి వ్యతిరేకంగా ఉద్యమాలు జరుగుతున్నాయి. ఆడవాళ్లు గడప దాటి బయటకు వెళ్ల కూడదని ఆంక్షలు నడుస్తున్న కాలంలో కడియాల గోపాలరావు, పుచ్చలపల్లి సుందరయ్య, మానికొండ సుబ్బారావు వంటి మహనీయులు మహిళలను చైతన్య పరిచి 1936లో కృష్ణా జిల్లా మహిళా సంఘాన్ని ఏర్పాటు చేశారు. దానిని నిర్వహించే బాధ్యతలు మానికొండ సూర్యవతి, నాగేళ్ల రాజేశ్వరమ్మ, వల్లభనేని సీతామహాలక్ష్మీ, చంద్ర సావిత్రీదేవి, డా॥అచ్చమాంబ తదితరులకు అప్పగించారు. ఆనాటి నుండి జరిగిన పోరాటాల ఫలితంగానే తర్వాత కాలంలో మహిళలకు అనేక హక్కులు అందించాయి. అలాంటి వారి మధ్య పెరిగి, అభ్యుదయ భావాలను అందిపుచ్చుకున్న మానవతా వాది డా.జ్యోతి. ఎమర్జెన్సీ ముగిసిన తర్వాత జరిగిన ఓ సమావేశానికి రాజేశ్వరమ్మతో పాటు జ్యోతి కూడా వచ్చింది. అప్పుడే నాకు ఆమెతో పరిచయం. అప్పటి నుండి ఆమెను ఆప్యాయంగా అక్కా అని పిలుచుకునేదాన్ని.

తల్లి నిర్బంధ జీవితంతో...

కృష్ణాజిల్లాలోని కాటూరు గ్రామానికి 'ఆంధ్రామాస్కో'గా పేరుంది. కమ్యూనిస్టు పార్టీ బలంగా ఉన్న ఇలాంటి గ్రామాలు ఆనాడు పెద్ద ఎత్తున జరుగుతున్న తెలంగాణా సాయుధ రైతాంగ పోరాటానికి ఎన్నుదన్నుగా నిలబడ్డాయి. అలాంటి బలమైన గ్రామాలపై ప్రభుత్వం నిఘా పెంచింది. పార్టీపై నిషేదం విధించింది. ఆ రోజుల్లో జ్యోతి తల్లి రాజేశ్వరమ్మ రహస్య జీవితంలో ఉన్నారు. రహస్యంగా ఉన్న వారిని పట్టి ఇవ్వాలని ప్రభుత్వం ప్రజలను భయపెట్టింది. భయపెట్టడమే కాక మలబారు పోలీసులు గ్రామంలో ప్రజలపై దాడులు చేసి అత్యంత అమానుషంగా 150 మందిని వీధుల్లోకి లాక్కొచ్చారు. వివస్త్రలను చేసి లాఠీలతో కొట్టారు. ఊరంతా నగ్నంగా ఊరేగించుకుంటూ గాంధీ బొమ్మ చుట్టు ప్రదర్శనలు చేయించారు. ఈ హేయమైన, అమానుషమైన చర్య రాష్ట్రమంతా దావానలంలా వ్యాపించింది. అప్పటికి చిన్నదైన జ్యోతిని ఈ ఘటన భయభ్రాంతులకు గురిచేసింది.



ఆనాటి మహిళా నాయకులు సూర్యవతి, భిక్షవతి గార్లతో...

స్ఫూర్తిని నింపాయి...

తన తల్లి జైలు, రహస్య జీవితం అనుభవించింది. అయినా ఎన్ని కష్టాలు ఎదురైనా తల్లి తాను నమ్మిన మార్క్సిజం - లెనినిజం సిద్ధాంతానికి చివరి దశ వరకు కట్టుబడి ఉండటం జ్యోతిలో స్ఫూర్తిని నింపాయి. 'నా చదువు విషయంలో అమ్మ ప్రత్యేక శ్రద్ధ తీసుకోనేది. విశాఖ ఆంధ్ర యూనివర్శిటీలో మెడిసన్ చదివేటప్పుడు ఊరి నుండి మా ఇంట్లో పని చేస్తున్న రాములును నాకు సాయం చేసేందుకు పంపింది. అప్పట్లో నేను నా క్లాస్‌మేట్ జగత్‌ను ఇష్ట పడ్డాను. వివాహం చేసుకుంటానని అమ్మతో చెప్తే తనే నాన్నను ఒప్పించింది. 1965లో నా వివాహాన్ని ఘనంగా జరిపించింది. కానీ 1967లో డాక్టర్ జగత్ అనారోగ్యంతో మరణించారు. దాంతో చాలా కుంగిపోయాను' అంటూ మాతో అప్పుడప్పుడు చెప్పుకొని బాధపడేవారు.



ఆదాయం మొత్తం పేదలకే...

జ్యోతి స్పెషలైజేషన్ (ఎనస్తీషియా) చేయటానికి ఇంగ్లాండ్ వెళ్లింది. 1977లో తల్లిదండ్రుల ప్రోద్భలంతో డాక్టర్ ప్రసాద్‌ను వివాహం చేసుకుంది. తర్వాత అమెరికా, ఇంగ్లాండు, దుబాయ్, అబూదబి మొదలైన దేశాల్లో వైద్యురాలిగా పని చేసింది. ఇండియా వచ్చి కొద్ది కాలం హైదరాబాద్‌లో ప్రాక్టీస్ కొనసాగించింది. వృద్ధాప్యంలో ఉన్న తల్లిదండ్రులను చూసుకునేందుకు సొంతూరైనా కాటూరు వచ్చి అక్కడి నుండే ఉయ్యూరు, కానూరు, విజయవాడ, మచిలీపట్నం హాస్పిటల్స్‌లో ఎనస్తీషియాగా వైద్యాన్ని అందించేది. వైద్యురాలిగా తనకు వచ్చిన ఆదాయం మొత్తం పేద రోగుల మందులు, వారి పిల్లల ఫీజులకు ఉపయోగించేది. తన చివరి దశలోనూ పేదవారు ఎవరైన వైద్య సహాయం కోసం వస్తే డాక్టర్ దగ్గరకు పంపడమే గాక ఒక్కో సందర్భంలో వారి ఫీజులు కూడా ఈమే చెల్లించేది. తన ఇంట్లో పని చేసే వారి పిల్లలకు ఉన్నత చదువులకు ఆర్థిక సహాయం అందించి తన మానవత్వాన్ని చాటుకుంది.

ట్రస్ట్ ఏర్పాటు చేసి...


తల్లి అనారోగ్యంగా ఉన్న సమయంలో జ్యోతి ఆమెను కంటికి రెప్పలా కాపాడుకుంది. ఏలాంటి బెడ్‌సోర్స్ రాకుండా జాగ్రత్త పడింది. ఆ సమయంలోనే జ్యోతి చర్మ క్యాన్సర్ బారిన పడ్డారు. అయినా తన ఆరోగ్యం కన్నా తల్లి ఆరోగ్యాన్నే చూసుకుంది. తాను ఓ డాక్టర్ అయి ఉండి కూడా తన ఆరోగ్యం గురించి పట్టించుకోక పోవడం మాకు చాలా బాధగా అనిపించేది. తన తల్లి కోసమే జీవిస్తుందా అన్నట్టుగా ఉండేది. అలా చివరి వరకు పేదల కోసమే పని చేసిన తల్లి రాజేశ్వరమ్మ 2016లో చనిపోయారు. తన తల్లిదండ్రుల ఆశయాలను కొనసాగించాలనే ఉద్దేశంతో ఆమె వారి పేరుతో ఉయ్యూరులో ఓ ట్రస్టును ఏర్పాటు చేసి దాని నిర్వహణకు, ఆఫీసు నిర్మాణానికి 30 లక్షలు ఖర్చుపెట్టింది. కరెంటు పోతే ఇబ్బంది అవుతుందని జనరేటర్ సౌకర్యం కూడా ఏర్పాటు చేసింది.

తన తర్వాత కూడా...

క్యాన్సర్ వ్యాధితో చివరి దశలో ఉన్న జ్యోతి తన అమ్మ నాన్న ఆశయాలు చిరకాలం నిలవలని బ్యాంకులో తన అకౌంట్ పేరుతో ఉన్న 71 లక్షలను ఉయ్యూరులో నాగళ్ళ రాజేశ్వరమ్మ, జానకి రామయ్య విజ్ఞాన కేంద్రానికి కార్పస్ ఫండ్‌గా ఏర్పాటు చేసింది. దాని పైన వచ్చే వడ్డీని పేదలకు ఉచిత విద్య, వైద్యం, ఉపాధి, వృత్తి శిక్షణా కేంద్రాలు నిర్వహించాలని ఆమె కాంక్షించింది. మనుషులు పుడతారూ, చనిపోతూనే ఉంటారు. ఈ రెండు సంఘటనల మధ్య జీవితాన్ని ఎలా గడిపారు, తన చుట్టూ ఉన్న సమాజం పట్ల ఎలా ప్రవర్తించారు అనేదే ముఖ్యం. అలా నిజంగా జీవించిన జ్యోతి జీవితం నేటి తరానికి స్ఫూర్తిదాయకం. తల్లి రాజేశ్వరమ్మ ఆశయాన్ని, ఆదర్శాన్ని తేది వరకు పాటించి, తన తర్వాత కూడా పేదలకు సేవలు కొనసాగాలని కోరుకున్న గొప్ప మానవతా వాది, ధన్యజీవి ఆమె.

- కె.స్వరూపారాణి





యాలకులతో...

సుగంధ ద్రవ్యాల్లో యాలకులు కూడా ఒకటి. వీటిని వంటల్లో మంచి సువాసన కోసం మాత్రమే కాదు... ఆరోగ్య పరంగా అందులో వున్న విలువలను శరీరానికి అందించేందుకు వేస్తుంటారు. ఈ యాలకులు చేసే ఉపయోగాలు కొన్నింటిని చూద్దాం.

- కొందరు కడుపు ఉబ్బరం తో బాధపడుతుంటారు. అలాంటి వారు యాలకులు పొడి చేసి, అర చెంచా పౌడర్ తీసుకొని చిన్న గ్లాసులో సగం నీళ్ల తీసుకుని ఉడకబెట్టాలి. ఆ నీటిని తాగితే కడుపు ఉబ్బరం తగ్గిపోతుంది.
- పిల్లలలో జలుబుకి యాలకులు మంచి ఔషధంగా చెప్పవచ్చు. నాలుగు లేదా ఐదు యాలకులు నిప్పులపై వేసి ఆ పొగను పీల్చినట్లయితే ముక్కు కారటం తగ్గుతుంది.
- అధిక సూర్యరశ్మిలో తిరిగినప్పుడు తేలికపాటి తల నొప్పి రావచ్చు. ఇందుకోసం, నాలుగు లేదా ఐదు యాలకులు చూర్ణం చేసి, వాటిని సగం టంబ్లర్ నీటిలో వేసి, కషాయాలను తయారు చేసి, కొద్దిగా తాటి జామ్ వేసి తాగాలి, వెంటనే మైకం తొలగిపోతుంది.
- డిప్రెషన్ ఉన్నవారు 'యాలకుల టీ' తాగితే సాధారణ స్థితికి వస్తారు. తక్కువ టీ పౌడర్, ఎక్కువ యాలకులు కలిపిన టీ తీసుకుంటే మనసుకు ఆహ్లాదం కలుగుతుంది. అయితే యాలకులు ఎక్కువగా నమలడం లేదంటే నోటిలో చాలా సమయం అలాగే ఉంచడం మంచిదికాదు.

భ్రమలు కల్పించడానికే...

(మొదటిపేజీ తరువాయి)

రూ.45 లక్షల కోట్లు కాగా, 2024-25 సంవత్సరానికి రూ.47.6 లక్షల కోట్లతో మధ్యంతర బడ్జెట్‌ను కేంద్రం ప్రవేశపెట్టిందని తెలిపారు. గత బడ్జెట్లలో దేశంలో 25 కోట్ల మందిని దారిద్ర్యరేఖ నుంచి ఎగువకు తెచ్చామని చెప్పిందని గుర్తు చేశారు. మరోవైపు దారిద్ర్యరేఖలో మగ్గుతున్న వారికి రానున్న ఐదేండ్లు ఐదు కిలోల చొప్పున ఉచిత బియ్యం సరఫరా చేస్తామని ఇప్పుడు ప్రకటించారని పేర్కొన్నారు. పేదలు, యువకులు, మహిళలు, రైతులే ప్రధాన లక్ష్యంగా బడ్జెట్‌ను రూపొందించామని చెప్పినా పేదల పరిస్థితి మరింత దిగజారుతున్నదని ఆందోళన వ్యక్తం చేశారు. ఉపాధిహామీ నిధులు 2022-23లో రూ.91 వేల కోట్లు వ్యయం చేయగా, 2024-25లో రూ.86 వేల కోట్లు ప్రవేశపెట్టారని తెలిపారు. ఆహార సబ్సిడీ రూ.మూడు లక్షల కోట్ల నుంచి రూ.2.63 లక్షల కోట్లకు కుదించారని పేర్కొన్నారు. ఎరువుల సబ్సిడీని రూ.2.55 లక్షల కోట్ల నుంచి రూ.1.68 లక్షల కోట్లకు తగ్గించారని వివరించారు. కేంద్రం ఒకవైపు నిత్యావసర సరుకుల ధరలు పెంచుతూ, మరోవైపు సబ్సిడీలకు కోత పెడుతున్నదని విమర్శించారు. నిరుద్యోగం, ఆరోగ్యం తదితర సమస్యలను ప్రస్తావించకుండా రామమందిరం నిర్మాణం ద్వారా రానున్న కాలంలో దేశాభివృద్ధి అవుతుందనీ, 2047 నాటికి దేశంలో దారిద్ర్యం పూర్తిగా నిర్మూలించబడుతుందని ఓట్ ఆన్ అకౌంట్ బడ్జెట్‌లో ప్రకటించడం ప్రజలను మోసం చేయడమేనని తెలిపారు.

త్వరలో మరో రెండు గ్యారంటీలు

(మొదటిపేజీ తరువాయి)

ఆదేశించారు. ఒక్కో గ్యారంటీ అమలుకు ఎంత ఖర్చవుతుంది? ఎంత మందికి లబ్ధి కలుగుతుందనే వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఈ నెలలో ప్రవేశ పెట్టే ఓటాన్ అకౌంట్ బడ్జెట్లోనే వాటికి అవసరమైన నిధులు కేటాయించాలని ఆర్థిక శాఖకు సూచించారు. అసెంబ్లీ సమావేశాల్లోపు మరోసారి క్యాబినేట్ సబ్ కమిటీతో సమావేశమై తుది నిర్ణయం తీసుకుంటామని చెప్పారు. గతేడాది డిసెంబర్ 28 నుంచి జనవరి6 వరకు నిర్వహించిన ప్రజాపాలన కార్యక్రమంలో అయిదు గ్యారంటీలకోసం మొత్తం 1,09,01,255 దరఖాస్తులు వచ్చాయనీ, వీటికి సంబంధించిన డేటా ఎంట్రీ పూర్తి చేసినట్లు అధికారులు సీఎంకు వివరించారు. అందులో కొందరు ఒకే పేరుతో రెండు, మూడు దరఖాస్తులు ఇచ్చారనీ, కొన్నింటికి ఆధార్, రేషన్ కార్డు నెంబర్లు లేవని తెలిపారు. అలాంటి వాటిని మరోసారి పరిశీలించాలనీ, అవసరమైతే క్షేత్రస్థాయికి వెళ్లి వివరాలు సేకరించాలని ముఖ్యమంత్రి ఆదేశించారు. అర్హులైన వారెవరూ నష్టపోకుండా ఒకటికి రెండు సార్లు సరి చూడాలని కోరారు. దరఖాస్తుల్లో తప్పులుంటే వాటిని సరిదిద్దుకునేందుకు ఎంపీడీవో ఆఫీసుల్లో లేదా తదుపరి నిర్వహించే ప్రజా పాలన కార్యక్రమంలో మరోసారి అవకాశమివ్వాలని సూచించారు. గ్యారంటీల అమలుకు లేని పోని నిబంధనలు పెట్టి ఎవరినీ ఇబ్బంది పెట్టొద్దని చెప్పారు. ఇంకా దరఖాస్తు చేయని వారుంటే నిరంతర ప్రక్రియగా దరఖాస్తు చేసే అవకాశం కల్పించాలని సీఎం ఆదేశించారు. ఈ సమీక్షలో ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతి కుమారి, డిజీపీ రవిగుప్తా,ఆర్థిక శాఖ ముఖ్య కార్యదర్శి రామకృష్ణ రావు, సివిల్ సప్లయిస్ కమిషనర్ డీఎస్ చౌహన్, మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్ ప్రిన్సిపల్ సెక్రెటరీ దానకిషోర్, జీహెచ్ఎంసీ కమిషనర్ రోనాల్డ్ రోస్, హోం శాఖ సెక్రటరీ జితేందర్, సీఎం ప్రిన్సిపల్ సెక్రటరీ శేషాద్రి, ఇతర ఉన్నాతాధికారులు పాల్గొన్నారు.

అరెస్టును సవాలు చేస్తూ..

(మొదటిపేజీ తరువాయి)

శుక్రవారం విచారణ జరుపతామని ప్రధాన న్యాయమూర్తి డీవై చంద్రచూడ్ నేతృత్వంలోని బెంచ్ తెలిపింది. 'మనీ లాండరింగ్ నిరోధక చట్టంలోని సెక్షన్ 19పై న్యాయస్థానం వివరణ ఇవ్వాల్సి ఉంది. ఓ వ్యక్తిని ఈ విధంగా ఎలా అరెస్ట్ చేస్తారు?' అని సిబల్ ప్రశ్నించారు. దీనిపై ఈడీ తరపు న్యాయవాది తుషార్ మెహతా వాదనలు వినిపిస్తూ ఇదే తరహా పిటిషన్‌ను జార్ఖండ్ హైకోర్టులో కూడా దాఖలు చేశారని తెలిపారు. అయితే హైకోర్టులో ఉన్న పిటిషన్‌ను ఉపసంహరించుకుంటామని సిబల్ చెప్పారు.

ఇదిలావుండగా రాంచీలోని మనీ లాండరింగ్ నిరోధక న్యాయస్థానం సొరేన్‌ను ఒక రోజు జ్యుడీషియల్ కస్టడీకి పంపింది. పది రోజుల పాటు కస్టడీకి ఇవ్వాలన్న ఈడీ అభ్యర్థనను తోసిపుచ్చింది.

నిరాశపరిచిన నిర్మలమ్మ బడ్జెట్

(మొదటిపేజీ తరువాయి)

కల్పన కోసం ఏదైనా పథకమో లేక కార్యక్రమమో ప్రకటిస్తారని ఎదురు చూసిన నిరుద్యోగుల ఆశలు ఆవిరయ్యాయి.

ఈ వరాలతో సరి

పేద, మధ్య తరగతి ప్రజల సొంతింటి కలను సాకారం చేసేందుకు ప్రధానమంత్రి ఆవాస్ యోజన పథకం కింద రాబోయే ఐదు సంవత్సరాల్లో మరో రెండు కోట్ల ఇళ్లను నిర్మిస్తామని నిర్మల తెలిపారు. విద్యుత్ బిల్లుల నుండి సామాన్యులకు ఊరట కల్పించే ఉద్దేశంతో కొత్తగా సౌరశక్తి పథకాన్ని ప్రకటించారు. ఇందులో భాగంగా కోటి ఆవాసాలకు ప్రతి నెలా 300 యూనిట్ల ఉచిత విద్యుత్ లభిస్తుందని చెప్పారు. ఇళ్లపై సౌర ఫలకాలు ఏర్పాటు చేసుకునే వారికి ఏడాదికి రూ.15,000 నుండి రూ.18,000 ఆదా అవుతుందని తెలిపారు.

పట్టణ పేదల కోసం కూడా ఆర్థిక మంత్రి ఓ పథకాన్ని ప్రకటించారు. 'అద్దె ఇళ్లు, మురికివాడలు, అనధికారిక కాలనీలలో నివసించే మధ్యతరగతి ప్రజలు ఇళ్లను కొనుగోలు చేసేందుకు లేదా నిర్మించుకునేందుకు సాయం అందిస్తాం' అని చెప్పారు. అయితే ఈ పథకం లక్ష్యాన్ని మాత్రం వివరించలేదు. 9-14 సంవత్సరాల మధ్య వయసున్న బాలికలు సర్వైకల్ క్యాన్సర్ బారిన పడకుండా వ్యాక్సిన్ల తయారీని ప్రోత్సహిస్తామని అన్నారు. దేశంలో మరిన్ని వైద్య కళాశాలల ఏర్పాటుకు కమిటీని ఏర్పాటు చేస్తామని, ఆయుష్మాన్ భారత్ పథకాన్ని ఆశా వర్కర్లు, అంగన్‌వాడీ కార్యకర్తలు, సహాయకులకు కూడా వర్తింపజేస్తామని తెలిపారు. ప్రధానమంత్రి స్వనిధి ద్వారా ఇప్పటి వరకూ 78 లక్షల మంది వీధి వ్యాపారులకు రుణాలు అందించామని, రాబోయే కాలంలో మరో 2.3 లక్షల మందికి కొత్త రుణాలు ఇస్తామని ఆర్థిక మంత్రి చెప్పారు. పంటలకు నానో డీఏపీ ఎరువులు అందజేస్తామని అన్నారు. చమురు గింజల రంగంలో ఆత్మ నిర్భరత సాధిస్తామని ఆశాభావం వ్యక్తం చేశారు. 2, 3 తరగతులకు చెందిన నగరాలకు కొత్తగా విమాన సర్వీసులు ప్రారంభిస్తామని తెలిపారు. ఎలక్ట్రిక్ వాహనాల కోసం ఛార్జింగ్ స్టేషన్లు, ప్రజా రవాణా కోసం ఎలక్ట్రిక్ బస్సుల్ని ప్రోత్సహిస్తామని వివరించారు.

స్వల్పంగా పెరిగిన కేటాయింపులు

మధ్యంతర బడ్జెట్‌లో పలు కీలక పథకాలకు కేటాయింపులు పెద్దగా పెంచలేదు. గ్రామీణ ఉపాధి హామీ పథకానికి కేటాయింపులను కేవలం రూ.26,000 కోట్లు మాత్రమే పెంచారు. ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో ఈ పథకానికి రూ.60,000 కోట్లు కేటాయించగా వచ్చే ఆర్థిక సంవత్సరంలో రూ.86,000 కోట్లు (సవరించిన అంచనాలు) కేటాయించారు. ఇక ఆయుష్మాన్ భారత్ (పీఎంజేఏవై) పథకానికి కేటాయింపులు రూ.7,200 కోట్ల నుండి రూ.7,500 కోట్లకు అంటే కేవలం రూ.300 కోట్లు మాత్రమే పెరిగాయి.

కీలకమైన ఆరోగ్యం, విద్య రంగాలకు సైతం మధ్యంతర బడ్జెట్‌లో కేటాయింపులు అరకొరగానే ఉన్నాయి. ఇక్కడ గమనించాల్సిన ముఖ్యమైన విషయమేమంటే ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో ఈ రంగాలకు జరిపిన కేటాయింపుల్ని సైతం పూర్తి స్థాయిలో ఖర్చు చేయలేదు. ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో విద్యపై రూ.1,16,417 కోట్లు ఖర్చు చేయాల్సి ఉండగా రూ.1,08,878 కోట్లు మాత్రమే ఖర్చు పెట్టారు. అదే విధంగా ఆరోగ్య రంగంపై రూ.88,956 కోట్లు ఖర్చు పెట్టాల్సి ఉండగా రూ.79,221 కోట్లు వ్యయం చేశారు.

కేటాయింపుల్లోనూ కోతలే

ఎస్సీ, ఎస్టీ, మైనారిటీల సంక్షేమం కోసం ఉద్దేశించిన కీలక పథకాలకు కూడా మధ్యంతర బడ్జెట్ కేటాయింపుల్లో కోత విధించారు. ఉదాహరణకు షెడ్యూల్డ్ కులాల వారి అభివృద్ధి కోసం ఒకే గొడుగు కింద సాయం చేసేందుకు ఉద్దేశించిన పథకానికి (అంబ్రెల్లా స్కీమ్) బడ్జెట్ అంచనాలు రూ.9,409 కోట్లు కాగా సవరించిన అంచనాలు రూ.6,780 కోట్లు. షెడ్యూల్డ్ తెగలకు బడ్జెట్ అంచనాలు రూ.4,295 కోట్లు కాగా సవరించిన అంచనాలు రూ.3,286 కోట్లు. మైనారిటీలకు బడ్జెట్ అంచనాలు రూ.610 కోట్లు కాగా సవరించిన అంచనాలు రూ.555 కోట్లు. ఇతర బలహీన వర్గాలకు బడ్జెట్ అంచనాలు రూ.2,194 కోట్లు కాగా సవరించిన అంచనాలు రూ.1,918 కోట్లు.

పన్నులే ఆదాయం

ప్రభుత్వానికి ఇప్పుడు ఆదాయ పన్ను ద్వారానే అధిక ఆదాయం లభిస్తోంది. ప్రభుత్వానికి ప్రధాన ఆర్థిక వనరు అప్పులే అయినప్పటికీ అతి పెద్ద రెండో ఆర్థిక వనరు ఆదాయ పన్ను నుండి లభించే రాబడి. 2024-25 ఆర్థిక సంవత్సరంలో ప్రభుత్వ ఆర్థిక వనరుల్లో 19 శాతం రాబడి ఆదాయ పన్ను ద్వారా లభించేదేనని బడ్జెట్ పత్రాలు చెబుతున్నాయి. ప్రభుత్వ ఆర్థిక వనరుల్లో 17శాతం కార్పొరేట్ పన్నులు, 18శాతం జీఎస్టీ, 28శాతం అప్పుల ద్వారా సమకూరుతోంది.

ద్రవ్యలోటును మరింత తగ్గిస్తాం

రాబోయే ఆర్థిక సంవత్సరంలో దేశంలో ఉత్పత్తి అయ్యే వస్తువులు, సేవల మొత్తం మార్కెట్ విలువ (నామినల్ జీడీపీ) 10.5శాతం పెరగవచ్చునని ప్రభుత్వం భావిస్తోంది. తాజా బడ్జెట్ పత్రాల ప్రకారం ఈ విలువ రూ.3,22,71,808 కోట్లు ఉండవచ్చునని అంచనా. ద్రవ్య లోటును 5.8శాతానికి తగ్గించామని నిర్మలా సీతారామన్ చెప్పారు. వచ్చే ఆర్థిక సంవత్సరం నాటికి దీనిని 5.1శాతానికి, 2025-26 నాటికి 4.5శాతానికి తగ్గిస్తామని తెలిపారు. మూలధన వ్యయాన్ని రూ.10 లక్షల కోట్లకు పెంచాలని ప్రభుత్వం లక్ష్యంగా నిర్దేశించుకున్నప్పటికీ సవరించిన అంచనాలను బట్టి అది సాధ్యపడలేదని తేలింది. మూలధన వ్యయం రూ.9.5 లక్షల కోట్లకే పరిమితమైంది.

ప్రతిపక్షాలపై విసుర్లు

గంట పాటు సాగిన నిర్మలమ్మ బడ్జెట్ ప్రసంగంలో... బీజేపీపై ప్రతిపక్షాలు చేస్తున్న ఆరోపణల్ని తిప్పికొట్టారు. బీజేపీ మెజారిటీ వాదానికే కొమ్ముకాస్తోందన్న విమర్శను ప్రస్తావిస్తూ మోడీ ప్రభుత్వం లౌకికవాదాన్ని బలపరిచే చర్యలు చేపడుతోందని చెప్పారు. అవినీతి ఆరోపణలతో ప్రతిపక్ష నేతలపై జరుగుతున్న విచారణలను గురించి మాట్లాడుతూ 'గతంలో సామాజిక న్యాయం ఓ రాజకీయ నినాదంగా ఉండేది. మా ప్రభుత్వానికి సంబంధించి అది సమర్థవంతమైన, అవసరమైన పరిపాలనా మోడల్. ప్రజలందరికీ సామాజిక న్యాయం అందేలా చూడాలి. అవినీతిని తగ్గించాలి. బంధుప్రీతిని రూపుమాపాలి' అని అన్నారు.

ప్రమాణస్వీకారంలో ఆలస్యమెందుకు?

(మొదటిపేజీ తరువాయి)

నెలకొన్నదని మనుసింఘ్వీ చెప్పారు. శాసనసభలో అధికార పక్షానికి 47-48 మంది, ప్రతిపక్షానికి 33 లేదా 32 మంది ఉన్నారని స్పష్టమైందని గుర్తు చేశారు. అయినా గవర్నర్ ఇప్పటి వరకూ ఎందుకు చర్య తీసుకోలేదని నిలదీశారు. మెజారిటీ శాసనసభ్యులు మద్దతు లేఖలు ఇచ్చినప్పటికీ ఎందుకింత ఆలస్యం జరుగుతోందో అర్థం కావడం లేదని అన్నారు. 'మీరు ప్రధాని లేదా హోం మంత్రి కార్యాలయం నుండి ఆదేశాల కోసం ఎదురు చూస్తున్నారా? లేక ఎమ్మెల్యేలు పార్టీ ఫిరాయింపులు జరపడం కోసం చూస్తున్నారా? ప్రజాస్వామ్యబద్ధంగా ఎన్నికైన ప్రభుత్వాన్ని తొలగించి రాష్ట్రపతి పాలన విధించేందుకు వేచి ఉన్నారా?' అంటూ గవర్నర్‌పై మనుసింఘ్వి ప్రశ్నల వర్షం కురిపించారు.

నేడు ఇంద్రవెల్లికి సీఎం రేవంత్‌రెడ్డి

నవతెలంగాణ- ఆదిలాబాద్ ప్రాంతీయ ప్రతినిధి

రాష్ట్రంలో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ పార్టీ లోక్‌సభ ఎన్నికల్లోనూ విజయమే లక్ష్యంగా సమాయత్తం అవుతోంది. ఇందులో భాగంగా ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి శుక్రవారం ఆదిలాబాద్ జిల్లా పర్యటనకు రానున్నారు. పోరాటాల పురిటిగడ్డగా భావించే ఇంద్రవెల్లిలో బహిరంగ సభ నిర్వహించనున్నారు. రెండేండ్ల కిందట టీపీసీసీ అధ్యక్షుడి హోదాలో దళిత, గిరిజన దండోరా పేరిట ఇంద్రవెల్లిలో బహిరంగ సభ నిర్వహించడంతో భారీ సంఖ్యలో జనాలు హాజరయ్యారు.

ఈ సభ విజయవంతం కావడంతో రాష్ట్రవ్యాప్తంగా అసెంబ్లీ ఎన్నికల సమయంలో కాంగ్రెస్‌కు ఒక ఊపు వచ్చింది. హస్తం పార్టీ అధికారంలోకి రావడానికి ఈ సభ దోహదం చేసిందని చెప్పొచ్చు. అదే సెంటిమెంట్‌ను పునరావృతం చేస్తూ సీఎం హోదాలోనూ రేవంత్‌రెడ్డి ఇక్కడే తొలి బహిరంగ సభ నిర్వహించేందుకు సిద్ధమయ్యారు. రానున్న లోక్‌సభ ఎన్నికలే లక్ష్యంగా కాంగ్రెస్ ఇప్పటి నుంచే కసరత్తు ప్రారంభించింది. ఇందులో భాగంగా సీఎం రేవంత్‌రెడ్డి జిల్లాల పర్యటనకు ఇంద్రవెల్లి నుంచి శ్రీకారం చుడుతున్నారు. ఇంద్రవెల్లి స్థూపం వద్ద స్మృతివనం నిర్మాణాన్ని ప్రారంభించడంతోపాటు నాగోబా ఆలయంలో పూజలు నిర్వహించి అభివృద్ధి పనులను ప్రారంభించనున్నారు. ఈ బహిరంగ సభను విజయవంతం చేసేందుకు ఉమ్మడి జిల్లా ఇన్‌చార్జి మంత్రి సీతక్క ప్రతిష్టాత్మకంగా తీసుకుంటున్నారు. రెండ్రోజులుగా జిల్లాలోనే మకాం వేశారు. ఉమ్మడి జిల్లాలోని కాంగ్రెస్ పార్టీ ఎమ్మెల్యేలు, నియోజకవర్గాల ఇన్‌చార్జీలతో సమావేశాలు నిర్వహించి భారీ జన సమీకరణ చేపట్టాలని స్పష్టం చేశారు. ఈ సభకు ఉమ్మడి జిల్లావ్యాప్తంగా భారీ స్థాయిలో జనాన్ని తరలించేందుకు ఆ పార్టీ శ్రేణులు సిద్ధమవుతున్నాయి.

కేఆర్ఎంబీ చేతికి సాగర్, శ్రీశైలం !

(మొదటిపేజీ తరువాయి)

ఇచ్చినట్టు తెలిపారు. పవర్ స్టేషన్లపై ఇంకా ఎలాంటి నిర్ణయం తీసుకోలేదన్నారు. నాగార్జునసాగర్‌ను తెలంగాణ శ్రీశైలంను ఏపీ చూసుకుంటాయన్నారు. ప్రాజెక్టులన్నీ ఇక నుంచి బోర్డు పరిధిలో నడుస్తాయని తెలిపారు. తమ డిమాండ్లపై కేంద్రానికి లేఖలు రాసినట్టు ఈఎన్సీ మురళీధర్ తెలిపారు. ఇంకా అక్కడ నుంచి నిర్ణయం రాలేదని తెలిపారు. నీటి వాటాల పంపకంపై త్రిసభ్య కమిటీనే నిర్ణయం తీసుకుంటుందన్నారు. ప్రాజెక్టుల వద్ద భద్రత అనేది పరిస్థితిని భట్టి బోర్డు ఆదేశాల మేరకు జరుగుతుందన్నారు. కేఆర్ఎంబీ పరిధిలో ఉన్న 15 ప్రాజెక్టులన్నీ బోర్డు పరిధిలోకి వెళ్తాయన్నారు. ప్రాజెక్టులను పూర్తిగా అప్పగించలేదనీ, ఆపరేషన్లు, నీటి విడుదల బోర్డు చూసుకుంటుందన్నారు. సీఆర్‌పీఎఫ్ భద్రత సైతం కృష్ణా బోర్డు పరిధిలోనే ఉంటుందన్నారు. నిర్వహణ కోసం సిబ్బంది కేటాయింపు 40: 45 కావాలని కోరుతున్నట్టు తెలిపారు. కృష్ణాజలాల్లో 50 శాతం వాటా డిమాండ్‌కు కట్టుబడి ఉన్నామని చెప్పారు. ఏవైనా సమస్యలు ఉత్పన్నమైతే ఢిల్లీ వేదికగా పరిష్కరించుకోవచ్చని చెప్పారు.

మాకు అభ్యంతరం లేదు : ఏపీ ఈఎన్సీ

ఏపీ ఈఎన్సీ నారాయణరెడ్డి మాట్లాడుతూ బోర్డు పరిధిలో మొత్తం 15 కాంపెనెంట్స్‌లో తొమ్మిది తెలంగాణ, ఆరు ఆంధ్రప్రదేశ్‌వి ఉన్నాయన్నారు. కృష్ణా బోర్డుకు ప్రాజెక్టుల అప్పగింతపై తమకు ఎలాంటి అభ్యంతరం లేదని చెప్పారు. ఆపరేషన్ ఇరు రాష్ట్రాల నుంచి సిబ్బంది కేటాయింపు ఉంటుందన్నారు. నీటి కేటాయింపులపై త్రిసభ్య కమిటీదే తుది నిర్ణయమని చెప్పారు. ప్రాజెక్టుల నిర్వహణ ప్రోటోకాల్ త్రిసభ్య కమిటీ అప్పుడున్న పరిస్థితుల్లో తీసుకుంటుదని, లెఫ్ట్ మెయిన్ కెనాల్ నుంచి రెండు టీఎంసీలు, మార్చి సమయంలో రైట్ మెయిన్ కెనాల్ నుంచి మూడు టీఎంసీలు ఏపీకి విడుదల చేసేందుకు ఒప్పుకున్నారన్నారు. ఏప్రిల్‌లో ఐదు టీఎంసీలు ఏపీకి ముందుగానే కేటాయింపులు ఉన్నాయనీ, ప్రాజెక్టుల నిర్వహణ కోసం తెలంగాణ ఒప్పుకుందన్నారు.

గందరగోళంలో రాష్ట్రం : మాజీ మంత్రి హరీశ్‌రావు

ప్రాజెక్టుల నిర్వహణ కృష్ణా బోర్డుకు అప్పగించడం గందరగోళాన్ని తలపిస్తున్నది. ప్రభుత్వం తప్పుదోవన వెళుతున్నది. తెలంగాణ ప్రయోజనాలకు నష్టం. ఇక నుంచి చుక్క నీరు తీసుకోవాలన్నా బోర్డు అనుమతి తప్పనిసరి. పర్మిషన్ లేకుండా విద్యుత్ ఉత్పత్తి చేయడం సాధ్యమా ! ఇంజినీర్లు, అధికారులు అక్కడకు వెళ్లలేరు. మార్పు అంటే ఇదా ? రాష్ట్రం హక్కులు, అధికారాలు కేంద్రం చేతిలో పెట్టడమా ? కాంగ్రెస్‌కు మెజారిటీ కట్టబెట్టిన పాలమూరు, రంగారెడ్డి, నల్లగొండ ప్రజలకు కాంగ్రెస్ ప్రభుత్వం చేసే మేలు ఇదేనా ? తెలంగాణ ప్రయోజనాలు కాపాడేది ఎవరో ఈ చర్యతోనే స్పష్టమవుతున్నది.

రాష్ట్రాల హక్కులకు భంగం కలగొద్దు: సాగునీటి రంగ నిపుణులు సారంపల్లి మల్లారెడ్డి

ప్రాజెక్టులను కృష్ణాబోర్డుకు అప్పగించొద్దు. హక్కులను కాపాడాలి. మార్గదర్శకాలకు అనుగుణంగా నీటి వాటాలు అమలు చేయించాలి. స్వయంగా తానే చేయకూడదు. ఇది రాష్ట్రాల హక్కులకు భంగం కలిగించడమే. అనవసర సమస్యలు రాకుండా చూడాలి. శాంతిభద్రతలను కాపాడాలి. గెజిట్‌కు భిన్నమైన చర్యలు తీసుకోవద్దు. ఏ ప్రాజెక్టును బోర్డునూ స్వాధీన పరచొద్దు. కృష్ణా బోర్డు అధికారాలను అమలు చేయడం కాదు, ఇరు రాష్ట్రాలతో ఎక్కడిక్కడ అమలుచేయించాలి.

ఈగల్ మ్యూజిక్ అత్యద్భుతం


దేవ్ జాంద్

రవితేజ నటిస్తున్న తాజా యాక్షన్ థ్రిల్లర్ 'ఈగల్'. కార్తీక్ ఘట్టమనేని దర్శకత్వంలో పీపుల్ మీడియా ఫ్యాక్టరీ పతాకంపై నిర్మాత టీజీ విశ్వ ప్రసాద్ నిర్మిస్తుండగా, వివేక్ కూచిభొట్ల సహ నిర్మాతగా వ్యవహరిస్తున్నారు. కావ్య థాపర్, అనుపమ పరమేశ్వరన్ హీరోయిన్స్‌గా నటిస్తున్నారు.

ఈనెల 9న ఈ సినిమా ప్రపంచవ్యాప్తంగా గ్రాండ్‌గా విడుదల కానుంది. ఈ నేపథ్యంలో ఈచిత్ర సంగీత దర్శకుడు దేవ్ జాంద్ మీడియాతో మాట్లాడుతూ, 'నేను సెల్ఫ్ ఫ్రీ లాన్స్ మ్యూజిషియన్‌ని. హీరో శ్రీ విష్ణు, నేను గీతమ్ కాలేజ్‌లో క్లాస్ మేట్స్. శ్రీ విష్ణుని కలిసినప్పుడు కార్తీక్‌కి కూడా నా ట్యూన్స్ వినిపించేవాడిని. ఆయన రాసుకున్న ప్రతి స్క్రిప్ట్‌కి ముందు నుంచే మ్యూజిక్ కంపోజ్ చేసేవాడిని. అలా కార్తీక్‌తో జర్నీ కొనసాగింది. ఈ సినిమా కోసం మూడు ట్రాక్స్ కంపోజ్ చేసి కార్తీక్‌కి ఇచ్చాను. ఈ మూడు ట్రాక్స్ రవితేజ విన్నారు. ఆయనకి చాలా నచ్చాయి. అలా నన్ను తీసుకున్నారు. ఈ చిత్ర నేపథ్య సంగీతం విని అద్భుతంగా చేశానని రవితేజ ప్రశంసించారు. అది చాలా తృప్తిని ఇచ్చింది. ఇందులో చాలా కొత్త తరహా సంగీతం చేశాం. ఈ సినిమాలో స్క్రీన్ ప్లే, యాక్షన్, దర్శకుడు తీసిన విధానం చాలా యూనిక్‌గా ఉంటాయి. విడుదలైన మూడు పాటలు

విశ్వంభర షూటింగ్ షురూ..

చిరంజీవి నటిస్తున్న ఫాంటసీ అడ్వెంచర్ చిత్రం 'విశ్వంభర'. ఈ సినిమా కోసం చిరు జిమ్‌లో కసరత్తులు చేస్తూ ప్రత్యేకంగా సిద్ధమౌతున్నారు. ఈ వర్క్ అవుట్‌కి సంబంధించిన వీడియో ఇప్పుడు సోషల్ మీడియాలో టాప్ ట్రెండ్‌లో వైరల్ అవుతోంది. వీడియో చివర్లో 'గెట్టింగ్ రెడీ ఫర్ విశ్వంభర' అని మెగాస్టార్ చెప్పడం అభిమానుల్లో మరింత ఉత్సాహాన్ని నింపింది. ఈ నెల నుంచి చిరు ఈ సినిమా షూటింగ్‌లో జాయిన్ అవుతున్నారు.


చిరంజీవి

'బింబిసార' ఫేమ్ వశిష్ట ఈ మెగా ఫాంటసీ అడ్వెంచర్‌కు దర్శకత్వం వహిస్తున్నారు. యువి క్రియేషన్స్ పతాకంపై విక్రమ్, వంశీ, ప్రమోద్ అత్యంత భారీ బడ్జెట్‌తో నిర్మిస్తునారు.వచ్చే ఏడాది సంక్రాంతికి సినిమాను విడుదల చేస్తామని మేకర్స్ ఇప్పటికే అనౌన్స్ చేశారు. ఈ చిత్రానికి రచన, దర్శకత్వం: వశిష్ట, నిర్మాతలు: విక్రమ్, వంశీ, ప్రమోద్, సంగీతం: ఎంఎం కీరవాణి, డీవోపీ : ఛోటా కె నాయుడు, ప్రొడక్షన్ డిజైనర్: ఏఎస్ ప్రకాష్, కాస్ట్యూమ్ డిజైనర్: సుస్మిత కొణిదెల, ఎడిటర్: కోటగిరి వెంకటేశ్వరరావు, సంతోష్ కామిరెడ్డి, సాహిత్యం: శ్రీ శివ శక్తి దత్తా, చంద్రబోస్.

నవచిత్రం



ఈ నెలలోనే రిలీజ్



విలేజ్ బ్యాక్ డ్రాప్ లవ్ స్టోరీలోని సహజత్వాన్ని ఉట్టి పడేలా 'రాధా మాధవం' సినిమాను తెరకెక్కించారు. వినాయక్ దేశాయ్, అపర్ణా దేవీ హీరో, హీరో యిన్లుగా గోనాల్ వెంకటేష్ నిర్మించిన ఈ అందమైన ప్రేమ కథా చిత్రానికి దాసరి ఇస్సాకు దర్శకత్వం వహించారు. వసంత్ వెంకట్ బాలా కథ, మాటలు, పాటలు అందించారు. షూటింగ్ కంప్లీట్ చేసుకున్న ఈ మూవీ ట్రైలర్‌ను హీరో శ్రీకాంత్ రిలీజ్ చేశారు.

ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, 'ట్రైలర్ చూస్తే అందమైన ప్రేమ కథా చిత్రమని తెలుస్తోంది. ట్రైలర్ చాలా బాగుంది. ఈ సినిమా పెద్ద విజయం సాధించాలి. హీరో, దర్శక, నిర్మాతలకు మంచి గుర్తింపు తీసుకురావాలి' అని చెప్పారు. 'మా సినిమా ట్రైలర్‌ను హీరో శ్రీకాంత్ రిలీజ్ చేయడం ఆనందంగా ఉంది. ఈనెలలోనే మా సినిమా రాబోతోంది. ఆడియెన్స్ మా సినిమాను చూసి సక్సెస్ చేయాలి' అని నిర్మాత గోనాల్ వెంకటేష్ అన్నారు. దర్శకుడు ఇస్సాకు మాట్లాడుతూ, 'ఓ మంచి పాయింట్‌తో రూపొందిన ఈ సినిమా కచ్చితంగా విజయం సాధిస్తుందనే నమ్మకంతో ఉన్నాం. ప్రస్తుతం సెన్సార్ కార్యక్రమాలు జరుగుతున్నాయి' అని తెలిపారు.

సరికొత్త పాయింట్


అమరదీప్ చౌదరి, సుప్రీత

బిగ్ బాస్ ఫేమ్ అమరదీప్ చౌదరి హీరోగా, నటి సురేఖావాణి కుమార్తె సుప్రీత హీరోయిన్‌గా నూతన చిత్రం ప్రారంభమైంది.

మహర్షి కూండ్ల సమర్పణలో ఎం3 మీడియా బ్యానర్‌పై మహా మూవీస్‌తో కలిసి ప్రొడక్షన్ నెం 2గా మహేంద్ర నాథ్ కూండ్ల ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. గురువారం ప్రసాద్ ల్యాబ్‌లో పూజా కార్యక్రమంతో ఈ సినిమా ఆరంభమైంది. ముహూర్తపు సన్నివేశానికి బసిరెడ్డి క్లాప్ కొట్టగా, నిర్మాత ఏఎం రత్నం కెమెరా స్విచ్ ఆన్ చేశారు. దర్శకుడు వీర శంకర్ గౌరవ దర్శకత్వం వహించారు.

ఈ సందర్భంగా నిర్మాత మహేంద్ర నాథ్ కూండ్ల మాట్లాడుతూ, 'భారతీయ సినిమాలో ఇంత వరకు ఎవ్వరూ టచ్ చేయని పాయింట్. చాలా చాలా కొత్త పాయింట్' అని అన్నారు. 'మాలాంటి కొత్త వాళ్ళని ఎం3 మీడియా ఎంతో ప్రోత్సహించింది' అని దర్శకుడు మాల్యాద్రి రెడ్డి చెప్పారు.

అమర్ దీప్ చౌదరి మాట్లాడుతూ, 'ఈ సినిమా ఎలా ఉండబోతోందని మేం చెప్పడం కంటే.. మూవీ చూసి మీరే చెప్పాలి' అని తెలిపారు. 'అవకాశం ఇచ్చిన మేకర్స్‌కు థ్యాంక్స్' అని సుప్రీత చెప్పారు.

ఎవరూ ఊహించలేరు..

గీతానంద్, నేహా సోలంకి జంటగా దయానంద్ దర్శకత్వంలో రూపొందిన చిత్రం 'గేమ్ ఆన్'. మధుబాల, ఆదిత్య మీనన్, శుభలేఖ సుధాకర్ కీలక పాత్రలు పోషించారు. కస్తూరి క్రియేషన్స్ అండ్ గోల్డెన్ వింగ్ ప్రొడక్షన్స్ బ్యానర్స్‌పై రవి కస్తూరి నిర్మించారు.

ఈ చిత్రం నేడు (శుక్రవారం) విడుదల కానుంది. ఈ నేపథ్యంలో హీరో గీతానంద్ మీడియాతో మాట్లాడుతూ, 'ఇదొక యూనిక్ స్టోరీ. రెగ్యులర్‌గా కాకుండా డిఫరెంట్‌గా చేయాలని ప్రయత్నించాం. హీరో లూజర్ నుంచి విన్నర్‌గా ఎలా మారాడు అనేది ఆసక్తికరంగా ఉంటుంది. దీనిలో భాగంగా ఉండే టాస్కులు ప్రేక్షకులని ఆకట్టుకుంటాయి. డైరెక్టర్ దయానంద్ మా


గీతానంద్

తమ్ముడు కావడంతో స్క్రిప్ట్ విషయంలో ఇద్దరం బాగా డిస్కస్ చేసుకునే వాళ్ళం. మేమిద్దరం కలిసి చాలా షార్ట్ ఫిలిమ్స్ చేశాం. రియల్ టైమ్ సైకలాజికల్‌గా సాగే ఈ సినిమాతో ప్రేక్షకులు గేమ్ వరల్డ్‌లోకి వెళ్ళిపోతారు. యాక్షన్ సీక్వెన్సెస్ కూడా చాలా కొత్తగా ఉంటాయి. నేహా సోలంకి, నాకు మధ్య ఆన్ స్క్రీన్ కెమిస్ట్రీ బాగుంటుంది. మధుబాల ఇప్పటివరకు కనిపించని కొత్త క్యారెక్టర్‌లో కనిపిస్తారు. ఇందులో క్రేజీ బ్యాక్ స్టోరీ ఉంటుంది. ప్రేక్షకులు ఎవరు ఊహించలేరు అనేంతగా ఉంటుంది. ఆదిత్య మీనన్ గ్రేషేడ్‌లో కనిపిస్తారు. శుభలేఖ సుధాకర్ మా తాత పాత్రలో ఇన్స్పైరింగ్ రోల్ చేశారు. ఈ సినిమాకి బ్యాక్ గ్రౌండ్ స్కోర్ హైలైట్‌గా ఉంటుంది. నిర్మాత రవి కస్తూరి ఎక్కడా కాంప్రమైజ్ కాలేదు. అందుకే విజువల్స్, పాటలు చాలా రిచ్‌గా ఉంటాయి. ప్రీమియర్స్‌కి మంచి స్పందన వస్తుంది. రిలీజ్‌కి ముందే ఈ సినిమా డిజిటల్ రైట్స్‌కు ఫ్యాన్సీ ఆఫర్ రావడం చాలా ఆనందంగా ఉంది' అని అన్నారు.

నా పాత్ర ముగిసింది అనుకున్నాను!

కారు ప్రమాద ఘటనపై రిషబ్ పంత్



ముంబయి : 30 డిసెంబర్, 2022. భారత క్రికెట్‌ను షాక్‌కు గురి చేసిన రోజు. టీమ్ ఇండియా స్టార్ క్రికెటర్ రిషబ్ పంత్ తీవ్ర కారు ప్రమాదంలో ప్రాణాపాయ స్థితి నుంచి బయటపడిన రోజు అది. కుటుంబంతో గడిపేందుకు న్యూఢిల్లీ నుంచి రూర్కీ వెళ్తున్న సమయంలో కారు రోడ్డు డివైడర్‌కు ఢీకొని రిషబ్ పంత్ దారుణంగా గాయపడ్డాడు. ఆ సమయంలో అటుగా వెళ్తున్న ఇతర వాహనదారులు రిషబ్ పంత్‌ను కారు నుంచి బయటకు తీసి ప్రాణాలు కాపాడారు. పంత్ బయట పడని కాసేపట్లోనే అతడి ఎస్‌యూవీ కారు మంటల్లో పూర్తిగా కాలిపోయింది. మరణం అంచు వరకు వెళ్లి వచ్చిన రిషబ్ పంత్ ఓ టెలివిజన్ ఛానల్‌తో కారు ప్రమాదంపై మనోభావాలను పంచుకున్నాడు. ' ఈ ప్రపంచంలో నా సమయం అయిపోయింది' అని అనిపించిందని పంత్ భావోద్వేగంగా అన్నాడు.

'జీవితంలో తొలిసారి అంతా అయిపోయింది.. పోనీలే అనిపించింది. ఈ ప్రపంచంలో నా సమయం ముగిసిందని అనిపించింది. గతంలో ఎన్నడూ అటువంటి భావన నాలో కలుగలేదు. ప్రమాదం జరిగిన సమయంలో నాకు తగిలిన గాయాలు గుర్తున్నాయి. కానీ మరింత ప్రమాదకర గాయాలు కాకుండా బయటపడటం నా అదృష్టం. కుడి కాలు మోకాలుకు మూడు శస్త్రచికిత్సలు జరిగాయి. బెంగళూర్‌లోని జాతీయ క్రికెట్ అకాడమీలో రిహాబిలిటేషన్ కొనసాగించాను. రికవరీ సమయాన్ని కుదించేందుకు శ్రమించాను. గాయం నుంచి కోలుకునే ప్రక్రియ చాలా చిరాగ్గా ఉంటుంది. ప్రతి రోజు చేసిందే మళ్లీ చేయాలి. అది అసహనం కలుగజేస్తుంది. అయినా, చేయక తప్పదు. మళ్లీ క్రికెట్ ఆడటం మొదలు పెట్టే వరకు ఎటువంటి భవిష్యత్ ప్రణాళికలు వేసుకోవాలని అనుకోవటం లేదు. నేను కోలుకునే సమయంపై ఒక్కొక్కరు ఒక్కోలా చెప్పారు. నేను నా డాక్టర్‌ను నేరుగా అడిగాను. కనీసం 16-18 నెలలు సమయం పడుతుందని ఆయన చెప్పారు. అందులో కనీసం ఆరు నెలలు ముందుగానే పూర్తిగా కోలుకుంటానని డాక్టర్‌తో చెప్పాను. ప్రమాదం జరిగిన సమయంలో రజత్ కుమార్, నిషు కుమార్‌లు నన్ను కారు నుంచి బయటకు లాగారు. ఆ ఇద్దరిని జీవితాంతం రుణపడి ఉంటాను' అని రిషబ్ పంత్ అన్నాడు. బెంగళూర్‌లో ఆగస్టు 24, 2023న రిషబ్ పంత్ ఇంటర్వ్యూ తీసుకోగా.. సదరు ప్రసారదారు ఫిబ్రవరి 1న ప్రసారం చేశారు.

ఆటలు

హైదరాబాద్‌లో స్పిన్‌బాల్‌పై బజ్‌బాల్ సూపర్ హిట్ కొట్టింది. టీమ్ ఇండియా ఓటమెరుగని ఉప్పల్ స్టేడియంలో ఇంగ్లాండ్ అనూహ్య విజయంతో టెస్టు సిరీస్‌ను గొప్పగా మొదలెట్టింది. తొలి టెస్టులో ఊహించని ఓటమికి కీలక ఆటగాళ్ల గాయాలు జతకలవటంతో టీమ్ ఇండియా కాస్త నైరాశ్యంలో పడింది. విశాఖ తీరంలో కుర్రాళ్ల అండతో విజయమే లక్ష్యంగా బరిలోకి దిగుతున్న రోహిత్‌సేన కోసం బజ్‌బాల్ సవాల్ ఎదురుచూస్తోంది. భారత్, ఇంగ్లాండ్ రెండో టెస్టు నేటి నుంచి ఆరంభం.

స్టార్ బ్యాటర్ విరాట్ కోహ్లి లేడు. తొలి టెస్టులో రాణించిన కెఎల్ రాహుల్ దూరమయ్యాడు. మహా మాయగాడు రవీంద్ర జడేజా అందుబాటులో లేడు. ప్రతిభావంతులైన శుభ్‌మన్ గిల్, శ్రేయస్ అయ్యర్ ఫామ్‌లో లేరు. ఇంగ్లాండ్‌తో విశాఖ టెస్టు ముంగిట టీమ్ ఇండియా పరిస్థితి ఇది. గతంలో విశాఖలో టెస్టు ఓపెనర్‌గా తొలి మ్యాచ్‌లోనే హిట్ కొట్టిన రోహిత్ శర్మ.. ఇప్పుడు టెస్టు జట్టు సారథిగా అదే ఫలితం పునరావృతం చేయాలని చూస్తున్నాడు. లోకల్ బాయ్ భరత్‌కు తోడు తెలుగింటి తేజం రోహిత్ శర్మ విశాఖ టెస్టులో ఫ్యాన్స్ ఫేవరేట్స్‌గా బరిలోకి దిగుతున్నారు.

బాల్‌బాయ్ టూ పోస్టర్‌బాయ్!



కె.ఎస్ భరత్. భారత టెస్టు జట్టుకు ప్రాతినిథ్యం వహిస్తున్న ఆంధ్రప్రదేశ్ కుర్రాడు. 30 ఏండ్ల శ్రీకర్ భరత్ సొంత మైదానం విశాఖపట్నంలో తొలి మ్యాచ్‌కు రంగం సిద్ధం చేసుకున్నాడు. హైదరాబాద్ టెస్టులో వికెట్ కీపర్‌గా జట్టులో నిలిచిన భరత్.. విశాఖ టెస్టులోనూ వికెట్ కీపింగ్ గ్లౌవ్స్ అందుకోనున్నాడు. విశాఖలోని డా.వైఎస్ రాజశేఖర్‌రెడ్డి ఏసీఏ వీడీసీఏ క్రికెట్ స్టేడియంలో బాల్‌బాయ్‌గా అంతర్జాతీయ మ్యాచులకు పని చేసిన భరత్.. ఇప్పుడు అదే స్టేడియంలో టెస్టు క్రికెట్ ఆడేందుకు సిద్ధమయ్యాడు. ఆంధ్ర ఆటగాడు జాతీయ జట్టుకు ప్రాతినిథ్యం వహిస్తున్న సందర్భాన్ని ఆంధ్ర క్రికెట్ సంఘం (ఏసీఏ) వేడుకగా జరుపుతోంది. విశాఖ నలువైపులా కె.ఎస్ భరత్ పోస్టర్లతో టెస్టు మ్యాచ్‌కు క్రేజ్ తీసుకొచ్చే ప్రయత్నం చేస్తోంది. బాల్‌బాయ్ ఇప్పుడు ఆంధ్ర క్రికెట్‌కు పోస్టర్‌బాయ్‌గా నిలిచాడని సోషల్ మీడియాలో ప్రశంసల జల్లు కురుస్తోంది. భారత్, ఇంగ్లాండ్ టెస్టు మ్యాచ్ ముంగిట భరత్‌ను ఆంధ్ర క్రికెట్ సంఘం సన్మానించింది. 'సొంత మైదానంలో టెస్టు మ్యాచ్ ఆడటం గొప్పగా అనిపిస్తుంది. కానీ భారత జట్టుకు ఇది నాకు ఇంకో సవాల్ వంటిదే. సొంత మైదానంలో అభిమానుల నడుమ ఆడటం ఎప్పటికీ ప్రత్యేకమే. భావోద్వేగాలను నియంత్రణలో ఉంచుకోవటం కీలకం' అని కె.ఎస్ భరత్ అన్నాడు.

సమం చేస్తారా?

గెలుపే లక్ష్యంగా టీమ్ ఇండియా

- ఆత్మవిశ్వాసంతో ఇంగ్లీశ్ జట్టు దూకుడు
- భారత్, ఇంగ్లాండ్ రెండో టెస్టు నేటి నుంచి

ఉదయం 9.30 నుంచి స్పోర్ట్స్ 18లో...



నవతెలంగాణ-విశాఖపట్నం



ఆ ఇద్దరు మెరవాలి

హైదరాబాద్ టెస్టు ఓటమి కంటే ఎక్కువగా భారత్‌ను వేధిస్తున్న సమస్య శుభ్‌మన్ గిల్, శ్రేయస్ అయ్యర్ ఫామ్. వైట్‌బాల్ ఫార్మాట్‌లో పరుగుల వరద పారించిన ఈ ఇద్దరు.. రెడ్‌బాల్ క్రికెట్‌లో ఇబ్బంది పడుతున్నారు. సహజంగానే స్పిన్ పిచ్‌లపై శ్రేయస్ అయ్యర్‌కు మంచి రికార్డుంది. స్పిన్నర్లపై వేగంగా, దూకుడుగా పరుగులు చేయటంలో శ్రేయస్ అయ్యర్ దిట్ట. కానీ, ఇంగ్లాండ్ స్పిన్నర్లపై అయ్యర్ ఆశించిన ప్రదర్శన చేయలేదు. శుభ్‌మన్ గిల్ పరిస్థితీ ఇంతే. వైట్‌బాల్ ఫార్మాట్ తరహాలో వేగంగా పరుగులు చేయాలనే ఆలోచనలో కనిపిస్తున్న గిల్.. అనవసర షాట్లకు వికెట్ పారేసుకుంటున్నాడు. గిల్, అయ్యర్ ఇద్దరూ దూకుడు, షాట్ల ఎంపికలో జాగ్రత్తలు తీసుకుంటే బ్యాటింగ్ లైనప్ కష్టాలు తీరినట్టే. కెప్టెన్ రోహిత్ శర్మ, యశస్వి జైస్వాల్‌లు దూకుడుగా ఆడుతున్నారు. ధనాధన్ ఓపెనింగ్ భాగస్వామ్యాలు నమోదు చేస్తూ మిడిల్ ఆర్డర్‌పై ఒత్తిడి తొలగిస్తున్నారు. కె.ఎస్ భరత్ హైదరాబాద్ టెస్టులో రాణించినా.. అద్భుత ఇన్నింగ్స్ అవకాశాన్ని చేజార్చుకున్నాడు. సొంత మైదానంలో భరత్ అటువంటి అసమాన ఇన్నింగ్స్ ఆడతాడేమో చూడాలి. ఇక కెఎల్ రాహుల్ స్థానంలో యువ బ్యాటర్ సర్ఫరాజ్ ఖాన్ అరంగ్రేటం ఖాయంగా అనిపిస్తోంది. నెట్స్‌లో స్పిన్నర్లపై ఎక్కువగా సాధన చేసిన సర్ఫరాజ్.. నేడు ఇంగ్లాండ్‌పై ఎంట్రీ ఇచ్చేందుకు ఎదురు చూస్తున్నాడు. బౌలింగ్ విభాగంలో బుమ్రా, సిరాజ్ పేస్ బాధ్యతలు పంచుకోనున్నారు. అశ్విన్, అక్షర్‌లకు తోడుగా వాషింగ్టన్ సుందర్ స్పిన్ బాధ్యతలు తీసుకునే అవకాశం కనిపిస్తోంది.

భయమెరుగని ఇంగ్లాండ్

ఇంగ్లాండ్ అతిపెద్ద బలం ఆ జట్టు భయమెరుగని క్రికెట్. కెప్టెన్ బెన్ స్టోక్స్, కోచ్ బ్రెండన్ మెక్‌కలమ్ ఓటమికి ఏమాత్రం భయపడటం లేదు. ఓటమి ఎదురైనా.. గెలుపు కోసం ప్రయత్నించాలనే పట్టుదలతో కనిపిస్తున్నారు. ఆ తెగువే హైదరాబాద్ టెస్టులో మంచి విజయాన్ని కట్టబెట్టింది. భారత స్పిన్నర్ల మాయను ఎదురొడ్డి బ్యాటర్లు పరుగులు చేయటం, భారత బ్యాటర్లను మాయలో పడేటం.. ఇదే ఇంగ్లాండ్ గెలుపు ఫార్ములా. స్పిన్ పిచ్‌లు అంటూ గోల చేయకుండా.. స్పిన్ పరీక్షను స్పిన్‌తోనే ఎదుర్కొనేందుకు అద్భుతంగా సిద్ధమైంది. తొలి టెస్టు హీరో ఒలీ పోప్, టామ్ హర్ట్‌లీలు విశాఖలోనూ ఇంగ్లాండ్ ట్రంప్ కార్డులే. జాక్ క్రాప్లీ, బెన్ డకెట్, బెన్ స్టోక్స్ ఫామ్‌లో ఉన్నారు. జో రూట్ సైతం ఈ త్రయానికి తోడైతే విశాఖలో భారత్‌కు గట్టి సవాల్ విసరవచ్చు. జానీ బెయిర్‌స్టో బజ్‌బాల్‌తో ఎప్పుడు విరుచుకుపడే ప్రమాదం పొంచి ఉంది. బౌలింగ్ విభాగంలో మరోసారి ముగ్గురు స్పిన్నర్లు తుది జట్టులో నిలిచారు. ఏకైక పేసర్‌గా మార్క్‌వుడ్ స్థానంలో జేమ్స్ అండర్సన్ ఆడనున్నాడు. మోకాలి గాయంతో ఇబ్బంది పడుతున్న జాక్ లీచ్ స్థానంలో బషీర్ అరంగ్రేటం చేయనున్నాడు. రెహన్ అహ్మద్, టామ్ హర్ట్‌లీలతో కలిసి జో రూట్ సైతం మాయ చేయనున్నాడు.

పిచ్, వాతావరణం

భారత్, ఇంగ్లాండ్ టెస్టు మ్యాచ్‌కు సంప్రదాయ ఉపఖండ పిచ్‌ను సిద్ధం చేశారు. విశాఖ పిచ్ సహజంగానే స్పిన్‌కు అనుకూలం. తొలి రెండు రోజుల ఆటలో బ్యాటర్లకు కాస్త మొగ్గు ఉండవచ్చు. టాస్ నెగ్గిన జట్టు తొలుత బ్యాటింగ్ ఎంచుకునే అవకాశం ఉంది. నాల్గో ఇన్నింగ్స్‌లో ఇక్కడ పరుగుల వేట కష్టసాధ్యం అవనుంది. టెస్టు మ్యాచ్‌కు ఎటువంటి వర్షం సూచనలు లేవని వాతావరణ శాఖ తెలిపింది.

Printed and Published by Nandayla Narsimha Reddy on behalf of Navatelangana Printers Private Limited, Printed at Navatelangana Printers Private Limited Nallapaneni Kasaiah Nagar, Tallampadu, Khammam-507170, Telangana State, Published at Navatelangana Printers Private Limited, Nallapaneni Kasaiah Nagar, Tallampadu, Khammam-507170, Editor : R.Sudha Bhaskar. TEL TEL/2015/60886